

జనవరి 2014
రూ. 12/-
చతుర
mohan PUBLICATIONS
Mohanpublication.com
ఆధ్యాత్మిక, జ్యోతిష్య, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్ర, తంత్ర గ్రంథములకు
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా, రాజమహేంద్రవరం - 533101.
grantha nidhi THE TREASURE OF PAGES
FOREVER TELUGU FREE E-BOOKS DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in
అక్కినేని కుటుంబరావు నవల
కొల్లేరు కంటనీరు .. 6
అంతర్జాతీయ ప్రమాణాలతో అడ్వాన్స్‌డ్ హోమియో & అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద మందుల ద్వారా
అనుభవం-పరిశోధన-నిపుణత కలిగిన స్టార్ డాక్టర్స్ బృందంచే సురక్షితమైన చికిత్స
స్టార్ హోమియోపతి ఆయుర్వేద
99599 11088
www.starhomeo.com
99599 11099
www.starayurveda.com
కీళ్ళనొప్పులు, అలర్జీ, ఆస్తమా, మధుమేహం,
థైరాయిడ్, సంతానలేమి, పంచకర్మ వైద్యం
నేను నమ్మాను మీరూ నమ్మండి...
సికింద్రాబాద్ కొత్తపేట కూకట్‌పల్లి విజయవాడ తిరుపతి వైజాగ్ రాజమండ్రి హన్మకొండ & కర్నాటక

అక్షరధార

వేల ఏళ్ళ క్రితం మన ప్రాచీనులు మనిషి ప్రవర్తనా నియమావళిని నిర్దేశిస్తూ వాటిని శ్లోకబద్ధం చేశారు. అవి అన్ని కాలాలకి, అన్ని ప్రదేశాలకి చెందిన అందరికీ సమానంగా వర్తించే నిత్య సత్యాలు.

నూతన సంవత్సరం

యో యాదృశేన భావేన తిష్ఠత్యస్యాం యుధిష్ఠిర
హర్ష దైన్యాది రూపేణ తస్య వర్షం ప్రయాతి వై

భావం: ఓ ధర్మరాజా! ఈ నూతన సంవత్సరం మొదటి రోజున సంతోషంగా ఉండే వ్యక్తికి, మొత్తం ఏడాదంతా ఆనందంతో గడచిపోతుంది. ఈ రోజున బాధపడేవారికి సంవత్సరం పొడవునా దుఃఖంగానే అనిపిస్తుంది.

అలంకారాలు!

నరస్య భూషణం రూపం
రూపస్య భూషణం గుణమ్
గుణస్య భూషణం జ్ఞానం
జ్ఞానస్య భూషణం క్షమా

భావం: మనిషికి అలంకారం సుందర రూపం. ఆ రూపానికి అలంకారం గుణం. ఆ గుణానికి జ్ఞానం, జ్ఞానానికి అలంకారం క్షమించే హృదయం.

విద్య గొప్పతనం!

మాతేవ రక్షతి పితేవ హితే నియుక్తే
కాంతేవ చాభి రమయత్య పనీయ ఖేదమ్
లక్ష్మీం తనోతి వితనోతిచ దిక్షు కీర్తిం
కింకిం న సాధయతి కల్పలతేవ విద్యా

భావం: విద్య తల్లిలా లాలిస్తుంది. తండ్రిలా పాలిస్తుంది. ప్రియురాలిలా సంతోషపెడుతుంది. ఐశ్వర్యాన్ని, కీర్తిని కల్గిస్తుంది. కల్పవృక్షంలా అన్నిటినీ సమకూర్చుతుంది. అందుకే బాగా చదువుకోవాలి.

సమయం నియమం!

క్రియతే నియమితం యత్తత్
అపూర్ణం శిష్యతే ధృవమ్ ।
సమయస్య పయోగస్తు
యోజితేన క్రమేణ హి ॥

భావం: నియమ సంయమనంతో పనులు చేయకపోతే అవి అసంపూర్తిగా మిగిలిపోతాయి. సమయపాలన ప్రతివ్యక్తి విజయానికి ప్రథమ సోపానం. కాబట్టి సమయాన్ని చక్కగా వినియోగించుకోవాలి.

దుర్మార్గుడి లక్షణం!

లబ్ధోదయః ఖలజనః ప్రథమం
స్వజనే కరోతి పరితాపం
ఉద్గచ్ఛ దావదహనో జన్మ
భువం దారు నిర్దహతి

భావం: అడవిలో రెండు ఎండు కొమ్మలు రాసుకుంటే ఎలా అగ్ని పుట్టి అది తల్లితండ్రుల లాంటి ఆ కొమ్మలనే కాల్చేస్తుందో.. అలా దుర్మార్గుడు తన ఎదుగుదలకు సహాయం చేసిన వారికే మొదట ఎసరు పెడతాడు.

ప్రయత్నం ప్రధానం!

అన్నదానాత్పరం దానం
విద్యాదాన మతః పరమ్ ।
అన్నేన క్షణికా తృప్తిః
యావజ్జీవం చ విద్యయా

భావం: అన్నదానం ఉత్తమమైనదే. కాని దానికంటే విద్యాదానం గొప్పది. అన్నం వల్ల ఆకలి తీరి క్షణికమైన తృప్తే కలుగును. కాని విద్య వల్ల జీవితాంతం సుఖశాంతులు లభిస్తాయి

సేకరణ : లిపి

భలేభలే!

అమెరికన్ స్క్రీన్‌రైటర్ ఆరన్ సోర్కిన్ అద్దంలో చూస్తూ తాను రాసిన సంభాషణలను అభ్యాసం చేస్తుంటాడు. ఓసారి ఆ సంభాషణల్లో లీనమై తలతో అద్దాన్ని ఢీకొని ముక్కు పగలగొట్టుకున్నాడట! 'ఎ ఫ్యూ గుడ్‌మెన్,' 'ది అమెరికన్ ప్రెసిడెంట్', 'ది వెస్ట్‌వింగ్' వంటి గొప్ప రచనలు చేసిన ఈయన అకాడమీ అండ్ ఎమ్మీ అవార్డును అందుకున్నాడు.

భళ్ భళే!

అమెరికన్ రచయిత డాన్ బ్రౌన్ రాస్తున్నపుడు అతడి టేబుల్ మీద ఇసుక గడియారం తప్పకుండా ఉంటుంది. రచన మీద ఏకాగ్రత కుదరడానికి, అలసట తీరడానికి తలక్రిందులుగా నుంచుంటాడీయన. బ్రౌన్ రచనలు 52 భాషల్లోకి అనువాదమయ్యాయి. అంతేకాదు 2012 సంవత్సరం వరకు దాదాపు రెండువందల మిలియన్ల కాపీలు అమ్ముడయ్యాయి.

భలేభలే!

అమెరికన్ నవలా రచయిత్రి గెర్ట్రూడ్ స్టీన్‌కు తన కారులోని ముందుసీటు రచనకు అనువైన ప్రదేశం. అక్కడే ఆమె ఏకాగ్రతగా రాసుకునేది. ఎంత ట్రాఫిక్ ఉన్నా అదేమీ పట్టించుకోకుండా తనపని తాను చేసుకుంటూ ఉండేది. భర్తతో కలిసి వెళ్లినపుడు ఆయన పని పూర్తి చేసుకుని వచ్చేదాక స్టీన్ కారులోనే కూర్చుని పద్యాలు, కవిత్వం రాసుకునేది!

భలేభలే!



గ్రీకు ప్రసిద్ధ రచయిత డెమోస్తెనీస్ ఇంట్లో నుండి కదలకుండా రాసుకోవడానికి సగం గుండు చేయించుకునేవాడు. తనకు రచన మీద ఆసక్తి లేకపోయినా, రచన త్వరగా పూర్తి కావాలనుకున్నా ఈ పని చేసేవాడు. అర గుండు మీద మళ్లీ ఎప్పటిలా జుట్టు వచ్చేవరకూ బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండి రాసుకునేవాడు.

భలే భలే!

అమెరికన్ రచయిత్రి ఫ్లానెరీ ఓ కానర్ రచనలోనూ క్రమశిక్షణ పాటిస్తుంది. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో ఓ రెండుగంటల పాటు రాసుకుంటుంది. అంతే, ఇంక మళ్లీ ఆ రోజులో పెన్ను ముట్టుకునేది కాదు. ఆమె రచనలు దక్షిణ గోథిక్ శైలిలో సాగుతాయి.

భళ భళే!

చిన్నతనంలో పేదరికం తాళలేక దొంగతనం చేసి జైలుకెళ్లిన అమెరికన్ రచయిత హంటర్ స్టాకన్ థామ్సన్‌కు మధ్యాహ్నం మూడుగంటలకు తెల్లవారేది! లేస్తూనే మద్యం సేవించేవాడు. తరువాత కాస్త భుజించి ఇక అర్ధరాత్రి వరకూ ఏకధాటిగా రాసుకుంటూ పోయేవాడట.



‘రే.. గేలం పట్టుకుని నా వెనక కొల్లేట్లోకి దా’ అన్నాడు దాసుబావ.

ఆడుకుంటున్న ఐదేళ్ల శీనూ గేలం పట్టుకుని వెంట నడిచాడు. తర్వాత గేలానికి ఎర్రని గుచ్చి కాలవలోకి వేసి పైకి లాగాడు. అంతే.. పెద్దకొరమీను గట్టుమీదకు వచ్చి పడింది.

పరుగెత్తుకొచ్చిన దాసు ‘ఇది నా గేలానికి పడింది. ముట్టుకున్నావా చచ్చావే ’ అన్నాడు దౌర్జన్యంగా.

‘దాసుబావా! నేనే గదా గేలాన్ని కాలవలోకేసి పైకి లాగింది? నాకే కదా చేపపడింది! ’


‘ఆ! పడతది! ఏలెడు లేవు, ఇంత పెద్ద చేప నీకెట్టా పడతదిరా? పెద్దాడ్ని నన్నొదిలి బుడ్డాడివి నీకు పడ్తది? అయినా ఈ గేలమెవరిది?’ అన్నాడు దాసు బుకాయిస్తూ.

‘గేలం నువ్విచ్చినా మరి ఎర్రలెవరు తెచ్చారు? కాలవలోకి గేలం ఎవరేశారు? చేపనెవరు బైటికి లాగారు? ఇంత అన్యాయమా?’ అన్నాడు శీను ఏడుస్తూ.

కొల్లేటి గ్రామాల జన జీవితాలకు దర్పణం

అక్కినేని కుటుంబరావు

కొల్లేరు కంటనీరు



శ్రీ నివాసరావు చెరువు గట్టు మీద నిలబడి చూశాడు. కనుచూపుమేర అనంతంగా కనపడాల్సిన కొల్లేరు ముక్కలు ముక్కలుగా కనపడింది. ఎన్నో రకాల మొక్కల్తో, తీగల్తో, పూవుల్తో కనపడాల్సిన కొల్లేరు పగిలిన అద్దం ముక్కల్లా వెలవెలబోతూ కనపడింది. బుల్లిబుల్లి పూల పడవల్లాంటి బాతుల బారుల్లేవు. ఎగిరే పూల పొట్లాల్లాంటి పక్షుల సందడి లేదు. విశాలమైన ప్రపంచ పటం నిండా అడ్డదిడ్డమైన గీతలతో విభజించబడిన దేశాల్లా కొల్లేరు నిండా గట్లు... తెగిపడిన గట్లు. రాధాకృష్ణ శ్రీనివాసరావు భుజం మీద చేయి వేశాడు. అరవై ఏళ్ళ క్రితంనాటి కొల్లేరు జ్ఞాపకాలు శ్రీనివాసరావు మనసు నిండా ఎలా నిండి ఉంటాయో రాధాకృష్ణకు తెలుసు. కొల్లేటితో వారిద్దరికీ బాల్యపు అనుభవాలు, అనుభూతులూ బంధాలై పెనవేసుకుని ఉన్నాయి. శ్రీనివాసరావు మనసులో రేగిన కల్లోలం రాధాకృష్ణకు అర్థమవుతోంది. అతని మనసు లోనూ అదే కల్లోలం. అదే గతకాలపు తలపోతల బరువు.

ఏదీ ఆ ఏటివార.. కొల్లేటివార.. ఏదీ ఆనాటి పెద్ద జాడ.. దానినంటిపెట్టుకునే చిన్న జాడలు! కొల్లేటితోపాటు ఏటివారని కూడా తెగనరికి ఊరి ఇళ్ళ వరకూ చేపల చెరువులు చేసేశారు. ఎకరాల కొద్దీ విస్తరించి పాతిక పడవలూ, వందలాది దోనెలతో ఉండే ఆ ఏటివార...

అరవై ఏళ్ళక్రితం అయిదేళ్ళ శీను తన నాలుగు గేదెల్నీ తోలుకొచ్చి, తనకంటే గేదెలు కాయటంలో అనుభవంగల కిష్టుడు, దాసు వంటి అనేకమంది పిల్లలు తోలుకొచ్చిన గేదెలతో తనవాటినీ కలిపింది ఈ ఏటివారనే. ఏదీ ఆ ఏరు? ఆ ఏటివార?

నిర్మలంగా రంగురంగుల రెల్లుపూలతో, రకరకాల కలవపూలతో, కలేకాయలతో, నీటితోపాటు ఊగుతూ, తేలుతూ, తూలుతూ స్వాగతాలు చెప్తున్నట్లుండే పట్టుకుచ్చుల్లాంటి నాచు మొక్కల్తో, నీటిపై నృత్యాలు చేస్తూ ముగ్గులూ, బొమ్మలూ గీసే చిన్ని చిన్ని కీటకాలతో, కొన్ని లక్షల పక్షులతో కళకళలాడే జల జీవారణ్యం కొల్లేరు.

ఇవాళ మురికి కూపమై, రకరకాల రోగ క్రిములకు నిలయమై, పర్యావరణం విలయమై, పక్షులకు విషవలయమైంది. అన్ని జీవరాశులకూ అభయమిచ్చే కొల్లేరు ధన కాంక్షాపరుల చేతుల్లోపడి, వినాశనానికి నిదర్శనంగా, జనాలకు మృత్యు సదృశంగా మారిపోయింది.

సహజంగా బలంగా పండే చేపలనిపుడు పెంచుతున్నారు. చేపల చెరువుల కాలుష్యంతో చేపలు చచ్చిపోతున్నాయి. ఒకప్పుడు ఎలాంటి చేపలవి! వాలగ తోకతో కొడితే వాతలు తేలేవి. వాటిని పట్టటానికి బలమైన యువకులే యుద్ధం చెయ్యాల్సి వచ్చేది, వాటి బరువునాపలేక. అలాంటి చేపలివాళ చెరువుల్లో ప్రాణవాయువు తగ్గి చచ్చి నీటిపై తేలుతున్నాయి. వికలమైన మనసుతో మరోసారి కనుచూపుమేర చూశారిద్దరూ.

చెరువుకట్ట దగ్గర పిల్లలు కొంతమంది చిన్న చిన్న క్రికెట్ బ్యాట్లు పట్టుకుని మురికి చొక్కాలతో, చింపిరి తలలతో క్రికెట్టు ఆడుతున్నారు. శ్రీనివాసరావు, రాధాకృష్ణ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. ఇద్దరూ అరవై ఏళ్ళు దాటినవారే. కానీ ఇద్దరూ ఒక్కసారి చిన్నపిల్లలయిపోయారు. ఇద్దరి పెదవుల మీదికీ ఆనందంతో కూడిన నవ్వు వచ్చింది. కళ్ళల్లోకి చిత్రమైన కాంతి వచ్చింది. వారి కళ్ళ ముందు అప్పటి వరకూ వారిని విషాదంలో నింపిన ముక్కల ముక్కల నీటి

మడుగులు మాయమైపోయాయి. అంతా ఒకటే అనంత జలరాశి. దిగంతాల వరకూ వ్యాపించిన జలరాశి. సూర్యచంద్రులను తన గర్భంలో దాచుకోగలననే గర్వంతో నిండుచూలాలి వలే మందయానాలు చేస్తున్న కొల్లేరు వారిద్దరి కళ్ళముందూ నిల్చింది. ఇద్దరూ కొంచెంగా వెనక్కు తిరిగి చూశారు. ఒంటి నిట్టాడి ఇళ్ళతో కళకళ లాడే పులపర్రు. ఆ ఇళ్ళ నుండి పరిగెత్తు కొచ్చే పిల్లలు, ఏటివార కర్రాబిళ్ళ ఆడుకునే పిల్లలు, నత్తల్నీ, నత్తగవ్వల్ని ఏరుతూ ఉండే పిల్లలు, గేదెల మేతకోసం తూడు కోసుకుని మోపులు మోసుకెళ్ళే పిల్లలు. జాడలో ఈత కొడుతూనో, జాడగట్టున నడుస్తూనో, దాళ్వా గడ్డి మోస్తూనో సందడి సందడిగా తిరిగే పిల్లలు.. ఏటి వార మోరలెత్తి 'అంబా' అని అరుస్తూ వెళ్ళే ఆవుల, గేదెల మందలు, బారులు బారులుగా వచ్చి ఆకాశానికి రకరకాల రంగులద్దుతూ ఒక్కసారిగా క్రమశిక్షణ గల సైనిక సమూహాల్లా కొల్లేట్లో దిగే పక్షులు - అన్నీ- అన్నీ వాళ్ళ కళ్ళ ముందర సజీవంగా నిలబడ్డాయి... వాళ్ళీ లోకంలో లేనట్టు వాళ్ళ ముఖాలు చూస్తే తెలిసిపోతోంది. జ్ఞాపకాల పడవలెక్కి దిగుతూ, స్మృతిమందిరాలలో విడిది చేస్తూ కాలప్రవాహంలో వెనక్కు నడుస్తు న్నారు. ఆ నడక చాలా అనాయాసంగా, హాయిగా ఉంది. వాళ్ళిప్పుడు శ్రీనివాస రావు, రాధాకృష్ణ అనే ప్రసిద్ధ వ్యక్తులు కాదు.

శీనుగాడు, కిష్టుడు అనే పిల్లలు. శీనుకి ఐదేళ్ళయితే కిష్టుడికి పదోయేడు. వాళ్ళి ద్దరూ తమవంటి పిల్లల సమూహంలో

పడిపోయారు. పెద్దల సామీప్యంలోకి వెళ్ళి తిరుగుతున్నారు.



శీను ఏటివారకు గేదెల్ని తోలుకొచ్చేసరికి ఊళ్ళో చాలామంది పిల్లలు పెద్దజాడలో వాళ్ళ మందల్తోపాటు వెళ్తున్నారు. ఏటివార మీద కూడా కొందరు పెద్దజాడలో దిగటానికి సిద్ధంగా ఉన్నారు.

వీడ్ని చూడగానే "ఏరో శీనుగా! ఇయ్యాల నువ్వు కూడా వత్తన్నావా మాతో పాటు" అన్నాడు నవ్వుతూ గుత్తా దాసు.

"ఆ!" అంటూ తన గేదెలు అటూ ఇటూ పోకుండా మళ్లేసుకుంటున్నాడు శీను.

శీనుకు అయిదేళ్ళుంటాయి. ఒంటిమీద గోచీ, తలకు చుట్టుకున్న తలగుడ్డా, చేతిలో ఓ కఱ్ఱా, ముక్కుకో కాడా, చెవికో పోగూ.

"మనదేశానికి సొసంత్రం వచ్చి అయిదేళ్ళయితే నీకిప్పటికి సొసంత్రమొచ్చిందేరా!" అన్నాడు వంకరగా నవ్వుతూ దాసు.

"అదేంట్రా? " అన్నాడు కిష్టుడు.

"ఈడ్ని ఈడమ్మ బళ్ళోకి పంపి సదివిచ్చాలని తంటాలు పడతాందిలే. ఈడేమో నిన్న ఒక్కరోజు బళ్ళోకెళ్ళొచ్చి ఇకెల్లనన్నాడు" అన్నాడు దాసు.

"ఏరా శీనూ.. ఒక్కరోజు బళ్ళోకెళ్ళగానే సదువైపోయిందనుకున్నావా? " అన్నాడు కలపాల కోటేశ్వరరావు.

"బళ్ళోకెందుకెళ్ళలేదురా? " చిరాగ్గా అడిగాడు కిష్టుడు.

శీను గొడ్లను మళ్ళేసే కొత్త చదువు నేర్చుకుంటూ "ఆ పొంతులుగారు నిన్న పొట్టాడ్ని బెత్తంతో బాదాడు. అందుకే ఇద్దరం ఇక జల్మంలో బళ్ళోకెళ్ళగూడదనుకుని ఒట్టు గూడా ఏసుకున్నాం" ఆ నిర్ణయం శీనుకి ఎంత నిర్భయాన్నిచ్చిందో అదంతా వాడి గొంతులో పలికింది.

"ఆ దెబ్బతో మనాడికి బడినుంచి సొసంత్రమొచ్చి గొడ్లంబట బడ్డాడు"

"అది సరే పిల్నాకొడుకేం గేదెల్ని గాత్తాడూ...? " అంటూ కోరగా చూశాడు పావులూరి ఎంకటేశ్వర్రావు.

"ఆడు గాసేదేంటి. అన్నిటితోపాటు అయ్యానీ" అన్నాడు శీను మేనత్త కొడుకు కిష్టుడు.

"అసలీడికీతొచ్చా? " పెద్దారి సుబ్బయ్య ఆరా తీశాడు.

"ఏరా? " అనుమానంగా చూశాడు కిష్టుడు.

'ఆ' అన్నట్టు తలూపాడు శీను.

అందరూ ఒకర్నొకరు చూసుకున్నారు.

"కొల్లేట్లో ఈతంటే చెర్లోనో, కాలవలోనో కొట్టినట్టు గాదు" దాసు దబాయించాడు.

"ఊ" అని చిన్నగా మూలిగి "సర్లే నీళ్ళలోకి మీ పెద్దగేదె దిగేప్పుడే దిగి దాని తోక పట్టుకుని వదలమాక. అది గట్టెక్కినాకే నువ్వు దాని తోక వదలాలి, సరేనా? " సులువైన దారి చెప్పాడు కిష్టుడు.

'సరే' అన్న శీను కళ్ళల్లో లీలగా భయం జాడను చూసిన కిష్టుడు "ఏం పర్వాలా! మేమంతా ఈ కొల్లేట్లో అట్టా ఈత నేర్చుకున్నాళ్ళమే. గేదె తోక వదలకుండా కాళ్ళతో ఈతగొడ్తా ఉండు. నేనూ, ఎంకన్నా నీ పక్కనే ఉండి చూత్తానే వుంటాంలే. రొండు రోజుల్లో బయమదేపోతంది. ఈతదే వత్తంది" అని, "దిగండే...

ఇంకా చూత్తా నిలబడ్డారేంది.. మేత మెయ్యాలని లేదా? " అందుబాటులో ఉన్న రెండు గేదెల్ని రెండు దెబ్బలేశాడు.

ఏటివార నుంచి గేదెలూ, దున్నలూ, వాటి దూడల్తో సహా కొల్లేట్లో ఉన్న పెద్ద జాడలోకి దిగి ఈత కొట్టడం మొదలెట్టాయి. ఎవరి మందతో వాళ్లు వెనకే ఈతల్తో అనుసరిస్తూ పోతున్నారు.

శీను రెండో బాబాయి కొడుకు ఎంకన్నా, కిష్టుడూ శీనూ మీద ఓ కన్నేసి ఈత కొడ్తున్నారు. శీను మునుగుతూ, తేలుతూ, నీళ్ళు గుటకలేస్తూ గేదె తోకమాత్రం వదలకుండా కాళ్ళాడిస్తూ, నీళ్ళతో.. కొల్లేటితో పోరాటానికి తలపడ్డాడు. కొంతదూరం వెళ్ళేసరికి వాడికి కాస్త ఆనూపాను తెలిసింది. బెదురు కూడా తగ్గింది. అనంత జలరాశి కొల్లేట్లోకెళ్తూ దానిని.. తన చుట్టూ ఉన్నదానిని చూశాడు. కొల్లేటి నిండా కనుచూపుమేర తూడు, తుంగ, గవర, గరిక, అల్లిలాంటి పచ్చమేత... వాటికి పూసిన రంగురంగుల పూలతో తలాడిస్తూ పిలుస్తున్నాయి. జమ్ము, జీలగ పొదలు పొదలుగా వ్యాపించి ఉన్నాయి. వాటిలో పక్షుల గోల.

బెకబెకమంటూ బాతుల మందలు - వీళ్ళను దాటుకుంటూనో, వీళ్లే వాటిని దాటుకుంటూనో ప్రయాణం చేస్తున్నాయి. ఆ బాతులు నీళ్ళమీద కదులుతున్న పూల గుత్తుల్లా ఉన్నాయి. కొంగలు గేదెల మీద వాలి అక్కడ్నించే తమ చేపలవేట సాగిస్తున్నాయి. దొరికిన చేపపిల్లని గేదెమీదే పెట్టుకుని పొడిచి తినేస్తున్నాయి. తిన్న తర్వాత బహుశ గేదెకి కృతజ్ఞతగానేమో అరుస్తున్నాయి. గేదె మాత్రం తక్కువ తిన్నదా? కావాలని నీళ్ళల్లో తను మునిగి కొంగను ముంచుదామని చూస్తోంది. కొంగ తక్కువ టక్కరా? గేదె మునగటాన్ని గమనించి 'క్వాక్ క్వాక్' మంటూ పైకెగిరి గేదె నీటిపైకి తేలగానే తన పీఠం మీదికొచ్చి కూచుంటోంది.

ఆకాశంలో ఉత్తూతి పిట్టలు ఉత్తూతి రాగాన్ని ఆలాపిస్తూ చక్కర్లు కొడుతున్నాయి. రకరకాల చిన్న చిన్న పిట్టలు కోలాహలంగా గోలచేస్తూ ఆకాశంలో గిరికీలు కొడుతున్నాయి. గేదెల్ని తోలుతున్న ఊరి పిల్లలంతా ఏవో కేకల్తో ఒకర్నొకరు పలకరించుకుంటూ, హెచ్చరించుకుంటూ వెళ్తున్నారు. ఊళ్ళోనుండి ఉండీ ఉండీ సొట్టబెమ్మం భార్య కేకలు, కొల్లేటి నీటిలో ప్రతిధ్వనిస్తున్నాయి. పక్కకి చూసిన శీనుకేం చెయ్యాలో పాలుబోలా. కుడివేపునో రెండు, ఎడమవేపునో మూడు పాములు శీనూతోపాటే మెలికలు తిరుగుతూ అతడ్ని ఎవడీ కొత్త పిల్లాడన్నట్టు పరిశీలిస్తూ వస్తున్నాయి.

"బావయ్యా" శీను గొంతు వణికింది.

"ఏంట్రా.. కష్టంగా ఉందా? ఉంటే చెప్పు.. మా మాళీగేదెమీదెక్కి కూచుందువుగాని.."

"అదిగాదు బావయ్యా! పాములు.."

"పాంలా! అయ్యేం జేత్తయ్‌రా - నీటి పాంలే - అయ్యే బోతయ్. అంతగా బయమైతే ఒక పని చెయ్ - ఆటెంక జూడమాక" అని తేలికగా తీసిపారేశాడు కిష్టుడు.

శీనూ అప్పుడప్పుడూ దొంగ చూపులు చూసినా అవి తలలూగించటం నాలుకతో ఎక్కిరించటం తప్ప, పాపం ఏమీ చెయ్యటంలా... గేదెలు వెళ్తూ వెళ్తూ తమని తినొచ్చుగా అంటూ తీగలు సాగివస్తున్న తూటుకాడల్ని లాగి కొరికి తింటూ వెళ్తున్నాయి.

ఆ పెద్దజాడలో సుమారు ఓ మైలు వెళ్ళాక కుడివైపుకి తిరిగి కాస్త మెరకగా వున్న మోతేవారి లంకలోకి వెళ్తున్నాయి గేదెలు. కొల్లేట్లో అక్కడక్కడా చిన్నచిన్న

లంకలున్నాయి. కోమటిలంక, మణుగులూరిలంక, మోతేవారిలంక ఈ ఊరికి కాస్త అందుబాటులో ఉన్న లంకలు. అక్కడా నీళ్ళుంటాయి గానీ, నడవటానికి వీలుగా నీళ్ళు మోకాళ్ళోతు లోపే ఉంటాయి. ఈ లంకల్లో పశువులకి ఎంత తిన్నా తరగని మేత. అందుకే ఆగస్టు నుంచి ఫిబ్రవరి దాకా ఊళ్ళో నిలబడటానికి కూడా చోటు దొరకని గొడ్లని ఈ లంకలకి తోలుకొస్తారు పిల్లలు. మోతేవారిలంకలోకి గొడ్లు ప్రవేశించగానే పిల్లలంతా అరుపులు, కేకలు. అందరికంటే చిన్నాడు ఇవ్వాళ్ళొచ్చిన ఐదేళ్ళ శీను, అందరికన్నా పెద్దాళ్ళు పదకొండు, పన్నెండేళ్ళ కిష్టుడు, ఎంకన్నా...

అందరూ గోచీల్తోనే ఉన్నారు. వీళ్ళతో పాటు ఓ అయిదుగురు ఆడపిల్లలు కూడా ఉన్నారు. వీళ్ళూ అప్పుడప్పుడూ ఈతలు కొట్టినా ఎక్కువసేపు గేదెల మీద ఎక్కి కూచునే వస్తారు. వాళ్ళు వెనకాల బొందుల్తో బిగించిన లాగూలు వేసుకున్నారు.

లంకలోకి చేరగానే పిల్లల్లో సందడి మొదలైంది. శీను ఆశ్చర్యంగా చూస్తోంటే అర్థమైందేమిటంటే అందరివంటిమీదా పట్టిన నల్లటి జలగలు. ఇద్దరిద్దరు చేరి ఒకళ్ళ వంటిమీదున్న జలగల్ని ఒకళ్లు లాగి లాగి వదిలిస్తున్నారు. అవి తలదగ్గర వదిలేత్తే తోకదగ్గిరా, తోక దగ్గిర వదిలేత్తే తల దగ్గిరా పట్టు బిగిస్తున్నాయి. జలగ తల వదిలిన చోట రక్తం కారుతోంటే బురద తీసి రాస్తున్నారు. నీళ్ళల్లోంచి తీసిన పెద్ద మట్టిగడ్డలాంటిది పెడ్తున్నారు గాయం దగ్గర. శీనుకి ఇదంతా చూస్తోంటే లోన కంగారుగా ఉందిగానీ పైకి గుంభనంగా ఉన్నాడు. ఉన్నట్టుండి వాళ్ళని చూడ్డం మాని తన ఒళ్ళు చూసుకున్నాడు. శీను చాలా ఎర్రగా ఉంటాడు. ఎర్రాడని కూడా అంటారు వాడిని. అందువల్ల తన ఒంటి మీద నల్లగా అతుక్కుపోయి రక్తం తాగుతున్న ఆరు జలగల్ని చూడగానే "బావయ్యా" అనే అరుపు వాడికి తెలియకుండానే నోటంట వచ్చేసింది.

కిష్టుడు శీనువంక చూసి "అరె ఎంకన్నా .. ఆడు జూడరా" అని ఎంకన్నని కూడా తీసుకుని వచ్చి శీను ఒంటిమీది జలగల పని పడుతున్నాడు. ఒకదాన్ని పీకగానే రక్తం ధార కడుతోంది. మంచి మట్టిగడ్డాకటి తీసి అతికించాడు కిష్టుడు. శీనూ వంటి మీదనుంచి ఎర్రటి రక్తంతోపాటు వాడి కంటి నుంచి వెచ్చని కన్నీరు కూడా కారుతోంది. ఎలాగో తంటాలుపడి నాలుగింటిని లాగారు. మరోరెండు వదల్డంలా.

కిష్టుడు ఎంకన్నకేసి తలెగరేసి "ఈ రెండూ ఇట్టా రావులే. కాసిని ఉచ్చ పొయ్యరా" అన్నాడు.

ఎంకన్న గోచి తప్పించి శీను కుడివేపు నడుం మీదా, ఎడమ తొడమీదా ఉచ్చ పోశాడు. అక్కడున్న రెండు జలగలూ వెంటనే ఊడి నీళ్ళలోపడి మునుగుతూ, తేలుతూ వెళ్ళిపోయాయి.

కిష్టుడు మట్టితీసి రాసి "ఎక్కడో వెర్రాడిలాగున్నావేరా... కొల్లేట్లో దిగితే జలగలు పట్టుకోవా? ఏడవమాక... ఊడిపోయినయ్గా" అని కసురుకున్నాడు.

పావులూరి ఎంకటేశ్వర్రావు నవ్వుతూ

వచ్చి "అ(రే! ఇంకో జలగట్టాగే ఉండిపో యిందిరా.. దాన్ని కూడా లాగి పారె య్యండి" అనేసరికి శీనుకి కంగారు పుట్టి ఒళ్ళంతా చూసుకుంటుంటే.. "అదుగో అక్కడుందిరా, సూడు" అంటూ రెండు కాళ్ళ మధ్యనా చూపించాడు.

శీను మరీ కంగారుగా గోచీ దగ్గరకా పక్కనా, అటూ ఇటూ చూసుకుంటుంటే మిగతా అందరూ నవ్వులకి పడ్డారు.

"ఓరూరుకోండిరా! బుడ్డాడ్ని పట్టుకుని" అంటూ వాళ్ళని మందలిస్తూ తనూ నవ్వు తున్నాడు కిష్టుడు.

ఇదంతా ఏమీ పట్టించుకోక ఇంకో జలగ కోసం వెతుకుతూనే ఉన్నాడు శీను.

"ఏంరా ఇంకా కనపళ్ళేదా? ఆ గోచీ తియ్యరా. దాన్లో దూరినట్టుంది" అన్నాడు పావులూరి.

కంగారుగా గోచీ తీశాడు శీను. "అదుగో చూశావా" అన్నాడు పావులూరి.

పావులూరి దేన్నిచూసి జలగంటున్నాడో దాన్ని చూసిన శీనూ "యా! ఇది జల గ్గాదు" అన్నాడు నిశ్చయంగా.

"మరేంటది? "

"నా బెల్లం"

అందరూ పగలబడి నవ్వుతుంటే గాని శీనుకి విషయం అర్థమవలా. అప్పుడు వాడు గోచీ పెట్టుకునేసరికి.. అసలే ఎ(రటి మొహం, ఎండకి కందిన మొహం, సిగ్గుతో మరింత కందింది.

★ ★ ★

కోమటిలంకలో పశువులు కరువుదీరా కడుపునిండా మేతమేస్తోంటే వాటి మీదెక్కి సవారీ చేస్తూ, వాటి వంటిమీదున్న గోమా ర్లని వెతికి వెతికి తింటూ పిట్టలు, పిచి కలు, సందడి సందడిగా గోల చేస్తున్నయ్. కొన్ని బుల్లి పిట్టలు గొడ్ల చెవులమీద చేరి, వాటిని శు(భం చేస్తున్నయ్. గొడ్లు తిరిగి నంత మేరా వాటిమీదెక్కి అవీ తిరుగుతూ గొడ్లపనీ, తమపనీ ఏకకాలంలో పూర్తి చేస్తున్నాయి. కాస్త అవతలగా ఎకరా లకెకరాలు కలువపూలతో, మొగ్గల్తో నిండి పోయిన పొలాల్లోకెళ్ళి పడ్డారు పిల్లలంతా. అక్కడంతా పైన మొగ్గలూ, పూలూ ఉంటే ఆ కలువ మొక్కల దగ్గర కాడల్లో వేళ్ళా డుతూ, తిరుపతి లడ్డూలంతేసి కలేకా యలు! ఆ కలేకాయల్ని ఎవరికిష్టమైనన్ని వాళ్ళు కోసుకుని కాయల్లోని గుజ్జూ, గింజలూ తిన్నారు. కలేకాయలు తింటుంటే నేతిగింజలు నవుల్తున్నట్టుంది శీనూకి.

మధ్యమధ్యలో నీళ్ళల్లో ఉన్న చీమిడికా యలు కూడా తింటున్నారు పిల్లలు. శీనూ కూడా ఒకటి తిన్నాడు గానీ అది జిగట జిగటగా బాగోలేదు రుచీపచీ లేదు. శీనూతో వాడి పెద్ద బాబాయి కూతురు బేబీ కూడా జట్టుగా తిరుగుతోంది. బేబీతో పాటు దాని వయసే ఉన్న లక్ష్మికూడా వీళ్ళతోనే తిరుగుతూ, ఉన్నట్టుండి శీనూని చూసి నవ్వింది.

"ఎందుకు నన్ను చూసి నవ్వుతున్నా వు? " అన్నాడు శీనూ.

తలెగరేసి చి(తంగా "అందుకే" అంది లక్ష్మి.

శీను ముక్కు కందింది. ముక్కుపుటాల దిరినయ్.

"నువ్వాస్సలాడదానివేనా? " అన్నాడు.

"నువ్వాస్సలు మగాడివేనా? నువ్వు మగాడివైతే నేనాడదాన్నే" అంది లక్ష్మి.

"సిగ్గులేదు" అన్నాడు శీను మొహం మరింత ఎ(రగా చేసుకుంటూ

"సిగ్గులేందెవరికి? " నవ్వింది లక్ష్మి.

"అబ్బా! ఊరుకోవే! ఆడు మాతమ్ముడు" బేబీ విసుక్కుంది.

"తమ్ముడైతే ఏంటంట గొప్ప!"

"ఇట్టయితే మేం నీతో మాట్టాడం" బేబీ కోపం తెచ్చుకుంది.

"నేనేమన్నానని..." అని గొణుక్కుంటూ అవతలకెళ్ళింది లక్ష్మి.

లక్ష్మి వెళ్ళిన వైపుకే చూసి వెనక్కి తిరిగిన శీనూకి గొడ్లన్నీ మేత చాలించి పరుగులు తీస్తూ వెళ్ళడం కన్పించి "బేబక్కా! మన గొడ్లు? " అన్నాడు వాటివంక చూపించి.

"అయ్యెక్కడికెళ్తయ్యిరా! ఇప్పటిదాకా మేసినయ్‌గా... పెద్దగుణ్ణంలోకెళ్ళి కాసేపు పడుకుంటయ్. తర్వాత మళ్ళీ అవే వత్తయ్‌లే" అంది.

అప్పటికో సంవత్సరం నుంచి బేబి గొడ్లని తోలుకొస్తోంది.

"పెద్దగుణ్ణం అంటే? "

"అదుగో.. దూరంగా నీళ్ళు కన్పడ్తన్నయ్ చూడు, అదే. చుట్టుపట్ల ఊళ్ళ గొడ్లన్నీ అక్కడికే వచ్చి నీళ్ళు తాగి కాసేపు పొల్లాడి, ఎండగదా.. తాపం తీర్చుకుని వత్తయ్. పెద్దగుణ్ణం చాలా లోతురోయ్. ఎప్పుడూ అటేపు ఎల్లమాక. పెద్దాళ్ళే ఎల్లరు. ఎల్తే యికంతే సంగతులు. మనం వచ్చేదార్లో ఎడమేపున సిన్నగుణ్ణం ఉంది. దానిలో కూడా గొడ్లు పొడుకుంటయ్. అందుకే ఈ గుణ్ణాల్లో మొక్కలుండవ్. ఎల్లేటప్పుడు నీకు సిన్నగుణ్ణం చూపిత్తాలే" అంది బేబి.

శీనుకంటే ఒక్కేడు పెద్దది. దీనికిద్దరన్నలున్నారు గానీ వాళ్లు కైకలూరెళ్ళి చదువుకుంటున్నారు. ఇద్దరక్కలు. వాళ్లు పెద్దవాళ్ళు. అందుకని వాళ్ళ గొడ్లని కాయటానికి ఆ ఇంట్లో అది తప్ప వేరే దిక్కులేదు.

ఈ గొడ్లని తోలుకొచ్చిన పిల్లలెవరూ మధ్యాన్నానికి తినటానికేమీ తెచ్చుకోరు. అందరూ ఇలా కలేకాయల మీదే బతికేస్తారు. ఆ కొల్లేట్లో నీళ్ళే తాగేస్తారు.

పెద్దగుణ్ణం నుండి తిరిగొచ్చిన గొడ్లకి జలగల్నుంచీ, దురదల్నుంచీ విముక్తి కల్పించడం కోసం కోమటిలంకలో ఎవరో పుణ్యాత్ములు పెద్దపెద్ద రాతికడ్డీలని పాతించారు. గొడ్లొచ్చి ఆ రాతి కడ్డీలకి ఒళ్ళు రుద్దుకుంటయ్. ఈ పిల్లలు అవి రుద్దుకుంటుంటే జలగల్ని పీకుతారు. జలగలు ఒంటినున్నంత సేపూ ఏమీ తెలియదు గానీ, ఊడాక, 'జిలజిల' మంటుంది. దానికి తెలిసినది, అక్కడున్నదీ ఒకటే మందు. అది కొల్లేటి బురద. గొడ్లకి రక్తం కారేచోట బురద మెత్తుతారు. సాయంత్రమవుతుండగా పిల్లల ప్రమేయం లేకుండానే గొడ్లన్నీ కొల్లేట్లోని పెద్దజాడలో దూకి ఊరికేసి ఈదుతాయి. పిల్లలూ వాటి వెనకే. వీళ్ళ ముందూవెనకా కొల్లేటి నీటి మిలమిలల్లో సూర్యుడు బంగారపు రజను చల్లుతూ ఉంటాడు. కొల్లేటివారకొచ్చిన గొడ్లు పైకెక్కలేక కొల్లేట్లో పడి మళ్ళీ లేస్తున్నయ్. ఎత్తుగా ఉన్న గడ్డమీదికిగాక వాలుగా ఉన్న చోటికి పసుల మందను మల్లేస్తూ బుడ్డాళ్ళంతా గేదెలెనక ప్రయాసపడుతున్నారు.

గేదెలకన్నా ముందే వయ్యారంగా ఊపుకుంటూ బాతుల మందలు వారకెక్కేశాయి. వాటి అరుపుల్తో, గొడ్లకాడి బుడ్డాళ్ళ కేకల్తో ఆ కొల్లేటి వార వారంతా రోజూలాగే సందడీ చప్పుళ్ళతో మారుమోగిపోతోంది. బాతులు సుశిక్షితులైన సైనికుల్లా తమ కోసం యజమానులు కట్టి ఉంచిన వలల, తడికెల, తాళ్ళ దొడ్లలోకి వెళ్ళిపోతున్నాయ్.

వారమీదకొచ్చిన గేదెల ఒంటి మీదున్న జలగల్ని, తమ ఒంటి మీదున్న జలగల్ని ఊడబీకి, నేలమీదేసి, కర్రతోనూ, కాళ్లతోనూ, తోకనుంచి తలదాకా పిండి నేలంతా నెత్తురు మడుగులు చేస్తున్నారు పిల్లలు. కష్టపడి తాగిన నెత్తురంతా నేల పాలవగా 'బతుకు జీవుడా', 'రేపొస్తారుగా చూసుకుందాం' అనుకుంటూ కొల్లేట్లోకి అంచెలంచెలుగా పాకిపోతున్నాయ్ జల

గలు. తాము మేసిన మేత నెమరేసు కుంటూ చావిట్లో కట్టేసి ఉన్న తమ చిన్న దూడల్ని తల్చుకుని తమ తమ ఇళ్ళకేసి వడివడిగా నడుస్తున్నాయ్ గేదెలు.

★ ★ ★

కృష్ణాజిల్లాకి, పశ్చిమ గోదావరి జిల్లాకి మధ్య 260 చదరపు మైళ్ళ మేర విస్తరించిన కొల్లేరు ఆసియా ఖండంలోనే అతి పెద్ద మంచినీటి సరస్సు. బుడమేరు, నాగులేరు, అక్కిలేరు, తమ్మిలేరులాంటి ఏరుల్నుంచేకాక 67 కాలవల్నుంచి కూడా నీరూ, మురుగు వచ్చి కొల్లేట్లో కలుస్తుంది. ఇట్లా వచ్చి చేరిన నీరంతా ఉప్పుటేరు ద్వారా బంగాళాఖాతంలో కలుస్తుంది. జులై, ఆగస్టు మాసాలలో సరస్సు పూర్తిస్థాయిలో నిండి ఏప్రిల్, జూన్ మాసాల్లో ఎండుతూ ఉంటుంది.

వేసవికాలం వస్తుందంటే చాలు, ఊళ్ళోని పశువులు మేకలు, గొర్రెలే కాక మెట్ట ప్రాంతపు రైతుల పశువులు కూడా కొల్లేట్లో మేత కోసం మందలు మందలుగా వచ్చేవి. ఎన్ని మందలు వచ్చినా అన్నిటినీ కడుపు నింపే కన్నతల్లిలా అక్కున చేర్చుకునేది కొల్లేరు.

ఈ కాలంలోనే కొల్లేట్లోకి దేశవిదేశాల్నుంచి బహుదూరపు బాటసారుల్లా ఎన్నో పక్షులు వచ్చి రకరకాల రంగుల ద్దేవి. తమ కూతలతో, అరుపులతో కొత్త సంగీతాల్ని తెచ్చేవి. గూడకొంగలు(పెలికాన్స్), కొండింగాయ్, పరజ, నత్తగొట్టు కొంగలు (ఓపెన్ బిల్లుడ్ స్టార్క్స్), తెల్లకంకణాలు (వైట్ ఇబిస్), ఎర్రకాళ్ళ కొంగలు (పెయింటెడ్ స్టార్క్స్), చింతవక్కలు (నైట్ హార్న్స్), చుక్కమూతి బాతులు (స్పాట్ బిల్లుడ్ డక్స్), నల్లబోడి కోడి (కూట్), కలికి పక్షులు (డార్టర్), జకానాలు, కత్తిరి పిట్టలు (బ్లాక్ డ్రోంగో), మైనాగోరులు, పాలపిట్టలు, కొంగలు, ఉత్తూతి పిట్టలు.. ఇవన్నీ కొల్లేట్లో ఐదారు నెలలపాటు హాయిగా విహరించి, కడుపునిండా తిని కాలం గడిపేవి.

ఉదయం అవుతూనే గుంపులు గుంపులుగా ఆకాశంలో పక్షులూ, మందలు మందలుగా నేలమీద పశువులూ ఆహారం కోసం ఈ సరస్సుకి చేరేవి. తిన్నంత మేత తిని, తాగినన్ని నీళ్ళు తాగి సాయంత్రానికి తిరిగి ప్రయాణమయ్యేవి. ఊరి పశువులు వాటివాటి దొడ్లలోకి వెళ్తే, పొరుగూళ్ళ పశువులు ఏటివారనే విశ్రమించేవి. పక్షులన్నీ ఆ చుట్టుపట్ల ఊళ్ళల్లో ఉన్న చెట్లని ఇళ్ళుగా చేసుకుని అక్కడే గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లల్ని చేసి, సాయంత్రాలు మేత తెచ్చి, పిల్లలకు తినిపించి, పెంచి పెద్దవి చేసి, వేల మైళ్ళ ప్రయాణానికి సిద్ధంచేసి వర్షాకాలం వస్తుందని పసిగట్టగానే బయల్దేరి వెళ్ళిపోయేవి. మళ్ళీ సంవత్సరం వచ్చినప్పుడు మళ్ళీ అదే చెట్టుని ఆక్రమించేవి. రంగురంగుల చిన్న, పెద్ద పక్షుల కలకలా రావాలతో, రకరకాల పూలతో కొల్లేటి సౌందర్యం ప్రకృతిలోని సర్వ వర్ణ స్వర సంగమంలా తోస్తుంది.

కొల్లేటిపైన పశువుల, పక్షుల సందడి ఇలా ఉంటే కొల్లేటి లోపల చేపల సంబరం చెప్పనలవి గాకుండా ఉండేది. కొరమీనులు, వాలగలు, బొచ్చెలు, గుర

కలు, పరిగలు, బిళ్ళ పరిగలు, బెత్తులు, మట్టగుడిసెలు, బొమ్మిడాయిలు, ఇంగిలాయిలు, మార్పులు, జెల్లలు, శీలావతి.. ఇంకా రొయ్యలు పీతలు, నత్తలు ఇలా ఎన్నో రకాలుండేవి. వేలెడంత నుంచీ ఇరవై, ముప్పై వీశెల బరువున్న చేపల వరకూ ఉండేవి. రొయ్య ఒక్కోటి రెండు వీశెల బరువుండి వాటి మీసాలు చిన్న సైజు చేతికర్రల్లా ఉండేవి. ఇంగిలాయి, మార్పు, జెల్ల చాలా ప్రమాదకరమైనవి. అవి కుడితే భరించలేనంత బాధేగాక చావు మీదికొచ్చేది. బొమ్మిడాయిలు కూడా మూడంగుళాల నుంచీ, రెండడుగుల బారు వరకూ పెరిగేవి. వీటిని వలలోనుంచి తీసి బుట్టలో వేసేంతలో చేతినుంచి జారి ఈదుకుంటూ వెళ్ళిపోయేవి. వాలగల్ని నలుగురు మనుషులు కావడికి కట్టి మోసు కెళ్తూ ఉండేవారు.

ఇన్ని రకాల పక్షులకాలవాలమై, కొన్ని వేల లక్షల జీవరాశులకు ఆహారాన్ని పెట్టి పెంచే కొల్లేటి ఒడ్డున, కొల్లేట్లోనూ లంకల్లాంటి గ్రామాలు వందకు పైగా ఉండేవి. ఆ గ్రామాల్లో ఒక గ్రామం పులపర్రు. పులపర్రుకి అరమైలు దూరంలో కైకలూరు నుంచి ఏలూరు వైపు వెళ్ళే బాట ఉంది. ఆ బాట నుంచీ చీలి ఒక చిన్న బాట ఊళ్ళోకి వస్తుంది. ఊరికి మూడు వైపులా కొల్లేరుంటే ఈ బాట ఉన్న వైపు ఊరిని ఆనుకుని ప్రవహించే ఒక పంట కాలువ ఉంది. ఈ ఊరిని దాటగానే ఆ కాలవ కొల్లేట్లో కలిసిపోతుంది. ఈ పంట కాలవకీ, పెద్ద బ్రాంచి కాలవకీ, చిన్న బ్రాంచి కాలవకీ మధ్యనున్న నాలుగొందల ఎకరాల భూమిని పెద్దదొడ్డి అంటారు. పెద్ద బ్రాంచి కాలవగట్టుకీ, పెద్ద బోదికి మధ్యగల రెండొందల యాభై ఎకరాల భూమిని పెద్దబోదిదొడ్డి అంటారు.

కొల్లేటికి ములకలొస్తే, ఈ రెండు దొడ్లలో పొలాలున్న పులపర్రు రైతులు, పలుగులు, పారలు కత్తవలతో తయారై ముంపునీరు పొలాల మీద పడకుండా పెద్దగట్టు కట్టుకుని ఆ గట్టుకి మరామ్మత్తు చేస్తూ, బలహీనంగా ఉన్న, అనుమానంగా ఉన్న ప్రాంతాలలో రాత్రీపగలూ వంతుల వారీగా కాపలాలు కాస్తుంటారు. ఆషామాషీగా వచ్చే ముంపులను ఈ దొడ్లలోకి రాకుండా నిలువరించేవారు. దానికోసం అహరహం శ్రమించేవారు.

ఐతే పైనెక్కడో కురిసిన వానలు పల్లపు ప్రాంతం అవటం మూలంగా కొల్లేట్లోకి ప్రవహించి ముంపు ఒక్కసారిగా వస్తే కొల్లేరు ప్రళయరూపం ధరించి ఏరూ డొంకా, ఊరూవాడా, కాలవగట్టూ.. అన్నీ ఏకమొత్తంగా జలరాశిగా మారిపోయేప్పుడు ఈ పెద్దగట్టులో ఒకేసారి పది పదిహేను చోట్ల గళ్ళు పడిపోయి ఊరి జనమంతా గట్లమీద నిలబడ్డా, వాళ్ళతో సహా కొల్లేరు పొలాల్లోకి జొరబడిపోయేది. అప్పటి వరకూ రాత్రింబగళ్ళు రాక్షసుల్లా పనిచేసి పంటొచ్చేదాకా ఎలాగో గడిపేస్తే పంట చేతికి రాగానే తీరబోయే అప్పుల గురించో, తీర్చుకోబోయే చిన్నవో పెద్దవో కోర్కెల గురించి.. 'అమ్మాయి పెళ్ళి, దున్న ముసల్దయిపోయింది మరోటి కొని దీనికి విశ్రాంతినివ్వాలి, ఇల్లు కారతాంది వేసుకోవాలి, భార్య ఆరోగ్యం క్షీణిస్తోంది ఆస్పటల్లో చూపించాలి, పిల్లలు బక్కచిక్కిపోతున్నారు ఒక పాడిగేదెను కొనాలి, నాలుగు బాతుల్ని కొనుక్కోవాలి, ఒక దోనె కొనాలి, చిన్నాడేడుస్తున్నాడు వాడికొక బొందుల లాగు కుట్టించాలి, పెద్దదానికో గౌను కుట్టించాలి..' ఇలా కలలు కనే రైతులకు కంటిమీద కునుకు లేకుండా కలలన్నీ పగటికలలు చేసేసేది. మళ్ళీ సంవత్సరానికి ఉండేదెవరో, ఊడేదెవరో!

ఇలా అనేకసార్లు జరిగినా గీతలో కృష్ణ

పరమాత్ముడు చెప్పిన 'ఫలితాన్నాశించక కృషి చెయ్యి', 'కృషీ వలుడా కృషిచెయ్యి' అన్న సూక్తులను బాగా ఒంటబట్టించుకున్న రైతులు మళ్ళీ దుక్కులు, మళ్ళీ విత్తనాలు, మళ్ళీ ఆకుమళ్ళు, మళ్ళీ ఊడ్పులు, మళ్ళీ కలుపులు, మళ్ళీ దొడ్డికట్టలు, మళ్ళీ కాపలాలు, మళ్ళీ వరదలు, ముంపులు... ఏది ఏమైనా ఎప్పటికైనా పంట కళ్ళజూడాలి, చూస్తారు, చూసేవారు రెండు మూడేళ్ళకొకసారి. కొంత కొల్లేటికోసం, కొంత కొల్లేటిలంకల్లో అలుపుసొలుపులకూ, ఆశానిరాశలకీ అతీతమైన అనామక రాక్షసుల్లా కష్టపడే ప్రజలకోసం అందుకే 'కొల్లేటి వ్యవసాయం' అనీ 'కొంపకొల్లేరే' అనీ 'కొల్లేట్లో పండే పంటేగాని చచ్చే దున్నపోతులకు లెక్కేలేదు' అనే సామెతలు నిత్యసత్యాలుగా జనం నోళ్ళల్లో నానుతుంటాయి. మిగతా జిల్లాల్లో పొలాన్ని దున్నడానికి ఎడ్లని వాడితే, ఇక్కడ దున్నల్ని ఎక్కువ వాడతారు కొల్లేటిపొలాల్లో దుక్కి దున్నడానికి దున్నలే మేలని. బళ్ళక్కూడా దున్నల్నే పూనుతారు.

పులపర్రులో ఒకే గది ఉన్న ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల ఒకటుంది గానీ దానికి పంతులు వచ్చే రోజులు తక్కువ. వాననో, వరదనో, బురదనో ఏదో ఓ వంక చెప్పేవాడు. ఎప్పుడన్నా పంతులొచ్చిన రోజు చచ్చేట్టు తంతాడు గాబట్టి పిల్లలొచ్చేవారుగాదు. అందుకే పేరుకి ఓ బడున్నా అది లేనట్టే. తీరుబడి లేని పనుల్తో సతమతమయ్యే జనానికి దేవుడిని తల్చుకునే సమయంకూడా దొరికేది కాదేమో ఆ ఊళ్ళో గుడి కూడా లేదు. సంవత్సరంలో సగం రోజులు ఊరంతా బురదతో ఉంటుంది. మిగిలిన సగం రోజులూ రొంపితో నిండి ఉంటుంది.

పులపర్రులో ప్రధానంగా రెండు కులాల వారే ఉన్నారు. కమ్మదొరలు, వడ్డిరాజులు. కమ్మదొరలంతా వ్యవసాయం చేస్తే, వడ్డి రాజులు చేపలవేటకు వెళ్తారు. కొల్లేటిలో ఈ గ్రామ హద్దు ఇంతవరకని అక్కడి గ్రామాల కులపెద్దలే నిర్ణయిస్తారు. ఆ హద్దుల మధ్య గల సరస్సుమీదే ఆ గ్రామంలో చేపల వేటగాళ్ళు అధికారం కలిగి ఉంటారు. గ్రామ కట్టుబాట్లను బట్టి కుటుంబాలను, ఆ కుటుంబంలోని సభ్యులనూ లెక్కించి ఆ ప్రకారం వేటగాళ్ళను నిర్ణయిస్తారు. ఆ నిర్ణయం ప్రకారం ప్రతి వేటగాడూ కొన్ని 'మావుల్ని' కొల్లేటి సరసులో గ్రామ పెద్దలు నిర్ణయించిన చోట ఉంచుతాడు. ఈ మావుల్లో సరసులోని చేపలు పడతాయి. బోనుల్లో చిక్కిన ఎలకల్లాగా మావుల్లోకి వెళ్ళిన చేపలు తిరిగి బైటపడలేవు. మావులు విశాలంగా ఉండటంతో ఒక్కో మావులో చాలా చేపలు పడతాయి.

ప్రతిరోజూ తెల్లవారుజామున వేటగాళ్ళు దోనెల మీద వెళ్ళి, మావుల్లో పడ్డ చేపల్ని ఏటివారకు తెస్తారు. వాటిని ఆయా కుటుంబాలకు సంబంధించిన స్త్రీలు కైకలూరు, ఏలూరు, ఆకివీడు, భీమవరం, ఉండి, గూడెం ప్రాంతాల్లోని చేపల వర్తకులకు అమ్ముతారు. ఈ అమ్మకాలు, కుటుంబాలకు కావలసిన కొనుగోలూ ఇదంతా చేసేది ఆ వడ్డీల ఆడవాళ్ళే. అందువల్ల వడ్డిరాజుల కులంలో పురుషులకెంత ప్రాముఖ్యం ఉందో స్త్రీలకూ అంత ప్రాముఖ్యం ఉంది. బరువైన చేపల తట్టలను నెత్తిమీద పెట్టుకుని ఎంత దూరమైనా చేతులూపుకుంటూ వెళ్ళే ఈ స్త్రీలు మంచి వ్యవహారజ్ఞానంతో ఉండేవారు.

వడ్డీల పిల్లలు గేలాలతో చేపలవేటకు వెళ్ళేవారు. పెద్దలు పెద్దచేపల్ని తెస్తే పిల్లలకు చిన్నచేపలు దొరికేవి. ఎప్పుడన్నా ఈ వరస తిరగబడి గేలాలకు పెద్దచేప చిక్కితే పిల్లలకు పండగే పండగ. ఎగురు

కుంటూ 'నేను పెద్దచేపను పట్టుకున్నా' అని వీధుల్లో గంతులేసేవారు. పెద్దలు వాళ్ళను మెచ్చుకునేవారు. పిల్లలు తెచ్చిన చేపల్ని నీళ్ళల్లో ఉడికించి, ఉప్పు, కారం వేసి, పులుసులా కాచి నూకల 'తాప'తో కలిపి తినేసేవారు. మసాలాలకూ, ఇతర దినుసులకూ ఠికానా లేదు వారికి. వడ్డీలకు నత్తమాంసం అంటే ప్రాణం. మాంసం తీసి ఆ గుల్లల్ని బైట పడేస్తారు. అవంత తేలికగా మట్టిలో కలవవు. అందు వల్లే వడ్డిగూడెం చుట్టూతా నత్తగుల్లలే నత్తగుల్లలు! గుట్టలు గుట్టలుగా పడుంటాయి.

చేపల వేట అయిపోయాక ఆడవాళ్ళు గంపలేసుకు అమ్మకాలకెళ్ళాక, మగవాళ్ళు వీధిలోకొచ్చి చిత్తూబొత్తు, కోతముక్కా, ఢంకా పలాసు, లోనాబైటాలాంటి జూదపాటలాడేవారు. పిల్లలు కర్రాబిళ్ళా, గోలీలు,

బెత్తులు, బచ్చాలు, నత్తగుల్లల్ని పోగేసి పగలగొట్టటం లాంటి ఆటల్తో తలమునకలుగా ఉండేవారు.

గుణ్ణాల్లో పెరిగే చేపలను మాత్రం బహిరంగ వేలం పాటలో వడ్డీలు పాడుకుని వేసవికాలపు చివరి రోజుల్లో పట్టుకునేవారు. ఒక్కోసారి మణుగు, మణుగున్నర చేపలు కూడా పడి వేటగాళ్ళను ముప్పుతిప్పలు పెట్టేవి. వేలంపాటలో వచ్చిన డబ్బుని ఊరుమ్మడి సొమ్ము అని దాచిపెట్టి గ్రామంలో జరిగే జాతరలు, కొలువులు, నాటకాలు, తోలుబొమ్మలాటలకీ, కలరాలాంటివి వస్తే వైద్యులకీ, మందులకీ పశువులకొచ్చే రోగాలకి మందులకీ, పశువైద్యుల ఫీజులకీ, ప్రభుత్వోద్యోగుల మామూళ్ళకీ దానిని ఖర్చుపెట్టేవారు. ఈ సొమ్ము ఎంత దేనికి ఖర్చు చెయ్యాలో నిర్ణయించటానికి కొందరు పెద్దలుంటారు. లెక్కలు చాలా కచ్చితంగా అందరికీ తెలిసేలా ఉండేవి. నిజాయితీ గల పెద్దల్ని ఈ పనికి నియోగించేవారు గ్రామస్థులు. ఊరి సొమ్ము తింటే పుట్టగతులుండవనే భావన బలంగా ఉన్న రోజులవి.

★ ★ ★

ఏటివార తడికల్లోపల ఉన్న బాతుల మందని చూస్తూ ఆలోచిస్తున్నాడు శీను. ఆ బాతులు పెట్టే గుడ్లలో ఒకటీ అరా 'తోలు' గుడ్లుంటాయి. పెంకు కట్టనివి. 'ఎప్పుడన్నా ఒకటిస్తాలే' అన్నాడు బాతుల మందని చూసే మురళి. ఆ ఆశ శీనుని పట్టి పీడించి ఇటు లాక్కొస్తుంటుంది. ఏం చేస్తాడు? కోడిగుడ్డు కావాలంటే ఊళ్లో దొరకదు. ఎక్కుమంది కోళ్లని పెంచరు. పెంచినా కోసుకు తినెయ్యటానికే లేపోతే ఏదో ఓ వర్షానికి తట్టుకోలేక అవి కాస్తా చస్తయ్. ఏ చిన్న ములక వచ్చినా కొట్టుకుపోతాయ్. కోడిగుడ్డు కావాలంటే కైకలూరు సంతకెళ్లి కొనుక్కు రావల్సిందే. ఆ కోడిగుడ్లు గోలీకాయల్లాగా ఉంటాయి. దానికన్నా ఏటివార చౌకగా దొరికే పెద్ద పెద్ద బాతుగుడ్లు నయం గదా. నీచువాసనొస్తుంది అంటారు. నీచు తింటూ నీచు వాసన రాకపోతే ఏం బాగుంటుందో శీనుకర్థంగాదు. ఎండు చేపలూ, ఎండు రొయ్యలూ దోసకాయలో వేసి వండితే ఆ వాసనే అసలెంత కమ్మగా ఉంటుంది. బొమ్మిడాయిల్నిగానీ, బెత్తుల్ని గాని బెండకాయల్లో కలిపి వండుకుంటే ఎంత బాగుంటుంది! శీనుకప్పుడే నోట్లో నీళ్లూరాయి. సరిగ్గా అప్పుడే శీనుని చూసిన మురళి "శీనూ! ఒక తోలు గుడ్డుంది కావాలా?" అనడిగాడు. శీను ముఖం సంతోషంతో ఇంతయ్యింది.

"ఆ" అంటూ పరుగెత్తికెళ్లి దాన్ని తీసుకుని ఇంటిదారి పట్టాడు.

మధ్యలో ఏనిపిల్లి రాఘవయ్యగారింటెనకాల ఏపచెట్టు కింద పొట్టాడు ఒక మేకని పట్టుకుని లాగుతున్నాడు. అది 'మేమే' అని అరుస్తోంది. శీనూని చూసి పొట్టోడు "అరే శీనుగా.. దా! దా! మేకపాలు తాగుదాం" అని కేకేశాడు.

శీను పొట్టోడి దగ్గరికెళ్లాడు.

"నువ్వు మేకని కదలనియ్యకుండా ముందు కాళ్లు పట్టుకో. నేను ఎనక్కాళ్లు పట్టుకుని పాలుతాగుతా. తర్వాత నువ్వు

తాగుదుగాని" అన్నాడు పొట్టోడు.

"సరే" అని తోలుగుడ్డని కాస్త దూరంగా కిందపెట్టి మేకకాళ్లు పట్టుకున్నాడు శీను. ఒకరికిద్దరయ్యేసరికి ఇక అరవడం కూడా దండగేననుకుందేమో మేక 'మే' అనకుండా ఊరుకుంది. పొట్టోడు నోట్లో పాలుపడేట్టు మేక చన్నుని పిండి, అవి సరిగ్గా నోట్లో పడక కళ్లమీదా తలమీదా మొఖంమీద పడి తంటాలు పడుతున్నాడు. "నువ్వు పట్టుకోరా! నేను చూపిత్తా" అని శీను మేక చన్నుని నోట్లో పెట్టేసుకుని పిండటం మొదలెట్టాడు.

అప్పుడే ఏనిపిల్లి రాఘవయ్యగారు ఇంటెనక్కొచ్చి "ఉరే పిల్లనా కొడకల్లారా! ఏంజేత్తన్నార్రా? " అని ఓ రంకేశాడు.

ఇద్దరూ మేకనొదిలి అదే పరుగు. కాస్త దూరం వచ్చాక శీనూకి తోలుగుడ్డ గుర్తొచ్చి వెనక్కొచ్చాడు. తోలుగుడ్డ అలానే ఉంది. మేక లేదు. పిల్లలొదలగానే పారిపోయింది. తోలుగుడ్డ భద్రంగా ఉన్నందుకు సంతోషంతో దాన్ని తీసుకుని సందు మలుపు తిరుగుతున్నాడో లేదో భాస్కరం బాబాయి కనపడి "ఎక్కడికెల్లా అయ్యా! మీ అమ్మ నీ కోసం ఎతుకుతోంది. ఇంటికెల్లు" అన్నాడు.

"సరే" అని తలూపి బుద్ధిగా ఇంటికెళ్తాంటే కాలవగట్టు దగ్గర్నించి గంగిరెద్దులాళ్ల మేళం వినపడింది. శీనుతో సంబంధం లేకుండానే వాడి కాళ్లు అటు పరిగెత్తినయ్.

అప్పటికే గంగిరెద్దు వెనక పొట్టోడున్నాడు. శీను వెళ్లేసరికి మరో నలుగురు పిల్లలు పోగయ్యారు. గంగిరెద్దు ముందు ఒకడు డోలు కొడ్తుంటే ఒకడు బూరూత్తున్నాడు. వెనక ఆరుగురు పిల్లల్తో వంటినిండా రంగురంగుల చీరలూ, దుప్పట్లతో గంగిరెద్దు.

"అరే శీనూ.. మీ అమ్మ నువ్వేమైపోయావోనని ఏడుత్తాందిరా! ఇంటికెళ్లు" అని అరిచాడు రాజులు బావ.

వదల్లేక వదల్లేక గంగిరెద్దు నొదిలి ఇంటిదోవ పట్టాడు శీను.

శీనుగాడి అమ్మొక్కత్తే తన బిడ్డ కాసేపు కనపడకపోతే అల్లల్లాడిపోతంది. 'బిడ్డేమైపోయాడో' అని ఏడుస్తుంది. ఆమెకి నలుగురు మగపిల్లలు పుట్టి కొంత పెరిగాక చచ్చిపోయారు. లేక లేక ఎప్పటికో కలిగిన ఈ శీనుగాడి మీదే పేణాలెట్టుకు బతుకుతాంది లక్ష్మమ్మ. అదే పొట్టోడి తల్లి అయితే పొట్టోడు ఎంతసేపు కనపడకపోయినా అస్సలేమీ అనదు. వాడు తిరిగి తిరిగి ఎప్పుడో కొంపకి చేరినప్పుడు మాత్రం 'ఏడికి పోయా! ఏ జామయ్యిం దెల్లి. కాకిలాగా ఊరంతా తిరుగుతావ్! పద తానం చేసింత తిందూగాని' అంటుంది.. అంతే. పొట్టోడి స్వేచ్ఛ చూస్తే శీనుగాడికెప్పుడూ అసూయే.

శీనూని చూసి, వాడి చేతిలో తోలుగుడ్డని చూసి "మళ్లీ తెచ్చా, ముదనష్టపు తోలుగుడ్డని. ఎన్నిసార్లు చెప్పాను తోలుగుడ్డ అరిష్టమని" అరిచింది లక్ష్మమ్మ.

"ఎక్కడికన్నా ఎళ్లేప్పుడు చెప్పి ఎళ్లమన్నా. నీ కోసం ఎక్కడని ఎతకాలి? " అంది కోపంగా.


"ఎతకటమెందుకు? నేనేమన్నా తప్పిపోతానా? "

"ఆ.. తప్పిపోవు! పెద్దింటమ్మ తిరనాళ్లలో తప్పిపోయావు"

"ఇదేమన్నా తిరనాళ్లా? ఊరు. అయినా తప్పిపోయినప్పుడు నాకసలేం తెలవదు. ఇప్పుడు పెద్దాడ్నయ్యా. నేనేం తప్పిపోను"

తల్లి తనని పెద్దాడిగా గుర్తించనందుకు శీనుకి చిరాకొస్తుంది.

"అవున్నిజమేలే. నువ్వు తప్పిపోవు. పోతేగీతే మేమందరం తప్పిపోతాం. పద కాళ్లూచేతులూ కడుక్కుని పీటేసుకో.



అన్నం తిందూగాని"

"ఈ తోలుగుడ్డు కూరొండు. అప్పుడదే సుకుతింటా"

"ఉప్పుడొండలేను. బెండకాయ కూరొండా. అది రేపొండుతాలే. ఈలోపు నీ తోలుగుడ్డెక్కడికీ పోదు, పద"

"నాకన్నం వద్దు. నేను తినను"

వాళ్లమ్మలాగే శీనూకి కూడా పంతం ఎక్కువ.

శీనూ అలిగాడు. అమ్మమీద కాదు. అన్నం మీద.

అమ్మ ఎంత బతిమాలినా కరగలా.

ఇక లాభం లేదని అప్పటికప్పుడు ఒక ఉల్లిపాయ కోసి తోలుగుడ్డుతో పొరటు చేసి "ఇకదా! గుడ్డొండాలే. దా!" పిల్చింది లక్ష్మమ్మ. "దాయ్యా! మయ్యావి గదూ"

"నన్నిసిగించకురా. నాకోపిక లేదు. ఎంతకని బతిమాలను. మయ్యగదూ!దా"

ఎన్నిసార్లు ఎలా బతిమాలినా కరగటం లేదు శీను మనసు. అలక వీడటంలా.

"పోనీ.. తినిపిస్తా పట్టు. ఆ.. అను" అని ముద్ద కలిపి నోటి దగ్గరకి తెస్తే మొఖం తిప్పేసుకుంటున్నాడు. కానీ గుడ్డు పొరటువాసన... శీనుకెంతో ఇష్టమైన నీచు వాసన... పంతం నిలబడేట్టు లేదు. దానికి తోడు కడుపులో ఎలుకల పరుగులు మొదలైనాయ్. లొంగక తప్పేట్టు లేదు.



మరొక్కసారి బతిమాలనియ్ అనుకుంటున్నాడు. బతిమాలిన ప్రతిసారీ బిర్రుగా ఉంటున్నాడు.

ఆకలి పెరుగుతోంది. అమ్మకి ఓపిక నశిస్తోంది. రెండు విషయాలు అర్థమవుతున్నాయి. "ఇదే ఆఖరిసారి! తింటే తిను. లేకపోతే ఆకల్తో ఆ పొట్టని మాడ్చు! నేనిక బతిమాల్లేను" అంది లక్ష్మమ్మ.

'చచ్చాన్రా దేముడా! ఇక బతిమాలకపోతే ఈ ఆకలిని తట్టుకోవటం కష్టం' అనుకుని ఓరగా తల్లివంక చూశాడు. ఆమె పళ్లెంమీద మూతేసి, చేటలో బియ్యం పోసుకుని మట్టిగడ్డలేరుకుంటోంది. తనంతట తనెళ్లి తినటం అంటే పౌరుషం. ఏం చెయ్యాలి? అందుకే అంటారు పెద్దాళ్లు, తెగేదాకా లాగకూడదని.

"అమ్మా" అన్నాడు శీను నెమ్మదిగా.

తలెత్తకుండానే "ఊ" అంది లక్ష్మమ్మ.

"ఇంకొక్కసారి బతిమాల్తే తింటా" అన్నాడు బుంగమూతితో.

"సరే! రా నాన్నా! మా నాన్నవి కదూ! నువ్వు తినకపోతే నా కడుపుఎట్టా మాడిపోతందో. దా వచ్చి తిను" అంది.

ఒక్క ఉదుటున భోషాణం మీదనుంచి ఉరికి గబగబా రెండు ముద్దలు మింగాడు. పొలమారింది. లక్ష్మమ్మ శీను మాడు మీద కొడ్తూ "అంతా తొందరే! నెమ్మదిగా తిను! ఈ నీళ్లు తాగు. గొంతు

కడ్డం పడిందా? అంత తొందరెందుకు? ”

ఆకలి! ఆకలి!

★ ★ ★

వేసవికాలపు ఎండ, వడగాల్పు. ఎక్కడా మనిషి తిరగటంలే. పురుగూ, పిట్టా ఏ చెట్ల ఆకుల సందుల్లోనో దాక్కున్నయ్. రంగయ్యగారు మాత్రం వసారాలో కూర్చుని పొగాకు పాయలు తీసుకుంటు న్నాడు. ఎవరో ఒకతను ఆ వీధిలో వెళ్తు న్నాడు. నెత్తిమీద తలగుడ్డ, మొలకో గోచీ తప్ప ఒంటిమీద వస్త్రం లేదు.

రంగయ్యగారు చూడనే చూశాడు.

“ఎవరా మనిషి? ” అని అతనికినపడేలా కేకేశాడు.

“నేను వడ్డాడ్నిలెండి” అన్నాడతను ఆగి.

“ఇట్రా... ఏంటింత ఎండలో పడిపో తున్నా... నీ పేరేంటి? ”

“నాపేరు వడ్డీ కాసులండి” అంటూ దగ్గ రకొచ్చాడు. కానీ ఎండలోనే నిలబడి ఉన్నాడు.

“ఇట్టా వసారాలోకి రా! ఇంతెండబడి ఎక్కడికి? ”

“పొద్దుననగా సేపల గంపెత్తుకునెల్లిం దండి మా ఆడది! రోజూ ఈపాలి కొచ్చేదే. ఇంకా రాలేదని అట్టా కాలవగట్టుకేసె ల్తన్నా. వత్తాందేమో సూద్దామని..”

“అన్నం తిన్నావా? ”

“ఆ.. తిన్నానండి. అదే పాపమేం తిన కుండా గంపెత్తుకెల్లింది. ఏమైపోయిందో నని? ”

“ఏమవ్వదులే. వత్తంది. కాలవగట్టు దాకా వచ్చిందిక ఊళ్లోకి రాకుండా అక్కడే ఆగదుగా”

“ఏదో ఆదుర్దా కొద్దీ..”

రంగయ్యగారు పక్కనే ఉన్న కుండలో నుంచి గ్లాసుతో మజ్జిగ తీసిచ్చి “ఇయ్యి తాగు. ఇంతెండలో పడి తిరుగుతున్నావ్” అన్నాడు.

వడ్డీకాసులు గ్లాసందుకుని ఎత్తి పెట్టుకు ని గడగడ తాగి “మీకెందుకండి శెమ? ” అన్నాడు గ్లాసందిస్తూ.

గ్లాసు తీసుకుని కుండమీదున్న మూత మీద బోర్లించి పెడ్తూ “దీన్లో శ్రమేముంది గానీ ఇంటో వంట నువ్వు చేత్తావా, నీ భార్యా? ” అన్నాడు.

“దానికి వంటచేసేంత తీరికెక్కడిదండీ. పొద్దున్నే నాతోపాటే కొల్లేటికొత్తంది. నేను వల తీసుకుని దోనె మీద చేపలు పట్టటా నికి కెళ్తానా, అది ఏటివారకి దగ్గర్లో ఉన్న మావుల్లో పడ్డ సేపలు పోగేత్తదండి. నేనొ చ్చేతలికి ఏటివారన గంపతో సిద్ధంగా ఉంటదండి. నేను పట్టిన చేపలన్నీ గంపలో ఏసుకుని ఇక గునుకేత్తానే ఉంట దండీ. కైకలూరే ఎల్తందో, ఏలూరే ఎల్తందో అది ఆ రోజు పడ్డ సేపల్ని బట్టుంటదండి.. అయ్యన్నీ అమ్ముడుబోయే దాకా కొట్లంటా, ఈదులెమ్మటా తిరిగి, ఇంటోక్కావల్సిన సరుకు తీసుకుని వత్త దండి. నేను ఇంటోనే ఉంటాగదండీ. నే ననే ఏముందిలెండి. మా గూడెంలో మొగోళ్లంతా ఇంట్లోనే ఉంటాం. మేమే కాత్తుడకేసి మేం తినేది తిని ఆళ్లకింతుం చుతామండి..”

“అదే మంచి పద్ధతిలే గానీ.. ఏం కూరొండుకున్నా ఇయ్యాల? ”

"నత్తల కూరండి"

"నత్తలంత రుచిగా ఉంటయ్యేరా? " ఆశగా అడిగాడు రంగయ్య.

"ఆ! శానా రుశండీ! అదీగాకండీ నత్తల్ని తింటే పొట్ట రాదండి. కొవ్వుని కరిగిత్త దండి" అన్నాడు వడ్డీకాసులు తన పొట్ట వంక చూసుకుంటూ.

"అందుకేనా మీరంతా దిట్టంగా ఇట్టా ఉంటారు, ఉక్కుముక్కల్లాగా" అన్నాడు రంగయ్య వడ్డీకాసుల్ని ముచ్చటగా చూస్తూ.

"ఆ! అంతేనండి. మీకు శుభ్రంచేసి తెమ్మంటారేంటండీ? "

అప్పటిదాకా ఈళ్ల మాటవింటూ గడప మీద తలపెట్టుకుని లోనపడుకున్న లక్ష్మమ్మ ఒక్కసారి లేచి గయ్యిమంది.

"రకరకాల చేపలయిపోయాయి. ఇక నత్తలా. తెచ్చావంటే నిన్నీఈదిలోకే రాని వ్వను. నత్తలు తింటే ఈయన్ని ఇంటోంచి గెంటేత్తా. ఇద్దరూ కల్సి కొల్లేట్లో నత్తలేరు కుని బతుకుదురుగాని.. ఏమనుకున్నారో"

ఆ అరుపులకు జడుసుకుని "అమ్మో! అమ్మగారిక్కోపమొచ్చినట్టుంది. నేనెల్తా నండి" అని జారుకున్నాడు వడ్డీకాసులు.

రంగయ్యగారు నవ్వుకుంటూ వీధిన ఎండనబడి వెళ్లే తర్వాతి మనిషి కోసం చూస్తున్నాడు. ఈ ఎండాకాలమంతా, ఆయనకిదొక సరదా.

ఎవరటుగా వెళ్తున్నా 'కాసిని దాహం తీసుకుని ఎల్దువుగాని రా' అని పిలవడం లక్ష్మమ్మగార్ని కేకేసి 'కొంచెం మజ్జిగ తీసు కురావే' అని చెప్పడం.. ఇదేపని. ఆవిడ మధ్యానం పూట కాసేపు నడుం వాలుస్తూ 'కుండా గ్లాసూ' తెచ్చి ఆయన పక్కన పెట్టే స్తుంది. అటుగా వెళ్ళే ప్రతివాళ్ళూ మన వాళ్ళే రంగయ్యగారికి.

మనుషుల జాతి, మతం, కులంప్రసక్తి లేకుండా 'మనవాళ్ళే', 'మనూరే' 'మన పక్కూరే', 'మన కొల్లేరే', 'మన మనిషే'.. బాగుంది. అయితే మనుషులే కాదు అటుగా వెళ్ళే కుక్క కూడా 'మన కుక్కే'. వాకిట్లో వాలే కాకులు కూడా 'మన కాకులే' . ఇంట్లో చావిట్లో చేరి కిచకిచల పాట కచే రీలు చేసే పిచ్చుకలు కూడా 'మన పిచ్చు కలే'. ఈ ప్రకృతిలో మనవి కానివి లేవా యనకి.

★ ★ ★

అప్పుడే అటుగా వెళ్తున్న వడ్డీవాళ్ళ పిల్లాడి తలవంకా, వాడేసుకున్న మొల తాడు వంకా చూస్తున్న శీనూకి అలా తాను కూడా ఉండాలనిపించింది. తల మీద ముందు వరసలో ఓ బెత్తెడు మేర అంటకత్తెరేయించిన జుట్టు- మిగతా అంతా నున్నటి గుండు. ఎంత బాగుందో. తన తలనిండా ఈ జుట్టేంటి.. వాడికంత షోకేంటి? ఆ షోకు తనకూ కావాలని పించి తనక్కూడా అలా క్షవరం చేయించ మని తండ్రి దగ్గర ఏడ్చి గొడవ పెట్టాడు. రంగయ్య "తప్పయ్యా! అట్టా బాగుండ దయ్యా" అని బుజ్జగించాడు. లక్ష్మమ్మ ఆ మాత్రం కనికరం కూడా చూపించలేదు. "ఎదవ బుద్దులు! ఎదవ కోర్కెలు! ఇంకో మాటు నోరెత్తావంటే అట్టకాడ కాల్చి వాత పెడతా" అంది.

వడ్డీల పిల్లల మీద వాళ్ళ తలిదండ్రుల కున్న ప్రేమ తనమీద తన తలిదండ్రులకు లేనందుకు శీను ఒక పూటంతా ఏడ్చాడు.

తన కోరికలు సామాన్యంగా తీర్చే తలి దండ్రులు.. ఒకోసారి తల్లి కాదన్నా తీర్చే తండ్రి ఈ విషయంలో తన మీద ఇంత నిర్దయగా ఎందుకున్నాడో వాడి చిన్న బుర్రకి అర్థం కాలేదు.

ఏమైనా వడ్డీల పిల్లలు అదృష్టవంతులు. చక్కగా గుండు. ముందు అంటకత్తెర. ఇట్లా తల పని చేయించే తలిదండ్రులు. దహించుకుపోతున్న శీను హృదయం

చల్లారటానికి చాలా సమయమే పట్టింది.

ఇక మొలతాడు విషయంలో కూడా తనంత దురదృష్టవంతుడు మరొకరు లేరని వాడికి అర్థమైంది. ఒక బుడ్డాడికి మొలతాడు చుట్టూ చిల్లు కానీలు. మరొక డికి పెద్ద కానీలు. పొట్టోడికి మువ్వలున్న మొలతాడు, శీనూకి మాత్రం ఒట్టి ఎర్ర తాడు. చిల్లిగవ్వ లేని నూలు తాడు. ఏదో ఒకటి తన మొలకీ ఉండగూడదా! ముఖ్యంగా పొట్టోడికి మల్లే మువ్వల మొలతాడు తనకీ ఉండాలని ఆరాటం పెరిగి పర్వతమంతైపోయి గుండెలు పగిలేలా ఏడిపించింది. తలిదండ్రులిద్దరూ ఎన్నడూ లేనంత ఐకమత్యంగా శీనూని వాడి ఏడుపుకి వాడినొదిలి తమ పనులు తాము చేసుకుంటున్నారు.

అప్పుడే అటొచ్చిన వీరభద్రం మేనల్లుడి ఏడుపు చూసి "ఏమిటంట? ఎందుకంట? " అనడిగి వివరం తెల్సుకుని "సరేరా! నువ్వూ పొట్టోడూ కుస్తీ పట్టండి. నువ్వు గెలిస్తే నీకాడి మువ్వల మొలతాడి ప్పిస్తా! నువ్వోడిపోతే గుండుకొట్టిచ్చి ముందు పిలక పెట్టిస్తా. సరేనా! పో! పోయి పొట్టోడ్ని పిల్చుకురా" అన్నాడు.

ఏడుపాపి ఆలోచించి ఓడినా గెలిచినా తనకే లాభం అనుకున్న శీనూ గబగబా వెళ్లి "రా రా! రా రా!" అని పొట్టోడ్ని పిల్చుకొచ్చాడు.

"కుస్తీ పట్టండ్రా" అన్నాడు వీరభద్రం.

పాపం పొట్టోడికి పందెం సంగతి కూడా తెలీదు. మీదికొస్తున్న శీనూతో తలపడ్డాడు. ఇద్దరూ హోరాహోరీగా కుస్తీ పట్టారు. కింద పడ్డారు. లేచారు. దుమ్ము దులుపుకున్నారు. అరచేతుల్లో ఉమ్మేలూసుకుని మట్టి తీసి రాసుకుని "రారా!! రారా!!" అనుకుంటూ కోళ్ళ పందాల్లో ఏ శత్రుత్వమూ లేని కోళ్ళు ప్రాణాలు తీసుకునేంతగా ఎలా పోరాడుతాయో అలా పోరాడారు.

వీరిద్దరి కుస్తీ పోటీకి ఊరి పెద్దలంతా ఒక్కొక్కరే వచ్చి ప్రేక్షకుల్లా నిలబడ్డారు. కాసేపట్లోనే రెండు పార్టీలుగా చీలిపోయారు. ఒకడు అట్లూరివాడైతే ఇంకొకడు అక్కినేనివాడు. బావా బామ్మరుదుల వరస. ఊరివాళ్ళ వినోదానికి అంతకంటే పెద్ద కారణం అక్కర్లేదు కూడా.

అట్లూరి వాడు పడితే అక్కినేని వాళ్ళ పక్షం గోల, అక్కినేనివాడు పడితే అట్లూరి వాడి పక్షం గోల.. చప్పట్లు, నవ్వులు. అరుపులు. ఎగతాళి మాటలు. చివరికి ఈలల దాకా వచ్చింది వ్యవహారం.

కోడిపుంజుల్లా పొడుచుకుంటున్న పిల్లలు రొప్పుతున్నారు.

ఇక కాకయ్యగారు ఊరుకోలేక "ఆ.. ఇక చాల్లే. ఊరుకోండిరా! పిల్లమోళ్ళు. వాళ్ళతో నా మీ ఆటలు? వాళ్ళెంత, వాళ్ళ ఊపి రెంత? ఏ నవరగంత కన్నా తగిల్తే ఇకం దరం కూచుని ఏడవాలి. ఆపండి. ఆళ్ళనిడదియ్యండి" అని కాకయ్యగారు కేక లేసే వరకూ పోటీ సాగింది. ఎవరు ఓడారు? ఎవరు గెలిచారు? అది ఎవరికీ పట్టలేదు. ఇద్దరూ గెలిచారు. ఒక్కరూ ఓడలేదు. బాగుంది. ఇద్దరూ ఒకరి భుజంమీదొకరు చేతులేసుకుని, బెల్లం గడ్డలు బుగ్గన పెట్టుకుని కిలకిలా నవ్వుకుంటూ పోతున్నారు. చిత్రమేమిటంటే మువ్వల మొలతాడు కోసం కుస్తీపోటీకి దిగగానే విషయం శీనూ పూర్తిగా మర్చిపోయాడు. దానికోసం తానేడ్చిన ఏడుపు ఎటుపోయిందో వాడికి గుర్తే లేదు.

ఒళ్ళంతా దుమ్ము. చెమటలు. అక్కడక్కడా చిన్న దెబ్బలు. ఐతే మాత్రం ఏం? నోటి నిండా బెల్లంగడ్డ. భుజం మీద పొట్టోడి చెయ్యి. ప్రపంచంలో శీనుగాడికి ఏ అన్యాయమూ కన్పించలేదు. తనకన్నా అదృష్టవంతుడు ఎక్కడా ఉండడనే భావం

వంటిది వాడి మనసునిండా నిండిపో యింది. పొట్టోడికసలు ఏ గోలా లేదు. పక్కన శీను ఉంటే చాలు వాడికి. ఇద్దరి నవ్వులతో కొల్లేట్లో కలువపూలు పోటీపడ లేకపోయాయి.

కాస్త ఎండగా అన్పిస్తే చాలు, శీనూ, పొట్టోడు, మరికొందరూ కలిసి కాలవ కర్రొంతెన కిందికి చేరేవాళ్ళు. కాలవలో నీళ్లు చల్లగా ఉండేవి. నెత్తిపైన వంతెన. వంతెనకి పక్కన బొరియలు. వాటినిండా కప్పలు చేరి వీళ్ళను చూసి అవీ నీళ్ళలోంచి బొరియల్లోకి గెంతనూ, మళ్ళీ నీళ్ళల్లోకి గెంతనూ.. ఆడుతుండేవి.

కర్రొంతెన కింద కర్రలకి చుట్టుకొని వేళ్ళాడుతూ పాములు.. దొరికిన కప్పని మింగి కడుపింత లావయిపోయి బద్ధకంగా పడి ఉండే పాములు.

కాలవలో చేపలు ఉండుండి వీళ్ళ లేత శరీరాన్ని పొడిచేవి. అలా పొడిచినప్పుడల్లా చక్కలిగింతల్తో ఉలికులికి పడి నవ్వులు రువ్వే పిల్లలు.

నెమ్మదిగా బొరియ దగ్గరికెగిరెళ్ళే కప్ప పిల్లని పట్టుకున్న పొట్టోడు "అరే శీనుగా. కప్పపిల్లని పట్టుకున్నారా" అన్నాడు.

"ఏదీ చూపించు? "

పొట్టోడు మూసిన గుప్పిట్ని తెరిచాడు. కప్పపిల్ల చెంగున శీనూ మీదికొక్క దూకు దూకింది. వాడు ఉలిక్కిపడ్డాడు. అది నీళ్ళల్లో మాయమయింది. పిల్లల నవ్వులు. పిల్లలకి నవ్వడానికి పెద్ద విషయాలేమీ అక్కర్లా. నీళ్ల తళతళలు చాలు. నీటి మీది నుంచి పైకెగిరే ఓ చేపపిల్ల చాలు. పెద్దవాళ్లెవరో చూసి వాళ్ళ నవ్వుల్ని హరించేదాకా ఆ కాలవలో ఆటలే.

ఉన్నట్టుండి శీనూ కాళ్ళకేదో చుట్టుకుంటున్నట్టుంది. అదేంటో తెలియక అనుమానంగా చూస్తున్నాడు. పొట్టోడు "ఏంట్రా? " అనడిగాడు.

"ఏమో! ఏంటో కాళ్ళకి చుట్టుకుంటాంది"

"తాంబేలు పట్టుకుంటాందేమో! తాంబేలు పట్టుకుంటే గాడిద కూసేదాకా వదలదంట" పొట్టోడు తన లోకజ్ఞానాన్ని ప్రదర్శించాడు.

"ఏహె తాంబేలు కాదు. పట్టుకోటల్లా. చుట్టుకుంటాంది"

"అయితే పామే"

"పాం కూడా కాదురా. మెత్తగా లేదు. గట్టిగా ఉంది. ఉండు చేత్తో చూత్తా" అంటూ శీనూ కాళ్ళ దగ్గర, చేతికి తగిలిన దాన్ని పైకి లాగాడు. అది ఎనిమిది అంకెలాగా ఉన్న తీగెల చుట్ట. ఇద్దరూ కలిసి దాన్ని ఒడ్డుకు లాగారు. శీను దాన్ని మోసుకుని ఇంటికి తెచ్చాడు.

"ఏంటీ.. కుమ్మరాం. ఎందుకు తెచ్చా! ఎక్కడ దొరికిందీ? " అంది లక్ష్మమ్మ చిరాగ్గా.

"కాలవలో దొరికిందమ్మా" శీనూకేదో నిధి దొరికినంత సంబరంగా ఉంది.

"ఎందుకీ ఎత్తు భారం. కాలవలో కొట్టుకుపోయేదాన్ని కొట్టుకుపోనివ్వకుండా ఇంటిదాకా మోసుకొచ్చా"

"కొట్టుకుపోలా. నా కాళ్ళకు చుట్టుకుంది"

"నయమే. మెడకి చుట్టుకోలా! ఆ కాలవకెళ్ళకు నాయనా అంటే యినలే. నా కొంపకేదోటి తెచ్చి పెడ్తావు"

రంగయ్యా ఈ మాటలు వినపడి రంగం

లోకి వచ్చాడు.

"ఏంటే! నా బాబునేంటంటన్నావ్? "

"ఆ.. నీ బాబునీ, నిన్నూ అంటం తప్ప నాకు పనేం ఉంది. సూడు నీ బాబు సంపాదన" అని తీగల చుట్ట చూపించింది లక్ష్మమ్మ.

"ఇది నీకెక్కడిదయ్యా? " ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రంగయ్య.

"కాలవలో తానం చేత్తాంటే, కాలికి సుట్టుకుంటే తెచ్చా" అన్నాడు శీను.

"ఏంటా శనీస్వరం? తీసికెళ్ళి పెంట పోగు మీద పడేసిరా" అంది లక్ష్మమ్మ.

"ఒసి నీగోలాపవే! ఇదేంటనుకుంటన్నా? "

"ఏంటి? "

"దీంతో మావులు తయారు చేత్తారు" అంటూ అప్పుడే అటెళ్తున్న వడ్డీల కిట్టమూర్తిని చూసి "ఉరే కిట్టమూర్తీ! ఇటు రా!" అని పిల్చాడు రంగయ్య.

కిట్టుడు అందరు వడ్డీలకిలాగానే గోచీ మాత్రమే పెట్టుకుని ఉన్నాడు. భుజం మీద కావిడి బద్దుంది.

"ఎక్కడికెల్తన్నా"

"ఎక్కడికెల్తామండీ! కొల్లేట్టోకే"

"సరే! ఇది సూడు నీకు పనికొత్తందేమో"

"కిట్టుడు తీగల చుట్ట చూసి పరమానంద భరితుడై "ఇది మీ దెగ్గర..? "

"మా అయ్యకి దొరికిందిలే. నీక్కావాలా? "

"ఆ! తీసికెళ్తా దొరా! మా సిన్నదొరకి నేనున్నంత కాలం కోరిన సేప ఇత్తానుండే" అని ఆ చుట్టని కావిడిక్కట్టుకుని భుజానికి తగిలిచ్చుకునెళ్ళిపోయాడు.

"కిట్టమూర్తికెందుకిచ్చావు నాన్నా? " అన్నాడు తన చేతిలో పెన్నిధి జారిపోయిందన్నంత దిగులుతో.

"ఇత్తే ఏ? నీకు ఏ చేప కావాలంటే ఆ చేప ఇత్తానన్నాడుగా" నవ్వుతూ అన్నాడు రంగయ్య.

"మనమే మావులు తయారు చేసుకుని కొల్లేట్లో పెట్టుకుంటే మనకే బోల్డు చేపలు దొరికేయిగా!" కళ్ళింతింత చేసి అన్నాడు శీను.

"అదే! కొల్లేట్లో మావులు పెట్టుకుని, వడ్డాళ్ళ పొట్టగొట్టి, రోజూ కొడుకో గంపా, బాబో గంపా ఎత్తుకుని 'చేపలమ్మా చేపలు' అని కైకలూళ్ళో, ఏలూళ్ళో అమ్ము కొద్దురుగాని" అంది లక్ష్మమ్మ.

"నేనూ మా అయ్యా ఎందుకమ్ముతామే! వడ్డాళ్ళని చూట్టల్లా! మొగాళ్ళు చేపలు తెత్తే ఆడాళ్ళు గంపలేసుకెళ్తారు"

"ఇంకేం.. నాకే ఎత్తండి చెరో గంపా. నేను ఎళ్ళి అమ్ముకొత్తా"

శీనూకి యమ సరదాగా ఉంది. తామిద్దరమూ చేపలు పట్టడం... అమ్మ గంపనెత్తుకుని అమ్ముకుని రావటం ఊహించుకుని నవ్వుకుని... ఉన్నట్టుండి ముఖం చిన్నబుచ్చుకుని "ఛీ! అమ్మా! నువ్వేమీ చేపలమ్మొద్దుగాని.."

"ఆ... కాని"...

"నేను తెచ్చిన చేపలు వండిపెట్టవే సాలు"

"మా నాయనే - బతికిచ్చావులే" అంది లక్ష్మమ్మ.

అన్నట్టుగానే కిట్టమూర్తి ఆ చుట్టతో

రెండు మావులు పెట్టుకుని వారానికోసారి ఓ కొరమీన్నో, ఓ నాలుగుమట్టగుడిసెల్నో, ఓ వాలగపిల్లనో తెచ్చిస్తుండేవాడు. ఒక నాడు ఒక చిన్న పొట్లం తెచ్చిచ్చాడు.

"ఏంది కిట్టుడు ఇది? " అన్నాడు శీను.

"గూడెంలో ఇవాళ పందినేశాం బాబూ. నాలుగు వారు ముక్కలు తెచ్చా బాగుం టంది"

"చేపలయిపోయాయి.. ఇక పందుల్ని కూడా తెస్తున్నావా కిట్టమూర్తీ... తీసు కుపో" అంది లక్ష్మమ్మ.

"పందుల్నెక్కడ తెత్తానమ్మగోరూ! ఏదో బాబు తింటాడని నాలుగు వారు ముక్కలు అంతే" అని అక్కడ పెట్టి వెళ్ళాడు.

శీనూకీ, వాడి నాన్నకీ ఆ రోజు స్వర్గమే!



తెల్లారక ముందే లేచిన మధు ఎస్సెల్సీ పుస్తకాలు ముందేసుకుని చదవాల్సినవి చదివేసి, బట్టీ పట్టాల్సినవి పట్టేసి, లెక్కల హోంవర్కు చేసేసి, సైన్సు బొమ్మలేసేసు కునే సరికి చూరు ఎండ గడప దాటి అరు గుమీదకొచ్చేసింది. అదిచూసి కంగారుగా "అమ్మమ్మా టైమయిపోయింది. అయిదు నిమిషాల్లో వచ్చేత్తన్నా... వంటయిందా" అంటూ వాకిల్లోకి పరిగెత్తి, తొట్లో ఉన్న నీళ్ళతో లాగు మీదే నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుని, స్నానం చేశా ననిపించాడు. ఇంట్లోకి పరిగెత్తి ఉతికిన చొక్కా, లాగూ వేసుకుని, వంటింట్లోకెళ్లేస రికి, పీటముందు పళ్ళెంలో అన్నం, కూరా ఏసి, పక్కనే కంచు గ్లాసులో మంచినీళ్ళు పెడుతోంది సుబ్బమ్మ.

"అన్నం మూటగట్టావా? " అనడుగుతూ పీటమీద కూర్చున్నాడు మధు.

"నన్నట్టా కంగారెట్టమాకయ్యా. నువ్వన్నం తినేలోగా నేను అన్నీ కట్టిపెడ తాగా. ఇవాళన్నా ఆ పిల్లమోళ్ళకి తగ్గిందో లేదో" అనుకుంటూ ఒక పెద్దకుండలో అన్నం, ఒక చట్టిలో వేడివేడిగా అప్పుడే దించిన పొట్లకాయ పాలకూరా, చిన్న 'జర్మసిలేరి' గిన్నెలో పచ్చిమిరపకాయ పచ్చడి, టిఫిన్ గిన్నెలో గడ్డ పెరుగూ అన్నీ వేరు వేరు మూటలుగా గుడ్డల్తో కట్టి అన్నీ కలిపి ఒక సంచిలో పెట్టింది.

ఇదంతా అన్నం తింటూ ఒక కంట చూస్తున్న మధు "నా అన్నం కూడా కట్టెయ్. నేను పుస్తకాలు సంచిలో సర్దుకు వొస్తా" అంటూ తినడం ముగించి ఒక్క గంతులో ఇంట్లోకెళ్ళాడు.

సుబ్బమ్మ ఇత్తడి టిఫిను కడిగి దాన్లో అన్నంపెట్టి, ఒక చిన్నగిన్నెలో కూరా, అన్నం మీద కాస్త పచ్చడి వేసి మూత పెట్టేసింది.

మధు సంచి చంకకి తగిలించుకుని వచ్చాడు.

"కాత్త పెరుగెయ్యనా? " అంది సుబ్బమ్మ.

"ఒద్దొద్దు. మధ్యాన్నం పెరుగన్నం తింటే ఇక ఒకటే నిదర. పెరుగొద్దులే" అంటూనే అన్నం మూటల సంచీ, తన ఇత్తడి టిఫినూ పుచ్చుకుని వసారాలో నిలబెట్టిన సైకిల్ దగ్గరకొచ్చాడు. సైకిల్ కారియర్‌కి అన్నంమూట గట్టిగా కట్టుకుని, తన ఇత్తడి టిఫిన్ ఒకవైపు, పుస్తకాల సంచీ మరొక వైపూ హాండిల్‌కి తగిలించి, ఒకసారి బెల్

ట్రింగ్ మనిపించి, వసారా అరుగు మీద నుంచి వాకిట్లోకి తీసుకొచ్చి ఎక్కి "అమ్మమ్మా! ఎల్తన్నా.. తలుపేసుకో. లేపోతే కుక్కలో, కోళ్ళో ఇంటో దూరి ఇల్లంతా కంపుకంపు జేత్తయ్" అన్నాడు.

"నేనన్నీ సూసుకుంటాలేగానీ ఎల్తన్నా అనమాక. ఎల్లొత్తా అను. అమ్మాళ్ళని మరీ పొద్దోయే దాకా ఉండకుండా, కాత్త పెందలాడే తిని నీకు గిన్నెలిమ్మనయ్యా. రోజూ సీకట్లో బడొత్తన్నావ్. పురుగో బుట్రో..." ఆవిడ రోజూ చెప్పే జాగ్రత్తలే అవి.

"సర్లే సర్లే ఎల్తన్నా. నాకు స్కూలు టైమైపోతాంది" అంటూ సైకిల్ మీద రివ్వున వెళ్ళిపోయాడు మధు.

అప్పటిదాకా దడి అవతల నుంచుని వీళ్ళ మాటలే వింటున్న నాగరత్నం "ఏంటి పెద్దమ్మా. మధు ఎల్లిపోయినట్టు న్నాడుగా. ఈ వయసులో నీకీ బాదొచ్చిప డింది. ఎట్టున్నారంట పిల్లలు? " అనడి గింది.

"ఇద్దరికీ జొరాలు తగ్గలేదంట. పెద్దడా టరేమో టయిపాడంటన్నాడంట"

"అమ్మో! టయిపాడంటే ఈన పచ్చం ఇరవై రోజులన్నా ఉంటుందంట. ఏం జొరాలో ఏంటో? మాయదారి జొరాలు!" అనుకుంటూ దడికి అవతల పనిలో ముని గిపోయింది నాగరత్నం.

★ ★ ★

మధు పులపర్రు అడ్డరోడ్డులోంచి చింత పాడురోడ్డెక్కి, కైకలూరు కేసి తొక్కుతు న్నాడు సైకిల్. 'ఈ అన్నాలు తీసికెళ్ళి అమ్మాళ్ళకివ్వాలి. తాలూకాఫీసులు దాటి హైస్కూలు కెళ్ళాలి. అంతా కలిసి ఐదారు మైళ్ళుంటుంది. స్కూలొదిలాక మళ్ళీ అమ్మాళ్ళ దగ్గరకెళ్ళి తమ్ముడు రాజుల్ని, చెల్లెలు శ్యామల్నీ చూసి, కాసేపు కబుర్లు చెప్పాలి. పాపం ఆళ్ళు రోజురోజుకీ చిక్కి పోతన్నారు. పొద్దున తెచ్చిన అన్నమే అమ్మా, నాన్నా రాత్రికూడా తిన్నాక ఆ గిన్నెలన్నీ తీసుకుని చీకట్లోపడి ఊరుచే రాలి. ఇక రాత్రికి చదూకునే ఓపికుండదు. తెల్లారగట్ట లేవాల్సిందే-' సైకిల్తో పాటు మధు ఆలోచనలూ ముందుకెళ్తున్నాయి. హఠాత్తుగా సైకిలు ఆగింది. ఆలోచనలు ఆపి మధు సైకిల్ దిగాడు కైకలూరెళ్ళే రోడ్డుమీద ఆ వేళప్పుడు చిన్న మామయ్య భాస్కరమూ శీనూ ఎందుకు నడుస్తు న్నారో అర్థం కాలేదు మధుకి.

"ఏంటి మామయ్యా? " అన్నాడు.

"సంతకెల్తన్నానురా! ఈడూ ఎమ్మటబ డితే పోన్లే పిల్లాడని తీసకపోతన్నా"

"సర్లే, సైకిలెక్కండి. ఏం నడుస్తారు? "

శీను సంతోషం చెప్పనలవిగాదు. భాస్కరం కూడా 'అమ్మయ్య' అనుకు న్నాడు. ముందు కడ్డీమీద హ్యాండిల్ గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు శీను. వెనక కేరియర్ మీద అన్నం మూట పట్టు కుని కూర్చున్నాడు భాస్కరం. మధు సైకి ల్‌కి ముందున్న వేగం లేదు.

"నీక్కావల్సినయ్యేంటో చెప్తే నేనే సంతలో కొని తెచ్చిచ్చేవాడ్నిగా. అనవస రంగా నువ్వొత్తన్నావనుకుంటే, నీతోపాటు ఈడ్ని తెత్తన్నావెందుకు చినమామయ్యా? " అన్నాడు మధు.

"సంతకొచ్చి శానారోజులయిందిరా! ఈడేమో నేనూ వత్తానని ఎంటబడ్డాడు. సరేగదాని తీసుకొచ్చా. ఆడు సంతలో ఏమేం కొనుక్కుంటాడో అడుగు" అన్నాడు భాస్కరం.

"ఏరా శీనూ! ఏం కొనుక్కుంటావురా? " అనడిగాడు మధు.

సైకిల్ మీద కూర్చోడం, అది 'జుయ్'న వెళ్ళడం, రోడ్డుకటూ ఇటూ ఉన్న పొలా లన్నీ వెనక్కెళ్ళిపోవటం చిత్రంగా చూస్తున్న శీను "నేనా... నాకా" అని ఆలో

చనలో పడ్డాడు.

"ఆ... నీకే! ఏమేం కావాలి సంతలో?"

"జిలేబీ"

"ఆ.. ఇంకా?"

"చెరుకు ముక్కలు"

"ఓహో! ఇంకా?"

"అంతే!"

"అంతేనా? ఇంకోటి చెప్పు"

ఆలోచనలో పడ్డాడు శీను.

"చెప్పరా.. ముచ్చటగా మూడు చెప్పు"

"జిలేబి"

"చెప్పావుగా. జిలేబి, చెరుకు ముక్కలు. ఇంకోటి చెప్పు"

"ఇంకోటా... ఆ.. నిమ్మతొనలు"

వెనకనుంచి భాస్కరం అంటున్నాడు "ఈడికి జిలేబీ ఉంటే అసలింకేం అక్కర్లా. కదరా?"

అవునని తలూపాడు.

"ఆడసలు నాతో వత్తానని పేచీ పెట్టిందే అందుకు. పోయిన మంగళారం సంతకెళ్ళిన కాకయ్యగారి బెమ్మంతో జిలేబీ తెమ్మని చెప్తే ఆడు మర్చిపోయి వచ్చాడంట. ఈ మంగళారం నేను కూడా అట్టాగే మర్చిపోతానేమోనని నాతో బైల్దేరాడు"

"ఓహో! అదా సంగతి. మరి నాకు చెప్తే రోజూ కైకలూరు నుంచి వచ్చేప్పుడు ఒక జిలేబీ పొట్లాం తెచ్చిచ్చేవాడ్నిగా" అన్నాడు మధు.


శీను ముఖం ఇంత చేసుకుని తల్లెత్తి మధువంక చూశాడు.

"నిజంగానేరా! నేను రోజూ కైకలూరొస్తన్నాగా. శ్యామలాంబ గుడి దగ్గర మిఠాయి బండి ఉంటది. సాయంత్రం నేను వచ్చేప్పుడే ఆ బండి దగ్గర జిలేబీ అమ్ముతా ఉంటారు. రేపట్నించి రోజూ జిలేబీ తెమ్మంటావా?"

"ఆ.. తే" అన్నాడు శీను సంభ్రమంగా.

"తే.. అనగానే సరా? మరి డబ్బులో?"

చిరకాల పరిచయం!



అక్కినేని కుటుంబరావు

నేను పుట్టింది 1946లో గుడివాడ దగ్గర్లోని చౌటపల్లిలో. బాల్యం కొల్లేరులోని పులపర్రులో గడిచింది. చౌటపల్లి, పెదపాలపర్రులో చదువుకున్నాను. 1963లో హైదరాబాద్‌వచ్చి స్థిరపడ్డాను. 'సొరాజ్జెం' 'కార్మికగీతం'తో సహా 9 నవలలు, 50 కథలు రాశాను. 'భద్రం కొడుకో' సినిమాతో మొదలుపెట్టి 5 సినిమాలకు దర్శకత్వం వహించాను. వీటికి 2 జాతీయ, 19 నంది పురస్కారాలు వచ్చాయి. 'గాంధీ' సినిమాను తెలుగులోకి అనువదించి విడుదల చేశాను. 5 టీవీ సీరియల్స్, 25 టెలీ ఫిలిమ్స్ చేశాను. సాహిత్య అకాడమీకి 'కథల మాస్టారు కాళీపట్నం రామారావు' డాక్యుమెంటరీ పూర్తి చేసి ఇచ్చాను.

'చతుర', 'విపుల'తో నాకు ప్రారంభ సంచికల నుంచే పరిచయం. గతంలో 'చతుర'లో నా నవలలు 'వేణుగానం', 'మోహనరాగం' వచ్చాయి. 1997 చతుర నవలల పోటీకి నేనూ ఒక న్యాయనిర్ణేతగా వ్యవహరించాను. ఉషాకిరణ్ మూవీస్ వారు నా నవల 'అమ్మ'ను అదే పేరుతో 1990లో సినిమాగా తీశారు.

చిరునామా :
అక్కినేని కుటుంబరావు,
ఫ్లాట్ నెంబర్ : 302,
వినాయక కౌస్తుభ అబోడ్,
వీధి నెం. 11, ఈస్ట్‌మారేడ్ పల్లి,
సికింద్రాబాద్- 500026.

అన్నాడు ఎనకనుంచి భాస్కరం.

"డబ్బుల్లేముందిలే మామయ్యా. పెద్ద మామయ్యనడిగి తీసుకుంటాలే" ఆ మాటతో మధు మీద శీనుకి అపారమైన ప్రేమ పుట్టుకొచ్చింది.

"ఇంకా నయంరా! రోజూ జిలేబి తింటే ఆడెందుకన్నా పనికొత్తాడా? "

"ఏం? "

"ఏం.. ఏంటి? రోజూ జిలేబీ తింటే పురపాసనాలు పట్టుకుంటాయి. ఇట్టా ఎప్పుడన్నా వారానికోసారంటే ఫర్వాలేదు గానీ రోజూ తినగూడదు" భాస్కరం బాబాయి మాటలతో 'రోజూ జిలేబి' అనే అందమైన కల మాయమైనందుకు అప్పటికప్పుడు ఏడవాలనిపించింది శీనుకి. బాగుండదని ఊరుకున్నాడు. మాటల్లోనే సంతదగ్గరకొచ్చారు.

"మామయ్యా సాయంత్రం ఎక్కడుంటారు? " అన్నాడు మధు.

"అబ్బో! సాయంతరం దాకా ఎందుకు? మేం ఎల్లిపోతాంలే. మా కోసం చూడమాక!"

"ఎట్టెల్తారే? "

"ఎవళ్ళోకళ్ళ బండెక్కెల్తాంలే"

"సరే" అని మధు వాళ్ళిద్దర్నీ దించి వెళ్ళిపోయాడు. కేకలు, అరుపులు, గోల, రణగొణధ్వని, అమ్మకందార్ల పిలుపుల్తో సంతలో కడుగుపెట్టారు శీను, భాస్కరం.

శీను కుడిచెయ్యి భాస్కరం ఎడమ చేతిలో ఉంది. అలా ఇద్దరూ సంతలో కలిసి తిరుగుతున్నారు.

"చెయ్యొదలమాకరా. చెయ్యొదిలితే తప్పిపోతావ్" అంటున్న భాస్కరం బాబాయి చెయ్యి ఎప్పుడొదిలాడోగాని ఇప్పుడు శీనూ తప్పిపోయాడు. భాస్కరం బాబాయి ఏడుస్తున్నాడో లేదో గాని తప్పిపోయిన శీను తెగేడుస్తున్నాడు. ఎటుచూసినా కొల్లేట్లో తూటిపువ్వుల్లా జనం. గోల గోలగా కొల్లేట్లో కొంగల్లాగా ఒకటే అరుపులు.

"అబ్బ! తెమలండే. ఉరుంలు, మెరుపులూ ఆ వజాన వత్తంటే వానొత్తందేమోననే గేనమూ, భయమూ లేకుండా ఇంకా బేరాలాడతన్నారు బేరాలు... పదండే" అనే హెచ్చరికల్తో సంతంతా కోలాహలంగా ఉరుకులూ పరుగుల్తో ఉంది. జిలేబీ బండబ్బాయి కనపడ్డాడు గాని భాస్కరం బాబాయి కనపళ్లా. తెచ్చుకున్న పావలా కాస్తా "పారేసుకుంటావ్. ఈడ తే. నేను కొనిత్తా" అని బాబాయే తీసేసుకున్నాడు. అదుగో చెరుగ్గడలు. జిలేబి దగ్గర లేడు. చెరుగ్గడల దగ్గరా లేడు. అసలీ బాబాయి సంతకెందుకొచ్చినట్టు. ఎంతాపుకుందామన్నా ఆగకుండా తన్నుకొస్తున్న ఏడుపు.

సంతలో చేపలమ్ముకుని ఖాళీ గంపల్తో వెళ్తున్న ఇద్దరు ఆడవాళ్ళు శీనూని చూస్తూ ఆరాగా అనుకున్నారు.

"ఎర్రతేలులాగా ఉన్న ఈ పిల్లాడెవరే ఎక్కడో సూసినట్టుంది"

రెండో ఆమె పరీక్షగా చూసి "మన అక్కినారి పిల్లడే" అన్నది.

"ఎవరూ మన రంగయ్యా గోరి పిల్లడా... ఏమబ్బాయ్.. ఎందుకేడుత్తున్నా? సంతలో తప్పిపోయావా? "

"నేను గాదు. నేనిక్కడే ఉన్నాగా. మా బాబాయి తప్పిపోయాడు"

"ఓసి నీ పిల్లాడు బంగారం గానూ- సూడవే! ఈన తప్పిపోలేదంట. ఈన బాబాయి తప్పిపోయాడంట" ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంకో ఇద్దర్ని పిల్చి శీను తప్పిపోయి సంతలో తిరుగుతున్నాడని చెప్పారు. 'అందరూ నేను తప్పిపోయానంటారేంటి? తప్పిపోయినోళ్ళు ఎవరికీ కనపడరు. నేనం దరికీ కనపడతానే ఉన్నా. చూస్తా చూస్తా తప్పిపోయావా? అంటారు. భాస్కరం బాబాయిని ఎవరూ పట్టించుకుని ఎతకరు' జనం తెలివితక్కువతనానికి శీనుకి కోపం వచ్చేస్తోంది.

"సర్లే, పద. మేమూ ఊళ్ళోకేలే. నన్ను చూశావా ఎప్పుడన్నా? "

"ఆ"

"నేనెవర్ని? "

"కిట్టమూర్తి పెళ్ళానివి"

"ఓరి నీ పిల్లాడో.. బాగానే గుర్తుపెట్టు కున్నావే!"

"నువ్వు అప్పుడు మాకు బొమ్మిడాయిలు తెచ్చిపెట్టావుగా"

"ఎప్పుడూ..? ఆ.. నిజమే సరే, దా.. వానొచ్చేట్టుగా ఉంది. తొందరగా నడువ్" అంటూ ఇద్దరూ పరుగులాంటి నడకతో బైల్దేరితే వాళ్లెనకే పరుగులతో అనుసరిం చాడు శీను. వెనక వదిలిన జిలేబీలు, చెరు గ్గడలు గుర్తొచ్చి ఏడుపు తన్నుకొస్తూనే ఉంది.

అట్లట్లా గరువు దాటారు. కారు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. వాళ్ళిద్దరూ మాటల్లో పడి గబగబా నడుస్తున్నారు, ఆ రోడ్డు మీద సంతరోజు- కొల్లేట్లో బాతు ల్లాగా మందలు, మందలుగా మనుషులు- ఉరుకులు, పరుగులుగా కేకలు, అరు పుల్తో... అందరి నెత్తిమీదా గంపలో, పల్లి కెలో, సంచులో, మూటలో బస్తాలో...

★ ★ ★

ఆ రోజు సాయంత్రం నుంచీ ఆకాశం నిండా మబ్బులు పరుగులు పెడ్తన్నయ్. మధు స్కూలు నుంచి అమ్మావాళ్ళ దగ్గర కొస్తూనే "అమ్మా నాకు తొందరగా గిన్నెలి చ్చెయ్.. వానొచ్చేట్టుంది. అది రాకముందే ఊరు జేరాలి" అన్నాడు.

"పిల్లలకీ జొరాలేంటో.. మనకీ తిప్ప లేంటో.. ఏదేముడికి మనమీద కోపమొ చ్చిందో.." అంటూ కళ్ళు తుడుచుకుంది వజ్రమ్మ.

"నెత్తిమీదుంటది నీళ్ళకుండ. ఆపిక, ఆడ నే మాటిను. తొందరగా ఆ అన్నం, కూరా పళ్ళాల్లో తీసిపెట్టుకుని ఆ గిన్నె వాడికివ్వు. ఆడ్ని తొందరగా ఎల్లనియ్" అని గదమా యించాడు వీరభద్రం.

ఆవిడాపనిలో పడింది.

మధు తండ్రితో "ఏమంటున్నాడు నాన్నా డాక్టర్‌గారు? " అనడిగాడు.

"పరీక్షలన్నీ చేశాడురా. టయిపాడేనని చెప్పాడు. మరో పదిరోజులన్నా పడ్తం దంట జరం తగ్గటానికి. తర్వాత మరో పదిరోజులుండి మందూ మాకూ వాడితే గాని లాభం లేదంటన్నాడు. ఏతావాతా నెలరోజులన్నా ఈ బాధ తప్పదు మనకి"

"బాధనుకుంటే ఎట్టా నాన్నా? మన చేతిలో ఏం లేదుగా? అన్నిటికన్నా తమ్ముడు చెల్లెలి ఆరోగ్యం గదా మనకి ముఖ్యం" అన్నాడు మధు.

చిన్నాడైనా మధుకున్న వివేకానికి ఆశ్చ ర్యమనిపించింది వీరభద్రంగారికి.

"అంతేలే. నువ్వు జాగర్తగా ఎల్తన్నావా? తొందర తొందరని నువ్వు సైకిల్ని దేనికీ గుద్దకుండా ఎల్లు" అని కొడుక్కి జాగ్రత్తలు చెప్పాడు.

"సరే నాన్నా.. అమ్మా.. ఎల్తన్నా" అంటూనే అమ్మ ఇచ్చిన గిన్నెల మూట

కేరియర్‌కి కట్టుకుని రివ్వున బయల్దేరాడు మధు. కైకలూరు రోడ్డు నుంచి గరువు దగ్గర కుడేపు తిప్పి అరమైలు వచ్చాడు. శాయిలుపాడు రోడ్డు దాటుతున్నాడు. అంతే.. పంతం పట్టినట్టు వచ్చి పడింది వర్షం. ఉరుములూ మెరుపులు.. ఇప్పట్లో తగ్గేలా కనిపించలేదు.

చొక్కాతీసి పుస్తకాల సంచీకి చుట్టాడు. ఏమి తడిచినా ఫరవాలా. పుస్తకాలు తడవకూడదు. సైకిల్ నడవనని మొరాయిస్తోంది. మధు సైకిల్ దిగి చూస్తే రెండు చక్రాలూ మట్టి తొడుగుల్తో! చక్రాలు శుభ్రం చేసి నడిపిస్తే, నిమిషంలో మళ్లీ మట్టి తొడుగు సిద్ధం. వెనక్కు వెళ్లినా లాభం లేదు. ఆ రోడ్డు మీదన ఎక్కడా ఒక్క చెట్టు కూడా లేదు. ఉండదు. కొల్లేటికి తరచుగా వచ్చే వరదల వల్ల ఏ మొక్కా చెట్టయ్యే అవకాశం లేదు. పొద్దున్నే అమ్మావాళ్లకు అన్నం తేవాలి. అదీగాక ఊళ్లో ఇంట్లో అమ్మమ్మా, చిన్న తమ్ముడు కిష్టుడు తనెళ్ళకపోతే కంగారుపడతారు. కిష్టుడు తనను వెతుక్కుంటూ వచ్చినా వస్తాడు. లాభం లేదు. వెళ్ళాల్సిందే. ఎలా? రోడ్డు మీద నర మానవుడు కనపడటంలా. సైకిల్ కదలదు. దీన్ని మోసుకుని నాలుగు మైళ్ళు ఈ వర్షంలో, ఈ బురదలో నడవాలంటే అదయ్యేపని కాదు. రోడ్డు పక్కన మట్టి కోసం తవ్విన కొలుములున్నయ్యి. ఆ కొలుముల్నిండా నీళ్ళున్నయ్యి. అటూ ఇటూ చూసి ఆ కొలిమిలోకి సైకిల్‌ని తోసేశాడు. పుస్తకాల సంచీని కూడా గిన్నెల సంచీలో వేశాడు. ఇక ఆ వర్షంలోనే నడవటం మొదలెట్టాడు.

★ ★ ★

మురిక్కాలవ వంతెన ఇంకా అరమైలుందనగా దిమ్మడదమ్మడగా వాన కొట్టడం మొదలైంది. మనుషులు ముద్ద ముద్దయిపోయారు. దోవంతా బురద బురద. కాలేస్తే జారుతోంది. శీను అట్టాగే నాలుగడుగులేసి ధబేలున పడ్డాడు.

"ఎవరి పిల్లాడే.. అట్టొదిలి పోతన్నారు! పాపం పిల్లాడు బురదలో పడ్డాడు" అనే కేకలకి కిట్టమూర్తి పెళ్లాం వెనక్కి తిరిగొచ్చింది. చూసి "ఏంటబ్బాయ్! అట్టా పడ్డా? జారిందా.. ఎదవ్వాన ఇప్పుడే రావాలా? సర్లే, ఉండు" అని శీనుని లేపి తన బుట్టలో కూచోపెట్టుకుని "కదలకుండా కూచో. కదిల్తే పడతావ్" అని బుట్ట నెత్తిమీద పెట్టుకుని చకచక నడవటం మొదలుపెట్టింది.

ఆరేళ్లొచ్చినా అబ్బునాకారం శీనూది. కాబట్టే ఆమెకు పెద్ద కష్టమనిపించలా.

"ఏంటి మా ఒదిన ఎవరో పిల్లాడ్ని బుట్టలో ఏసిందే!" అని నవ్విందొక మరదలు.

"మరే.. మీ అన్నొక పనికిమాలివాడయ్యాడు. ఈనన్నా పనికొత్తాడేమోనని" అందరూ అంత వానలో, అంత బురదలో నవ్వుల్తో పగుల్తూ, తలదాచుకుందుకు మురిక్కాలవ వంతెన కిందికి పరిగెత్తారు. గంప దించగానే లేచి బైట నిలబడ్డాడు శీను. అప్పటికే అక్కడ చాలామంది ఉన్నారు. మురిక్కాలవ వంతెన చాలా పెద్దది. దానికింద కొంత పొడి నేలా, దాని తర్వాత కొంత తడి నేల, దాని తర్వాత కాలవలో నీళ్లు! అనుకోకుండా వచ్చిన ముంపుల గురించి దడ దడ పడుతున్న వాన గురించి, తెచ్చుకుంటున్న సరుకుల గురించి, అవి తడిస్తే పనికొస్తాయనీ, పనికిరావనీ, గోలగోలగా చెప్పుకుంటున్నారందరూ.

ఇంతలో వంతెన్నానుకుని నిలబడ్డవాళ్ళలో నలుగురు కిందవాళ్లను తోస్తూ ముందుకు జరిగారు.

"అబ్బా ఏంటయ్యా! మీద మీద పడత

న్నారు. పడేత్తారా ఏంటి? "

"నిన్ను పడేత్తానికి మాకేం పని లేదంటే, అటు సూడు.. వంతెన గోడ బొక్కల్లో.. పాములెట్టా తొంగిసూత్తన్నయ్యో!"

"ఆ! సూత్తే.. ఏంచేత్తయ్యయ్యా? ఎప్పుడూ పాముల మొకం చూడ్లేదా? కొల్లేట్లో ఉంటన్నావు మళ్లీ. బురదకొయ్యల్ని చూసి బయపడతన్నాడు"

"బురదకొయ్యలా!? ఇటొచ్చి సూడు, రెండు తాసు పాంలున్నయ్"

"సర్లే, గొడవ చెయ్యమాకండయ్యా. ఆటికి మాత్తరం పేణబయం ఉండదేంటి? "

అంతలోకే కిందున్నవాళ్ళు పైకి జరగటం మొదలుపెట్టారు.

"ఏంటయ్యా! మీదిమీదికొత్తన్నారు? "

"ఏంటా! కాలవకేసి చూడు.."

కాలవ వరద తడినేలని దాటి పొడినేలని తడిచేస్తూ పెరుగుతోంది. జనంలో కలవరం మొదలయింది.

"మొబ్బులు చూసినపుడే అనుకున్నా. పైన బాగా కుండపోత కురిసినట్టుంది. తడిసో గిడిసో కొంపకు సేరుకోటం మంచిది. ములకొచ్చేట్టే ఉంది"

"ములకా? " జనంలో కలకలం.

"ములకొత్తందా? కొంపా గోడూ.. పిల్లా జల్లా.. ముసలీ ముతకా పారదాం పదండి" తొందరతొందరగా కదిలి జోరున కురుస్తున్న వానలో గుండా వంతెనపైకెక్కి వెళ్లిపోయారు. కొందరు ఆలోచనలో పడ్డారు. నిలబడ్డ శీను ఎప్పుడు కూచున్నాడో, ఎప్పుడు నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడో ఎవరూ గమనించలా.

★ ★ ★

కళ్లూ, నోరూ తుడుచుకుంటూ కనపడని రోడ్డుని కాళ్ళతో వెతుక్కుంటూ చిన్న బ్రాంచి కాలవ దగ్గర ఎడమకి తిరిగి చేలల్లో, గట్లమీదా, గండ్లలో దిగి, లాడికోడుని దాటుకుని, బురదనీ, గడ్డీగాదాన్నీ కసాబిసా తొక్కుకుంటూ దిమ్మరిస్తున్న వానలో పడి ఊళ్లోకొచ్చి పడ్డాడు మధు. ఊళ్ళో జనమంతా బిక్కుబిక్కుమని ఇళ్లల్లో పడున్నారు. ఒక్కరూ బైట కనపడలా. ఇంటికెళ్లి తలుపు తోసేసరికి, ఆ తలుపు తెరుచుకుంది. మినుకు మినుకుమనే బుడ్డి దీపపు గుడ్డికాంతిలో, గదిలో ఓ మూల మునగదీసుకు కూచుని గుడ్డెట్టుకు చూస్తన్నారు అమ్మమ్మ, తమ్ముడు. ఇంటి పైకప్పు మధ్యన కాస్త ఆకులు ఎగిరిపోయి గది మధ్యలో వర్షం కురుస్తోంది. మధుని చూడగానే అంతవరకూ భయంతో అణిగి ఉన్న ఏడుపు ఒక్కసారిగా వరదలా బైట కురికి ఇద్దరూ బావురుమన్నారు.

"ఎందుకే.. ఏమైంది? " అన్నాడు మధు.

"నువ్వేమైపొయ్యావోనని బయంతో సస్తన్నాం. నిన్ను మళ్లీ చూత్తామనుకోలా!" అంది అమ్మమ్మ.

"నేనెళ్లి సూసొత్తానంటే వదల్టల్లా ఈ ముసల్ది" అన్నాడు కిష్టుడు.

"నేనేమవుతాను? రాలేకపోతే కైకలూర్లోనే ఉండేవాడ్ని" అన్నాడు మధు.

"అది గాదన్నయ్యా! ఇంతకుముందే పెద్ద మావయ్య ఒచ్చెళ్ళాడు. ఈ వాన వాలకం చూత్తే వరదొచ్చేలాగుంది. కాత్తి జాగర్తగా ఉండండని చెప్పాడు. దాంతో

ఇది వరదొచ్చేసినట్టు, నువ్వు దాన్లో కొట్టుకుపోయినట్టూ..! పిల్లమోడుల్ని చూత్తే అట్టా. పెద్దాడ్ని చూత్తే ఇట్టా. నా కూతురింటికేదో శని దాపురించిందని నువ్వొచ్చే ముందు దాకా ఒకటే ఏడుపు. నువ్వొచ్చే ముందు పెద్ద గాలొచ్చింది సూడు, అప్పుడే ఈ కప్పు లేసిపోయింది. దెబ్బతో ముసల్దానికి మాటడిపోయింది. మనం కూడా బతకంరా కిట్టుడూ అని సైగలు చేత్తాంది. దేవుడ్లా నువ్వొచ్చావు" అన్నాడు కిష్టుడు.

★ ★ ★

రాత్రంతా జోరున కురిసిన కుండపోత వాన కాస్త తెరిపిచ్చింది. తెల్లారింది. ఊళ్ళో పల్లంలో ఉన్న ఇళ్ళవాళ్ళ బతుకులన్నీ తెల్లారాయి. కుండలు, చట్లు, గుడ్డల మూటల్లో, నార సంచుల్లో కట్టుకుని పడవల మీద కైకలూరుకేసి పోతున్నారు. 'రెండు రోజులుంటే ములక అదే తగ్గుతుందిలే' అని మొండిగా ఉన్న కొందరు మూట లేసుకుని కాకయ్యగారి చావిట్లోకి, వీరభద్రంగారి చావిట్లోకి వచ్చిపడ్డారు.

ఊరు చుట్టూ, ఊళ్ళోనూ ఎటు చూసినా నీళ్ళే. వీళ్ళిద్దరి ఇళ్ళూ నాలుగడుగుల ఎత్తు. భరంతులు తోలి కట్టినవవడం మూలంగా చిన్నపాటి ములకలకి మునగవు. అప్పుడు పల్లపు ఇళ్ళవాళ్ళు, ఎటూపోడానికి దిక్కులేని వాళ్ళు వీళ్ళ చావిళ్ళలో తలోమూలా చేరతారు.

శీనుగాడు కళ్ళు తెరిచేసరికి ఎదురుగుండా తన మొహంలోకే చూస్తున్న తల్లి కనపడింది.

శీనూ కళ్ళు తెరవడం చూసి ఆవిడ కళ్ళల్లోకి నీళ్ళు వరదలా వచ్చి పడ్డాయి. అవి పైటచెంగుతో తుడుచుకుంటూ "అంత వానలో, ఆ నీళ్ళొడ్డున, ఆ పాముల కంతల పక్కన నీకు నిద్రెట్టా పట్టిందయ్యా? " అంది.

"ఆ? " అన్నాడు అమాయకంగా శీను. వాడికింకా పూర్తిగా మత్తు దిగలా.

"ఆ కిష్టమూర్తే గనక నిన్నుచూడకపోతే ఆ వరద నీళ్ళలో పడి కొట్టుకుపోయేవాడివే. అప్పుడు నేనేమవ్వాలి నాయనా" కళ్ళు తుడుచుకుంటున్న తల్లిని చూస్తే శీనుకి సంతకెళ్లానని, వానొచ్చిందని గుర్తొచ్చింది. లేచి కూర్చోబోతే "పడుకో నాయనా" అంటూ కళ్ళు తడుచుకుంటున్న తల్లిని చూస్తున్న శీనుకి నిన్న సాయంత్రం జరిగింది మెల్లిగా గుర్తుకొస్తోంది.

"కిష్టమూర్తి నన్నెత్తుకొచ్చాడా! ఆడి పెళ్లాం నన్ను మురిక్కాలవ వంతెనకింద దించిందిగా, గంపలో పెట్టుకుని తెచ్చిందమ్మా అక్కడికి" అన్నాడు శీను.

"కిష్టమూర్తి పడవలో వేసుకుని నువ్వు తడవకుండా నీ మీద గొడుగుపట్టి మరీ తీసుకువచ్చాడు"

"ఆ!"

"ఆ! మురిక్కాలవలో నీళ్ళు పెరిగిపోతాంటే అక్కడున్నాళ్ళంతా ఏంజెయ్యాల్రా భగవంతుడా అనేడుత్తున్నారు. మనూరి వడ్డీల కిట్టమూర్తి ఆ కాలవలోనే పడవలతో వస్తూ వంతెనె కిందున్నాళ్ళని చూసి 'ఇంకా ఇక్కడ నుంచున్నారేంటి? ములకొత్తాంది! పడవెక్కండి! ఈ వాన మన కొంప ముంచేట్టే ఉంది. ఎక్కండెక్కండి' అనగానే మనూరాళ్ళంతా పడవెక్కేశారు.

నుచ్చుమిల్లాళ్ళు నిలబడిపోయారు. అప్పుడు కిట్టమూర్తికి ఆరి కాళ్ళసందుల్లో గుండా పడి నిద్రోతున్న నువ్వు కనపడ్డా వంట. 'ఆర్నీ! మన రంగయ్య గారబ్బా యిరా. ఈన ఇట్టాబడి ఎట్టా నిద్రోతు న్నాడు' అంటే.. అందరూ ఇరగబడి జూసి ఒకటే నవ్వులంట. ఓ పక్క ములకొస్తాం దని గోల, ఓ పక్క జోరున వాన, ఓ పక్క పాములు, కిందజూత్తే ఎగుడుదిగుడు తడి నేల.. ఈటన్నిటికంటే జనంగోల, ఏడ్పులు, అరుపులు.. నీకు నిదరెట్టా పట్టిందయ్యా! సరే, ఎట్టయితే ఏం.. నిన్ను పడవలో పడేసి కిట్టమూర్తి తీసుకొచ్చేదాకా నేనూ, మీ నాన్నా నిన్ను మళ్ళీ ఈ కళ్ళతో చూస్తామనుకోలేదయ్యా" కళ్ళు తుడుచు కుని ముక్కుజీదుకుంది లక్ష్మమ్మ.

శీనూకి హఠాత్తుగా భాస్కరం బాబాయి గుర్తొచ్చాడు. "అమ్మా! భాస్కరం బాబాయి తప్పిపోయాడే. దొరికాడా? " అన్నాడా త్రంగా, భయంగా.

"ఆ! దొరికాడయ్యా.. మీ నాన్నకి. ఏడుపు మొకం పెట్టుకొచ్చి 'అయ్య ఇంటి కొచ్చాడా? ' అని అడగతా వచ్చాడు. ఎన్నడూ ఎవరిమీదా చెయ్యెత్తని మీ నాన్న 'పిల్లాడ్ని సంతలో ఒదిలి ఏ మొకం పెట్టు కొచ్చావురా? ' అని మీ భాస్కరం బాబా యిని రొండేశాడు. 'ఆడే ఎక్కడో తప్పిపో యాడు. నన్నేం జేయమంటావు? జోరున వానొచ్చి సంతలో ఒక్క పురుక్కూడా లేకుండా పోయేదాకా ఎతికి, ఒకేళ నేకనప ళ్ళేదని, ఎవరెంటన్నాబడి ఇంటికొచ్చాడేమో నని ఏడుత్తా, నానా యాతనాబడొచ్చాను' అని, అన్న కొట్టినందుకు కాక నువ్వు తప్పి పోయావని మీ బాబాయి ఒకటే ఏడుపు. నువ్వు లేకుండా మీ బాబాయి రావటం, ములకొచ్చి పడటం.. నువ్వింక మాకు కన పడవనుకునేసరికి పై పేణాలు పైనే పొయినయ్యి. ఎంతమంది దేవుళ్ళకు మొక్కానో! ఆ దేవుళ్ళే కిట్టమూర్తి రూపంలో వచ్చి నిన్ను నాకిచ్చారు నాయనా!"

దుఃఖమూ సంతోషమూ కలిసి వచ్చి ఆమె రెండు కళ్ళూ నిండార్లవుతుంటే అయోమయంగా చూస్తుండిపోయాడు శీను.

"లే! లేచి.. కచ్చికతో పళ్ళు తోంకో" అం ది లక్ష్మమ్మ.

"శీను మంచం దిగి కాళ్ళు కింద పెట్టేస రికి పాదాలను నీళ్ళు పలకరించాయి. కిందచూస్తే ఇంటినిండా నీళ్ళు. కిందున్న సామానంతా ఎలిసె మీదికి, భోషాణం మీదికి ఎక్కేశాయి. ఉట్టెలమీదికెక్కిన కుండలుగాక, ఖాళీగా ఉన్న సత్తుగిన్నెలు రెండూ నీళ్ళల్లో ఉయ్యాలలూగుతూ ఆడు కుంటున్నయ్యి.

అవన్నీ చూసి తల్లివంక తిరిగి "అమ్మా! ఏంటిది? " అన్నాడు ఆశ్చర్యంగా శీను.

"ములక నాయనా! ఊరంతా నీళ్ళల్లో మునుగుతోంది. కొల్లేరు ఊరిమీదకొచ్చే సింది. ఈ నీరెప్పటికి తీస్తుందో. పైన కురిసే వానలకు వరదింకా పెరుగుద్దో ఏమో? దిక్కు తోచక అల్లాడతన్నారు జ నాలు" లక్ష్మమ్మ గొంతునిండా దిగులు.

"నాన్నేడమ్మా? "

"ములకొత్తాంటే మీ నాన్న ఇంటో ఉంటాడా? ఊళ్ళో గొడ్డూగోదా, పిల్లా మేకా, అందరి మంచీచెడ్డా చూడాలిగా. ఎళ్ళాడు. నువ్వు లే నాయనా! మొకం కడుక్కో. చద్దన్నం తిందూగాని"

★ ★ ★

ఆకాశమంతా మబ్బులు కమ్ముకొస్తూ అంతా కీకామండలంలాగా అయిపో యింది. ఈదురు గాలులు మొదల య్యాయి. పెద్దదొడ్డిలో, పులిదొడ్డిలో, లాడి కోడు దగ్గరా, ఏటివారనా, ఈసారి పండిన పంటంతా పనల మీదా, కోతల మీదా

కుప్పల మీదా, కల్లాంలోనూ, ఒక్కో పొలంలో ఒక్కోరకంగా ఉంది. ఊరు ఊరంతా పదిరోజుల్లో చేతికి రాబోయే పంటమీదే ఆశపెట్టుకుని బతుకుతోంది. చూస్తుండగానే రైతుల నోటికందాల్సిన పంటంతా కొల్లేటి నీటికందింది. మొత్తం నీళ్ళల్లో మునిగిపోయింది. కాలం గాని కాలంలో బంగాళాఖాతంలో వాయు గుండం పడి కొల్లేటి ఊళ్ళల్లోని జనాల్ని మాయ వాన గుండంలో ముంచేసింది. ఊళ్ళో అన్నీ పూరిపాకలు. ఒంటినిట్టాడి పాకలు, రెండునిట్టాళ్ళ పాకలు. ములక కొంచ్చి మీద పడింది. ములక రావటం మొదలెడ్తే అది పెరగటమే గాని తరగదు. జనం ములకని ఎదుర్కొని బతుకు పోరా టంలోకి దిగకపోతే పంటనష్టంతోపాటు పశునష్టం, ప్రాణనష్టం తప్పదు. పోయి నవి పోతే ఉన్నవాటిని కాపాడుకోవాలి. ఆ పనికి నడుం కట్టారు జనం.

తెల్లారగానే ఊళ్ళోని పశువుల్ని పోగేసి ఏలూరవతల జంగారెడ్డిగూడెం, ఇంకా అవతల నూజివీడు, తిరువూరుల వైపు తెలిసిన వాళ్ళెక్కడుంటే అక్కడికల్లా తోలు కెళ్తన్నారు అప్పజెప్పిరావటానికి.

ములకలో నీళ్లతోపాటు నానా చెత్తా కొట్టుకొస్తుంది. అప్పుడప్పుడూ ఉబ్బిన మనుషుల శవాలు, పశువుల, కోళ్ళ, పందుల కళేబరాలు వస్తుంటాయి. ఊరి నిండా, ఇళ్ళనిండా నీళ్ళే.. మురికిగా, చెత్తగా. తాగటానికి ఉన్న ఒక్క చెరువూ మునిగిపోయింది. తాగటానికీ, వంటకీ నీళ్ళు లేవు. ఊళ్ళో మునగని ఇళ్ళు మూడే. అక్కడే అందరికీ వంటలూ, వార్పులూ. ఉన్న నీళ్ళనే తీసుకుని వడకట్టి బాగా కాచి అవే వాడుకోవటం.

ఊళ్ళో ఆడవాళ్ళకి అన్నిటికన్నా పెద్ద కష్టం మరొకటుంది. ఒకటికొస్తే నీళ్ళు నిండిన ఇంట్లోనే ఓ మూల కానిచ్చేవాళ్ళు. రెండికలా వెళ్ళలేరుగా. మగాళ్లు దోనెల మీదా, పడవల మీదా ఊరు బైటికి పోయి పని కానిచ్చి వచ్చేవాళ్ళు. మరి వీళ్ళు ఏం చేస్తారు?

నాలుగైదు కుటుంబాల ఆడవాళ్ళంతా పడవెక్కేవాళ్లు. ఒక మగాడే పడవ నడిపే వాడు. ఊరు బైటికి దూరంగా పులిదొడ్డి గట్టు మీదున్న నాలుగు తాటిచెట్ల చాటుకు తీసికెళ్ళి ఆపి అతను అటువైపు తిరిగి కూచునేవాడు. వీళ్ళంతా కలిసి ఒకరికొ కరు సాయపడుకుంటూ, పడవ అంచున కూర్చుని, ఒకరిని ఇద్దరు పట్టుకుని నీళ్ళ ల్లోకి దొడ్డికెళ్ళేవాళ్ళు.

'ఏదైమైనా ఇబ్బంది ఇబ్బందే', 'సిగ్గుతో సగం చచ్చినట్టుంటాది', 'ఏం చేస్తాం.. తప్పదుగా' అనుకుని రోజులు గడిపేవాళ్ళు నీళ్ళు తీసేదాకా.

★ ★ ★

మధు వచ్చి బలవంతపెడితే రాత్రి పడు కోటానికి రంగయ్యగారు వాళ్ళింటికి వెళ్ళాడు. లక్ష్మమ్మని ఎంత బతిమాలినా "నేను రాన్లే. బాబుని తీసికెళ్లు" అంది.

"నువ్వెక్కడ పొడుకుంటావంటే? "

"ఈ భోషాణమ్మీదే" అంది.

అప్పటికే ఇంటెడు సామానూ భోషాణం లోపలా పైనా చేరింది.

"ఎట్టాగో కాత్తి ఖాళీ చేసుకుని అట్టాగే క్రిష్ణా రామా అనుకుంటాలే.. మీరెళ్ళండి" అని అందర్నీ పంపించేసింది.

"అక్కడైనా ఇబ్బందేలే" అనుకుంటూ వెళ్ళాడు రంగయ్య శీనుని ఎత్తుకుని.

వీరభద్రంగారిల్లు మూడు నిట్టాళ్ళది. బాగా భరంతు తోలించి ఎత్తుగా కట్టాడు. గత రాత్రి కురిసిన వానకు ఇంటిమధ్య కప్పు కొంతమేర ఎగిరిపోయినా ఎక్కువ భాగం పొడిగానే ఉంది. తెల్లారాక వీలై నంత వరకూ ఆ ఎగిరిన కప్పు మీద తాత్కాలికంగా అవీ ఇవీ కప్పారు.



ఇంతజేసినా వరద ఇంకొక్క అరడుగు గాని పెరిగిందంటే నీళ్ళు వాళ్ళింటిలోకీ వచ్చేస్తయ్. ఐనా కాకయ్యగారిల్లు, వీర భద్రం గారిల్లూ ఉండబట్టి ఊళ్ళో జనాలకి తలదాచుకునే చోటింతైనా దొరికింది.

కష్టమో నిష్టూరమో కలిసి పడదామని జనం చాలామంది వాళ్ళిళ్ళల్లో చేరితే ఇంటినొదిలి ఎక్కడికీ రానని లక్ష్మమ్మ ఇంట్లోనే ఒక్కత్తే ఉండిపోయింది. తట్టలో బుట్టా, బుట్టలో తట్టా పెట్టి తంటాలు పడి పిట్టలాంటి మనిషి లక్ష్మమ్మ భోషాణం మీదే ఓ పక్కన ఒదిగి పడుకుంది.

ఓ అద్ధరాత్రివేళ పెళపెళమని ఉరుము. వెంటనే పిడుగు మీద పడిందా అనే అనుమానంతో బిక్కచచ్చిపోయింది లక్ష్మమ్మ. పడింది పిడుగు కాదు గానీ పెద్ద పాము.

పిడుగనుకుని "అర్జునా ఫాల్గుణా పార్థా కిరీటి" అంటూన్న లక్ష్మమ్మ పిడుక్కి బదులు పడిన పాముని మెరుపు వెలుగులో చూసి "క్రిష్ణా రామా" అని అనుకుంటూ ఈ రాత్రితో అన్ని బంధాలనుంచీ తనకిక విముక్తేననుకుంది. కొంతసేపటికి ఆ పాము కూడా తన మీద అలానే చుట్ట చుట్టుకుని కదలకుండా పడుండటం చూసి "అది మాత్రం ఆ దేవుడు సృష్టించిన జీవి కాదా! దానికి మాత్రం బతుకు భయం ఉండదా? నేనేమీ చెయ్యకపోతే అది మాత్రం నన్నేం చేస్తది" అనే ఆలోచనల్తో కదలకుండా అలానే పడుకుంది. లక్ష్మమ్మకి భక్తి చాలానే ఎక్కువ. అది దేవుడికి లంచాలిచ్చి లబ్ధి పొందుదామనుకునే భక్తి కాదు. అదే ఆ రాత్రి ఆమె నిశ్చింతగా నిద్రపోయేలా చేసింది. తెల్లారి అది విని అందరూ ముక్కున వేలేసుకున్నారు.

"చచ్చిపోతానని భయం వెయ్యలేదా? అసలు భయంతో చచ్చేవాళ్లే ఎవరైనా"

"ఆ పరమాత్మకి నన్ను తీసికెళ్ళాల నుంటే వెళ్ళననటానికి నేనెవర్ని? "

"మరి ఆ పామేం అయింది? "

"తెల్లారుతుండగా లేచి తనున్న స్థలం తనకనుకూలమైంది కాదనుకుందేమో నెమ్మదిగా నామీద నుంచి దిగి వెళ్ళిపోయింది"

"అమ్మో! అమ్మో!"

విన్నవాళ్ళంతా హాహాకారాలు చేస్తుంటే లక్ష్మమ్మ మాత్రం పరమాత్ముడికో దణ్ణం పెట్టి ఊరుకుంది.

నాలుగురోజులు గడగడలాడించిన కొల్లేరు అయిదోరోజున తగ్గటం మొదలెట్టింది. ఆ రోజు తగ్గకపోతే ఊరు ఖాళీచేసి వెళ్ళిపోవాల్సిందే. ఏడోరోజుకి ఇళ్ళల్లో రోడ్లమీదా నీళ్ళు పూర్తిగా తగ్గిపోయి ఊరు ఊరంతా బురదమయంగా తయారైంది. జమ్ముతో గోడలు కట్టుకున్న వాళ్ళు కొత్తగా జమ్ముతో మళ్ళీ కట్టుకోవాల్సిందే. మట్టిగోడలు పూర్తిగానో, కొంతో నీళ్ళల్లో కలిసిపోయాయి. కొందరిళ్ళ కప్పులు ఎగిరిపోయాయి. మళ్ళీ కప్పుకోవాలి. ఈ ఏడు పంట ఆశ లేకుండా పూర్తిగా కొల్లేటి పరం అయిపోయింది. ఊరి మగాళ్ళంతా ఊరినీ, చెరువు కట్టనీ బాగుచేసుకోవటంలో పడితే, ఆడవాళ్ళు ఇళ్ళనీ, గోడల్నీ, వాకిళ్ళనీ బాగుచేసుకోవడంలో పడ్డారు. ఊళ్ళో ఇంటి పైకప్పు కార

కుండా నెయ్యడంలో రంగయ్యగారికి సాటి మరొకరు లేరు. ఈ కులం, ఆ కులం అనే భేదం లేకుండా అందరిళ్ళపై కప్పుల మర మ్మత్తూ రంగయ్యగారి ఆధ్వర్యంలో జరుగుతోంది. చెరువుకట్ట చాలాచోట్ల గళ్ళు పడింది. వీరభద్రం, అచ్చయ్య, కొల్లూరి నాగయ్య, బాలకిష్టల కింద ఇరవైమంది చెరువు బాగుచేస్తున్నారు. ఊరి రోడ్ల మరమ్మత్తు కాకయ్యగారి బ్రెమ్మం, ఆనందరామయ్యగారి వెంకయ్య, ఏనిపిల్లి రాఘవయ్య, కాట్రగడ్డ సూర్యనారాయణ, చిన్న రాఘవయ్య, పెద్దారి సుబ్బయ్యల ఆధ్వర్యంలో మరో ఇరవైమంది పనిచేస్తున్నారు. కొల్లేరు తెచ్చిపడేసిన చెత్తా, చెదారం, మురుగూ, శవాలు, అన్నీ కాలవగుండా కొల్లేట్లోకే తోసేసి 'నువ్వు తెచ్చింది నువ్వే తీసుకో' అంటున్నారు.

ఎటొచ్చీ ఆడవాళ్ళకే ఏ సహాయమూ దొరకడంలా. ఎవరింటి పనివాళ్ళకే సరిపోతోంది. లక్ష్మమ్మ ఇంటి గోడలు మట్టితో మెత్తింది. ఈ వరద తాకిడికి ఆ మట్టి కాస్తా కరిగి లోన దడిలా కట్టిన వాసాం బద్దలు మిగిలాయి. మళ్ళీ మట్టితో మెత్తుకోవాలి. భాస్కరం, సరోజినీ లక్ష్మమ్మ దగ్గరకొచ్చారు. "మమ్మల్నేం చెయ్యమంటావో చెప్పు వదినా" అన్నాడు భాస్కరం.

"కైకలూరు గానగసత్తెంగారింటి దగ్గర మిల్లులో అడిగి నాలుగు బత్తాల ఊక తెచ్చిపెట్టు సాలు" అంది లక్ష్మమ్మ.

సరేనని అప్పటికప్పుడు కైకలూరు వెళ్ళాడు భాస్కరం.

లక్ష్మమ్మ, సరోజినీ కలిసి నానాతంటాలూ పడి బురద అడుగున ఉన్న మట్టిని తీసి గుట్టగా పోసుకున్నారు. దాని మీద అవసరమైన బురదని, ముక్కలుగా చేసిన వరిగడ్డిని కలిపి, సరోజిని తొక్కుతోంటే 'నేనూ తొక్కుతా' అని శీనూ కూడా తొక్కడం మొదలుపెట్టాడు. భాస్కరం, మరో ఇద్దరు మనుషుల సాయంతో ఊక తెచ్చి పడేశాడు. ఆ మట్టిలో ఊక కలిపి బాగా కలియతొక్కి, ఆ మట్టిముద్దలు సరోజిని, శీనూ అందిస్తుంటే లక్ష్మమ్మ గోడని సుతారంగా కట్టుకుంటోంది.

ఇళ్ళూ, ఊరు, చెరువు మరమ్మత్తయి మళ్ళీ మామూలవటానికి మరో పదిహేను రోజులు పట్టింది. కొల్లేరు ఏమెరగనట్టు ఇదంతా చూస్తూ ఉంది.

ఎన్నాళ్ళీ సంబరం! మళ్ళీ ములకలు రావా? కథ మొదటికి రాదా అన్నట్టు కొల్లేటి కొంగలు కబుర్లు చెప్పుకుంటున్నాయి.

★ ★ ★

"పెద్ద మామయ్య నిన్ను కొట్టాడంటే మొదట నేనసలు నమ్మలేదు, తెలుసా? " అన్నాడు క్రిష్ణ.

"ఈయన్నేమిటి.. ఆయనసలు ఎవర్నయినా కొట్టాడంటే నమ్మలేం" అన్నాడు మధు నవ్వుతూ.

అన్నతో దెబ్బలు తిన్న భాస్కరం కూడా నవ్వుతూ "పెద్దన్నయ్యకి అంత కోపం ఎన్నడూ సూడ్లా. అది కోపం కూడా కాదులే. లేక లేక పుట్టిన నలుసు గదా ఆడు. ఆడు తప్పిపోయాడంటే.. అమ్మో.. తల్చుకుంటేనే బయ్యంగా ఉంది" అన్నాడు భాస్కరం.

"వాడు.. ఆ శీనుగాడు అంత వాన

గోలల్లో వంతెన కింద పడి నిద్రోతున్నా డంట" అని నవ్వాడు క్రిష్ణ.

"గోడల నిండా పాములు... కృష్ణమూర్తి చూడకపోతే ఏమయ్యేవాడో..?" ఆశ్చ ర్యంగా అన్నాడు మధు.

"ఆ.. అక్కడింకా చాలామందున్నార్లే"

"మనూరాళ్ళు పడవెక్కేశారంట"

"మనూరాళ్ళు గాపోతేయేం? నుచ్చుమి ల్లాళ్ళున్నారుగా.. వాళ్ళయినా వాడ్నట్టా ఒంటరిగా వదిలెళ్ళేవాళ్ళా? కాపోతే దొరికే దాకా మనకి గాబరా"

"ఒట్టి గాబరానేనా? పెద్ద మావయ్యా, పెద్దత్తయ్య ప్రాణాలు పోయేయి గాదూ?" అన్నాడు మధు.

"ఆ మాట నిజమే"

మధు, క్రిష్ణ, భాస్కరం యింటి వాకిట్లో వేసిన మంచాల మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. భాస్కరం వాళ్ళిద్దరికీ చిన్న మేనమామే అయినా ఆయన పెళ్ళి చేసుకుంది మధు పెద్దమ్మ కూతురినే!

భాస్కరానికి ఇద్దరాడ పిల్లల్తర్వాత ఒక మగపిల్లాడు. మంచినీళ్ళ చెరువు దగ్గరే ఇల్లు. నలుగురన్నదమ్ముల్లో కాస్త డొక్క శుద్ధి ఉంది భాస్కరానికే. చదివింది తక్కువే అయినా వేమన శతకం, సుమతీ శతకం, భాస్కర శతకం, భర్తృహరి సుభాషితాలు అప్పచెప్పేస్తాడు. సంతకెళ్ళి నప్పుడు సరుకులతోపాటు ఓ చిన్నపుస్తకం కూడా కొనుక్కుని తేవడమేగాక ఖాళీ దొరి కినప్పుడల్లా కూర్చుని ఈ శతకాల్ని బట్టీప ట్టేవాడు. అప్పుడప్పుడూ సందర్భాన్ని బట్టి ఒక పద్యాన్ని చెప్పి అవతల వారిని ఆశ్చ ర్యపరిచేవాడు. పెద్దమ్మాయి శేషారత్నం పనీపాటా చేస్తూ తల్లికి చేదోడు వాదో డుగా ఉంటుంది. చిన్నది బక్క పీచు. పేరు అరుణగానీ అందరూ 'చీమా' అని పిలుస్తారు. కల్లాకపటం తెలియని పిల్ల. శీనూ కంటె చిన్నది. శీనూని 'అన్నయ్యా అన్నయ్యా' అంటూ ప్రాణం ఇడుస్తుంది. అన్నలిద్దరి పెళ్ళిళ్ళు అయి వేరే వెళ్ళిపో యాక కూడా భాస్కరం పెద్దన్నయ్య దగ్గరే పెరగటం మూలాన రంగయ్యగా రంటే ప్రేమ. వదిన లక్ష్మమ్మంటే లక్ష్మ ణుడికి సీతమ్మ వారిలాగే.

మధు, క్రిష్ణ రావటం చూడగానే సరోజి నమ్మ వంటింట్లోకెళ్ళి శనగపిండి కలిపింది. శేషారత్నం ఉల్లిపాయలు సన్నముక్కలు చేసి తల్లికిస్తోంది. వాటిని పిండిలో కలిపి "నాలుగు పచ్చిమిరపకాయలు చీల్చి ముక్కలు చేసివ్వు" అని తను అల్లం ముక్కలు చేసుకుని, అన్నీ కలిపి వేడిగా పకోడీలు వేస్తోంది.

"ఏమే మాక్కాస్తేమన్నా పెడ్తావా? నాగ్గాపోయినా నీ తమ్ముళ్ళకి.." అని భాస్కరం లోనికో కేకేశాడు.

అంతలోనే రాజులు వాయువేగంతో పరి గెత్తుకొచ్చాడు "అన్నయ్యా! ఏటివార పెద్ద కొట్లాట జరిగేట్టే ఉంది. మనాళ్ళందర్నీ పరుగెత్తి రమ్మంటున్నారు. కర్రలూ, బరి సెలు ఎక్కడున్నాయ్?" అన్నాడు కంగా రుగా.

ముగ్గురూ కళ్ళింతింతలు చేసుకుని లేచి నిలబడ్డారు.

ఊరు కొత్తగా ఇప్పుడు రెండు పార్టీ లుగా విడిపోయింది. భాస్కరం, వీర్రాఘ వయ్యా గ్రూపుకి చెందిన వాడయితే, వీర భద్రం సుబ్బయ్య గ్రూపుకి వత్తాసు. ఈ పార్టీలో వాళ్ళెవరో ఆ పార్టీలో వాడ్నేదో అంటాడు. అందరూ కర్రల్తో బరిసెల్తో యుద్ధానికి సిద్ధమైపోతారు.

భాస్కరం చావిట్లో ఎలిసెమీద దాచిన కర్రలూ, బరిసెలూ దించారు. తలా నాలుగు తీసుకుని ఏటివారకి కలిసే పరు గులు తీశారు.

వెనకనుంచి "ఈ పకోడీలు తినెళ్ళండి" అనే సరోజినమ్మ కేకలు గాల్లోంచి వస్తు

న్నాయి.
పకోడీలు తినేట్టే ఉంది.
పెద్దారి సిన్నాడు తక్కువ్వాడు కాదు. ఇరవై బరిసెలు చేయించి పెట్టాడు. ఎప్పుడు కొట్లాటొచ్చినా ఇరవయ్యా పుచ్చు కొచ్చి తమ వాళ్ళందరికీ తలోటి ఇస్తాడు.



ఏటివారన ఊళ్ళో మగాళ్ళంతా చేరారు. అటు కొందరూ ఇటు కొందరూ. కలిసి పరుగెత్తుకొచ్చిన భాస్కరం ఒక గ్రూపులో కెళ్తే మధు, క్రిష్ణ, రాజులూ మరో గ్రూపులోకి వెళ్ళారు.
పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. తప్పకుండా ఇవ్వాళ కొన్ని బుర్రలు పగిలేలా ఉన్నాయి.
"ఉరేయ్.. ఆగండ్రా.. ఆగండి!" అనే అరుపుల్తో రంగయ్య ఉరుక్కుంటూ వస్తు న్నాడు. ఆయన కాళ్ళకడ్డం బడ్తూ శీను గాడు "వద్దు నాన్నా, నువ్వెళ్ళొద్దే నాన్నా" అని ఏడుస్తున్నాడు. శీనుగాడ్ని అమాంతం ఎత్తుకుని ఆయన చకచకా రెండు గ్రూపుల మధ్యకొచ్చి నిలబడి ఇరువైపుల వాళ్ళనీ చూశాడు.
"పిచ్చెదవల్లారా! ఏంటిరా మీ గొడ వలు? బరిసెలెట్టి పొడుచుకు చస్తేగాని చల్లారని పగలు ఏమన్నయ్‌రా మీకు? మీరు చస్తే మీ పెళ్ళాంపిల్లలు ఏమ వుతార్రా! ఆలోచించారా! ఏరా మధూ, కర్ర ల్లేపి చూత్తన్నారు. భాస్కరాన్ని కొడ తారా? ఆడి బుర్ర పగిలి ఆస్పటల్లో పడితే ఆడికి అన్నం మోసుకెళ్ళాల్సింది మళ్ళీ నువ్వే గదరా! బుద్ధీ, జ్ఞానం ఏమన్నా ఏడి చినయ్యా! పైగా చదూకుంటున్నాడివి, నలుగురికి యివరం తవరం చెప్పాల్సినా డివి కర్రపట్టుకునుంచున్నావే! నువ్వేంటిరా బాసిగా.. అరేయ్ రాజులూ.. ఆ బరిసె దించండి ముందు. కిట్టుడూ.. నిన్నగాక మొన్న పుట్టావు. నీక్కూడా బరిసె కావా ల్సొచ్చిందేరా? పొడు.. పొడు.. నన్ను ముందు" అంటూ అందర్నీ పేరు పేరునా పిల్చి 'గడ్డి' పెట్టేసరికి అందరి రోషాలూ చల్లబడ్డాయి. రంగయ్య తిట్టిన తిట్లకి అందరి తలలూ సిగ్గుతో వాలిపోయాయి. రంగయ్య తప్ప ఆ మాటలు ఎవరు చెప్పినా ఎవరూ వినేవారు కాదు.
ఎక్కడాళ్ళక్కడ చల్లగా జారుకోటం మొదలవగానే రంగయ్యతోపాటు భాస్కరం, మధు, క్రిష్ణా, రాజులూ కూడా భాస్కరం ఇంటి దగ్గరికే వచ్చారు. భాస్కరం ఇంటి మీదగానే వీళ్ళెళ్ళకెళ్ళాలి.
"లోనకిరా అన్నయ్యా ఎల్దూగానిలే" అని పిల్చాడు భాస్కరం.
రంగయ్య వాకిట్లోకొచ్చి మంచం మీద కూర్చున్నాడు. శీనూని ఒళ్ళో కూర్చోబెట్టుకు న్నాడు. మధు, క్రిష్ణ, భాస్కరం దగ్గరా కర్రలూ బరిసెలూ తీసుకుని చావిట్లోకెళ్ళి ఎలిసె మీద సర్ది వచ్చాడు రాజులు, పాండవులు ఆయుధాల్ని జమ్మిచెట్టు మీద దాచినట్టు.
"మీ పార్టీలు కాదుగాని ఊరికేదో శని పట్టినట్టుంది" అంటూ వచ్చింది సరోజిని, చేతిలో పకోడీలు పట్టుకుని. శేషారత్నం పళ్ళాల్లో పెట్టి తలో పళ్ళెమూ ఇచ్చింది.
"బాగా చెప్పావమ్మా! రానురాను బుద్ధిలే కుండా పోతాంది జనానికి" అన్నాడు రంగయ్య, శీను నోట్లో ఒక పకోడీ

పెడుతూ.

పకోడీ తింటున్న శీనూగాడ్ని చూస్తూ "ఎట్టా తింటున్నాడో సూడు. సంతలో నువ్వు తప్పిపోటం మూలంగా మీ బాబాయి దెబ్బలు తిన్నాడు, తెలుసా? " అన్నాడు మధు.

"సంతలో నేనేం తప్పిపోలా. బాబాయే తప్పిపోయాడు" అన్నాడు శీను ఉక్రోషంగా.

అందరూ ఒక్కసారి ఘొల్లున నవ్వారు.

★ ★ ★

అర్జునుడు బాణం ఏద్దామని చూసేసరికి ఎదురుగుండా ఎవరున్నారూ.. తాతగారైన టువంటి భీష్ముడు. పక్కకి చూస్తే అందరు అన్నలూ, తమ్ములూ అయిన కౌరవులు. మరో పక్కకి చూస్తే గురువులైనటువంటి ద్రోణుడూ, కృపాచార్యుడు. అర్జునుడేమనుకున్నాడంటే 'ఇంత యుద్ధమూ చేసి నేను చంపేది ఎవర్ని? అందరూ నావాళ్ళే. ఛీ! నేనీ యుద్ధం చెయ్యను' అని ఎత్తిన ధనుస్సు దించేసి కృష్ణుడితో 'బావా! నేను యుద్ధం చెయ్యలేను' అన్నాడు.

"ఆ" అని కళ్ళూ నోరూ తెరిచి మొత్తం శరీరమంతటితోనూ వింటున్నాడు శీను. రోజూ రాత్రవ్వగానే తల్లి పక్కన పడుకుని అమ్మమీద ఒక చెయ్యివేసి అమ్మ చెప్పే రామాయణ, భారత, భాగవతాల్లో ఏదో ఒక కథ వింటేగాని నిద్రపోడు శీను. లక్ష్మమ్మక్కూడా శీనుకేదో ఓ కథ చెప్పక పోతే నిద్రపట్టదు.

"అప్పుడు క్రిష్ణుడు విశ్వరూపం చూపించాడు"

"అంటే... ఇశ్వరూపమంటే..? "

"శ్రీక్రిష్ణుడంటే శ్రీ మహావిష్ణువే. ఆయనే మనందరికీ దేవుడు. ఈ లోకాలన్నీ ఆయనే సృష్టించాడు. మనందరికీ సుఖాలు, కష్టాలు అన్నీ ఆయనే ఇస్తాడు. మనందరం ఆయన పిల్లలమే"

"మనందరం ఆయన పిల్లలమైతే సుఖాలే ఇవ్వొచ్చుగా. కష్టాలెందుకిస్తాడు? "

"కన్నపిల్లలైనంత మాత్రాన పిచ్చి పనులు చేస్తే ఏ అమ్మా నాన్నయినా ఊరుకుంటారా? "

ఆలోచనగా "ఊహూ... తిడతారు" అన్నాడు శీను.

"మరీ పిచ్చి పనిచేస్తే? "

"కొడతారు"

"అదే మంచి పని చేస్తే? "

"ఏమన్నా పెడతారు తింటానికి"

"అవునుగదా.. తిట్టినా, కొట్టినా బాధపడతాం. అదే ఏమన్నా పెడితే సంతోషపడ్తాం. అలాగే దేముడు కూడా మనం మంచి పనులు చేస్తే సుఖాలిస్తాడు. పిచ్చి పనులు చేస్తే కష్టాలిస్తాడు. అందుకే ఎప్పుడూ మంచిపనులే చెయ్యాలి.. సరే కథ విను. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో "యుద్ధం చెయ్యడం, చెయ్యకపోవడంలో నీదేమీ లేదు. అన్నీ చేయించేది నేనే. కాబట్టి ధనుస్సు తీసుకుని వరసగా బాణాలేసి శత్రువుల్ని చంపు" అన్నాడు.

"అమ్మా! ఎవరైనా తన పిల్లల్ని చంపుకుంటారా? "

"ఊహూ! చంపుకోరు"

"మరి అందరూ దేవుడి పిల్లలే అయితే

దేవుడు తన పిల్లల్నే చంపమన్నాడెం దుకు? "

"నువ్వు చిన్న పిల్లాడివి. పెద్దయితేగాని కొన్ని విషయాలు నీకు తెలవ్వు. కథ విను.."

"వింటాన్లే గాని.. అప్పుడు కురుక్షే త్రంలో పెద్దయుద్ధం జరిగింది. చాలా మంది చచ్చిపోయారని చెప్పావు గదా!"

"అవును"

"అదంతా యుద్ధం చెయ్యడం మూలానే గదా? "

"అవును"

"యుద్ధం చెయ్యకపోతే చక్కగా అందరూ బతికేవారే గదా? "

"ఊ.."

"అమ్మా!" ఆలోచనగా అన్నాడు శీను

"ఊ.."

"ఇవ్వాళ ఏటివార పెద్దయుద్ధం జరుగు తోంటనే నాన్నెళ్ళి ఆ యుద్ధాన్ని ఆపేశాడు గదా? "

"అవును, లేకపోతే ఊళ్ళో వాళ్ళందరూ తలలు పగిలి కాళ్ళూచేతులూ ఇరిగి ఈపా టికి ఆస్పటల్లో పడుండేవాళ్ళు"

"కురుక్షేత్రమప్పుడు క్రిష్ణుడు బదులు నాన్నుంటే కురుక్షేత్రం జరిగుండేది కాదుగ దమ్మా" ఆశగా అన్నాడు శీను.

లక్ష్మమ్మ కొడుకు మొహాన్ని ప్రేమగా చూస్తూ దగ్గరికి లాక్కుని "ఇంటన్నావా? " అంది రంగయ్యతో.

ఆయనెక్కడ వింటున్నాడు. హాయిగా గుర్రుపెట్టి నిద్రోతున్నాడు.

★ ★ ★

"ఆడసలు మన్తో మాట్లాడి ఎన్నేళ్ళ యింది. నీతో పనుండి ఇప్పుడొచ్చి 'బావా' అంటే తైక్కిమని బైల్దేరా? బావంట బావ. నీ పెళ్ళానికి తమ్ముడా? నీ చెల్లికి మొగుడా!" కోపంతో రగిలిపోతోంది లక్ష్మమ్మ.

"అదేనే పిచ్చిదానా! ఆడికి పని పడగానే మనం గుర్తొచ్చామా లేదా! ఇన్నాళ్ళుగా మాట్లాడని వాడు ఆడంతటాడొచ్చి మాట్లాడ లేదా! మనమైతే ఆడి దగ్గరకెళ్ళి మాట్లాడలేదుగా. అయినా ఒక్కూరులో ఉండేవాళ్ళం.. తెల్లారి లేచింకాడనించి ఒకళ్ళ మొకాల్లొకళ్ళం చూసుకునే వాళ్ళం .. మాటల్లేకుండా, కనపడ్డప్పుడల్లా మొకం తిప్పుకుని తిరగటం ఎంత కష్టమో ఇంటో కూచునేదానివి నీకేం తెలుస్తుంది? అయినా ఆడే వచ్చి మాట్లాడాడుగా" సము దాయించాడు రంగయ్య

"ఆడికి పనుండి..."

"అయితే మాత్తరం.. అయినా పనిలే కుండా మాట్లాడుకోటం ఎందుకు? పనికి మాలిన వాళ్ళల్లే"

చేతిసంచీలో ఒక పంచె, చొక్కా వేసు కుని "బావా! రంగయ్య బావా" అని భూషణం బజార్లో నిలబడి కేకెయ్యగానే "వత్తన్నా" అని బైటికెళ్ళిపోయాడు రంగయ్య.

"రెండు బారలు పొద్దెక్కింది. ఎండ సి టసిటలాడతాంది. ఈ ఎండలోబడి ఎక్క డికెల్తాన్నాడు రంగన్నయ్య? " అంది కాక య్యగారి కోడలు రాముడమ్మ.

"ఉసే బేబమ్మా! నల్లకోడి సూడు. గుడ్డు కొత్తాంది. సూసి నిమ్మళంగా దాన్ని గంప కిందెట్టు" అని లోనికొక కేకేసి గొడ్లకా డున్న సొట్టలడ్డ ఇనప బొక్కిన తీసుకుని, ఇంకా లక్ష్మమ్మ నుంచి సమాధానం రాక పోయేసరికి "ఏంటొదినా మాట్లాడవు? " అంది.

రంగయ్య కనుమరుగయ్యే దాకా సూత్తా నిలబడ్డ లక్ష్మమ్మ "మణిసన్నాక ఇవరం తవరం ఉండాలి. ఎవరన్నా పిల్చి 'వత్తావా' అంటే సాలు.. ముడ్డి మీద గుడ్డ నిలవదు" అంది.

"ఎవరికి? " రాముడమ్మదో అయో

మయం.

"ఇంకెవరికి.. నీ అన్నకి!"

"అదే. రొండుబారలు పొద్దెక్కింది గదా. ఇంతెండలో బడిపోతన్నాడు. ఎక్కడికీ? కాత్తాగి సల్లబడ్డాకెల్లగూడదూ ఆ ఎల్లేదేదో"

"సల్లబడేదాకా ఆగాలంటే గంగిర్లెత్తవా? "

"ఇంతకీ ఎక్కడికంటే సెప్పవే? "

"ఇంకెక్కడికి? రేపు శుక్రోరం గుడ్లవల్లేరు గొడ్లసంతకెల్లి సూడిపడ్డనొకదాన్ని కొనాలంట"

"మీకేనా? " సంబరంగా అడిగింది రాముడమ్మ.

"అయ్యోరాత! మాకైతే మీ అన్నంత ఆగమేగాలమీదెల్తాడా? ఆ భూషణానికి"

"భూషణానికా? ఆడెవళ్ళంతోనూ మాట్టాట్టల్లేదుగా!"

"ఇప్పుడు పనొచ్చిపడింది. 'బావా' అంటూ నీ అన్నని బోల్తా కొట్టించాడు. ఇంకేవుంది.. లేడికి లేచిందే పరుగని బైల్దేరాడీయన"

"రంగన్నయ్యంత సత్తెకాలపు మణిసిని నేనెక్కడా చూళ్ళా. అయినా రేపు సంతైతే ఇవ్వాళే ఎళ్ళేం చేత్తారీళ్ళు? "

"అయితే నీ మట్టిబుర్రకింకా తట్టలేదా! నీ అన్నని ఈళ్ళంతా తీసుకెళ్ళేదెందుకనుకుంటున్నా? "

"గొడ్లనాణ్నెం అన్నయ్యకి బాగా తెలుసుగా.. అందుకే"

"అదొక్కటే గాదమ్మా పిచ్చి రాముడమ్మా! రేప్పొద్దున బైల్దేరి కైకలూరులో బస్సట్టుకుని గుడివాడో, బందరో ఎల్లి, మళ్ళొక బస్సట్టుకుని గుడ్లవల్లేరెల్లేసరికి పైటాలయిపోతంది. ఈలోపు పొద్దునా, మధ్యాన్నం ఏదన్నా తినాలా. తీరా సంత కెళ్ళేసరికి మంచి గొడ్డన్నీ అమ్ముడైపోతే నాసిరకం దాన్ని కొనుక్కోవాలా? ఇయ్యన్నీ నీ అన్న భూషణానికి చెప్పి ఇయ్యాలే బైల్దేరెల్తే పాలపర్రు దగ్గర దిగి నాలుగడుగులేస్తే మా పెద్దమ్మాయి శకుంతల చౌటపల్లిలో ఉందిగా రాత్రికక్కడే తిని పడుకుని తెల్లారిలేసి కాత్తేదన్నా టిపినీ తిని మళ్ళీ అంగలూరు మీదుగా నాలుగడుగులేత్తే గుడ్లవల్లేరేనాయె. పడ్డని కొనుక్కుని మళ్ళీ అమ్మాయిగారింటికొచ్చి అన్నం తిని బైల్దేరి తుమ్మకాలవ పట్టుకుంటే రేత్తిరయ్యేసరికి ఊళ్ళోకొచ్చి పడతాం..

ఇదీ అర్జునిడికి శ్రీక్రిష్ణులవారు గీత చెప్పినట్టు నీ అన్న ఆ భూషణానికి చెప్పిన కత!

భూషణానికేం తీపరం. ఇంత ఇవరంగా చెప్పినాక 'సరే బావా! నీ ఇష్టమొచ్చినట్టే, నువు చెప్పినట్టే చేద్దాం. అయితే ఇవ్వాళే బెల్దేరదాం' అన్నాడు. అక్కడికి నీ అన్ననీ, నన్నూ, మా పెద్దమ్మాయినీ ఉద్దరిస్తున్నట్టు" అంది లక్ష్మమ్మ.

★ ★ ★

తండ్రితోబాటు వచ్చిన భూషణాన్ని చూసి ఆశ్చర్యపోయింది శకుంతల.

"అట్టా చూత్తావేంటమ్మా! మన భూషణ మేలే.. కాళ్ళకి నీళ్ళియ్యి" అన్నాడు రంగయ్య.

ఇద్దరికీ రెండు ఇత్తడి చెంబుల్తో కాళ్ళకి నీళ్ళిచ్చి, తుడుచుకోటానికి తుండుగుడ్డలిచ్చి, వసారాలో రెండు మడతమంచాలు వాల్చి, లోనికెళ్ళి రెండుతికిన దుప్పట్లు తెచ్చి వాటి మీద పరిచి భూషణాన్ని "కూర్చో మామయ్యా" అని చెప్పి, ఇంట్లోకెళ్ళి "నాన్నా" అని పిలిచింది శకుంతల.

రంగయ్యగారు లోనికెళ్ళి "ఈడింకా రాలేదా? " అనడిగాడు. శకుంతలభర్త నారాయణ ఆయనకు వేలిడిచిన మేనల్లుడే. పాల వ్యాపారం చేస్తాడు.

"మీరొచ్చే ముందే ఎళ్ళారు. సాయంత్రం కూడా పాలుపట్టుకుని గుడివాడలో పొయ్యటానికి ఎల్తున్నారు.. ఏ రేత్తిరి

పదింటికో వస్తారుగాని నాన్నా ఈ భూష ణానికీ మనకీ మాటల్లేవుగా.. ఎప్పుడు కలి శారూ? " అంది ఆరాగా.

"నిన్నేలే. శుక్రోరం సంతకెల్దామని వచ్చి నోరు తెరిచి అడిగాడు. కాదనలేక.."

"ఏంటి నాన్నా.. ఇది? నువ్వు ఎన్నిసా ర్లన్నా రా.. గాని ఎవరో ఒకర్ని తీసుకుని ఇట్టా వారానికి రెండు రోజులొత్తే.. అదీ వాళ్ల పనిమీద.. నేనొండిపెట్టలేనే. ఊళ్ళో ఎవరు సంతకెళ్ళాలన్నా నా ఇంటిమీద పడితే, నేనెంతకని చావను? నాకిందే మన్నా నౌకర్లు చాకర్లున్నారా? ముగ్గురు చిన్నపిల్లలతో తలపేణం తోక్కొస్తోంది. పొద్దునపూట పాలయాపారం కోసం ఇల్లిల్లూ తిరిగి పాలు పోగేస్తుంటే... వచ్చే దేమూలకీ సాలక ఈయన సాయంత్రం కూడా పాలు పోగెయ్యమన్నాడు.

ఇద్దరమూ చెరోపక్కకీ ఎళ్ళి పోగేస్తే, ఆ బిందెలు కట్టుకుని సైకిలు తొక్కీ తొక్కీ ఈయన అవస్త అవస్తగాదు. మాకున్న కష్టాలు చాలనట్టు నువ్వొకడివి. ఆ పాడు గొడ్డ సంతకాదుగాని, నాకు ఎదవ సంత ప్రతివారమూ" తండ్రితో అట్టా మాట్టాడేసరికి శకుంతల గొంతునిండా ఏడుపు నిండింది.

"అట్టనమాకమ్మా! మనవాడేగా"

"ఎవరే.. ఎవరు మనవాడు? ఈ భూషణం మనవాడా? ఈయన మనవా డైతే మనవాడు కానాడెవడన్నా ఉన్నాడా? ఒక్కడి పేరు చెప్పు. నీకందరూ మన వాళ్ళే. ఇంట్లో నీవాళ్ళే పరాయివాళ్ళు. నీమూలాన అక్కడమ్మా, ఇక్కడ నేనూ ఎంత కష్టపడాల్సొస్తోందో తెలవదు. చెప్పినా అర్థం చేసుకోవు" ఏడుపు గొంతు లోకి కోపం వచ్చి ఏడుపుని నెట్టేసింది.

"ఇయ్యాల్టికేలేమ్మా! మన్తోపాటు నాలుగు మెతుకులు.."

"మనతోపాటు పెడ్తే.. రేపూరెళ్ళి నా పరువు తీస్తాడుగా, మర్యాద చెయ్యలేదని. సర్లే, ఎళ్ళు. ఏం చేస్తాను, నా ఖర్మను కోటం తప్ప" అని గబగబా పక్కింటి శశి రేఖమ్మత్తయ్యని పిల్చి "రెండు కోడిగు డ్లుంటే ఇస్తా? " అని అడిగింది.

"ఈ వేళప్పుడెవరొచ్చారే? "

"ఉన్నాడుగా మా నాన్న"

"ఓహో! రేపు శుక్రోరం గాదూ.." అంది శశిరేఖమ్మ.

ఆవిడకి తెలుసు శకుంతలమ్మ గురువారపు కష్టాలు.

లోనికెళ్ళి నాలుగు గుడ్లు తెచ్చిస్తూ "చేసి చేసి వస్తాడు. నారాయణకి లేకుండా చెయ్యమాక" అంది.

"హు" అని నిట్టూరుస్తూ వంటింట్లోకి నడిచింది శకుంతల.

★ ★ ★

ప్రతి శుక్రవారం గుడ్లవల్లేరులో గొడ్ల సంత చాలా పెద్దఎత్తున జరుగుతుంది. కృష్ణాజిల్లాలో దాదాపు ప్రతి ఊర్నించి గొడ్లని అమ్మాలనుకున్నా, కొనాలనుకున్నా అక్కడికొస్తారు.

రంగయ్యగారికి గొడ్ల నాణ్యత తెలుసు. అందుకే ఊళ్ళో ఎవళ్ళకే పశువు అవసరం వచ్చినా ఆయన్ని తీసుకుని సంతకొస్తారు.

భూషణం, రంగయ్యగారూ సంతంతా ఒకసారి కలియతిరిగారు. రంగయ్యగారి కన్ను ఒక మాళీపడ్డమీద పడింది. అక్కడ ఆగారు. తోక సాపుగానే ఉంది. గిన్నికొమ్ములు, ముచ్చిలిగుంటలో సుడుంది. నాలుగు సళ్ళతో పొదుగు బాగానే ఉంది. తప్పులేదు.

"మొదటి ఈతేగా?"

"కాదు.. పదీతలు! పడ్డని చూత్తే ఆమాత్రం తెలవట్లా?"

"పడ్డ కొమ్మిసర్లేదుగానీ, నువ్విసుర్తున్నావే?"

అతను మాట్లాడలా.

"పడ్డనమ్మడానికొచ్చావా? కొనేవాళ్ళని పొడవటానికొచ్చావా?"

"అమ్ముకునేవాడికున్న కష్టం కొనేవాడికేం తెలుత్తుంది?"

"సర్లే.. కష్టాల్లేందెవరికి, తెలవందెవరికిగాని.. ఎద్దై ఎన్నాళ్లయింది?"

చెప్పాడు.

"ఎంత సెబ్తున్నావ్"

చెప్పాడు.

"తగ్గేదేమన్నా ఉందా?"

"ఒక్కకానీ కూడా తగ్గను"

"నీవాలకం చూసి అదే అనుకున్నాలే" అని, రంగయ్యగారు భూషణాన్నివతలికి తీసుకొచ్చి "పడ్డ రాజాపడ్డ. కళ్ళు మూసుకు తీసుకోవచ్చు" అన్నాడు.

"ధర కాస్త ఇసురుగా ఉంది బావా"

"పడ్డటువంటిది"

"నెలలో ఈన్తుందంటావా?"

"మడి చూత్తే మరో పది పదేను రోజులు పట్టుచ్చులేగాని.. తీసేసుకో. లెక్కలేకుండా రోజుకి నాలుగైదు శేర్లు పాలిత్తది"

"అంతేనంటావా?"

"ఆ"

"బేరమాడి కాత్త బెట్టు చేద్దాం. ఏమంటా?"

"సరే, పద. ఈలోపెవడి కన్ను దాని మీద పడ్డా పడ్డనొదల్రు. ఆయనకేదో ప్రాణావసరం వచ్చి అమ్ముతున్నాడు. లేకపోతే వదులుకోవాల్సినది కాదు. అందుకే ఆయనకా ఆక్రోశం"

ఇద్దరూ మళ్ళీ పడ్డ దగ్గరకు వెళ్లారు.

"పడ్డని తీసుకునేది తీసుకునేదేగాని..

మీది ఏ ఊరు? " అడిగాడు రంగయ్య.

"ఎంట్రప్రగడ"

"ఎంట్రప్రగడా!" అన్నాడు రంగయ్య అది తనూరైనంత ఇదిగా.

"ఆ ఎవరన్నా తెలుసా? "

"తెలవకపోవటమేం. సూర్నారాయణగారనీ" అన్నాడు రంగయ్య.

"అట్లూరి సూర్నారాయణా? ఆయన నాకు మామవుతాడు"

"అనుకున్నాలే. పడ్డ రాజా పడ్డ. ఎందుకమ్ముతున్నా? అంత ప్రాణమ్మీదకేమొచ్చింది? " విచారించాడు రంగయ్య.

"ప్రాణం మీదికే వచ్చింది. మా అమ్మనాస్పటల్లో చేర్చా. ఏదో మాయరోగం. ఎక్కడ్డబ్బూ సాల్డల్లా! చూత్తా చూత్తా కన్నతల్లి నొదిలెయ్యలేను. ఈ పడ్డ నా దొడ్లోనే పుట్టింది. దీనమ్మ ఇంకా పాలిత్తానే ఉంది. పడ్డనమ్మాల్సొస్తందని జన్మలో అనుకోలా. అమ్మకోసం అమ్ముకోక తప్పట్లా" అతని కళ్ళల్లో సన్నటి నీటితెర. అమ్మకోసమో, అమ్ముకోవల్సిందానికోసమో, ఇద్దరి కోసమో!

"సర్లే, అధైర్యపడకు. రైతు పుటక పుట్టినోడికి కష్టాలకొ్కదవుందా? గాని ఒక పని చెయ్యి. నీ పరిస్థితి బాగయినప్పుడు రా.. ఈ పడ్డని మళ్ళీ నువ్వే కొనుక్కుందువుగాని"

ఊరిపేరు, తనపేరూ చెప్పి ఆయన చెప్పిన ధరకే పడ్డని కొన్నాడు రంగయ్యగారు. డబ్బిచ్చేప్పుడు "బేరమాడితే కాత్త తగ్గేవాడే. అవసరంలో ఉన్నాడు" అన్నాడు భూషణం.

"ఆయన పడ్డని కొంటన్నావా? ఆయన అవసరాన్నా? నోర్మూసుకుని ఇవ్వరా. రాజాలాంటి పడ్డ" గదిమాడు రంగయ్య.

పడ్డని తోలుకొద్దామంటే అది యజమాని నొదిలి రానంటుంది.

ఇట్లా కాదని దాన్ని కట్టేసి, ఆయన్నెళ్ళిపొమ్మన్నాడు. ఆయన వెళ్లబోతూ, ఆగి వచ్చి దాన్నోసారి వాటేసుకుని, కళ్ళు పైపంచతో తుడుచుకుంటూ, గబగబా వెళ్లిపోయాడు. ఆయనెళ్లాక కాస్త పచ్చగడ్డి తెచ్చి దానికి తినిపిస్తూ ఓ గంటాగి నెమ్మదిగా తాడు పట్టుకుని నడిపించారు. అది మధ్య మధ్యలో 'అంబా! అంబా!' అంటూ ఆయన్ని పిలుస్తూనే ఉంది.

సంతదాటి బైటికొచ్చాక భూషణం నెమ్మదిగా "బావా!" అన్నాడు.

"ఏంటిరా? "

"ఏంలేదు.. మా తోడల్లుడి తమ్ముడు ట్రాక్టరు బోల్తాపడి కాళ్లిరిగి గుడివాడ రాఘవయ్యగారి ఆస్పటల్లో పడున్నాడంట. నిన్న నేను బయల్దేరుతుంటే కబురొచ్చింది" అని అన్నాడు.

"అయితే ఏంటంటా? "

"ఏంలేదు. నేను కూత్తటెల్లి ఆడ్నిచూసొత్తా. నువ్వేమనుకోనంటే.." గొణిగాడు.

"సర్లే, ఎళ్ళరా. దానికేముంది? ఈ పడ్డని నేను తోలుకెళ్తాలే"

"నాకేమాత్రం ఈలున్నా మధ్యలో వచ్చి నిన్ను కలుత్తాలే"

"నీ మొఖం.. ఏమొద్దులే. నేను తుమ్మ కాలవ పట్టుకుంటే సీకటి పడకముందే ఊరు జేర్తాలే"

"ఎళ్ళి వత్తానే బావా! ఏం లేదు.. మళ్ళీ ఊర్నించి రావాలంటే.."

"ఏమొద్దులే. ఇంతదాకా వచ్చి ఆస్పటల్లో వున్నాడ్ని చూళ్ళేదని తెలిత్తే బాగుండదు. అదుగో గుడివాడ బస్సొత్తాంది. ఎక్కెక్కు"

భూషణం గబగబా వెళ్ళి గుడివాడ బస్సెక్కాడు.

తర్వాత గుడివాడలో బస్సు దిగ్గానే రెడీగా ఉన్న భీమవరం బస్సెక్కి కైకలూర్లో దిగి, ఊళ్ళోకే వెళ్తున్న భూపతయ్యగారి ఉమ్మయ్య సైకిలెక్కి, ఇంటికెళ్ళి భోంచేసి, ప్రయాణపు బడలిక తీరేదాకా పడుకున్ని


ద్రోయాడు. రంగయ్యగారు మాత్రం గుడ్ల వల్లేరు నుంచి పడ్డని తోలుకుని బైల్దేరి, ఆ పడ్డ అంగలూరు నుంచి ఎంట్రప్రగడ వెళ్ళ డానికి గుడివాడ రోడ్డంట పరిగెత్తితే, వెంటబడి, వెనక్కి మళ్ళించి, దానితో పోరాడి జంగాలవ నుంచి మళ్ళించి, తుమ్మకాలవ గట్టుకి చేరేసరికి, ఆకలితో నకనకలాడ్తూ, కనపడ్డ పండో, కాయో తింటూ, కాలవలో నీళ్ళు తాగుతూ పడ్డతో ఇరవై మైళ్ళు పరుగులు తీస్తూ, ఇల్లు చేరే సరికి ఊరుమాటు మణిగింది.

తెల్లారాక భూషణం తోడల్లుడు కనపడ్డ ప్పుడు వాడి తమ్ముడి కాళ్ళెలా ఉన్నాయని అడిగాడు రంగయ్యగారు.

"వాడికేం తీపరం!" అన్నాడు భూషణం తోడల్లుడు.

'ఈ భూషణం మా సెబ్బరాడు' అనుకు న్నాడేగాని, 'ఏందిరా ఈ పని? ' అనడ గలా. అదీ రంగయ్య గారంటే. ఆయనకి ఎవరైనా మనాడే. మనాడు కానివాడు భూమండలమంతా వెదికినా దొరకడు. ఇది అందరికీ తెలుసు. అందువల్లే ఎవరికే అవసరమొచ్చినా 'మన' రంగయ్యగారుం డనే ఉన్నారు.

అసలీ భూషణానికీ, రంగయ్యకీ మాట ల్లేకపోవడానిక్కారణం.. ఓసారి బస్సులో జేబుకొట్టేశారని రంగయ్యగారి ద్వారా అప్పు జేసి దున్ననికొని ఐదేళ్ళయినా అప్పుతీ



ర్వాలా. అడిగితే మాట్లాడ్డం మానేశాడు.

★ ★ ★

పెద్దజాడ నుంచి అనేక చిన్నచిన్న జాడలు కొల్లేటి లోపలి లోపలికి వెళ్ళి చుట్టుతిరిగి మళ్ళీ వచ్చి పెద్దజాడను కలుస్తుంటాయి. ఈ చిన్న జాడల్లో దోనెలు మాత్రమే వెళ్తాయి. పడవలు కొంతదూరం వెళ్ళినా ఎక్కడోచోట లోతులేక, ఊబిలోనో, ఎత్తుగా పెరిగిన నాచులోనో చిక్కుకుపోతాయి. అందువల్ల తెలిసిన వాళ్ళెవరూ పడవల్ని చిన్న జాడల్లోకి తీసికెళ్ళరు. చిన్నజాడల్తో బాగా పరిచయం ఉంటే తప్ప దోనెలవాళ్ళు కూడా తాము వెళ్ళాల్సిన దోవ ఏదో తెలియక తికమకపడి అనవసరంగా చాలా తిరుగుతుంటారు. ఒకసారి చిన్న జాడలోకెళ్తే అటూఇటూ ఉన్న జమ్ము, జీలగ, కిక్కిస పొదల్తో, తుంగతుప్పల్తో, నీళ్ళల్లోంచి పాకివచ్చే తూటు కాడల్తో నీళ్ళకింద ఉన్న నానాజాతుల నాచు, కలువల్తో దోవంతా దుర్గమంగా మారిపోతుంది. అదే తెలిసిన వాళ్ళయితే ఇట్టే వెళ్ళి అట్టే వస్తారు. కొల్లేట్లో వేటకొచ్చిన పక్షుల ధ్వనులేగాక ఇలా దోనెలమీద చేపల వేటకొచ్చే వడ్డి వాళ్ళ పాటల్తోనూ, కేకల్తోనూ కొల్లేరెప్పుడూ రకరకాల రాగాలు వినిపిస్తుంటుంది. ఒక్కోసారి అనుకోకుండా ఇరుక్కుపోయే దోనెను లాక్కోటానికి తిప్పలుప



డుతూ సాయానికెవరైనా దగ్గర్లో ఉన్నారే మోనని పిల్చే 'ఏహేయ్'లాంటి అరుపులూ, దగ్గర్లో ఉన్నవారి ఎదురు అరుపులు - 'ఎక్కడ్రా.. ఎవర్రా.. ఇక్కడా.. నేను పరు శురాముడ్ని' అంటూ సమాధానాలూ .. మరో చిన్నజాడలో చేపలవేట సాగిస్తున్న మరో 'కోదండరాముడు' రావటం, ఇద్దరూ కలిసి దోనెని వెనక్కీ ముందుకీ లాగిలాగి ఎలాగో నీళ్ళల్లోకి తేవటం.. 'అంత ఒ ళ్లూపై తెలవకుండా ఎట్టా నడుపుతున్నా దోనెని.. సమయానికి నేనుండబట్టి సరిపో యింది. లేపోతే ఏంచేసేవాడివి?' లాంటి మందలింపులూ ఆ కొల్లేటికి కొత్తగాదు. నిత్యమూ ఉండేవే.

ఏటివారన వరసగా నిలబెట్టిన పడవలు వాటిని కట్టెయ్యటానికి పాతిన గుంజలు.. కొన్ని పడవల్ని గట్టెక్కిస్తారు. పడవలకవ తలగా దోనెలు, పాతిన వాసాలక్కట్టి ఉంటాయి. కొన్నిటిని నీటిలో ముంచి కట్టి పడేస్తారు. ముంచిన దోనెని నెమ్మదిగా పైకి లేపుతుంటే మాలిమి అయిన గేదె లాగా నీటిపైదాకా వస్తుంది. తర్వాత దాన్ని అలానే నీళ్ళల్లో కాస్త ముందుకి తీసి కెళ్ళి వేగంగా వెనక్కు తోసి దోనె వెనక చివరిని పైకుండేలా చేస్తారు. ఎనక్కొచ్చిన వేగానికి దోనెలోపలున్న నీరు వెనకున్న ఖాళీలోంచి బయటికి వెళ్ళిపోతుంది. అలా కొంచెం కొంచెం ముందుకీ వెనక్కీ లాగి, తోసి, దోనెలో సుక్క నీరుకూడా లేకుండా తీసేసి వెనక ఖాళీని మూసేస్తారు. ఈ దోనె నడపటం చేతైతే చాలా సులువుగా ఉంటుంది. కాని పొరపాటుగా దోనె వెనక కూర్చొని కాళ్ళు వెనక కంతలో ఇరుక్కొని బోల్తాపడి చచ్చిపోయేవాళ్ళూ ఉన్నారు. పచ్చని పొదల్లోంచి నీటిపై తేలే నీలి తూటుకాడ పువ్వులు, రంగురంగుల కలువ పూల మధ్య దోనెతో రివ్వున జెర్రిగొడ్డుల్లా సాగిపోతుంటారు వడ్డీలు.

★ ★ ★

చిన్నరాఘవయ్యగారి గొడ్లను తోలుకొచ్చే సత్తెంతాత పిల్లల్లోకెల్లా పిల్లడు. ఆయనకు పెళ్ళి కాలా... ఆయనకా ధ్యాసే లేదు. చిన్నరాఘవయ్యగారింటికాడే ఉంటాడు. వాళ్ళ గొడ్లని కాయటం, గొడ్ల చావిడిని బాగు చెయ్యటం, గాట్లో గడ్డెయ్యటం, వాటికి కుడుతులెట్టి, పాలుపిండి ఇంట్లో ఇవ్వటం, వాళ్ళు పెట్టింది మారుమాట లేకుండా తినడం, కూనిరాగాలు తీసు కుంటూ చావిట్లోనే ఓ పక్క పడుకోటం.. అంతే.

కొల్లేట్లో కొచ్చినపుడు పిల్లలకి తగాదా లొస్తే తీర్పులు చెప్పటం, ఉన్నవాళ్ళల్లో చిన్నవాళ్ళను పోగేసుకుని పూరీడు పిట్టల్ని పట్టుకోవటం చేస్తుంటాడు. జమ్ము పొదల్లో ఉండే పూరీడులు గబుక్కున పైకె గరలేవు. పిల్లలు రహస్యంగా వెళ్ళి అవి ఎగరటానికి సమాయత్తమయ్యేసరికి పట్టే సుకుంటారు. పట్టుకున్న పూరీడుల్ని సత్తెం తాతకిస్తే వాటిని ఎండిన జమ్మి, తుంగ, జీలగ కర్రల్ని కట్టి, నిప్పెట్టి, ఆ మంటమీద కాల్చి, తలగుడ్డలో ఎప్పుడూ ఉండే ఉప్పు, కారం జల్లి తలో ముక్కా పెడతాడు.

ఒక్కోసారి రోలూరోకలి, పటాసు, భాస్వరం కలిపి మందుగుండు సామాను తెచ్చి, రాతికడ్డీల మీద మోగించేవాడు. అంతే గొడ్లమీదా, చేలలోనూ ఉన్న కొంగలు, పక్షులు రివ్వున పైకెగిరి కంగా రుగా అరుస్తూ వెళ్తుండేవి. పిల్లలు ఎగురు తున్న ఒక్కో కొంగను గుర్తుంచుకుని 'ఓ.. ఓ..' అంటూ అరుస్తూ కింద పరిగెత్తే వారు. కొంతదూరం ఎగిరిన కొంగ భయంవల్లో, మరెంచేతో కిందపడిపో యేది. వాటిని సత్తెంతాత కాలిస్తే అప్పటి కప్పుడు తినేసేవారు. ఒక్కోసారి ఇంటికి తెచ్చుకునేవారు.

ఓసారి శీను ఒక కొంగ కింద పరుగె

త్తటం మొదలెట్టాడు. వెనక నుంచి సత్తెం తాత "అరవరా.. అరుత్తూ పరిగెత్తు. ఒద లమాక" అంటూ అరుస్తున్నాడు. పిల్లలు తలో కొంగకిందా పరిగెత్తుతున్నారు. శీను "ఓ... ఓ" అంటూ అరుస్తూ పరిగెత్తుతూ ఓ గుంటలో పడ్డాడు. మళ్ళీ లేచాడు. పైకి చూస్తూ పరిగెత్తుతున్నాడు. కొంగకిందే పరిగెత్తుతూ, తుంగ కాళ్ళకు చుట్టుకుంటే, పడినంత పని జేసి, ఆ తుంగనే పట్టుకుని, తట్టుకుని, భయంతో అరుస్తూ పైకి పోతున్న కొంగని మాత్రం ఒదలకుండా కింద పరిగెత్తుతూనే ఉన్నాడు. సత్తెంతాత మరోసారి రోలూరోకలి మోగించాడు. ఎవరో విసిరేసినట్టు పై నుంచి శీనూ ముందు నీళ్ళల్లో పడింది కొంగ. గబుక్కున ఆ కొంగని పట్టుకుని, ఆయాసంతో నిలబడి, ఆ నీళ్ళల్లోనే కూలబడి, ఆయాసం తీర్చుకుని, నవ్వుతూ కొంగని తీసుకుని సత్తెంతాత దగ్గరికి వెళ్ళాడు. "బలే పరిగెత్తుకొత్తన్నావురా. ఇంటికి తీసికెళ్ళి మీ అమ్మతో కూరొండించుకో" అన్నాడు సత్తెం తాత. వీడికి గోచీ తప్ప ఆ రోజు తలగుడ్డ కూడా లేదు. గుత్తాదాసు శీనూకి దూరపు వరస బావవుతాడు. "నా తలగుడ్డలో చుడతానిటివ్వు" అని తీసుకుని ఏటివారకొచ్చాక తనింటికి తీసికెళ్ళిపోయాడు. శీనేమో తన గేదెలు మళ్ళేసుకుంటూ దాసు బావ దార్లో తమ ఇంటికెళ్ళి కొంగను అమ్మకిచ్చి ఉంటాడనుకున్నాడు.

తీరా అమ్మ అన్నం పెట్టాక కొంగ మాంసం కోసం చూసిన శీనూకి పచ్చిపులుసు దర్శనమిచ్చింది.

"కొంగ మాంసం ఏదమ్మా? " అన్నాడు.

"కొంగ మాంసమా? కుక్క మాంసమా? కోళ్ళు, చేపలు, మేకలు, గొర్రెలూ అయి పోయినయ్యి. కొంగలు, కుక్కలు కావలొచ్చినయ్యా? " అంది లక్ష్మమ్మ.

అమ్మదొక గోల. ఆమె పుట్టి బుద్ధెరిగాక నీచు తినెరగదు. నాన్నేమో నీచులేకుండా ముద్ద ఎత్తింది లేదు. ఆయన కోసం రుచికరంగా వండే లక్ష్మమ్మ వీటిని రుచి కూడా చూడదు. శీనూని పట్టుకుని ప్రతి రోజూ అన్నాల దగ్గర "జీవహింస మహా పాపం నాయనా!" అనేది తల్లి.

"నీ బొందేం గాదూ" అనేవాడు రంగయ్య. ఆయన మాట విననట్లుగానే శీనూతో "నా మాటినయ్యా.. చేపలూ, కోళ్ళూ అన్నీ ప్రాణం ఉన్న జీవులు.

వాటికీ మనలాగే బాధ తెలుసు. అందుకే వాటిని కోస్తాంటే అరుస్తయ్. ఏడుస్తయ్. గిలగిల కొట్టుకుంటయ్. ఔనా? నువ్వూ చూశావుగా. వీటిని తినగూడదయ్యా. నీచు మానేస్తే నీకేది కావాలంటే అదొండి పెడతా" అనీ, పాపంపుణ్యం ఎన్నో చెప్పేది శీనూకి.

అమ్మ చెప్పిన ప్రతి అక్షరం నిజమేనని పించేది శీనూకి. వెంటనే నీచు మానేసి అమ్మలాగే కూరగాయలూ, ఆకుకూరలూ తినాలనిపించేది. కానీ అవేవీ చేపలంత, మాంసమంత రుచిగా ఉండవే!

అంతలో రంగయ్య అడ్డొచ్చి "సర్లే, నీ సోదాపు. మాయ్యని కూడా నీలాగా పనికి మాలినాడ్ని చెయ్యమాక" అనేవాడు. శీనూని రంగయ్యగారు 'మా అయ్య' 'మాయ్య' అని తప్ప వేరొకమాటతో పిల్చే వాడు కాదు, చెప్పేవాడు కాదు.

"నీకూ, నీ తలిదండ్రులకీ, నీ తమ్ముళ్ళకీ, చెల్లెళ్ళకీ, వాళ్ళ కుటుంబాలన్నింటికీ చాకిరీ చేసీచేసీ నేను పనికిమాలిన దాన్నయ్యాను మరి" అంటూ గొణగడం మొదలు పెట్టేది.

"అబ్బా! ఆపవే సోది. రేపట్నించి మానే స్తాడ్లే. ఇవ్వాల్టికి తిననియ్యి. తినయ్యా. వాలగ ముక్క బాగుంది. ముళ్ళు నేను తీసిస్తాగాని తిను" అనేవాడు రంగయ్య.

తల్లి దీనంగా శీనూ వంక చూస్తే తలొంచుకుని "ఔనమ్మా రేపట్నించి మానే త్తాలే" అనేవాడు శీను.

"ఆ రేపట్నించి అనేది నువ్వు మాటల్నే ర్చినకాడ్నించి ఇంటానే ఉన్నా. ఆ రేపు మాత్రం రాదు. తిను" అని చట్టిలోని వాల గముక్క పళ్ళెంలో వేసేది.

అమ్మకి కష్టంగా ఉందని తెలుసు. అయినా చేపమీద దేవుడు తనకెందుకింత ఇష్టం కలిగించాడో తెలియక సతమతమ య్యేవాడు శీను.

"తినయ్యా.. మాయ్యా తిను. ముళ్ళు తియ్యనా?" అని ప్రోత్సహించే నాన్నతో "నేను తీసుకుంటాను" అంటూ చేపముక్క మాయం చేసేవాడు శీను.

అందువల్ల ఇప్పుడు అమ్మకంత నిష్టూరం. కానీ దాసుబావ కొంగనేం చేశాడు? అమ్మకివ్వలా. పచ్చి పులుసుతో రెండుముద్దలు గబగబా తిని లేచి పరిగెత్తి దాసుబావ ఇంటికెళ్ళాడు. వాకిట్లో మంచం మీద కూర్చుని దాసుబావ చీపురుపుల్లతో పళ్ళు కుట్టుకుంటున్నాడు.

"దాసుబావా! ఆ కొంగని మా అమ్మకివ్వ లేదంటగా?" అన్నాడు శీనూ.

"ఏ కొంగర్రా?" అన్నాడు నిదానంగా ఏమెరగనట్టు దాసు.

"సాయంత్రం కొల్లేట్లో నేను పట్టుకున్న కొంగని"

"ఆ కొంగని నువ్వెక్కడ పట్టుకున్నావురా .. నేనుగాదూ పట్టుకున్నది?" అన్నాడు దాసు.

"ఏంట్రా అది.. ఎవరా వచ్చింది?" లోన్నుంచి వచ్చింది దాసు తల్లి వెంకట్రా వమ్మ.

"ఆ.. ఏంలేదులే. సాయంత్రం కొల్లేట్లో కొంగని పట్టుకుని, కాసేపు పట్టుకోరా అని ఈడికిచ్చా అంతే. దాన్ని ఆడే పట్టుకున్నా నంటున్నాడు. ఏమో అనుకున్నా.. అక్కి నోడు తక్కువాడు గాదు" అన్నాడు దాసు.

ఆ మాటలు వినగానే శీనూ ముఖం పాలిపోయింది. మనసు విరిగిపోయింది. మనుషులు ఇలా కూడా ఉంటారని వాడికి మొదటిసారి తెలిసింది.


వాడి మొహం చూసి వెంకట్రావమ్మ "పాపం చిన్నమోడు! ఆడికి కొంగ మాంసం తిందామనిపించింది గాబోలు. ఉండరా ఉప్పుడే వత్తా" అని లోనికెళ్ళి చిన్న మట్టిమూకుడ్లో కొంగ మాంసపుకూర ముక్కలు రెండు వేసుకొచ్చి యిస్తూ

"ఎవరు పట్టుకుంటే మాత్రం ఏం లేరా! చిన్నగున్న. తీసికెళ్ళి తినరా" అంది.

శీనూకి ఎక్కడలేని పౌరుషం తన్నుకొచ్చింది.

"నాకేం వద్దు. నేను పట్టుకున్న కొంగని ఏటివార ఇత్తానని ఇవ్వకుండా, నేను పట్టుకున్నానంటున్నాడుగా. ఇది కూడా ఆయన్నే తినమను. తిని బలవమను" అంతవరకూ అనేసరికి శీనూకి ఏడుపాగలా. దాన్ని తొక్కిపట్టుకుని ఇంటికొచ్చి పడ్డాడు. అమ్మెక్కడికో వెళ్ళింది. నాన్న కాకయ్యగారి అరుగుమీద కూచుని ఎవళ్ళతోనో మాట్లాడతన్నాడు.

శీనూ ఒక్కడూ పక్క లేని నులక మంచంమీద పడుకుని తనివిదీరా ఏడ్చాడు. మానవజాతి చెయ్యగల మహా అన్యాయాలు అన్నీ ఆ పసిమనసుకు మొదటిసారి పరిచయమయ్యాయి. అబద్ధం, దొంగతనం, మోసం, విశ్వరూపం దాల్చి ఆ పిల్లవాడి ముందు భీకర నృత్యం చేస్తుంటే తట్టుకోలేక వెక్కివెక్కి ఏడుస్తూ నిద్రపోయాడు శీను. జరిగిన దురన్యాయానికి సాక్ష్యంగా వాడి బుగ్గలమీద కన్నీటి చారికలు!



అమ్మ కతలు చెప్తోంటే ఒక్కోసారి శీనూకి కొన్ని సందేహాలొస్తుండేవి.

"ఎంత పాండవులు మంచివాళ్ళయినా కర్ణుడిని అట్టా సంపకుండా ఉంటే బాగుండేది కదమ్మా" శీను మనసు కర్ణుడి చావు ఘట్టం వినేసరికి ద్రవించి పోయింది.

"ఖర్మ నాయనా ఖర్మ!" అంది లక్ష్మమ్మ.

"ఖర్మంటే" అర్థంగాని పదాలంటే శీనూకి చికాకు.

"ఖర్మన్నా, పూర్వ జన్మలన్నా, పాపపుణ్యాలన్నా..... ఇవన్నీ నువ్వు ఇంకొంచెం పెద్దాడివైతే అర్థమవుతాయిలే" అంది శీను కుతూహలానికి ఓ వైపు ఆనందిస్తూనే.

"నాకిప్పుడు కూడా అర్థమవుతాయి, చెప్పు" అందరూ ఎన్నాళ్ళు తననింకా చిన్నపిల్లాడిలా చూస్తారో తెలియక శీనూకి రోషం తన్నుకొస్తుంటుంది.

"మనమిప్పుడు మనుషులుగా పుట్టాం గదా. ఇంతకుముందు ఎన్నోసార్లు ఎన్నోజీవులుగా పుట్టుంటాం" చెప్తోంది లక్ష్మమ్మ.

"జీవులుగానా? ఛా! అప్పుడు కూడా మనుషులుగానే పుట్టుంటాం. నువ్వు మా అమ్మవి. నేను నీ కొడుకుని. నాన్న అప్పుడు కూడా నాన్నే. అట్టాగే పుట్టుంటాం" శీనూ అమ్మని కరుచుకున్నాడు. ఏ జన్మలోనూ ఈ అమ్మానాన్నల్ని వదలడం వాడికిష్టంగా లేదు. క్రితం జన్మలో ఏ పురుగుల్లాగానో, జలగల్లాగానో పుట్టుంటాం అంటే నమ్మడానికి వాడసలు సిద్ధంగా లేడు.

"అన్నీ నీ ఇష్టమే" అంది లక్ష్మమ్మ నవ్వుతూ.

"ఆ! నా ఇష్టమే" పంతంగా అన్నాడు శీను.

"సరే. ఇను మరి. ఆ జన్మల్లో చేసిన పాపాలు అంటే చెడ్డ పనులు. పుణ్యాలు అంటే? "

"మంచి పనులు.. తెల్సులే, చెప్పు"

"లెక్కలేసి"

"ఎవరు? "

“ఇంకెవరు? చిత్రగుప్తుడు. ఆయన దగ్గర మన లెక్కలన్నీ ఉంటయ్. ఇట్టా ప్రెతి మాటకీ అడ్డు పడితే నేనేం చెప్ప లేను”

“సరే, చెప్పు”

“లెక్కలేసి బ్రెమ్మ దేవుడికి చెప్తే ఆయన సరే.. ఇట్టా పుట్టాలి.. చేసిన చెడ్డ పనులకి ఈ జన్మలో బాధలు పడాలి.. మంచి పను లకి ఈ సుఖాలు.. అని మన తలరాత రాసి పంపుతాడు. దాన్నే మనం ‘ఖర్మ ఫలం’ అంటాం. ‘ఖర్మ’ అంటాం. అర్థ మైందా? ” అంది లక్ష్మమ్మ.

“అర్థమైంది గాని, ఒకటి అర్థంగాలా? ”

“ఏంటి? ” కొడుకు గంభీరంగా చెప్పిన తీరుకి మురిసిపోయింది లక్ష్మమ్మ.

“ఏంటా.. అమ్మా! ఆ జన్మలో చేసిన పాపానికి ఈ జన్మలో బాధలు పెట్టడం ఎందుకు? అసలా లెక్కలు గట్టడం, ఎవరి లెక్కలు ఆళ్ళకి సరిగ్గా చూసి తలరాత రాయటం.. ఈ పనంతా ఆళ్ళకెందుకు? ఎప్పుడు తప్పు చేత్తే అప్పుడే శిచ్చేస్తే సరి పోద్దిగా. బళ్ళో పంతుళ్ళలాగా నాలుగు పీకొచ్చుగా. అప్పుడు తప్పు చేసినాళ్ళకి చెయ్యనాళ్ళకి కూడా.. ఇది తప్పు.. ఇట్టా చేత్తే బాధలు పడాలి అని తెల్సిపోతది. తప్పులు చెయ్యరు. దేముళ్ళకీ మాత్రం తెలవదా? ” అన్నాడు తన మెదడునంతా కష్టపెట్టుకుంటూ.

పక్కనే మంచంమీద పడుకుని వీళ్ళ మాటల్ని వింటున్న రంగయ్య పకపక నవ్వాడు.

“మా నాయనే. చెంపలేసుకో. పిచ్చిమా టలూ నువ్వూను. అన్నీ తండ్రి బుద్ధులే. ఎప్పుడేం చెయ్యాలో నీ కన్నా, నీ బాబు కన్నా బాగానే దేముళ్ళకు తెల్సుగానీ నాకు నిద్రొత్తందిక పొడుకో. నన్ను ఇసిగించ మాక” అంది ఆవలిస్తూ లక్ష్మమ్మ.

“ఆ.. పొడుకుంటా. ఇవాళ కత? చెప్ప వేంటి? ” శీను మారాంగా అన్నాడు.

“ఇంతసేపు వాగించి ఇంకేం కత. పొడుకో. లేకపోతే మాటా పలుకూ లేకుండా పిల్లిలాగా పొడుకున్న మీ నాన్న నడిగి చెప్పిచ్చుకో. నన్నొదులు. రేపు పెందలకాడే పొడుకుని మంచి కతలు చెప్పుకుందాం” అని అటు తిరిగి కళ్లు మూసుకుంది లక్ష్మమ్మ.

“సరే” అని అమ్మ పక్కలోంచి లేచి నాన్న మంచంమీద పడుకుని ఆయన మీదోకాలూ, చెయ్యీ వేసి

“నాన్నా! మంచి కత చెప్పు నాన్నా” అన్నాడు.

“చెప్తానుండు. మీ అమ్మలాగా నమ్మటా నికీల్లేని కతలు, మాయలూమంత్రాలు, దేముళ్ళు చేసిన మోసాలు కాదు. నిజం గానే మనూళ్ళోనే జరిగిన కత సెప్తా, ఇను” అని రంగయ్యగారనగానే కళ్ళింతింత చేసి “మనూళ్ళో జరిగిన కతా.. చెప్పు చెప్పు” అని ఉత్సాహపడ్డాడు శీను.

“పులిదొడ్డి పేరిన్నావా? ” అడిగాడు రంగయ్యగారు.

“ఆ! ఇన్నా”

“దానికా పేరెట్టా వచ్చిందనుకుం టన్నా? ”

“ఏమో.. నాకేం తెల్సు? ”

“చెప్తా ఇను” అన్నాడు రంగయ్య.

“అదంతా నాకెందుకు? నాకిప్పుడు కత కావాలి. అది సెప్పు” మారాంగా అన్నాడు శీను.

“కతే మరి. నిజంగా జరిగిన కత, ఇను. శాన్నాళ్ళ క్రితం.. మేమంతా ఎప్పుడూ కూచున్నట్టే కాకయ్యగారి అరుగుల మీద కూచుని మాట్టాడుకుంటున్నాం. ఇంతలోకే మన వడ్డీల కిట్టమూర్తి కాలవ గట్టంటే ‘పులి పులి’ అంటూ కేకలేసుకుంటూ మా దగ్గరికొచ్చాడు”

“పులా!” అన్నాడు శీను భయంగా కథ

లోకిగాక ఇంట్లోకే పులొచ్చినట్టు.

“ఆ! పులి, పులి అని కిట్టమూర్తి రాగానే కాకయ్యగారు - ఏంట్రా ఈసారి దసరాకి పులి ఏసం ఏత్తావా ఏంటి- అన్నాడు. కానీ కిట్టమూర్తి భయంతో గజగజలాడ్తన్నాడు. ‘కాకయ్యగారో కడియాల రత్తయ్యగోరి సేలోకి పులొచ్చింది’ అన్నాడు.

‘పులా! నువ్వు చూశావా? ’ అన్నాడు మీ ఈరభద్రం మావ.

‘ఆ.. సూశానండి. అది కడియాల రత్తయ్యగోర్ని, కొల్లూరి చెలమయ్యగోర్నీ సంపేసి, రత్తయ్యగోరి గొర్రెని నోట కర్సు కెల్లి తింటూంది’ అని చెప్పాడు కిట్టమూర్తి. ఇంకంతే. కాకయ్యగారి అరుగుల మీదా, వసారాలో, చావిట్లో ఉన్న జనమంతా వెంటనే లేచి పరుగులు తియ్యడం మొదలెట్టారు. ఒకటేగోల. పులంట.. పులొచ్చిందంట అని.

ఈళ్ళ అడాదుడీ చూసి ఇళ్ళల్లో ఉన్నాళ్ళూ, వాకిళ్ళల్లో ఉన్నాళ్ళూ ఒకటే గోల.

‘ఏంటంటే ఏంటని’, ‘పులంటా’ అని ఒకరంటే, ‘అమ్మో పులా? నా బిడ్డలెక్కడ తల్లో!’ అని ఒకామె, ‘ఏదొచ్చిందమ్మా ఊరికి’ అని ఇంకొకామె, ‘పులేంటి.. ఎన్నడూ ఎరగం’ అని ముక్కున ఏలేసుకున్నారు కొందరు.

‘ఏహే! పులయ్యుండదు. ఏ నక్కనో చూసి పులనుకుని ఉంటారు’ అని తీసిపారేశారు కొందరు.

రంగయ్యగారు చెప్పేతీరులో ఉన్న ఉత్సుకతకి శీను పూర్తిగా కథలో లీనమయ్యాడు.

“ఇక జూడయ్యా! ఊరు ఊరంతా బల్లాలు, బరిశెలు, కర్రలు, పలుగులు, గొడ్డళ్ళు.. చేతికేదందితే అది పుచ్చుగుని కాలవగట్టంట పరుగులు తియ్యటం మొదలెట్టారు. ఊళ్ళో ఉన్న జనమంతా కడియాల రత్తయ్యగారి పొలం గట్టున పోగయ్యాం.

కొందరు గబగబా రత్తయ్యగారూ, చెలమయ్యగారూ పడున్న చోటికి పరిగెత్తి వాళ్ళ పరిస్తితేంటని చూశారు.

వాళ్ళిద్దరూ రక్తమోడుతూ పడున్నారు. ఎళ్ళిన జనంలో పెద్దలు పై పంచెలూ తల గుడ్డలూ తడిపి ముందు వాళ్ళకి రక్తం పోకుండా అక్కడే ఉన్న ఆకుల పసరు పిండి కట్లు కట్టారు. ఇద్దరూ మన సోయిలోనే ఉన్నారు గానీ బయ్యంతో ఒణికి సస్తన్నారు.

‘ఏమైంది.. నిజంగా పులేనా? ’ అని రత్తయ్యగారినడిగాం. ఆయన చెప్పాడ్రా అసలు సంగతంతా. పులేనంట, ఈన ముందు పులనుకోకుండా ఏదో జంతువు గొర్రెనేసుకుపోతందని కర్రుచ్చుకుని ఎంట

బడి ఒక్కటేశాడంట. అది గిర్రున ఎనక్కి తిరిగి పంజా ఇసిరిందంట. రత్తయ్యగారి గూబ అదిరింది. ఆయనరిసిన అరుపుకి చెలమయ్య పరిగెత్తుకొచ్చి కర్రల్తోనే రెండు పీకాడంట. అదూరుకుంటుందా? చెల మయ్య మీదిక్కూడా పంజా ఇసిరింది. ఇంతలో రత్తయ్య పక్కనున్న గొడ్డలి తీసు కుని దానిమీద దెబ్బేశాడు. అది గొర్రెని లాక్కుని పారిపోయింది. అక్కడే సీమ తుమ్మ చెట్టవతల జమ్ముందిలే, అక్కడే కూచుని గొర్రెని తింటోంది. ఇకప్పుడు నేనేం జేశానూ? 'అరే! దెబ్బతిన్న పులిని ఒదిల్తే అది మళ్ళీ మనల్ని దెబ్బ తీస్తుం దిరా. దాన్ని ఒదలగూడదు. నాలుగు వైపుల్నించి చుట్టుముట్టి చంపాల్రా పదం డి' అన్నాను.

పులేమో పొదలో ఉంది. అందరికీ కన పడతానే ఉంది. మేం దాన్ని సూత్తన్నాం. అది మమ్మల్ని సూత్తాంది. ఇంకో ఏపు గొర్రెని చీల్చుక తింటూంది. దాని నోరంతా ఎర్రగా నెత్తురు! మొకం నిండా నెత్తురు కారతాంది. చూట్టానికే బయంక రంగా ఉంది. మేమంతా సుట్టూ సేరాంగా. మాగోలకి దానికీ బెదురుగానే ఉంది. ఐనా పులి గదా! బెదిరి ఊరుకుం టదా? ఒక్కుదుటన ఎగిరి.. ఎవరి మీదకి ఉరికిందనుకుంటన్నా? " అన్నాడు రంగయ్య ఒక్క ఊపున కథ చెప్పిన ఆయాసం తీర్చుకుంటూ.

కళ్లింతింత చేసుకుని కేవలం చెవులతోనే గాక, మొత్తం శరీరమంతటితో వింటున్న శీనూ "ఎవరి మీదకి? " అన్నాడు ఆ త్రుతగా.

"మీ తాతమీదికి"

"ఆ!" అన్నాడు భయంగా శీను.

"ఆ! మా నాన్నమీదికే వచ్చింది"

"అప్పుడేమయింది? తొందరగా చెప్పు" అరక్షణం ఆలస్యం కూడా భరించలేకపో తున్నాడు శీను.

"మీ తాత చేతిలో తళతళలాడే బరి సుంది. ఒకే ఒక్క పోటుతో బరిసె పులి పొట్టలోకి దిగబడిపోయింది. మీ తాత పక్కనే ఉన్న మీ ఈరబద్రం మావయ్య ఇంకో బరిసెతో 'పొడవండ్రా' అని ఒక పొలికేక పెట్టి పులి డొక్కలో పొడిశాడు. ఆయన పక్కనున్న మీ అచ్చయ్య బాబాయి గెడ్డపలుగుతో ఒకపోటు, నేను దాని తల మీద గొడ్డలితో ఒక దెబ్బ, ఊళ్ళో అందరూ తలో దెబ్బ!"

"ఆ!" అంటూ నోరు తెరిచి "తర్వాత? " అన్నాడు శీను.

"ఇంక తర్వాతేముంది? ముందే కడి యాల రత్తయ్య గొడ్డలిదెబ్బ తినుంది. తర్వాత మీ తాతదెబ్బ, ఊరోళ్ళగోల, దెబ్బ లమీద దెబ్బలు పడిపోయింది. పడిందని కూడా సూడకుండా అందరూ చచ్చేదాకా కొట్టారు. చచ్చిం తర్వాత కూడా కొట్టారు"

కళ్ళింతింత చేసి, "చివరికి సచ్చిపోయిం దిగా" అన్నాడు.

"ఆ! సావక. సచ్చినట్టు సచ్చింది"

"తర్వాతేమైంది నాన్నా? "

"ఏమవుతుందయ్యా. కడియాల రత్తయ్యనీ, చెలమయ్యనీ చేతుల మీదే మోసుకుని అట్నించటే కైకలూరు ఆస్పట ల్కి తీస్కెళ్ళాం. కైకలూరంతా తెలిసిపో యింది. పులపర్రాళ్ళు పులిని సంపారంట అని పోలీసులొచ్చారు. పులి పక్కన నిల బడి పుటోలు దిగారు"

"తర్వాత..? "

"తర్వాతా.. ఇకప్పట్నుంచీ ఆ పొలాల న్నిటికీ కలిపి పులిదొడ్డి అని పేరు. అదీ కత. బాగుందా? " అనడిగారు రంగయ్య గారు.

"చానా బాగుంది నాన్నా!"

"సరే, ఇక పొడుకుని నిద్దరపో"

"నాన్నా! రేపు కూడా ఇంకొక కత

చెప్తావా? ”

“చెప్తాలే. పొడుకో. పొడుకో” అప్పటికే రంగయ్యగారికి నిద్రాదేవి మీదకి వచ్చేస్తోంది.

శీనూ మళ్ళీ మొదట్నుంచీ పులిదొడ్డి కథనీ, తాత, నాన్న, మావయ్యలూ, బాబాయిలూ, ఇంకా ఊళ్ళో వాళ్ళూ, వాళ్ళందరి ధైర్యాలూ గుర్తు తెచ్చుకుంటూ అమ్మా నాన్నలు నిద్రపోయిన చాలా సేపటికి గాని నిద్రపోలా.

★ ★ ★

మోతేవారి లంకలో మేతకి కొదవలేదు. అల్లి, గవర, గరిక, తుంగ, తూడులాంటి పచ్చమేత పుష్కలంగా ఉండటంతో ఒకసారి లంకలో పడ్డ గొడ్లు తిన్నంతసేపూ తినడం, అలిసిపోయినపుడు నిలబడి నెమ్మదిగా నెమరేసుకోడం, మరీ విసుగనిపిస్తే, ఒకదాన్తో ఒకటి సరసమో, విరసమో తరుముకోటం, మళ్ళీ మెయ్యడం, నెమ్మదిగా పెద్దగుణ్ణం వేపు వెళ్ళి దిగి తాగినంత నీరు తాగి, నీళ్ళతో ఆడినంత సేపు ఆడి, మళ్ళీ లేచి లంకలోకొచ్చి చివరి పట్టు పట్టడం. దీనిలో గొడ్లని తోలుకొచ్చిన పిల్లలకి పని పెద్దగా ఉండేది కాదు. గేదెలు ఒకదాన్నొకటి పొడుచుకుంటుంటే, వాటి మధ్యకి పరిగెత్తి, చెరి నాలుగూ కర్రతో తగిలించి, వాటిని వేరుచేసి దూరంగా తరమడం, అవి ఎటెటు వెళ్తున్నాయో గమనిస్తుండడం మినహా.

వీళ్ళకున్న పెద్దపని కలేకాయల్నీ, అల్లికాయల్నీ, చీమిడికాయల్నీ కోసుకు తినడం. కలేకాయలు తిని నీళ్ళు తాగి నోటితో గాలిని పీలిస్తే వచ్చే మజాననుభవించడం. ఒకర్నొకరు ఏడిపించుకుంటూ, నవ్వుకుంటూ, పోట్లాడుకుంటూ, రాజీలు పడుతూ, కబుర్లు చెప్పుకుంటూ రాత్రి అమ్మ దగ్గరో, నానమ్మ దగ్గరో విన్న కథని తోటి పిల్లల్తో పంచుకుంటూ తిరగడం.. ఇదే పని. పిల్లలకున్న ముఖ్యమైన కష్టం రోజంతా మోకాల్లోతు నీళ్ళల్లో నిలబడి ఉండడమే., కూర్చోటానికుండదు. మరీ నిలబడలేనప్పుడు గేదెమీదెక్కి కూచోడం.

శీనూ, వాడి తోటివాళ్ళే అయిన ఇద్దరు ఆడపిల్లలూ, తిన్నంతసేపూ అవీ ఇవీ తిని గేదెల మీదెక్కి కూచునేవారు. ఆ గేదెలు కూడా వీళ్ళని మొయ్యడం మేతలో భాగంగానే అనుకునేవి. అందుకే వీళ్ళని మొయ్యాలా అనే సందేహం వాటికొచ్చేదే కాదు.

కిష్టుడు, ఎంకన్న, పువ్వుల నాగేశ్వర్రావు, అంబటి రామ్మూర్తి, కుడితిపూడి పరబ్రమ్మం, దాసూ ఒకచోట చేరి తీవ్రంగా ఏదో మాట్లాడుకోవటం చూసి, శీనూ వాళ్ళ దగ్గరకెళ్ళాడు.

“సూద్దాంలేరా... లేడికి లేచిందే పరుగని.. ఇప్పుడేగా అనుకున్నాం. ఎల్దాంలే.. ఇంకా శాన్నాళ్ళుందిగా సంకురాత్తిరి” అన్నాడు పరబ్రెమ్మం.

“శానాళ్ళెక్కడుంది? తిప్పి తిప్పి కొడితే నెలకూడా లేదు. ఇప్పట్నుంచీ అనుకోకపోతే అవుతుందేంది? ” అన్నాడు కిష్టుడు.

“ఆ మాటా నిజమే. అసలెవరెవరు మన్తో వత్తారో సూడాలా! బోగిరోజా, పండగరోజా, కనుంరోజా.. ఎప్పుడెల్లాలో తేల్చుకోవాలా. అబ్బో! ఇయ్యన్నీ ఒక్క రోజులో అయ్యే పన్లేనా? ” అన్నాడు ఎంకన్న.

“ఎక్కడికెల్తన్నారు బావయ్యా? ” అడిగాడు శీను అప్పటి వరకూ వింటూ నిలబడ్డవాడు ఇక కుతూహలాన్ని అణచలేక.

“అడుగో ఈడొచ్చాడు. పెద్దాళ్ళం మేం సవాలక్ష మాట్లాడుకుంటాం. పిల్లనా కొడుకువి నీకెందుకురా? ” అంబటి రామ్మూర్తి శీనూని తీసిపారేశాడు.

“ఆడినేం అనమాకరా. ఆడు నా ముద్దుల మరిది” నోరారా నవ్వుతూ శీనూ

వంక చూస్తూ అన్నాడు కిష్టుడు.

"ఆడ్ని నేనేమన్నానెహే? పెద్దాళ్ళం.."

"ఆ.. పెద్దాళ్ళం! పెద్దాళ్ళమయ్యి మనం ఏం పీకుతున్నాం? మనం పీకేదేంటి ఆడు పీకనిదేంటి? " అన్నాడు ఎంకన్న నవ్వు తూనే.

"సర్లే.. సర్లే. అరేయ్ బామ్మర్దీ! మేం రేపొచ్చే సంకురాత్తిరి పండక్కి ఏలూరెళ్ళి సినిమాలు చూస్తాం. అందుకని ఎప్పుడె ళ్ళాలని మాట్లాడుకుంటన్నాంగాని- అదుగో నా కొమ్ముల గేదె అటు పోతాంది, దాన్ని మల్లేసుకురా" అన్నాడు కిష్టుడు.

శీను కొమ్ముల గేదున్నవైపు నీళ్ళను తప తప తొక్కుకుంటూ పరుగులు తీశాడు. అది చూస్తూ "ఈడికెవరన్నా ఏవన్నా పని చెప్పాలేగాని వెంటనే ఆ పని చేసిగాని మరోమాట మాట్లాడడు. ఈడు భలేవా డులే" అన్నాడు కిష్టుడు.

"ఆ మాట నిజమే" అని నవ్వుతూ ఒప్పు కున్నాడెంకన్న.

కొమ్ముల గేదెను మల్లేసి మిగతా గేదెల్తో కలిపిన శీనూని చూసి గేదెమీదెక్కి కూచున్న లక్ష్మి "ఆళ్ళేంట్రా మాట్లాడుకుం టున్నారు? " అంది.

"ఆళ్ళంతా రేపు సంకురాత్తిరి పండక్కి ఏలూరెళ్ళి సినిమాలు చూత్తారంట" అన్నాడు శీను.

"ఆళ్ళు పెద్దాళ్లు. ఆళ్ళేమైనా చేత్తారు. మనకెందుకు గానీ, రే! రొండు మంచి కలే కాయలు తెచ్చిపెట్టరా" అంది లక్ష్మి.

శీను కలవచేలల్లోకి పరిగెత్తి ఆరు పెద్ద పెద్ద కలేకాయలు కోసుకొచ్చాడు. నలుపూ, ఎరుపూ కలిసిన రంగులో గుండ్రంగా ఉన్న ఆ కలేకాయలని చూసి "నాక్కూడా తెచ్చావేంట్రా? " అంది రెండో గేదెమీదున్న బేబి.

"ఆ! నాకు తెలుసు.. ఇయ్యి చూడగానే నువ్వడుగుతావని" అంటూ ఇద్దరికీ చెరో రెండు కలేకాయలిస్తూ తనో రెండుంచుకు న్నాడు. ముగ్గురూ కలేకాయల పైతోలు సుతారంగా ఒలుస్తూ, లోనున్న కలే గింజల్ని కండతో సహా తింటున్నారు. తన వద్ద, బేబి వద్ద ఉన్న కాయల్నీ, శీను వద్ద ఉన్న కాయల్నీ చూస్తూ "ఈడు చూశా వటే.. మనకి పెద్దపెద్దవిచ్చి, ఆడు సిన్నయ్యి ఉంచుకున్నాడు" అంది లక్ష్మి.

బేబి కూడా చూసి "ఎట్టయినా మా తమ్ముడు శానా మంచాడే" అంది బేబి.

తలుపుతూ కాయను తింటంలో పడింది లక్ష్మి.

ఎటు చూసినా నీళ్లే. దూరంగా లంక గ్రామాలు. నీళ్ళల్లో చేపలు, పీతలు, నత్తలు, పాములు, జలగలు.. ఒకటేమిటి సమస్త జలచరాలు. నీటిపైన గాలికి ఊగుతూ పచ్చని గడ్డి జాతులు. వాటిని తింటూ పశువులు, పక్షులూ, కీటకాలూ. ప్రకృతిలో ఉన్న అన్ని జీవులూ ప్రకృతిమీదే ఆధారపడి, ప్రకృతిలో లీనమ వుతూ ఏదో ఒక మహాద్భుత సత్యాన్ని ఆవిష్కరిస్తున్నది కొల్లేరు. అక్కడ తృప్తిగా మేస్తున్న పశువుల మందలతో ఉన్న పశువుల కాపరులు కూడా ఏదో ఒకటి తింటూ, పశువులూ, పక్షులూ తాగే నీళ్ళే తాగుతూ సమిష్టి జీవనం సాగిస్తున్నారు.

"ఉసే లక్ష్మీ! ఆళ్ళు మనల్ని సినిమాకి తీసికెళ్లరంటావా? " అన్నాడు శీను.

"ఆహ్వా.. ఆళ్ళు తీసికెళ్తే మాత్రం మనం ఎల్తామా? " ఆశ్చర్యపోయింది లక్ష్మి.

"ఏం.. ఎందుకెళ్ళం? "

"ఎందుకా? ఏలూరంటే ఏంటది? మనూరులాగా ఉంటందనుకున్నావా? దాన్నిండా రిక్షాలు, సిన్నకార్లు, పెద్దకార్లు, లారీలు, రైళ్ళు, బోలెడంతమంది జనం. పెద్ద పెద్ద కొట్లు. ఆటిల్లో కళ్ళు మిరు మిట్లు గొలిపే కరెంటు దీపాలు. అమ్మో తల్చుకుంటేనే బయమేత్తంది. మనం అక్క డికెళ్తే ఇకంతే. మళ్ళీ తిరిగి రాలేం. ఏంట నుకుంటున్నావో" ఊహామాత్రానికే లక్ష్మికి

భయంతో చమటలు పట్టాయి.

"అయ్యన్నీ ఉంటే మనకేంటి? అసల య్యన్నీ చూట్టానికైనా ఎళ్లొచ్చుగా" అన్నాడు శీను.

వీడికి ఈ మాత్రం అర్థం కాదేంటన్నట్టు వాడిని చూసి "తప్పిపోతాంరా నాయనా!" అంది.

శీనూ నవ్వి "ఏం తప్పిపోం. ఏలూరు నేనెళ్ళలేదనుకుంటున్నావా? " అన్నాడు.

"ఎల్లావా? ఎప్పుడూ? "

"దసరా పండక్కి మా నాన్నతో"

"ఎట్టా ఎల్లారు? ఎవరెవరెల్లారు? " లక్ష్మికి నమ్మబుద్ధి కావటంలేదు.

"ఊర్నించి మా ఎంకయ్య తాతొస్తే- మా నాన్నా, ఎంకయ్య తాతా, నేనూ ఏలూరెళ్ళి సినిమా చూసొచ్చాం"

"నిజంగానా? ఏం సినిమా? " ఆశ్చర్యంగా అంది లక్ష్మి.

"నిజ్జంగానే పాతాళభైరవికెళ్ళాం"

పాతాళభైరవి సినిమాని తల్చుకోగానే వాడి మనసు ఏదో మాయాలోకంలో విహరించటం మొదలుపెట్టింది.

"ఆ సినిమా మీ నాన్నా, ఎంకయ్య తాతా చూసుంటారు. నువ్వు సినిమా మొదలెట్టగానే నిద్రోయి ఉంటావు గదా? " అంది లక్ష్మి.

"ఏం కాదు. సినిమా అంతా చూశా. కావాలంటే దాంట్లో వాళ్ళు ఏం మాట్లా డారో? ఏం పాటలు పాడారో.. అన్నీ చెప్తా, తెల్సా. మరే, దాన్లో తోటరాముడు ఎంత బాగుంటాడనీ. రాజకుమారంటే ఇష్టం. పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఇంకోడున్నాడు.. వాడ్ని చూత్తే పెద్దాళ్ళు కూడా జడుసుకుసత్తారు. అన్ని మాయలూ చేత్తాడు. రాజకుమారిని ఎత్తుకుపోతాడు. తోటరాముడొచ్చి ఇడిపి త్తాడ్లే. ఒసే.. ఇంకోడున్నాడే.. అంజిగాడు! వాడ్ని సూస్తే పొట్ట పగులుద్ది. నవ్వే నవ్వు. రాజుగారి బామ్మర్దొకడు. ఆడు పాట పాడతాంటే పామొస్తది. అప్పుడు సూడాలి ఆడి అరుపులు, ఒణికి సచ్చిపో తాడే. పాటలెంత కమ్మగా ఉన్నాయని, నాకో పాట కూడా వచ్చు" అంటూ, ఏడేళ్ళ శీను 'ఎంత ఘాటు ప్రేమయో.. ఇంత లేత వయసులో..' అని పాటంతా పాడేస రికి ఆ ఆడపిల్లలిద్దరూ నోళ్ళు తెరిశారు. మొత్తంమీద ఈడసాధ్యుడేనన్నట్లు ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

"ఐతే అంతదూరం నువ్వు నడిశావేరా? " బేబీకింకా అనుమానమే.

"నేనెక్కడ నడిశాను. మా నాన్న మెడల మీదెక్కి కూచున్నా. హాలు కాడ దిగా"

"ఆ!"

"ఆ! ఇంటి దగ్గరే నన్ను తీసికెళ్ళకుండా ఎల్తానంటే ఏడిశా. మా నాన్నేమో తీసి కెళ్తానని, మా అమ్మేమో ఒద్దు తప్పిపోతా డని. నేను సిన్నప్పుడు పెద్దింటమ్మ తిరనా ళ్ళలో తప్పిపోయినంటలే"

"ఆ.. తప్పిపోయావా? " లక్ష్మికివాళ శీనుగాడి గురించి ఎన్నో కొత్త విషయాలు తెలుస్తున్నాయి.

"ఔను. తప్పిపోయాను" గర్వంగా అన్నాడు శీను.

"మళ్ళీ దొరికావా? " భయంగా అడి గింది లక్ష్మి.

బేబి పక పకా నవ్వి "భలే అడిగావే.. దొరకకపోతే మరి ఈడెవడూ? " అంది.

ముగ్గురూ పగలబడి నవ్వారు. వాళ్ళ ముగ్గుర్నీ ఎక్కించుకున్న గేదెలు మూడూ మెయ్యటం ఆపి, ఓ నిమిషం ఆగి... తల లూపి పిల్లలు నవ్వుకోనీ అని ఒకదాన్నొ కటి చూసుకుని మళ్ళీ మెయ్యటంలో మునిగాయి.

నవ్వీ నవ్వీ "ఆ తరవాతేమైంది? " అన డిగింది లక్ష్మి.

"మా నాన్నేమో -అయ్యని నేనెందుకొద్దు

ల్తానే పిచ్చిమొహమా.. నా మెళ్ళమీదెక్కిం చుకుని తీసికెళ్ళి జాగర్తగా తీసుకురానూ? - అని చెప్పాడు. మా ఎంకయ్య తాత కూడా 'రానివ్వమ్మా.. నేను కూడా చూత్తాగా' అన్నాడు. మా అమ్మేమో 'ఏమో బాబూ.. మళ్ళీ మీరొచ్చేదాకా నా దడ తగ్గదు' అన్నది. నాతోనేమో 'నాన్నెక్కడన్నా దింపు దామని చూసినా ఆయన గుండు మీద పిలక పట్టుకుని ఒదలమాక' అంది. నేనూ సరే అన్నా. అప్పుడు మా నాన్న మెళ్ళ మీద కూచుని అటో కాలూ, ఇటో కాలూ ఏసుకుని మా నాన్న తలను గట్టిగా పట్టు కున్నా. చినెడ్లగాడిలో దిగినా, పెదెడ్ల గాడిలో దిగినా మా నాన్న నన్నసలు కిందకి దించలా. సినిమా హాలు దగ్గర మేమున్నపుడే పెద్ద ఏనుగొచ్చింది"

"సినిమాలోనా? "

"కాదు. నిజంగా ఏనుగే. మేం టిక్కెట్లు కొనుక్కుని హాలు బైటే అరుగు మీద కూచుని మా అమ్మ కట్టిచ్చిన అన్నం మూట ఇప్పి అన్నం తింటున్నాం. అప్పుడే అటేపు ఓ పెద్ద ఏనుగుని నడిపించుకుని ఒకడొచ్చాడు. నాకు భయంవేసి మా నాన్న ఎనక్కెళ్ళా. మా నాన్న నన్ను పట్టు కుని బయ్యం లేదులేయ్యా. ఇదే ఏనుగంటే సూడమన్నాడు. అది కొండంతుంది. దాని సెవులున్నయ్ మనింటో సేటకేమూలకీ సాలవు"

"ఏలూరేవన్నా అడివా? ఏను గెందుకుంటుందక్కడ? " లక్ష్మి శీను మాటలు నమ్మటానికి నిరాకరించింది.

"అవతల బజార్లో పెద్ద గుడుందంట. తిరణాల కోసం ఏనుగుని తెచ్చారంట" చాలా సేపు ముగ్గురూ వాళ్ళ వాళ్ళ ఊహా లోకాల్లో ఏనుగుతో విహరించారు.

ఉన్నట్టుండి లక్ష్మి అంది. "అరే! అర్థమైందా? నువ్వు ఏలూరెళ్ళావ్. సినిమా చూశావ్. మీ నాన్న మెళ్ళ మీంచి దిగలా. మరి రేపేళ్ళతో ఎళ్తే ఎవరి మె ళ్ళెక్కుతా బాబూ? " అంది

"ఉప్పుడ్నిన్ను మెళ్ళ మీదెక్కించుకుంటే వాళ్ళ మెళ్ళిరిగిపోవాల్సిందే" నవ్వింది బేబి.

"ఇప్పుడు నేను పెద్దాడ్నయ్యాను గదా! నేనే నడవగల్ను"

"నడుత్తావేమోగానీ ఆ జనంలో తప్ప న్నాపోతావ్, లేకపోతే ఏ కారు కిందన్నా పడతావ్" అంది లక్ష్మి

"ఎందుకు పడతాను? నాకు కళ్ళు లేవా? " ఉక్రోషపడ్డాడు శీను.

"నీకున్నాయి గానీ ఆ కార్లకుండవు" అని లక్ష్మీ, బేబీ నవ్వుతుంటే కొల్లేట్లో పడమటికి దిగుతున్న సూర్యుడి ముఖంలా శీను ముఖం కూడా ఎర్రబడింది. సూర్యుడు తన ముఖాన్ని మబ్బుల్లో దాచుకున్నట్లే శీనూ గేదెల గుంపులో కలిసి ఇంటిదారి పట్టాడు.

★ ★ ★

అటు గిత్తలూ కాదు. ఇటు దూడలూ కాదు. అలాంటి మగపిల్లలు ఏడుగురు. వాళ్ళతో పాటు నిఖార్సయిన ఒక దూడ శీను. పెదెడ్లగాడి దగ్గర ఆగారు. కైక లూరు నుంచి ఏలూరు వెళ్ళే రోడ్డులో పెదె డ్లగాడికి అప్పటికింకా వంతెన లేదు. ఎప్పు డైనా ఒక పడవ ఉంటుంది - అటూ ఇటూ జనాన్ని దింపటానికి. కానీ ఎప్పుడూ ఉండదు. ఇప్పుడూ లేదు. అందుకని ఇక పిల్లలు చొక్కాలు, లాగులూ విప్పి వెంటతెచ్చుకున్న సంచుల్తో పాటు, అన్నీ ఎవరివి వారు తలమీద పెట్టుకు న్నారు. శీనూ సంచీ, బట్టలూ కూడా ఎంకన్న పట్టుకుంటే శీనూ కిట్టుడి చెయ్యి పట్టుకుని నడిచాడు. కాళ్ళతో తడుం కుంటూ, తడుంకుంటూ అవతల గట్టుకు చేరారు. శీనూ గుండెల దాకా వచ్చిన కొల్లేరు మిగిలిన వాళ్ళని నడుముల దాకా

తడిపింది. ఎవరి బట్టలు వాళ్ళేసుకున్నారు. ఎవరి సంచులు వాళ్ళు పట్టుకున్నారు. మళ్ళీ హుషారుగా నడక ప్రారంభించారు.

"వద్దురా అంటే ఇనకుండా ఎంటబడ్డావు. దూలతీరిందా? " అన్నాడు దాసు శీనుని.

"ఉప్పుడేమైంది? నాకేం బాధ లేదు" మొహం ఎర్రగా చేసుకున్నాడు శీను.

"ఓరి దాసుగా! ఊరుకోరా! మా అత్తకీ, పెద్ద మామయ్యకీ వాడ్ని జాగ్రత్తగా తీసి కెళ్ళి తీసుకొత్తానని మాటిత్తేనే పంపారు. లేకపోతే వాళ్ళు 'ససేమిరా' అంటారు. ఈడేమో జలగలా నన్ను పట్టుకుంటాడు 'బావయ్య బావయ్య' అంటూ" అన్నాడు కిట్టుడు.

"ఆడు బావయ్యా అని ఎంటబడ్డాడు. ఈడు బామ్మర్దీ అని ఎంటతెచ్చాడు" అని నవ్వాడు దాసు.

"ఆళ్ళిద్దరూ బాగానే ఉన్నారు. మజ్జలో నీకేంటంట మంట? " ఎంకన్నకు దాసు వెటకారం నచ్చలేదు.

"ఆడికి మంట కాదుగానీ ఒక తంటా ఉందిలే. దాసుగాడి తమ్ముడు ఈడీడాడే. కానీ మా తగని అల్లరిగాడు. ఈడ్ని తీసికెళ్తే ఆడ్నెందుకు తీసికెళ్ళలేదని ఏడుత్తాడు. అంతే గదరా దాసుగా? " అన్నాడు రామ్మూర్తి.

"అమ్మో ఆడెంతేడిత్తే మాత్రం ఆడ్ని తీసకరాకేం! ఆడ్ని మనం ఏడుగురం కలిసినా బరాయించలేం" అన్నాడు దాసు, తీసుకురాని తమ్ముడ్ని తీసుకొస్తే వాడు పెట్టే తిప్పల్ని తల్చుకుని హడలిపోతూ.

"ఆ మాటా నిజమే. ఆడ్ని ఒక పుట్టలో పెడితే పది పుట్టల్లోంచి బైటికొత్తాడు"

అందరూ నవ్వుతుండగా "రేయ్ ఇట్టా మనం పెళ్ళినడకలు నడిత్తే లాబంలేదు. కూసేపు లగెత్తుదాం" అంటూ పరుగందుకున్నాడు పరబ్రెమ్మం.

"లగెత్తండ్రా" అన్నాడు ఎంకన్న.

అంతే! అందరూ తూనీగల్లా ఒకరికందకుండా ఒకరు పరుగు లంకించుకున్నారు.

ఈ లంకల్లో పిల్లలకి సినిమా పెద్ద విలాసం కిందకే వస్తుంది. సంవత్సరానికొక్కసారి.. అదీ కొన్ని ఇళ్ళల్లోని పిల్లలకే ఏలూరెళ్ళి సినిమా చూసిరావటానికి అనుమతి దొరుకుతుంది. అదీ సంక్రాంతి రోజుల్లో. ఇక ఈ సినిమాకి బైల్దేరడానికి మూడు నెల్లు ముందు నుంచీ సినిమాకెళ్ళాలనుకునే పిల్లలకి అదే రంధి. ఎవరెవరెళ్ళాలి? ఏమేం తీసికెళ్ళాలి? ఎప్పుడు బైల్దేరాలి?

"రే! డబ్బులన్నీ నాగేశ్వర్రావు దగ్గర దాచుకోవాలిరా. ఆడైతే కానీ కూడా పారెయ్యకుండా జాగర్తగా దాస్తాడు"

"అవును. ఆడే రైటు"

"మూడు సినిమాలకీ మూడు పావలాలు. ఒకోసారి నాలుగు కూడా చూడొచ్చు కాబట్టి సినిమాలకి రూపాయి పక్కనబెట్టాల్రా. ఇక సోడాకి ఒక అణా.. ఇంకేమన్నా కొనుక్కోవాలనిపిస్తే.."

"అక్కడ జిలేబీలుంటాయా" తొందర తొందరగా అన్నాడు శీను. అందరూ ఆడెంక చూసి "అదేమరి.. ఈడికి జిలేబీల పిచ్చి. ఏదోటి కొనుక్కోవాలన్పిస్తుందిలే.. దానికో అణా ఏసుకుందాం. మొత్తం ఎంత యిందిరా? " అన్నాడు కిష్టుడు.

"రూపాయి బేడా" అన్నాడు నాగేశ్వ్రావు.

"సరే రూపాయి పావలా ఏసుకోండ్రా. అంటే అయిదు పావలాలు సంపాదించి నాగేశ్వర్రావుకి సంకురాత్తిరి పండగ పదిరోజులుందనగానే యిచ్చెయ్యాలి. అట్టా ఇచ్చినాడే మనతో వత్తాడు. ఇవ్వనాడు రాడు"

ఇలా మూడునెలల ముందు నుంచీ ప్రయత్నాలు మొదలవుతాయి. ఏలూరెళ్ళి



సినిమాలు చూసొచ్చిన వాళ్ళంటే ఆ ఊరి 'పిల్లల ప్రపంచం'లో పెద్ద గొప్ప. వెళ్ళొచ్చిన వాళ్ళు రానివాళ్ళకి ఊరించి ఊరించి మిగిలిన తొమ్మిది నెల్లూ ఆ సినిమాల కబుర్లే చెప్పేవారు. వీళ్ళల్లో వీళ్ళు కూడా ఆ ముచ్చట్లు చెప్పుకుని మురిసిపోతుండే వాళ్ళు.

డబ్బుల్దగ్గరకొచ్చేసరికి ఎవరికైనా ఓ పావలా తక్కువైనా, సరే రమ్మనేవారు. అయితే వాళ్ళు ఆ పావలా మళ్ళీ సంక్రాంతిలోపు అప్పు తీర్చేయాల్సిందే మరి.

ఏలూరు ఇంకా రెండు మైళ్ళుందనగా ఒక పెద్ద చెరువొస్తుంది. ఆ చెరువు గట్టున ఓ చెట్టునీడన అంతా కాళ్ళూ చేతులూ కడుక్కుని కూచుని వాళ్ళ మూటలూ, సంచులూ విప్పదీసేవాళ్ళు. తామరాకుల్లో పెట్టుకుని కట్టుకున్న అన్నమూ ఆవకాయ కలిపిన పొట్లాం ఒకటైతే, రెండో పొట్లంలో పెరుగన్నం కలిపి తెచ్చుకుంటారు. దాదాపు అందరికీ అవే- శుభ్రంగా తామరాకులు నాకేసి, చెర్లో నీళ్ళు తాగేసి సంచుల్లో ఉన్న మిగిలిన బూరెలూ, అరిసెలు, తపాళాచెక్కలూ పట్టుకుని రెండున్నరా, మూడయ్యేసరికి ఏలూరులో ఉన్న సినిమాహాళ్ళ దగ్గర చేరే వాళ్ళు. టిక్కెట్లు సంపాదించాకే సోడా గానీ, కిళ్ళీగానీ.. ఒకోసారి ఆటకీ ఆటకీ మధ్య. దానిక్కూడా కిళ్ళీ ఎక్కడ కొనుక్కోవాలో, జిలేబీ ఎక్కడ బాగుంటుందో, సోడాలో ఎక్కడైతే ఎక్కువ పవరుంటుందో పరబ్రెమ్మానికే తెలుసు. అందరికీ పరబ్రెమ్మం మీదే గురి. ఏయే సినిమాలకె



ళ్ళాలో కిష్టుడికి బాగా తెలుసు. ఆ రోజు వీళ్ళదృష్టం బాగుంది. మూడు గంటలాట చూసి, ఏడు గంటలాట చూసి, పదింటి క్కూడా చూశాక తెల్సింది.. పండగవటం మూలంగా 'అర్ధరాత్రి' ఒంటిగంటక్కూడా ఇంకో ఆటుంది. 'మనదృష్టం రా' అనుకుని మొత్తం నాలుగు సినిమాలూ చూసేసి, తెల్లార్తూ ఉండగా ఏలూరు నుంచి బైటప డ్డారు. అన్ని ఆటల్లోనూ మధ్య మధ్య సంచుల్లో తెచ్చుకున్నవి తీసుకుని తింటూ, మిగిలినవాళ్ళకి పంచుకుంటూ కళ్ళింతింత చేసి నాగేశ్వర్రావుని, రామారావుని, కాంతా రావుని, జగ్గయ్యనీ, సావిత్రినీ, జమున్నీ, అంజలీదేవినీ చూసి, రేలంగినీ రమణారె డ్డినీ చూసి పొట్టపగిలేలా నవ్వి, సూర్యకాం తాన్ని, రాజనాలనీ చూసి భయపడి, రంగారావుని, గుమ్మడ్ని చూసి ధైర్యం తెచ్చుకుని సంవత్సరానికి సరిపడా మనసు నిండా ఆ సినిమాల సారాన్నంతా నింపు కుని ఏలూరు నుంచి బైటికొచ్చారు. ఇదివ రకు నాన్న మెడల మీద నుంచి ఎలాగైతే దిగలేదో అలాగే ఈసారి కిష్టుడి చెయ్యి పట్టుకుని వదలకుండా శీనూ ఏలూరు నుంచి బైటపడ్డాడు. అందరూ చూసిన సినిమాల్లోని సంఘటనల్ని చెప్పుకుంటూ, రేలంగిని అనుకరిస్తూ సూర్యకాంతాన్ని తిట్టుకుంటూ, 'ఎన్టీవోడి' ధైర్యాన్ని మెచ్చు కుంటూ, 'ఈరో, ఈరోయిన్లు' పాడుకున్న పాటల్ని పాడుకుంటూ హుషారుగా ఇళ్ళకు చేరి ఇంత తిని పడుకుంటే ఇకంతే - ఆ పగలూ, ఆ రాత్రీ నిద్రే నిద్ర!

★ ★ ★

"ఈసారి మనకి తమ్ముడు పుడతాడో, చెల్లెలు పుడతందో తెల్సుకుందామేరా? " అంది చిన్నక్క పొట్టోడితో.

శీనూ పొట్టోడు వడ్ల బస్తామీద నుంచి ఒకరి తర్వాతొకరు కిందికి దూకేవాళ్ళల్లా చిన్నక్క మాటలకి ఆగి "ఎట్టా తెల్సు కుంటాం? " అన్నారు ఒకేసారి.

"పుడితేనేగా తెలిసేది" అన్నాడు శీను.

"తెల్సుకోవచ్చు. కానీ ఒక పేను కావాలి" అంది తల గోక్కుంటూ చిన్నక్క.

నలుగురాడపిల్లల తర్వాత లింగులిటుకు మంటూ పొట్టోడొక్కడే మగ నలుసు. రాముడమ్మకీసారి మగపిల్లడే పుట్టాలని ఇంటిల్లిపాదీ కలలు కంటున్నారు.

"పేనా? నా తల్లో బోలెడున్నాయ్" అన్నాడు సంతోషంగా పొట్టోడు.

"నువ్వు పెద్దక్క దగ్గర పొడుకుంటా వుగా. పెద్దక్క తలంతా పేలతో పుచ్చిపో యింది" అంది చిన్నక్క. అంటూనే పొ ట్టోడి తలను తన చేతుల్లోకి తీసుకుని పేనుకోసం వెతకటం మొదలెట్టిందో లేదో ఒక 'దున్నపోతు'లాంటి పేను దొరక డంతో "ఉరే శీనూ! దొడ్లోకి లగెత్తుకెళ్ళి, గూట్లో ముగ్గుడబ్బా ఉంది.. తీసుకురా" అంది. శీనూ ముగ్గుడబ్బా తెచ్చాడు. ముగ్గురూ వడ్ల బస్తాల పక్కన కూచు న్నారు. చిన్నక్క ఓ గుప్పెడు ముగ్గు తీసు కుని పొట్టోడి చేతిలో ఉన్న పేనుని తీసి గచ్చుమీద ఉంచి దానిమీద గుట్టలాగా ముగ్గూ పోసేసింది.

"పేనూ.. పేనూ.. సెప్పవే.. మాకు తమ్ముడా, చెల్లెలా? " అంది.

పొట్టోడు ఆశ్చర్యంగా చిన్నక్కకేసి చూసి "పేనెట్టా సెప్పుద్దే.. దానికేమన్నా మాట లొచ్చా? " అన్నాడు.

శీను చిన్నక్కేం చెబుతుందాని చూస్తు న్నాడు.

"సూడండ్రా.. పేను ముగ్గుట్ట పైనుం చొస్తే తమ్ముడు. నేలమీద నుంచొత్తే సెల్లెలు" అని పొట్టోడి వంకచూసింది.

మళ్లీ "నువ్వు పుట్టక ముందు కూడా పెద్దక్కా, నేనూ ఇట్టాగే చూశాం తెల్సా? " అంది.

పొట్టోడు ఉత్సాహంగా "అప్పుడు పేనె టుగుండా వచ్చింది? " అనడిగాడు.

"ఎటొత్తది? పైనుంచి వచ్చుంటుంది" అన్నాడు శీనూ ఆ మాత్రం తెలవదా అన్నట్టు.

"అవును.. పైనుంచే వచ్చింది. అందుకే నువ్వు పుట్టావు" అంది చిన్నక్క, కళ్ళిం తింత చేసి శీను పొట్టోడివంక చూస్తూ.

"ఆ పేను గనక కిందనుంచి వత్తే నేనా డుకోటానికి పొట్టోడుండేవాడు కాదు. పొ ట్టిదుండేది" అన్నాడు.

"పేను పైనుంచొచ్చి బతికించిందిరా బాబూ" అన్నాడు పొట్టోడు. తనని మగా డిగా పుట్టించిన పేను మీద వాడికి ప్రేమొ చ్చింది. ఆ పేను గనక బుద్ధి మార్చుకుని కిందనుంచొస్తే తన గతేమయ్యేదోనని వాడి గుండె గుబగుబలాడింది.

"ఉస్.. గోలసెయ్యమాకండి. ముగ్గు కదుల్తాంది.. పేనొత్తాంది సూడండి"

ముగ్గురూ దీక్షగా ముగ్గుగుట్ట వంక చూస్తున్నారు.

పేను బద్ధకంగా ముగ్గుని తొలిగించు కుని నేలమీద పాక్కుంటూ బైటికొచ్చింది. అది చూసి హతాశురాలైన చిన్నక్క "ఛీ! చెల్లెలా.. ఉండు, ముచ్చెంగా మూడు సార్లు చూద్దాం" అని ఆ కదిలే పేను మీదే మళ్ళీ గుప్పెడు ముగ్గు పోసింది. లోపలి నుంచి నిండు గర్భంతో వసారాలోకొచ్చిన రాముడమ్మ వీళ్ళని చూసి "ఓసినీ ముగ్గార! ముగ్గునెందుకే.. అట్టా నాశనం జేత్తన్నావు? అది డబ్బాలోకెత్తిటు వ త్తావా.. నేనటొచ్చి ముగ్గురి ఈపులూ ఇమానం మోత మోగిచ్చనా? " అనేసరికి

చిన్నక్క పేను సంగతీ, పుట్టబోయే తమ్ముడి సంగతీ మర్చిపోయి గబగబా ముగ్గెత్తుతోంటే.. శీనూ, పొట్టోడు పరుగుల్తో అరుగులమీదికొచ్చి పడ్డారు.

అప్పుడే రెండు గేలాలు భుజమ్మీదేసుకుని అటుగా వెళ్తున్న దాసు వీళ్ళని చూసి "ఏరా శీనూ వత్తారేరా? " అన్నాడు.

"ఎక్కడికి? " అన్నాడు శీను.

"రండి సెబుతా" అనడమే తడవుగా ఇద్దరూ దాసు దగ్గరికి పరిగెత్తారు. దాసు వెంటనే చెరొక గేలం ఇస్తూ "భుజమ్మీద పెట్టుకోండి" అన్నాడు.

భీముడు గదని భుజమ్మీద పెట్టుకున్నంత గంభీరంగా వీళ్ళు గేలాన్ని పెట్టుకుని దాసువెంట నడుస్తున్నారు. దాసు వంతెనదాటి కాలవగట్టంటే నడుస్తున్నాడు. వీళ్ళు అతని వెనకే. ముల్పూరి సుబ్బారావు 'గోగుల్ని' కట్టగట్టి కాలవ ఒడ్డున ముని గేలావేసి ఆ కట్టమీద మట్టికప్పుతున్నాడు.

"దాసుబావా! సుబ్బారావు బాబాయి ఎందుకట్టా చేత్తన్నాడు? " అన్నాడు శీను.

"ఇది కూడా తెలవదేరా పిల్ల నాయాలా! గోగుల్ని ఊరేత్తన్నాడు. వారం తర్వాత తీత్తే గోగునారొత్తంది. ఆ గోగునారతో గొడ్లకి శిగమార్లూ, తాళ్ళూ, ఏంగావాలంటే అవి నేసుకోవచ్చు" అంటూ కాలవ కొల్లేట్లో కలిసేదాకా వచ్చి ఆగి "అరేయ్! మీ ఇద్దరూ గేలాల్ని నాకిచ్చి ఎర్రల్ని పట్టక రండి" అన్నాడు దాసు.

"ఎర్రలా? " అన్నారిద్దరూ.

"ఎర్రల్తెలవదేరా? మళ్ళీ కొల్లేట్లో పుట్టారు. ఎవరన్నా ఇంటే ముడ్డితో నవ్వుతారు.. వానపాముల్ని సూల్లేదా? "

"చూశాం చూశాం" వాళ్ళిక ఆ నిందలు భరించలేక అరిచారు.

"మరవే. ఎళ్ళి సేల గట్లకిందా, బోది గట్లకిందా ఎతకండి. ఎర్రల్ని తీసుకొత్తే ఈ గేలానికి తగిలిచ్చి నీళ్ళల్లో ఏశామా.. ఇక సేపలే సేపలు" అన్నాడు దాసు.

ఇద్దరూ గట్లంట పడి చెరో కాసిని వానపాముల్ని పట్టి తెచ్చారు. దాసు వాటిని తన తలగుడ్డలో వేసుకుని ఒక్కోటి గేలానికి తగిలించాడు. తనో గేలం పుచ్చుకుని మరో గేలాన్ని శీనూకిచ్చి "అదుగో.. ఆ రాయి దగ్గరెళ్ళి గేలాన్ని కాలవలో ఎయ్యి. ఇదుగో ఈ బెండు మునుగుతాంటే సేపొచ్చి ఎర్రని తింటాందన్నమాట. అప్పుడు పైకి లాగు. ఎల్లండి. అరే పొట్టోడా! నువ్వు బెండు వంకే సూడు. మునుగుతాంటే ఈడ్ని లాగమను" అని పద్ధతంతా ఇవరంగా చెప్పి వెళ్ళాడు దాసు.

శీను, దాసు గేలాలు కాలవలో వేసి గట్టుమీద కూర్చున్నారు. శీను కన్నా, పొట్టోడి కన్నా దాసు నాలుగేళ్ళు పెద్ద. వాడు పెద్ద కాబట్టి వాడి మాటలు చిన్నాడైన శీను, పొట్టోడు వినాలని దాసు ఒక రూలు ఎన్నడో పెట్టాడు.

శీను పక్కనే కూర్చుని కాలవలోని గేలం బెండు కదలికల్ని చూస్తున్నాడు పొట్టోడు. కొల్లేట్లో నుంచి ఎగురుకుంటూ వచ్చిన కత్తిరి పిట్ట ఒక్క ఉదుటున కాలవలోకి పడి చిన్నచేప పిల్లని నోట కరుచుకుని ఎగరటం చూస్తున్న శీనూతో "లాగరా.. లాగరా.. పడిందిరా.." అని త్వరత్వరగా రహస్యంగా అన్నాడు పొట్టోడు గేలానికున్న ఎర్రని అందుకుని లాగు

తోంది చేప. శీనూకి తెలుస్తోంది, తను పట్టుకున్న గేలాన్ని చేప లాగటం. గేలం బెండు మునిగిపోతోంది.

ఒక్క ఊపున గేలాన్ని కాలవలోంచి బైటికి లాగాడు శీను. పెద్ద కొరమీను గేలం ముల్లు నుంచి ఎగిరి గట్టుమీదపడి ఎగిరెగిరి కొట్టుకుంటోంది. పొట్టోడు, శీనూ చేప దగ్గరికి పరిగెత్తారు.

దాసు ఎక్కడినుంచొచ్చాడో ఒక్క ఉరుకు రికి "ఇది నా గేలానికి పడింది. దాన్ని ముట్టుకున్నారా చచ్చారే" అన్నాడు.

శీను పొట్టోడు నివ్వెరపోయి దాసు వంక చూశారు. తేరుకున్న శీను "దాసు బావా! ఇది నాకేగదా పడింది. నేనే గదా లాగింది? " అన్నాడు బేలగా.

"ఆ! పడతంది. ఏలెడు లేవు. ఇది నీకెట్టా పడతందిరా. పెద్దాడ్ని నన్నొదిలి బుడ్డ ముండాకొడుకువి నీకు పడ్తంది" ఎక్కిరించాడు.

"ఏరా పొట్టోడా! నాకు పడలా? " పొట్టోడి సాక్షం కోరాడు శీను.

"అవును. నీకే పడింది. నువ్వే లాగావు. అది బెండు లాగుతుంటే నేను చూశా. అప్పుడే 'లాగరా' అంటే నువ్వు లాగావు"

"పిల్లనాకొడుకల్లారా! ఎలక్కి పిల్లి సాచ్చెం అంటే ఇదే. గేలం ఎవడిదిరా? గేలం కర్రుచ్చుకుని ఒక్కటిస్తే పారుకుంటా ఎల్లి పెద్దగుణ్ణంలో పడతారు" అని ఆ కొర మీన్ను తీసుకుని వెళ్ళిపోయాడు దాసు. వీళ్ళు ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు.

"గేలం ఆడిదైతే మరి ఎర్రలెవరు తెచ్చారు? గేలం ఎవరేశారు? చేపని ఎవరు లాగారు? బైట ఎవరేశారు? ఇంత న్యాయమేరా? " అన్నాడు శీను.

"ఆడి పాపాన ఆడే పోతాడ్లేరా! మనమే గేలం తెచ్చుకుని, మనమే ఎర్రల్ని పోగు చేసి, ఇంతకన్నా మంచి చేపల్ని పట్టుకుందాం లేరా" అంటూ శీనూని సముదాయించాడు పొట్టోడు.

'గేలం ఉన్నాడిదా, గేలం వేసి పట్టినాడిదా చేప' అనే సందేహం శీను చిన్ని బుర్రని చాలారోజులు తొలిచింది.



మంచి దిట్టంగా ఉన్న నవారు మంచం మీద పడుకుని ఉన్నాడు కాకయ్య. మంచంపట్టెలు అరడుగు మంద మున్నాయి. మంచంకోళ్ళు నాలుగూ ఏనుగు కాళ్ళలా దృఢంగా ఉన్నాయి. పైన వసారా వాసాలకి వేళ్ళాడుతున్న రెండు తాళ్ళనీ చెరొకటీ పుచ్చుకుని శీనూ, పొట్టోడు కాకయ్యగారి రెండు కాళ్ళమీదా అటొకడూ ఇటొకడూ తొక్కుతున్నారు.

"నెమ్మది.. నెమ్మదిగా తొక్కండ్రా! ఎగరకండి. ఆ.. ఆ.. జాగర్త" అంటూ వాళ్ళని హెచ్చరిస్తూ పక్కనే అరుగు మీద కూచుని పొగాకు పాయలు తీసి చుట్ట చుట్టుకుంటున్న రంగయ్యగారితో మాటలు కలుపుతున్నాడు కాకయ్య.

"ఆడా! ఆడు కుప్ప తగలబెట్టి పేలాలేం చుకుతినే రకం గాదూ!" అన్నాడు కాకయ్య.

"బాగా సెప్పావ్! ఈడు తూమెడు ఒడ్లు తూర్పారబట్టేటప్పటికి ఏదుంవడ్లు ఎలకలు తింటయ్" అన్నాడు రంగయ్య చుట్ట చివర కొరికి ఉమ్మేసి.

"అయ్యా రాముడత్తనడిగి నుప్పు తీసు

కురా" అన్నాడు

"నేనెల్తా నేనెల్తా" అని ఇద్దరూ కాకయ్యా గారి కాళ్ళమీద నుంచి కిందకి దూకి లోనికి పరిగెత్తారు.

వెనక నుంచి "ఒక్కళ్ళు తేలేరా. అన్నిటికీ ఇద్దరూ తయారవ్వాల్సిందేనా? " అనే కాకయ్యా మాటలు వినకుండానే.

పొయ్యిలో మండుతున్న పేడుని అలానే తీసుకొచ్చేశారు.

"నుప్పు తెమ్మంటే కొంపకి నిప్పంటించే లాగున్నారు. ఇట్టాగేనా నుప్పు తేటం? " అని కోప్పడి ఆ పేడుని తీసుకుని చుట్ట అంటించుకుని గుప్పుగుప్పున రెండుసార్లు పొగొదిలి "జాగ్రత్తగా పొయ్యిలో పెట్టి రండి" అని ఇచ్చాడు రంగయ్య.

"దున్నేవాడు లెక్కలు జూత్తే నాగలి కూడా మిగలదంటారు" అన్నాడు కాకయ్య.

"ఐనా కేకలూ, బొబ్బలే గాని కళ్ళంలో ఇత్తుల్లేవు. నేనానాడు ఇత్తనాలు కొనేటప్పుడే చెప్పా. ధరకి భయపడి పుచ్చిన ఇత్తులు కొంటే అవి చచ్చినా మొలవ్వురా అని. ఇంటేనా? " అన్నాడు రంగయ్య.

పిల్లలిద్దరూ వచ్చి మంచమెక్కి పైన తాడు పుచ్చుకుని కాకయ్యగారి కాళ్లమీద మళ్లా తొక్కడం మొదలెట్టారు.

గొడ్ల చావిట్లో ఎవరో తిరగటం చూసి "ఎవరా మనిషి? " అన్నాడు రంగయ్య ఓరగా చూస్తూ. వెంటనే "మన ఈరభద్ధ మేలే" అంటుండగానే, వీరభద్రం "గిత్తలకి సిగమార్లు, మెడకి గంటలు, మూపురం దగ్గర మువ్వల పట్టీలు.. ఏం బాబాయ్! బెమ్మమీసారి ఎడ్లపందాలకెళ్తున్నాడా ఏంటి? " అంటూ వచ్చి కూచున్నాడు.

"ఆ.. పందాలా పాడా! ఏదో కాస్త సరదాకి" అన్నాడు కాకయ్య.

"మైసూరెద్దు పళ్ళు సూడబోతే కొమ్మిసుర్తాంది. మాంచి పొగరు మీదుంది"

"ఆ! ఆ! అరేయ్ మీ దుంపల్తెగ... ఎముకలిరగ్గొడ్తారేరా? తొడల మీద నెమ్మదిగా నడవండి" అరిచాడు కాకయ్య.

"గిత్తలకి మాత్తరం పోషణ బాగుంది. నా దిష్టే తగిలేలా ఉంది" వీరభద్రం నవ్వాడు.

"పదకొండొరసల నల్లతాడుకి జీడి గింజ లేసి సాయంత్రం కడదాంలే, ఏ దిష్టీ తగలకుండా" అన్నాడు రంగయ్య.

"సూడిగేద మడి కూడా జారిడిసింది. వారం తిరక్కుండా ఈనేట్టుంది" అన్నాడు వీరభద్రం.

"వారమా! మూడు రోజుల్లో ఈన్తంది" అన్నాడు రంగయ్య నమ్మకంగా.

"అంటే మూడునాలుగు రోజుల్లో మనకి జున్నుపాలు తప్పవన్నమాట"

"తాతయ్యా.." అన్నాడు పొట్టోడు.

"ఆ.. ఉండంట్రా. నేను నెమ్మదిగా బోర్లా పడుకుంటా. ఒకడు తొడల మీద అటోకాలు, ఇటోకాలూ ఏసి నడవండి. రెండోవాడు ఈపంటే నెమ్మదిగా.." అంటూ బోర్లా తిరుగుతున్నాడు. పాపం కాకయ్యది పెద్ద పొట్ట. అయినా నవారు మంచం అవడం వల్ల కాస్త ఫర్వాలేదు.

"జాగ్రత్తయ్యా. ఎన్ను మీద ఎగరబాకండి" అన్నాడు రంగయ్య.

"ఒల్లంతా ఒకటే సలుపుడు. కాత్తీ పిల్లమోడులు ఆళ్ల సిన్న సిన్న పాదాల్తో నడుత్తాంటే కూత్తంత తగ్గినట్టు.."

పిల్లలు నెమ్మదిగా నడుస్తూ ఒకర్ని చూసి ఒకరు కిసుక్కున నవ్వుకుంటూ ఉన్నారు.

"ఉరేయ్! మీ ఇద్దరూ కుస్తీపట్టు పడ్తే ఎవరు గెలుత్తార్రా" అన్నాడు వీరభద్రం. ఇద్దరూ 'నేనే' అన్నారొక్కసారిగా.

"సరే, మీ తాత పనయ్యాక మీ పని నేను చూత్తానుండండి" అన్నాడు వీరభద్రం.

రాముడమ్మ లోన్నుంచి గిన్నెలో ఓ డజను పూర్ణాలు తీసుకొచ్చి పిల్లలిద్దరికీ "ఇంద" అంటూ చెరొకటీ ఇచ్చి ఆ గిన్నె పెద్దవాళ్ళ ముగ్గురికీ అందేట్టు పెట్టింది.

"ఏంటమ్మా ఇవి. ఇప్పుడెందుకు? " అన్నాడు రంగయ్య ఎప్పట్లానే.

"ఇవ్వాళ శ్రావణ శుక్రవారం గదా! నోం నోచా" అంటూ రాముడమ్మలోనికెళ్ళింది. అంతలోనే లక్ష్మమ్మ గారు "శీనూ" అని కేకేసింది.

"వత్తన్నానమ్మా" అంటూ "తాతా" అన్నాడు శీను.

"ఆ.. ఎల్లెల్లు. అమ్మాయేదో పనుంటేనే పిలుత్తుంది" అని, "అరే శీనుగా! ఆ గిన్నెలో పూర్ణాలు నీకెన్ని గావాలిస్తే అన్ని తీసుకెల్లు" అన్నాడు కాకయ్య.

దిగుతూనే గిన్నె దగ్గరికెళ్ళి మరో రెండు పూర్ణాలు తీసుకుని లగెత్తాడు శీను.

★ ★ ★

"ఏంటమ్మా? " అంటూ లగెత్తుకొచ్చిన శీనూతో "కాత్తీ భోషాణంలోకి దిగి ఒక కొబ్బరికాయ ఉండాలి. సూసి తియ్యి నాన్నా" అంది లక్ష్మమ్మ.

"అమ్మా! ఇదుగో ఒక పూర్ణం తిను" అంటూ చెయ్యి చాపాడు శీను.

శీనూ చేతిలో ఉన్న పూర్ణం వంక చూస్తూ "వాళ్ళిచ్చారా.. నువ్వే..? "

"లేదమ్మా. కాకయ్య తాత నీక్కావల్సి నన్ని తీసుకెల్లరా అంటే... రెండే"

"ఒకటి తింటున్నావ్. మరో రెండు న్నాయ్. ఎవరన్నా తీసుకో అనగానే తీసు కోటమేనా? పిల్లాడు కరువాసున్నాడను కోరూ? "

"ఊ సర్లే. ఇది నీ కోసమే తెచ్చా. తీసుకో"

"నాకేమొద్దులే. నువ్వే తిందూగాని. ఆ పిడతలో పెట్టి నువ్వు భోషాణంలోకి దిగు"

"నువ్వు తినకపోతే నేను దిగను"

"ఆ బాబు మొండితనమే వచ్చింది. చెప్పిన మాటింటే నాకీ తిప్పలెందుకు? "

"ఉప్పుడు నీకొచ్చిన తిప్పలేంటే? ఒక పూర్ణం తినమంటమేనా? "

"ఎత్తుకున్న బిడ్డ మొత్తుకున్నా దిగడని ఉప్పుడు నేను నీతో వాగలేను గాని సెప్పిన పని సెయ్యయ్యా. ఓపిక లేదురా. ఇంకా బోల్డెంత పనట్టాగే ఉంది"

"ఉప్పుడా కొబ్బరి కాయెందుకు? "

"నీకూ నీ బాబుకీ పొట్ట పూజుంటే సాలు. నాకట్టా సాలదుగా. శ్రావణ శుక్రోరం. తలంటుకుని కాత్తి దేవుళ్ళ దగ్గర దీపమెలిగించి ఒక్కొబ్బరికాయ కొట్టు కుందామంటే.. మీ పనులన్నీ తెవిలేతలికే ఈ ఏలయ్యింది. పచ్చి మంచినీళ్ళు ముట్టలా. ఇప్పుడీ పూర్ణమెట్టా తినను? నన్నిసిగించుకుండా కాత్తి భోషాణంలోకి దిగు. సేతికందేతట్టే పెట్టా. అదే మీదికి దొర్లిందో.. సేతికి తగల్లా. నా బాబువి గదూ"

"అయితే నీ పూజయ్యాక ఇది తింటా నంటే దిగుతా"

"సరేలే, దిగు"

పూర్ణాలు రెండూ భోషాణంలోనే ఉన్న ఓ మట్టి పిడతలో పెట్టి తలుపుతెరిచే ఉన్న భోషాణం లోపలికి నిదానంగా దూరాడు శీను.

"కన్పడిందా.. బుడ్డెలిగించియ్యనా? "

"బుడ్డొద్దులే. కన్పడ్తుంది" అని చేతుల్తో తడుముతూ "అమ్మా.. బెల్లం కావాలా? "

"బెల్లమొద్దు, అల్లమొద్దు. కొబ్బరి కాయియ్యి సాలు"

"కొబ్బరికాయ ముక్కల్లో బెల్లం కలిపి పెట్టమ్మా దేముడికి"

"అబ్బా! నన్నిసిగించమాకరా"

"సరే. ఇదుగో కొబ్బరికాయ" అని పైకం దించి బెల్లం ముక్కొకటి నోట్లో ఏసుకున్నా డు శీను.

"ఇకా బెల్లమంతా అయ్యేదాకా బైటికి రావా? "

"వత్తన్నాలేవే. దిగేదాకా దిగు దిగు. దిగ్గానే రా! రా!" అంటూ మరోముక్క తీసుకుని పైకి లేచాడు.

"అదుగో చూశావా? అబ్బా కొడుకులకి బెల్లముంటే సాలు" అనుకుని "బైటికి రా. నేను తాళమేసుకోవాలి" అంది.

గబగబా బైటికొచ్చాడు శీను.

భోషాణం తలుపేసి గొణ్ణానికి తాళం తగిలిచ్చి మంగళసూత్రంలోనే ఉన్న తాళం చెవితో వంగి తాళంవేసుకుంది లక్ష్మమ్మ.

ఆ ఇంటికి సంబంధించిన సమస్త వస్తు జాలం, సరుకులు, బియ్యం, పప్పు, ఉప్పు ఒకటేమిటి, దాదాపు బట్టల్తో సహా మింగి కూర్చుంటుంది ఆ భోషాణం. దానిమీద తక్కువ సామానేమి ఉండదు. కట్టుడు బట్టలు. దండెం మీదెయ్యగా మిగిలినవి పక్కబట్టలు, రొండు గొంగళ్ళు ఒకవైపు, మరోవైపు వడ్లబస్తాలు, గిన్నెలు, పళ్ళాలు, గ్లాసులూ, ఇన్నీ పెట్టాక కూడా శీనూ, పొట్టోడు ఆడుకోవాలన్నా, రహస్యాలాడుకోవాలన్నా భోషాణం మీదే.

"అమ్మా! నేను కూడా పూజ చెయ్యనా? "

"ఆ.. చెయ్యి చెయ్యి. పొట్ట పూజయ్యిందిగా. ఇక దేవుడి పూజ..."

"ఏమన్నా తిని పూజ్జేత్తే ఏమవుతుందే.. దేవుడిక్కోపమొత్తందా? "

"బొమ్మకి మొక్కినా నమ్మకముండాలి నాయనా! దేవుడి మీదే నమ్మకం లేదు, మీ అయ్యా కొడుకులకి. ఇంక ఈ దొంగ పూజలెందుకు.. నా పనికడ్డంబడకు. పో బైటికి" అంది లక్ష్మమ్మ.

లక్ష్మమ్మ శీనూకి 'నీచు' తినొద్దని చెప్పినట్టే తనతోపాటే దీక్షగా ఉండి దేముడికి దండం పెట్టుకోమని చాలాసార్లు చెప్పింది. శీనుగాడి పొట్టేం పొట్టో గాని లేవగానే చెంబుట్కి పరిగెట్టడం, వస్తూనే కచ్చికతో పళ్ళు తోంకుని రెండు దోసిళ్ళ నీళ్ళతో పుక్కిలించి, మొఖం మీద నీళ్ళు జల్లుకుంటాడో లేదో 'అమ్మా! ఆకలేత్తాందే మన్నా పెట్టు' అనే కేకలేయిస్తుంది.

"రాత్రి పొడుకునేప్పుడేం జెప్పా! ఇవ్వాళ శనివారం. ఎంకటేశ్వరుడికి దండం పెట్టుకుని గాని పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోనని చెప్పావా లేదా? " అంటుంది లక్ష్మమ్మ.

"సరే నువ్వేమన్నా పెట్టు. నేనీలోపు దండం పెట్టేసుకుంటా"

"భక్తి దేవుడి మీద, చిత్తం చెప్పుల మీదంటే ఇదే. దేముడికి దండం పెట్టుకోవాలంటే ముందు శుభ్రంగా స్నానం చెయ్యాలి"

"అబ్బా! నేనిప్పుడే స్నానం చెయ్యను. ముందేమన్నా పెట్టు"

"నాకు తెలుసు నాయనా! తెలుసు... ఇదిగో రాత్రి అన్నంలో పాలు తోడెట్టి ఉల్లిపాయ ముక్కలేసుంచా! తిను సలవజేత్తంది" అని గిన్నె మూతతీసి ముందెడ్తే కరకర పచ్చి ఉల్లిపాయ నంజుకుంటూ, మీగడ పేరుకున్న పెరుగన్నం చరచర జుర్రుకుంటాడు శీను.

"అమ్మా" అన్నాడు శీను.

"ఏంటి నాయనా!" అంది లక్ష్మమ్మ.

"దేవుడు బాగా సంతోషపడాలంటే ఏం చెయ్యాలో నాకు తెల్సు. చెప్పనా? " ఇంటి

పనంతా చేసుకుని, తలారా స్నానం చేసి తుడుచుకున్న తుండుగుడ్డే జుట్టుకు చుట్టుకుని దేవుడి పటాలకి బొట్లు పెట్టుకుంటూ "చెప్పు నాయనా! ఎన్ని పూజలు చేసినా దేవుడికి నామీద దయెందుకు రాటం లేదో తెలవటల్లా! నీకు తెలిస్తే సెప్పు" అంది లక్ష్మమ్మ.

"ఉప్పుడా కొబ్బరికాయుందా!"

"ఆ! ఉంది"

"దానికి మూడు కళ్ళున్నయ్యి గదా! దానిలో ఒక కన్ను పొడిచి నీళ్ళన్నీ తాగెయ్యాలి"

"ఊ? " అంది ఆశ్చర్యంగా లక్ష్మమ్మ.

"బెల్లం మెత్తగా తరిగి నెమ్మదిగా దబ్బనం బెట్టి బెల్లాన్ని కొబ్బరికాయ నిండా ఆ కన్నులో నుంచి బాగా కూరాలి. తర్వాత ఆ కొబ్బరి కాయలని నుప్పల మీద బెట్టి కాల్చాలి. కాలాక దాన్ని తీసుకొచ్చి దేవుడి ముందు పగలగొట్టు. అది తిన్న దేవుడు నీకే వరం కావాలంటే అదల్లా ఇచ్చేత్తాడు. ఆ పెసాదం కాత్తి నువ్వు తిని మిగిలింది నాకూ, నాన్నకీ ఎట్టు. ఎంత బాగుంటుందో సూడు"

"ఎక్కడ నేర్చుకుంటున్నా బాబూ ఈ బుద్ధులు? దేవుడిక్కావల్సింది కాదన్న మాట మనం పెట్టాల్సింది. మనగ్గావలసింది దేవుడికి పెట్టి మనం తినాలి. ఇక సెప్పింది సాల్లే. బైటికి నడుత్తావా లేదా!" అంది లక్ష్మమ్మ.

"సర్లే. పూజవ్వగానే పిలువ్"

"ఆ పిలుత్తాలే. ప్రెసాదం తిని పెట్టాలిగా. పిలవకుండా ఎట్టుంటానూ? " అని పూజలో పడింది లక్ష్మమ్మ.

★ ★ ★

కాకయ్యగారు వసారా అంతా నాపరాయితో గచ్చు చేయించాడు. ఆ వసారాలో ఒక చివర వడ్ల బస్తాలు ఒకదాని మీదొకటిగా ఐదారు వరసల్లు చాలా ఎత్తుగా ఉంటాయి. శీనూగాడొస్తే చాలు వాడూ, పొట్టోడు కల్సి వాటిమీదికెక్కి, వాటి మీద నుంచి జారి, దూకి - ఇవే ఆటలు.

పెద్దాళ్ళు ఈ చివర మంచాల మీద కూచుని వాళ్ళ మాటల మధ్యలో అప్పుడప్పుడూ "ఉరే.. ఎదవల్లారా! వాటి మీదికెక్కబాకండిరా! ఏ బస్తాకిందో పడ్డారంటే అణగారిపోతారొరేయ్... ఆళ్ళు జూడు. ఇన్పించుకుంటారేమో" అని కేకలేస్తుంటారు. నిజంగానే వాళ్ళకవేమీ వినపడవు.

ఆడి ఆడి అలిసిపోతున్న పిల్లల్ని పిల్చి రాముడమ్మ ఏ అరిసి ముక్కో, బూరె ముక్కో చేతిలో పెట్టేది. అవి తింటూ మళ్ళీ బస్తాల మీదికెక్కిన శీనుకి చూర్లో చిన్నకొడవలి లిక్కి కనపడింది. వాడు నెమ్మదిగా అది తీసి ఎవరూ చూడకుండా బస్తా మీద ఓ దెబ్బ వేశాడు. బస్తాకి చిల్లు పడి వడ్లు జర్రున కారడం మొదలైంది. అప్పుడే పొట్టోడు వాడి 'అరిసి' పట్టుకుని బస్తాల మీదికొచ్చాడు. వడ్లు కారిపోవటం మొదలవగానే చెయ్యగూడని పని చేసినట్లు తెల్సిన శీను కంగారుగా లిక్కిని పొట్టోడి చేతికిచ్చి కిందకి జారాడు. వాడితో పాటే జారుతున్న వడ్లని చూసిన కాకయ్య "ఓరీళ్ళ దుంపతెగ. అరేయ్ బెమ్మం! వడ్లు కారతన్నయ్ సూడు. ఈళ్లే ఏదో చేశారు" అని పిల్లలెంక చూసి "అదుగో.. ఆడు చూడు, కొడవలి పెట్టి బస్తాకి చిల్లులు పెడ్తన్నాడు" అని పొట్టోడ్ని చూపాడు.

పరుగెత్తుకొచ్చిన బెమ్మం చిల్లుకి చెయ్యడ్డం పెట్టి "అరే శీనుగా.. సావిట్లోకెళ్ళి కాస్త వరిగడ్డి తీస్కరా, పరిగెత్తు" అన్నాడు. శీను పరిగెత్తికెళ్ళి వరిగడ్డి తెస్తే దాన్ని చిల్లులో దోపి పొట్టోడ్ని అందుకుందామని చూస్తే బెమ్మం కోపం తెలిసిన పొట్టోడు పైపైకెక్కేసి బెమ్మానికి దొరక్కుండా "నేను కాదు చిల్లు పెట్టింది" అన్నాడు.

తానేనని తెలిస్తే బెమ్మం తన భరతం పడతాడని శీను వెంటనే "ఆడే ఆడే. ఆడే కొడవలితో బస్తా మీద కొట్టాడు" అని అబద్ధం చెప్పేశాడు.

"వాడేలే. కనపడ్తానే ఉందిగా" అని ఎగిరి వాడ్నొక లాగులాగి చెంపమీదొకటి, నెత్తి మీదొకటి ఇచ్చేసరికి కాకయ్య అడ్డు పడి "సాల్లేరా! పిల్లసన్నాసి! ఆడికేం తెలుసు. ఇంక చెయ్యడ్లే. వదులు వాడ్ని" అని మందలించాడు.

కాని పొట్టోడు శీనునో చూపు చూశాడు. ద్రోహానికి గురైన మానవజాతి చూసే చూపది. శీను కూడా చాలాసార్లు తన కొంగల్ని, చేపల్ని కొట్టేసిన వాళ్ళకేసి ఆ చూపే చూశాడు. అందుకే వాడికా చూపు తట్టుకోవటం కష్టమై "బెమ్మం మామయ్యా. నేనే ఆ బస్తాకి చిల్లు బెట్టా" అని చెప్పే శాడు.

"సర్లే, ఎవడో ఒకడు. మా గొప్ప పని చేశారు. మీరిద్దరూ తోడు దొంగలే. ఇద్దరూ కల్సివడ్లన్నీ అదుగో ఆ సంచీకె త్తండి" అన్నాడు కాకయ్య తాత.

పెద్దవాళ్ళు వాళ్ళ మాటల్లో పడ్డారు.

పొట్టోడు శీనుగాడ్ని చూస్తూ నిలబడితే వాడి చూపుల్ని తప్పించుకుంటూ శీనూ తలొంచుకుని బుద్ధిగా సంచీలోకి వడ్లెత్తు తున్నాడు.

పొట్టోడు శీనునొక గుద్దుగుద్ది లోనికి పరిగెత్తుకెళ్ళాడు. శీను మారుమాట్లాడ కుండా వడ్లన్నీ సంచీలోకి ఎత్తేసి నెమ్మ దిగా ఇంటికెళ్ళాడు.

అరగంటన్నా గడవకుండానే గోళీలు లెక్కబెట్టుకుంటున్న శీనూ దగ్గరికి నెమ్మ దిగా కల్లుబెల్లం ముక్క చీకుతూ వచ్చాడు పొట్టోడు.

"అరే..శీనూ!" అని పిలిచి తన దగ్గ రున్న బెల్లంముక్క చూపించాడు.

శీను వాడ్ని చూసి గోళీలన్నీ అక్కడే పడేసి గబగబా వాడి దగ్గరకొచ్చి "ఎక్కడి దిరా? " అన్నాడు.

"కల్లుబెల్లం" అన్నాడు పొట్టాడు.

"ఎక్కడిదెహ? " మళ్ళీ అడిగాడు శీను.

"మా అమ్మిచ్చింది"

అంతే.. శీనూ విల్లులోంచి వదిలిన బాణంలా.. గుప్పెట్లో ఉన్న కప్పపిల్ల గుప్పిట తెరవగానే ఉరికినట్టు, ఒక్క ఉదు టున కాకయ్య గారింటికి పరిగెత్తాడు.

శీనూ వెంటే పొట్టోడు కూడా.

"రాముడత్తా" అని అరిచినట్టే పిల్చాడు.

"వచ్చా! మా నాయనే. మా అయ్యే. ఉండు. నీకూ ఓ ముక్కిస్తా" అని చేస్తున్న పనాపి చెయ్యి కొంగుకి తుడుచుకుంటూ వెళ్లి కుండలో నుంచి తీసి ఓ కల్లుబెల్లం ముక్క ఇస్తూ "నీకివ్వమని ఈడికిత్తే, నీకి వ్వకుండా తినేత్తాడని ఇవ్వలా. తిను. కొట్టుకోమాకండి. ఎల్లండి ఆడుకోండి"

శీను మనసు కల్లుబెల్లం ముక్కలానే తీపెక్కిపోయింది. 'రాముడత్త ఎట్టాగైనా మా అమ్మలాగే మంచిది' అనుకుంటూ బెల్లంముక్క చీకటం మొదలెట్టాడు.

శీనూ ఒక్కసారి, పొట్టోడొకసారి పోటీ పడ్డట్టు చీకుతూ, తాము సృష్టించే శబ్దాన్ని కూడా ఆనందిస్తుంటే, వాళ్ల ఆనందాన్ని భగ్నం చేస్తూ నల్లశ్యామలక్క వచ్చి "ఒరే పొట్టోడా! అమ్మ ఎక్కడుందిరా? " అంది.

"లోపలుంది"

నల్లశ్యామలక్క లోపలికెళ్లి "రాముడొదినా" అని పిల్చింది. వీళ్లిద్దరూ ఆమెనను సరించి లోనికెళ్లారు.

"ఏంటీ... ఉండు. ఉప్పుడే దీపం కొండెక్కింది. ఎలిగిత్తన్నా" అంటూ దీపం వెలిగించింది.

"బియ్యం నిండుకున్నాయ్... ఎసరు పెట్టిం తర్వాత చూసుకున్నా" అని ఆగింది శ్యామల.

"సర్లే, దానికేం భాగ్యం గానీ.." అని శ్యామలొంక చూసి "మెళ్లో గొలుసేదే" అని అడిగింది.

"గొలుసు పెరిగింది. తీసి పెట్లోపెట్టా"

"సర్లే. ఏమన్నా తెచ్చావా? "

"కొంగులో పొయ్యి. రేపు మీ అన్నయ్య తెచ్చాక ఇచ్చేత్తా"

"నీదంతా చోజ్జెమే. ఎప్పుడిత్తావని నేన డిగానా? ఒకళ్ల సరసనొకళ్లం ఉంటన్నాం. ఆ మాత్రం సాయం చేసుకోలేమా? " అంటూ బియ్యం కుండలోనుంచి తవ్వతో నాలుగు తవ్వలు శ్యామల కొంగులో పోసింది రాముడమ్మ.

★ ★ ★

"రాజులన్నయ్యా.. రాజులన్నయ్యా" అంటూ కేకలేస్తూ వస్తున్న దాసుని,

"ఎందుకురా అట్టా పెడబొబ్బలు పెడ్తన్నా. ఏం దొబ్బుడాయొచ్చింది? " అన్నాడు రాజులు.

"శీనుగాడు లేడు..."

"ఎందుకు లేడూ? ఎక్కడన్నా పడుకున్న గాడిదని లేపి తన్నించుకున్నాడా? "

"యెహే.. చెప్పేదినుు. ఆడు కొల్లేట్లో ఏడుత్తున్నాడు"

"గొడ్లని కాచేవాడ్ని కొట్టనివాడు, గొర్రెల్ని కాచేవాడ్ని తిట్టని వాడూ ఉండడని శాత్రం. ఎవడు కొట్టాడంట"

"కొట్టటం కాదు. ఆడి పాడిగేదె చిన్న గుణ్ణం దగ్గర ఊబిలో పడింది. పైకెక్కలే కపోతంది. ఆడు దాన్దగ్గరే చుట్టూ తిరుగుతూ ఏడుత్తున్నాడు"

"ఆడక్కడేడుత్తాంటే నువ్విక్కడేం జేత్తన్నా. నువ్వా ఆడికి తోడు అక్కడే ఏడవాల్సిందే"

రాజులు వరసది! మాట చురుకు. మనసు మంచిదే.

దాసు కోపంగా చూడటం చూసి "రోషానికేం తక్కువ లేదు. సర్లే, ఉప్పుడేం సేద్దాం? " అన్నాడు రాజులు.

"నువ్వొత్తేగాని అది ఆ ఊబిలోంచి పైకి రాదు. పదెల్దాం" అన్నాడు దాసు.

"ఉపాయం సెప్పరా అంటే ఉరితాడు తెచ్చుకో అన్నాడంట నీలాంటోడే. నేనెల్లి 'రావే' అంటే గేదె ఊబిలోంచి పైకొచ్చేత్తుందా!" నవ్వుతా అంటున్న రాజుల్ని చూసి "అది కాదు రాజులన్నయ్యా.."

"సర్లేరా కుంకా! నువ్వెళ్లి కళింగుల కిష్టని, పావులూరి ఎంకటేసర్రావునీ, చాప

రాల శివరావునీ, భేలవాళ్ల సుబ్బారావునీ, ఆ సాదేవుడ్నీ, ధర్మరాజునీ, ఎవరుంటే వాళ్లని తొందరగా అక్కడికి రమ్మని చెప్పి నువ్వొత్తా వత్తా కాకయ్య తాతనడిగి ఆళ్లింటో మోకు తీసుకురా! తొందరగా తగ లడు. నువ్వసలే జరిగితే జల్లెడతో నీళ్లు మోసే రకానివి" అంటూ ఎకసెక్కాలాడు తూనే నెత్తిమీదున్న గడ్డిమోపుతో ఇంటికెళ్లి గొడ్ల సావిట్లో పడేసి చావిడి చూరుకి కట్టి ఉన్న తాళ్లు, నాగలి కాడీ తీసుకుని కొల్లే ట్లోకి బయల్దేరాడు.

ఏటివారకెళ్లేసరికి అప్పుడే వడ్డాళ్ల నకు లుడు దోనెమీదొచ్చి దిగుతున్నాడు.

"ఏరా నకులా ఎక్కడికెళ్లొత్తున్నా? "

"మావులు దులుపుకొత్తన్నానండి"

"ఏమన్నా పడ్డయ్యా? "

"ఆ.. ఆ.. పడ్డయ్యి, రొండు బుట్టలు"

"సర్లే, ఆటిని దింపు. నేను దోనెమీద చిన్నగుణ్ణం దాకా ఎల్లొత్తా" నకులుడు చేపలు దించుకోంగానే అదే దోనె వేసుకుని తొందర తొందరగా చిన్నగుణ్ణం వైపు వెళ్లాడు.

"ఏరా బొమ్మిడాయిగా! నిన్ను కోమటి లంకల్లో మేపుకోరా అంటే పెజ్జాడకిటెం దుకు తోలావురా గేదెల్ని? " అన్నాడు రాజులు.

శీనుని కొందరు 'బొమ్మిడాయి' అని పిలుస్తారు.

"అటే తోలుకెల్లా బావయ్యా"

"ఆ! నువ్వటు తోలుకెళ్తే అదిక్కడ ఇరు క్కుందా? నిదర మొకమాడ! అబద్దం సెప్పినా అతికేట్టు సెప్పాల్రా!"

"అదిగాదు బావయ్యా.." సగం ఏడు పుతో చెప్పబోతున్న శీనూతో "నోర్ముయ్. ఏలెడు లేవు, పైగా దబాయింపొకటి.. సెప్పిన మాటినవు. నీకెట్టా తోత్తే అట్టా సేత్తావు. ఈ వజాన పెటకాలు పెడతావు. ఇప్పుడు దీన్ని పైకిలాగే తలికి అందరి ఒల్లూ ఊనాం అయ్యి, నడుములు పడిపో తయ్యి. ఎదవ ఎదవాని"

శీనూతో సహా ఆ ఊర్లో అందరికీ రాజులు సంగతి తెలుసు. ఎదురు మాట్లా డగూడదు. ఎంత పనైనా చేస్తాడు.

దాసు చెప్పగానే రాజులు పిలుస్తున్నా డని అందరూ వచ్చారు. సాదేవుడు లేడు. తాళ్లూ, మోకులూ అన్నీ వచ్చాయి.

"రంగయ్యగారు ములకలప్పుడు అమ్మిన గేదె గాదూ ఇది? "

"ఆ! అదే. మూడుసార్లు తోలుకెళ్తే మూడుసార్లూ కట్టు తెంపుకొచ్చేసింది. చివ రికి లాభం లేదని ఆళ్లు దీన్ని వదిలేసుకు న్నారు. మా పెద్దమామయ్యేమో ఆళ్ల డబ్బులాళ్లకిచ్చేశాడు" అన్నాడు రాజులు.

"ఈన్దగ్గర శాన్నాళ్లనుంచుంది"

"ఆ! అందుకే అది ఆయన్నొదిలి పోనని మారాంకేసింది"

గేదె రాజులు వంక చూసి 'అంబా' అ ని అంది.

"ఏమి నిక్కే.. నీ కోసమే వచ్చాం తల్లీ! సూడంఢ్రా.. ఎట్టా పిలుత్తోందో? తొంద రగా ఎళ్లి మా పెద్ద మామయ్యకి పాలివ్వా లని దాని తొందర. దానికి దాని దూడ మీదకన్నా మామయ్య మీదే ప్రేమెక్కువ"

అందరూ నవ్వారు.

"రంగయ్యగారు దూడ తాగగా మిలిగిన య్యేగా పిండుకునేది"

"అదే దాని ధైర్నం"

మాట్లాడుకుంటూనే ఊబిలోకి దిగి రాజులు మోకుని గేదె నడుంకి కట్టటం. తాళ్లు మెడకీ, కొమ్ములుకీ కట్టటం కాని చ్చాడు. ఆయన పైకొచ్చాక మోకుని నాగలి కాడికి కట్టి నలుగురూ కలిసి లాగుతూ "లే... రా...ఊ" అంటూ గేదెని ప్రోత్సహించి మొత్తమ్మీద పైకి లాగారు.

"రేయ్.. బొమ్మిడాయ్‌గా! గేదె కోమటి లంకలో మేసిందా, నిన్న సిన్నగుణ్ణం కాడ

మేసిందా, ఎక్కడ మేసిందనేది కాదురా. మన దొడ్లో పేడేసిందా? పాలు మనం పితుక్కున్నామా లేదా? ఇది ముఖ్యం. తెల్సిందా. ఈసారి మళ్లీ ఇటు తోలుకొచ్చి మా పుతమార్పకు" అని హితబోధ చేసి బురదబురదయి పోయిన ఒళ్లుని పెద్ద జాడ నీళ్లల్లో ఈది కడుక్కుని దోనెలెక్కెళ్లి పోయారు.

శీనుని రాజులు బావయ్యే గాదు మరి కొందరు బావలూ, మావలూ, వరసయ్యే వాళ్లు కూడా 'బొమ్మిడాయిగా' అని పిలుస్తారు. బొమ్మిడాయిలా ఎర్రగా ఉంటాడనే కాదు. బొమ్మిడాయిల్ని పట్టుకోవడంలో శీనూ నేర్పరి. అందుకనే వరసయ్యేవాళ్లు ఎవరన్నా 'బొమ్మిడాయిగా' అంటే నవ్వుతాడే తప్ప శీనూకి కోపం రాదు.

శీను గొడ్లని అందరిలాగే కోమటి లంకకే తోలుకెళ్లాడు.. తిరిగి వచ్చేప్పుడు చిన్నగుణ్ణం దగ్గరకొచ్చినప్పుడు గేదెలన్నీ అటువైపు వెళ్లాయి. వేసవికాలం దగ్గర పడుతున్న రోజులు. అక్కడక్కడా చిన్న చిన్న గోతులు, బురదతో నిండి పైన తూడూ, రెల్లూ అల్లుకుపోయి ఉన్నాయి. ఈ గేదె ముసలిదవుతోంది. ఓపిక తగ్గింది. లేకపోతే అలా ఇరుక్కునేది కాదు. వీటిలో ఏ ఒక్కటి గానీ శీనుని చెప్పనివ్వలేదు రాజులు. ఎందుకంటే ఇవన్నీ రాజులుకీ తెలుసు. ఎంతటివారికైనా ఇవన్నీ అనుభవాలే.

★ ★ ★

సాయంత్రమయ్యింది. సరస్సులోనించి రోజంతా వేటతో అలసిపోయిన వేలాది పక్షులు ఒకదాన్నొకటి హెచ్చరించుకుంటూ ఆకాశంలోకి ఒక్కసారిగా లేచాయి. ఉదయం వచ్చిన వరుసల్లోనే అన్నీ సర్దుకుని గూళ్లకి బయలుదేరాయి. నలభై, యాభై పక్షులు ఒక్కటై ముందున్న శత్రువుమీదికి దూకే ఒక బాణంలా వెళ్తొంటే ఆకాశమంతా పక్షుల క్రమశిక్షణకి, సమైక్యతకి పులకించిపోతుంటే... రకరకాల విన్యాసాలతో గుంపులు గుంపులుగా వెళ్తున్నాయి. ఆ గుంపుల్లో ఎన్ని జాతులో, ఎన్ని రంగులో!

ఏటివార, గేదెల వెనక పరిగెత్తుతున్న శీనూ పైన సందడి విని నెమ్మదిగా నడుస్తూ పైకి చూశాడు. అకస్మాత్తుగా ఆకాశంలో ప్రత్యక్షమైన ఒక డేగ ఎగురుతూ పోతున్న పక్షుల్లో చివరిదాన్ని తన్నింది. ఆ దెబ్బకి గింగిరాలు తిరుగుతూ పడిపోయిందో కొంగ.

ఆ కొంగ దగ్గరికి పరిగెత్తుతున్న శీనూని "ఉరేయ్! దాన్దగ్గరకెళ్లమాక. నేనొస్తున్నా" అన్న కేకతో పాటు, తను తెస్తున్న తూడు మోపు కింద పడేసి బాణాకర్రతో అటొచ్చాడు భూపతయ్య. వచ్చినవాడు ఆగకుండా కర్రెత్తి ఆకాశాన్నే బెదిరిస్తున్నట్టు డేగని అదిలించాడు.

దాదాపు కిందికి దిగిన డేగ దోవ మలుపుకుని పైకెగిరి తనకందిన మరో పక్షిని కాళ్ల సందున ఇరికించుకుని వెళ్లిపోయింది.

కొంగ దగ్గర నిలబడున్నారు భూపతయ్య, శీను.

"ఏరా! అక్కినాడా! కొంగంత లేవు. నీకు కొంగ కావాల్సొచ్చిందా? నేను రాటం కూత్తి ఆలస్యమైతే ఆ డేగ ఈ కొంగనొదిలి నిన్ను తన్నుకుపోయేది. ఈ పాటికీమాట మీ అమ్మానాన్నలకి తెలిసి లబోదిబోమని మొత్తుకుని ఊరూనాడూ ఏకం చేసేవారు తెల్సిందా? " అన్నాడు అట్లూరి భూపతయ్య.

'ఇలాంటి అన్యాయాలు నేనెన్ని చూశానో!' అన్నట్టు చూశాడు శీను భూపతయ్య కేసి.

"ఏంట్రా.. అట్టా జూత్తన్నా? " అన్నాడు భూపతయ్య.

"ఏం లేదు గానీ ఇప్పుడేంటంటావు

మామయ్యా? " అన్నాడు శీను.

"అంటానికేవుంద్రా? ఈ కొంగని నేను తీసికెళ్తన్నా" అన్నాడు భూపతయ్య.

"తీస్కెళ్లు" అన్నాడు శీను.

"అంతేనా? "

"అంటే? "

"అంతేనా? " రెట్టించాడు భూపతయ్య.

మాట్లాడలేదు శీను.

"అదిగాదురా.. కొంగని ముందు నువ్వే చూశావుగా.. ఇప్పుడు పేడకళ్లకి గంపలేసుకుని గేదెలెనకాల తిరుగుతారు, చూళ్లా"

"చూశా" శీనూకీ సంభాషణ పెద్ద ఆసక్తిగా లేదు.

"గేదె పేడేసేప్పుడు చూసి 'ఆ పేడ నాది' అని ఎవరు ముందంటారో వాళ్లదే ఆ పేడ కదా!"

"అవును"

"అలాగే కొంగని ముందు నువ్వు చూశావు. మరి నీదే అవుతుందిగా? "

శీనూ కాసేపు మాట్టాడకుండా నించుని చివరికి "నాదే అవుతుంది" అన్నాడు.

"మరి నన్ను తీసుకోమంటున్నావే? "

"తీసుకుంటానన్నావుగా మావయ్యా. అదీగాక నువ్వు పెద్దాడివి"

"పెద్దాడినైతే.. తీసుకుంటానంటే.. నాదవుద్దా? "

శీనుకి విసుగు పుట్టింది.

"అయితే ఇప్పుడేమంటా? "

"అహ! నేను తీసికెల్తాననగానే నాదనకుండా నువ్వెందుకొప్పుకున్నావు? అట్టా ఒప్పుకోకూడదు. అట్టా నోరు లేనాడిలా ఉంటే బతకలేవు" అన్నాడు భూపతయ్య గీతోపదేశం చేస్తున్నట్టు.

"వచ్చే డేగని నువ్వు కొట్టావుగా. అందుకని ఇది నీదేనేమోనని" తను మరీ అంత చేతకానివాడిని కాదని చెప్పదల్చుకున్నాడు శీను.

భూపతయ్యకి ఇది రైటనిపించింది. శీనూని మెచ్చుకోలుగా చూశాడు.

"ఓహో అదా! సర్లే నువ్వే తీసికెళ్లు. మీ అమ్మతో వండిచ్చి రొండు ముక్కలు నాకు తెచ్చిపెట్టు. మీ అత్తమ్మ ఏలూరెళ్లిందిలే" అంటూ మోపెత్తుకుని నవ్వుతూ వెళ్లిపోయాడు భూపతయ్య.

కొంగని లేపి చూస్తే అదింకా బతికే ఉంది. కొన ఊపిరితో కొట్టుకుంటోంది.

శీనూ దాని తల టక్కున విరిచేసి కాళ్లు చేత్తో పట్టుకుని లోకాన్ని జయించినవాడిలా ఇంటికెళ్లాడు.

రంగయ్య శీను చేతిలో కొంగని చూసి "ఏమేయ్! అయ్య బంగారంలాంటి కొంగని తెచ్చాడు. ఇటొచ్చి చూడు" అని లోనిక్కేకే

శాడు.

లక్ష్మమ్మ లోన్నించి వచ్చి కొడుకు చేతిలో కొంగని చూసి "చూస్తా, చూస్తా అలాంటి పక్షినెట్టా చంపబుద్ధయింది నాయనా? " అంది.

"నేను చంపలా.. డేగ చంపితే కింద పడింది" అని తలొంచుకున్నాడు శీను.

"దాని ఖర్మా, నా ఖర్మా కాల్తే ఏదో ఒకటి చంపుతుంది" అని లోనికెళ్లిన భార్యతో "మసాలా నూరు. నేను ఈకలు తీసి శుబ్బరం జేత్తా.. ఏరా అయ్యా! దీన్ని నువ్వే చంపావు కదూ? " అన్నాడు కొడుకుతో నెమ్మదిగా.

"అదీ.. నాన్నా! కిందబడి బాధతో కొట్టుకుంటుంటే..? "

"దాని బాధ చూళ్లేక తల విరిచేశావ్, అంతేనా? " అన్నాడు రంగయ్య, ఏమీ అనకుండా అలానే చూస్తూ నిలబడ్డ కొడుకుతో.

"అదే మంచిపని. లేకపోతే ఆ జీవుడు ఎంత హింస పడేది! ఎలాగూ చచ్చేదే. డేగ దెబ్బతిని బతికిన పక్షిని నేనింత వరకూ చూళ్లా" అని కొంగని తీసుకుని ఇంటెనక్కెళ్లాడు రంగయ్య.



వీరభద్రం ముందు నుంచుని ఎప్పుడూ మాట్లాడని క్రిష్ణ ఇప్పుడొచ్చి నుంచుని "నాన్నా" అన్నాడు.

"ఊ" అన్నాడాయన. ఆయన మామూలుగానే ఊ అన్నా అది ఉరిమినట్లుంది. క్రిష్ణ గుండెధైర్యం తెచ్చుకుని "అన్నయ్య లాగే కైకలూరెళ్ళి నేనూ చదువుకుంటా" అన్నాడు.

"మనింట్లో అన్నయ్య చదువుకుంటున్నాడు, చాల్దా" ఇంటికొకడు చదివితే చాలదా అని ఆయన ఉద్దేశం.

క్రిష్ణ కాస్త ఆలోచించి "అన్నయ్య చదువుకుంటే అన్నయ్యకి చదువొస్తుంది. చదువొచ్చిన వాళ్ళకే ఉజ్జోగమొస్తుంది. నాకేమీ రాదుగా"

"ఓహో! చదువుకుని ఉజ్జోగం చేస్తావా? సరే. మరిప్పుడు నువ్వు చేస్తున్న పనులన్నీ ఎవడు చేస్తాడు? "

"చిన్నన్నయ్యకిప్పుడు తగ్గిపోయి బాగానే ఉన్నాడుగా? "

"ఆహా! వాడికి నీ పని అప్పగించి నువ్వు మీ అన్నలాగా చదూకోటానికెల్తానంటావ్"

మాట్లాడకుండా నిలబడ్డాడు క్రిష్ణ.

"మరి నీ చిన్నన్నక్కూడా చదువుకుని ఉజ్జోగం చెయ్యాలనిపిస్తే అప్పుడేం చేద్దాం? "

"నేనాడినడిగా! నాకూ ఆ సదువుకూ పడదు లేరా. ఎవసాయమే చేసుకుంటా అన్నాడు" అని గబగబా చెప్పేసి ఊపిరి పీల్చుకున్నాడు.

"సరే. అయితే బుద్ధిగా చదువుకో" అన్నాడు వీరభద్రం.

మళ్లీ ఆయనే "మరెప్పట్నించి మొదలెడ్తా? నువ్వు సదివింది రెండేగా. మూడులో జేరతావా? " అంటూ క్రిష్ణని ఎగాదిగా చూశాడు.

"అహా కాదు. సెలవుల్లో రోజూ పెద్దన్నయ్య నా దగ్గర కూచుని మూడు, నాలుగు పుస్తకాలు సదివిత్తన్నాడు. ఈ సెలవలయ్యిపోయి బళ్ళు తెరవగానే పరీక్ష పెట్టి అయిదులో చేర్చుకుంటారంట. నేను

అయిదులో చేరొచ్చుంటన్నాడు అన్నయ్యా"

"ఓహో! అన్నదమ్ములిద్దరూ కలిసి ఆలో చిసిత్తన్నారా.. మరింకేం? నీ సదువు సంగతి మీ అన్నే చూసుకుంటాడు. నువ్వు వెర్రివేషాలు వెయ్యకుండా శ్రద్ధగా చదువుకో, పో"

క్రిష్ణ గుండెల మీద బరువు దిగింది. తండ్రి దగ్గర నుంచి మెల్లిగా నడుచు కుంటూ గుమ్మం దాకా వచ్చి అక్కడ్నించి ఒక్క పరుగు పెట్టాడు పెద్దన్నయ్య మధుతో ఈ శుభవార్త చెప్పటానికి.

★ ★ ★

కొల్లేట్లో కడుపు నిండా తిని చావిట్లోకొచ్చిన గేదెలు వాటి కట్టుగొయ్య దగ్గరికి అవి వచ్చి నిలబడ్డాయి. వాటి వెనకే వచ్చిన శీను గబగబా వాటిని కట్టేసి గాట్లో వరిగడ్డి వేశాడు. బద్ధకంగా పడు కుని తల్లిని చూసి లేచి 'అంబా' అంటున్న దూడ వెన్నుమీద తట్టి "కాసేపుండు. అమ్మొచ్చి నిన్నిడుత్తుందిలే" అంటూ వాకిట్లోకొచ్చాడు శీను.

దుమ్మూదూగరాతో నిండిన ఒళ్ళు, తలకో గుడ్డ, మొలకో గోచీ, ముక్కుకో కాడా, చెవికో పోగుతో ఉన్న శీనుని మండిగం పక్కన కూర్చుని బియ్యం ఏరు కుంటున్న లక్ష్మమ్మ చూసింది.

రాబోయే రోజుల్ని తల్చుకుంటుంటే ఆమెకి దుఃఖం ఆగటంలేదు.

మొన్నటిదాకా ఏటివార నాలుగెకరాలుం దిలే అనే ధైర్యం లక్ష్మమ్మది. వరస ములకల్తో అప్పు కింద జమైపోయి యివ్వాళ అదీ లేదు.

అపురూపంగా కని పెంచుకుంటున్న ఒక్కగానొక్క కొడుక్కివ్వటానికి సెంటు భూమి లేదు. 'ఆడెట్టా బతుకుతాడు? తమనెట్టా కడతేరుత్తాడు' అనే ఆలోచనతో ఆవిడ దుఃఖపుటేరైపోతోంది.

ఇద్దరాడపిల్లలున్నారంటే వారి దారి వేరు. పెద్దది శకుంతలకు పెళ్ళయింది. పిల్లలు. దాని తిప్పలది పడుతాంది. రెండోది ఝాన్సీ. అక్క దగ్గర చేరి, అక్కకి సాయంగా ఉంటూ చదువుతోంది. పంతు లమ్మనవుతానంటుంది. అవుతుందేమో. దానికి పెళ్ళి చెయ్యటమే కష్టం. పెళ్ళిచేసి పంపాక దాని సంసారం అది చూసుకుం టుంది గానీ తమ్ముడికేం చెయ్యగలుగు తుంది? వీడిట్టా బురద పిసుక్కోవటమే. అనుకోవటమే గాని బురద పిసుక్కోటానికి కూడా కాస్తంత భూమి లేదు.

నలభై ఏళ్ళ వయసులో ఇక కొడుకుని కనే భాగ్యం లేదని గుండె రాయి చేసుకు న్నాక కడుపులో పడ్డాడు శీను. తోటి వాళ్ళంతా ఈ వయసులో కడుపేంటని ఎగతాళి చేశారు. ఎవరెన్ననుకున్నా శీను పుట్టాక తన మొరాలకించినందుకు దేవు డికో దణ్ణం పెట్టుకుని వాడిని కంటికి రెప్పలా కాపాడుకొస్తోంది. నలుగురు కొడుకులు పుట్టి పోయాక మిగిలిన కొడుకు వీడు. వీడికేం కీడు మూడకుండా మూడోనెల్లో చాటలో పెట్టి పెంటదిబ్బ మీద వదిలేసింది. తీసుకొచ్చినవాళ్ళకి రెండ్రూపాయలిచ్చి కొనుక్కున్నట్టు, ఆ ఆచారం పాటించింది. గంగిరెడ్లాళ్ళకి ఇచ్చి మళ్ళీ తెచ్చుకుంది. వాడికి ఊపిరి నిలబడా లని చెయ్యని పని లేదు. మొక్కని దేవుడు లేడు. దేవుళ్ళందరూ కరుణించి వాడు బతికి బట్టకట్టాడు. 'మేం బతికిచ్చాం. నువ్వాడికేం బతుకు ఇస్తా' అని సవాలు చేస్తున్నట్టు దేవుళ్ళంతా కలిసి భూమి లాక్కున్నట్టయింది.

లక్ష్మమ్మ పైటచెంగుతో ముక్కూ, కళ్ళూ తుడుచుకుంది. ఆవిడకు ఆ వేళ తన జీవి తమంతా గుర్తొస్తోంది. గుండె మండు తోంది. అమ్మ పుట్టిన ఊరు కవుతరం నుంచి తల్లీతండ్రీ చచ్చిపోతే తమ్ముళ్ళూ చెల్లెల్ని తీసుకుని చౌటపల్లి అత్తగారింటికొ

చ్చింది. ఒచ్చింది మొదలు చాకిరే చాకిరి. గంపెడుమందున్న ఇల్లు. పెళ్ళిళ్లు, చావులు.. అన్నిటికీ తన ఒళ్ళే హూనమయింది. అయినా ఎన్నడూ 'నాక్కష్టంగా ఉంది, ఇంక నా వల్ల కాదు' అన్న మాట నోట్లోంచి రానివ్వలా.

కొల్లేట్లో మోకాటి నీళ్ళల్లో దమ్ము చేస్తున్న దున్నపోతుల్లాగానే, తలొంచుకుని చేస్తూ పోవటమే, కాడి లాగుతూ పోవటమే.

మామ చచ్చిపోతూ తన చేతులు పట్టుకుని కన్నీళ్ళు పెట్టుకుంటూ "అమ్మా! నన్ను కన్నతల్లి కన్నా బాగా చూసుకున్నావే" అంటే అప్పుడు కళ్ళవెంట ఎందుకు నీళ్ళు కారాయో.. అవి కన్నీళ్లో కాదో కూడా తెలియదు.

ఇంతమందిని మాట రాకుండా చూసినందుకు తనకి మిగిలిందేమిటి? చేతికి చిప్ప. ఆ చిప్పే ఇవ్వాలి కొడుక్కి. ఒక్కగానొక్కడు. గొడ్లని కాస్తున్నాడు. రేపెట్టా బతుకుతాడు?

ఆయన చూస్తే మారాజు. ఏమీ పట్టదు. చీకూచింతా లేదు. 'మన మంచి పనులే మన పిల్లలకి మంచి చేస్తాయి. నువ్వు బయపడమాకె' అంటాడు.

ఏం మంచి జరుగుతోంది? ఆయనని మాత్రం తప్పు పట్టటానికేముంది? ఎప్పుడూ రెక్కలు ముక్కలు చేసుకుంటూనే ఉంటాడు. పొలంలో గొడ్డుచాకిరీ చేస్తాడు. ఇక్కడ వరదలొచ్చి పొలంలో పనుల్లేకపోతే చౌటపల్లిలో రెండెకరాలు కవులుకి తీసుకుని చేస్తాడు.

పొలం పనులయిపోతే ఎవరింటి పైకప్పు తీసివేస్తున్నా అక్కడ పైన ఈయనుండాల్సిందే. గడ్డివామేస్తున్నా, కుప్పలేస్తున్నా ఈయన పైకెక్కకపోతే కుదరదు.

'రంగయ్యగారంత సుతారంగా మరొకళ్లెయ్యలేరు' అన్న మాట చాలు ఆయనకి. సొంతపనులు మానుకుని ఎళ్ళి ఆ పనులు చేస్తాడు. తన కొడుకు సంగతేంటని ఆలోచించడు. మళ్ళీ కొడుకంటే ప్రాణం. భుజాల మీంచి దించడు. 'మాయ్యా', 'మా బాబు' అని తప్ప 'అరే', 'ఉరే' అనడు. ప్రాణం పోయినా ఒక్క దెబ్బెయ్యడు. మరి వీడు మడిచెక్కలేక ఎన్ని దెబ్బలు తినాలో బతకటానికని ఆలోచించడు. 'మాయ్యకేం మారాజు గదూ' అని మురిసిపోతాడు.

నాలుగెకరాలు. ఏటివార పొలం. ఎంత లేదన్నా నలభై బస్తాలు పండేది. వాడి బతుకెళ్ళమారిపోయేది. అదికాత్తా అమ్మేశాడు.

లక్ష్మమ్మకు పొగిలిపొగిలి ఏడుపొస్తోంది. కడుపులోంచి భయం పుట్టుకొస్తోంది. కొడుకుని తల్చుకుంటే కన్నీరాగటంలేదు.

'అమ్మా!' అనే పిలుపుతో బతుకు భయం నుంచి బైటపడి శీనూ దిక్కు చూసింది లక్ష్మమ్మ.

వాకిట్లో ఉన్న తొట్లోనుంచి నాలుగు చెంబులు ఒంటిమీద దిమ్మరించుకుని "అమ్మా... తుడవ్వే" అన్నాడు, ఎర్రటి ఒంటి మీద నుంచి కారుతున్న నీళ్ళ ముత్యాల్ని చూసుకుంటూ.

లక్ష్మమ్మ లేచి లోనికెళ్ళి తుండు తెచ్చింది. శీను ఒళ్ళయితే తుడిచిందిగానీ తన కళ్ళు తుడుచుకోలేకపోయింది.

"ఎందుకమ్మా ఏడుత్తున్నా? " అన్నాడు శీను బిత్తరపోయి. తల్లి ఏడవటం వాడింత వరకూ చూడలా.

"ఏటివార పొలం మీ అయ్య అమ్మేశాడ్రా నాయనా" అని బావురుమంది లక్ష్మమ్మ.

శీను ఒక నిట్టూర్పు ఒదిలాడు. 'అమ్మయ్య' అనుకున్నాడు. వాడింకేం జరిగిందోనని భయపడ్డాడు.



పొలాలు అమ్ముకుంటారు కొనుక్కుంటారు. అది జరగటం వాడికి తెలుసు. ఇపుడు అమ్ముకుంటే తర్వాత కొనుక్కుంటాం. అమ్మెందుకింత ఏడుపేడ్చింది? ఏమైనా తల్లిని ఓదార్చాలనిపించింది.

"మళ్ళీ కొనుక్కుందాంలేవే- ఏడవమాక. నే కొనిత్తాలే" అన్నాడు ఏడేళ్ళ శీను. వాడన్న తీరుకి లక్ష్మమ్మకి మరింత ఏడుపొచ్చింది.

తల్లి ఆ తీరుగా ఏడుస్తుంటే శీనూకి ఏడుపొచ్చిందిగానీ తల్లి ఏడవటం నచ్చలేదు. నాన్న ఏడవలేదుగదా. అమ్మెందుకేడవాలి? అసలు పొలంలో పనిచేసేది- ఎప్పుడూ పొలంకాడే ఉండేది నాన్న. ఆయన శుబ్బరంగా ఉన్నాడు.

తల్లి ఏడుపు ఆపితే బాగుండుననిపించింది శీనుకి.

"అమ్మా- ఆకలేత్తందే-" అన్నాడు తను కళ్ళు తుడుచుకుంటూ.

"రాయ్యా- పైటాలన్నం తిందూగాని. ఎంతాకలిమీదొచ్చావో. నా ఏడుపుతో సరిపోయింది" అంటూ శీనూని లోపలికి తీసుకుపోయింది.

★ ★ ★

ఉరిమిన మబ్బు కురవకుండా పోతుందా! ఆకాశం నిండా నల్లటి మబ్బులు కమ్మడమేంటి ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన మొదలైంది. ఊళ్ళో మనుషులందరి మొహాల మీదా కారుమబ్బులు తాండవిస్తున్నాయి. నవంబరు చివరి వారంలో అనుకోకుండా కురుస్తున్న కుంభవర్షం. పెద్ద దొడ్డిలో, పులిదొడ్డిలో లాడికోడు దగ్గరా ఉన్న మెరకల్లో వరి పొలాలన్నీ పంటతో కళకళలాడుతున్న సమయం. కొన్ని పొలాలు కోతల మీదా, కొన్ని పొలాలు కుప్పల్తో, కొన్ని కుప్పనూర్పిడులైపోయి కళ్ళంలో రాశుల మీద ఉన్న పంట. ఉన్నట్టుండి ప్రళయ భీకరంగా ఉన్న ఆకాశం. రైతుల మనసుల్లో తుఫాను. ఎటెళ్ళడానికీ లేదు. ఏం చెయ్యడానికీ లేదు. కొల్లేరు 'వార' దాటి ఊరి మీద కొస్తోంది.

పోయినేడాది ఊడ్చిన వారానికి వరద ముంచెత్తి పదిహేను రోజులు చేలల్లో నీళ్ళు నిలబడి వరినాట్లు కుళ్ళిపోయే వరకూ పోలేదు. ఎక్కడెక్కడికో వెళ్ళి 'నారు' తెచ్చుకుని- మళ్ళీ ఊడిస్తే పొట్టల మీద వాన. సగానికి సగం దిగుబడి. పెట్టిన ఖర్చులు కూడా రాలా. ఈసారి ఇట్లాగయింది. నోటి దగ్గరి పంటని లాగేసుకున్న కొల్లేరు, గూడలేసుకుని కొందరు, తాటాకు గొడుగులేసుకుని కొందరు తడుస్తూ కొందరు కాకయ్యగారి వసారాలో చేరారు.

"ఏం చెయ్యాలి? "

"ఏం చేత్తాం"

"మన చేతిలో ఏముంది"

ఉన్నట్టుండి పురుషోత్తం గోడకోమూల కూలబడి నోట్లో పైపంచ దూర్చుకుంటూ ఏడుపునాపుకుంటున్నాడు.

నలుగురూ పురుషోత్తం చుట్టూ చేరి, నాలుగు మాటలు చెప్తున్నారు. "ఓరూరు కోరా! పెద్ద- నీకొక్కడికే పంట పోతాందా? "

"కాదులే. రేప్పొద్దున్నే కాటా ఏసి లారీ లెక్కిద్దామనుకున్నాడు. పండిన పంటంతా రాశిమీదుంది" జాలిగా అన్నాడు చెరుకూరి సూర్యనారాయణ.

'రాశిమీదుంటేంటి? కుప్పమీదుంటేంటి? పన మీదుంటేంటి? ఎట్టున్నా ఈ మహమ్మారికి నైవేద్యమేగా? " కసిగా అన్నాడు పొట్లూరి సుబ్బారావు

"ఒక్క రోజు.. ఒక్క రోజు.." ఏడుపునా పుకోలేక బావురుమన్నాడు పురుషోత్తం. పైకేడుస్తోంది పురుషోత్తమొక్కడే గానీ అక్కడున్న వాళ్ళందరూ లోన ఏడుస్తున్న వాళ్ళే. ఏడవడానిక్కూడా శక్తి లేకుండా అయిపోయినవాళ్లే. ఊరూ ఊరంతా ఏడుస్తోంది.

అంతలోనే- వీళ్ళ కన్నీళ్ళు కూడా కలిసి పొంగిందా అన్నట్టు ఊళ్ళోకి వచ్చేసింది కొల్లేరు. ప్రతి కొంపా కొల్లేరయిపోయింది. వీధుల్లోకొచ్చిన కొల్లేరు వీధంట పోకుండా ప్రతి గుమ్మంలో నుంచీ తొంగి చూసి, లోనిక్కూడా వచ్చేసింది. ఇంట్లో కిందున్న సామాన్లని ఎత్తుగా ఉట్టెల్లో, గూళ్ళలో, భోషాణాల మీదా సర్దుకుంటున్నారు. కొంపల్లో కొల్లేరు పెరుగుతోంది. మనుషుల బుర్రల్లో సముద్రాలే సముద్రాలు... దుఃఖసముద్రాలు.

★ ★ ★

కొల్లేటి వరద తగ్గి రెండు వారాలయింది. సంక్రాంతి నెలపట్టాల్సిన సమయం. ఊర్లో ఒక్కరి మొహంలోనూ సంతోషం మచ్చుక్కూడా కన్పట్టంలా. కష్టపడి పండించిన పంటలో ఒక్క గింజ కూడా ఒక్కరికీ దక్కలా. ఈ రైతులసలు ఈ వ్యవసాయం ఎందుకు చెయ్యాలో ఎవరికీ తెలియటంలా. వ్యవసాయం చెయ్యక ఏం చెయ్యాలో ఆ రైతులకు తెలియదు.

బొబ్బర్లంక నుంచీ, నాగాయలంక నుంచీ, చౌటపల్లి నుంచీ, కలవపూడి నుంచీ ఎప్పుడో వచ్చి, ఇక్కడే స్థిరపడిన ఆ కుటుంబాల వారందరికీ తమ పూర్వులు అసలిక్కడికి, ఈ కొల్లేటి రొంపిలోకి ఎందుకొచ్చి పడ్డారో, పడి ఏం సుఖం బావుకున్నారో తెలియటంలా.

చేసిన అప్పులు ఎప్పటికి ఎలా తీరతయ్యో తెలియటంలా. కొందరు పిల్లలు చదువుకుంటున్నారిప్పుడిప్పుడే. వాళ్ళకి పుస్తకాలనీ, బట్టలనీ, పరీక్ష ఫీజులనీ... ఇవన్నీ ఇప్పుడు కొత్త ఖర్చులు. పెళ్ళిళ్ళు... పురుళ్ళూ... చావులు... ఒకటా. రోజూ నాలుగేళ్ళూ లోనికి పోడానికేం చెయ్యాలో తెలియని స్థితి. ప్రతి ఇల్లూ అశాంతి నిలయంలా తయారయి వుంది. ఎవర్ని చూసినా మళ్ళీ ఏదో ప్రళయం ముంచుకొస్తున్నట్టే ఉంది.

అలాంటి ఒకానొక రోజున కాకయ్యగారి అరుగులపై మాటామంతీ లేకుండా దిగులుగా ఊరి పెద్దలంతా కూర్చుని ఉన్నారు. ఊళ్ళో కాస్త మోతుబరులుగా ఉన్న కాకయ్య, పెద్ద రాఘవయ్య, సుబ్బయ్యల దగ్గర తప్ప మిగిలిన ఏ కుటుంబానికీ ఏ ఆధారమూ లేకుండాపోయింది. అందరి ఆశలూ చేతికందబోయే పంటల మీదే. అది కాస్తా ములకపాలయింది. ఆడవాళ్ళూ మగవాళ్ళూ అనే తేడా లేకుండా అందరూ శోకంతో పగిలేలా ఉన్నారు. ఊరంతా ఒంటినిట్టాడి పాకలు. పెద్దవనుకుంటే రెండు నిట్టాడి పాకలే. కొందరు జమ్ముతో గోడలు కట్టకుంటే, కొందరు మట్టితో కట్టుకున్నారు. దాదాపు ఇళ్ళన్నీ మట్టిగోడలవే. అవి నాని కూలిపోతే, జమ్ము గోడలు కుళ్ళి కూలిపోయాయి. అవన్నీ ఇంటిల్లిపాదీ తంటాలు పడి సరిచేసుకుంటారు. కానీ రాబోయే రోజులెలా గడవాలి? అందరి మనసుల్లోనూ ఇదే ఆవేదన, ఆక్రోశం.

కాకయ్య అందర్నీ ఒకసారి చూసి

గొంతు సవరించుకుని "నారు పోసినవాడే నీరు పోత్తాడని... ఇట్టాంటప్పుడే గుండె దిటవు చేసుకోవాలి. కష్టాలు మనుషులకే వత్తాయి, మానులకి రావు" అన్నాడు.

అక్కడున్న వాళ్ళలో వెంకన్న వేదాం తిలా నవ్వి "తాతా! నువ్వు చెప్పింది వేరే చోటయితే నిజమే కానీ మనముంటున్నది కొల్లేట్లో. ఇక్కడ మనం నారు పోత్తాం, నాట్లేత్తాం. కలుపు తీత్తాం. పంట పండు తుంది. అప్పుడు దేవుడు మన పంట మీద నీరు పోస్తాడు. మనం నారు పోత్తే, వాడు నీరు పోత్తాడు. కష్టాలు మానులకి రావన్నావు. పెద్దదొడ్డి కాడికెళ్ళి చూడు. పెద్దపెద్ద తుమ్మ, సీమతుమ్మ చెట్లు కూడా కూలిపోయాయి. మనముండేది కొల్లేరే. ఇక్కడ పుట్టి పెరిగే పంటలకే కాదు, పశు వులకి, మానులకీ కూడా కష్టాలే" అన్నాడు.

ఆ అరుగు మీద కూర్చున్న వాళ్ళల్లో ప దహారేళ్ల నుంచి అరవై ఏళ్ళవాళ్ళ వరకూ ఉన్నారు. వయసు తేడా లేకుండా అందరి కళ్ళూ ఆగకుండా నీళ్ళు కార్తున్నాయి. ముక్కులు తుడుచుకుంటున్నారు. కొందరు పై పంచలు నోటికడ్డం పెట్టుకుని ఏడుత్తున్నారు. వాళ్ళకి రాబోయే రోజు లన్నీ పగలూ, రాత్రీ తేడా లేకుండా చీకటి తప్ప వెలుతురు చార కూడా కనపడటం లేదు.

ఊళ్ళో ఒకరికి కష్టమొస్తే నలుగురు మూగి వారి కష్టాన్ని తీరుస్తారు. సాయప డతారు. ఊరందరికీ వచ్చిన కష్టం ఎవరు తీర్చాలి? తీర్చాల్సిన ప్రభుత్వానికి ఈ ఊ ళ్లు, ఈ మనుషులూ కనపడరు. ప్రభుత్వాలున్నయ్యనీ, అవి తమ కష్టాన్ని తీర్చచ్చనీ కూడా ఈ మనుషులకి తెల వదు.

"ఈ కొల్లేట్లో ఉండలేం" అన్నాడు పరం ధామయ్య.

"నిన్నీ కొల్లేరు ఉండమని బలవంత పెడతుందా? ఎల్లు, ఉండలేకపోతే" అన్నాడు భూపతయ్య.

"ఎక్కడికెల్లాలి? "

"అదేగద! ఎక్కడా బతకలేకే ఇక్కడి కొచ్చి పడ్డాం"

"బతకలేక కూడా కాదులేరా. సారవంత మైన బూవులు సౌకలో దొరుకుతున్నాయ ని, ఏదో బావుకుందామనీ వచ్చాం"

"ఒక పంట చేతికొత్తే రెండు పంటలు జలదేవతకు బలివ్వాలని తెలిత్తే వచ్చేవా ళ్ళమా? "

"ఇప్పుడు తెల్సిందిగా.. పదండి పోదాం"

"ఎక్కడికి? "

"అది తెలిత్తే ఇక్కడెందుకుంటాం? "

"అదే మరి. ఉన్నాం కాబట్టి... ఇక్కడే పడుంటాం కాబట్టి... ఎట్టా బతకాలి? పెళ్ళాం బిడ్డలకేం పెట్టాలి? వాళ్ళకేదో ఒరగబెట్టక పోయినా నాలుగేళ్ళా నోట్లోకె ళ్ళేట్టు చూడాలంటే ఏం చెయ్యాలి? అదే మనం ఆలోసించాలి" అన్నాడు రంగయ్య.

వీరభద్రం అప్పుడే కాకయ్యగారి వసారా లోకి వస్తూ "రేత్రి బాగా పొద్దుబోయినాక పిచ్చయ్యొచ్చాడు" అంటూ కూచున్నాడు.

కాకయ్యగారి అరుగుల మీదా, వసారా లోనూ కూర్చోనున్న వాళ్ళంతా ఒక్కసా రిగా "ఆ! పిచ్చయ్యొచ్చాడా? " అన్నారు.

"పిచ్చయ్యొచ్చాడంట"

"పిచ్చయ్యా.. రేత్రా? "

"ఆ! పొద్దుబోయాక.."

అందరిలోనూ ఒక సంతోషం! ఒక కల వరం! ఒక ఆత్రుత!

"ఎన్నేళ్ళయింది పిచ్చయ్యని చూసి? "

"పోయిన సారొచ్చినప్పుడు ఇట్టాగే రేత్రొచ్చి తెల్లారకుండా ఎల్లిపోయాడు"

"అదీ రంగయ్య మావ సెప్తే తెల్సింది. ల్యాకపోతే తెలవకపోను"

అప్పుడు చిన్న ఇనప చక్రాన్ని కర్రము

క్కతో నడిపించుకుంటూ ఉడిగీ తొడు క్కని వెళ్తున్న శీనూని పిల్చి కాకయ్య గారు "అరే శీనూ.. అట్టాగే ఉగెత్తుకెళ్ళి మీ అత్తింట్లో మీ పిచ్చయ్య బావని పిల్చుకు రారా. మేం పిలుత్తున్నామని సెప్పు" అన్నాడు.

"పిచ్చయ్య బావయ్యా!" అని నోరు తెరి చాడు శీను, కర్రకున్న మేకుతో చక్రాన్ని పడిపోకుండా నిలబెట్టి.

"ఆ.. రేత్రొచ్చాడంటలే.. ఎల్లెల్లు. ఇక్క డున్నట్టు రావాలి"

"సరే" అని చక్రాన్ని వేగంగా కొట్టు కుంటూ పరిగెత్తాడు. అంతే వేగంగా వెన క్కొచ్చి "వత్తన్నాడు" అని చెప్పి, "అమ్మా.. అమ్మా!" అంటూ ఇంట్లో కురికాడు పిచ్చియ్య బావొచ్చాడని చెప్పడానికి. తెల్లటి పైజామా మీద తెల్లటి లాల్చీ వేసుకుని ఆ ఊరికి అతకని విధంగా పిచ్చయ్య వచ్చాడు, ముఖం మీద చెరగని చిరున వ్వుతో. ఓ పక్కనే మధు. మరో పక్క కిష్టుడు, రాజులూ.

"రా.. రా.. పిచ్చయ్యా! ఎప్పుడొ చ్చావయ్యా" అని అందరూ ఒకేసారి పల్కరి స్తుంటే, రంగయ్య దగ్గరికెళ్ళి, "ఎట్టు న్నావయ్యా? " అన్నాడు పిచ్చయ్య.

"ఆ! ఆ! బాగున్నా" అన్నాడు రంగయ్య.

"ఒక్కసారి పెద్దత్తయ్యకి కన్పడి ఇప్పుడే వస్తా" అంటూ ఎదురొచ్చిన శీనూతో పాటు ఇంట్లోకి నడిచాడు పిచ్చయ్య.

అప్పటికే లక్ష్మమ్మ గుమ్మంలోనే ఎదు రుపడి నవ్వుతూ కళ్ళనిండా పిచ్చయ్యని చూసుకుంటూ "ఒంట్లో బాగుంటుంద య్యా? " అంది

"నా ఒంటికేం..? బస్కీలు తీసే ఒళ్ళు. నువ్వెట్టా వున్నావత్తయ్యా? " అన్నాడు ప్రేమగా.

"ఉన్నాం ఇట్టా... వరదొచ్చి అందర్నీ ముంచేసిందిగా. ఇదుగో దీనిమీద కూచో" అని ఒక పెద్దపీట చూపించింది.

"లేదులే. మళ్ళీ వస్తా. అరుగుల మీద ఊరి పెద్దలూ, పెదమావయ్యా, కాకయ్య తాతా, అందరూ కూచుని రమ్మంటే ఒక్క సారి ముందుగా నిన్ను చూసెళ్దామని వచ్చా. వాళ్ళతో కాసేపు మాట్టాడి మళ్ళీ వస్తా అత్తయ్యా"

"సర్లే. భోజనానికొచ్చెయ్యి. వంట చేస్తా"

"కాదులే. పిన్ని వచ్చేటప్పుడు మరీ మరీ చెప్పింది, కొరమీను వండుతున్నా.. ఎక్కడా తినమాకని" అన్నాడు నవ్వుతూ.

"సర్లే. సాయంత్రమన్నా ఇక్కడికి రా"

"ఉంటే ఇక్కడికి రాక ఎక్కడికి పోతాను. కానీ సాయంత్రానికి బెజవాడ వెళ్ళాలి. కాస్త పనుంది"

"నీకు పని లేందెప్పుడు? ఎప్పుడొచ్చినా చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొత్తావ్. అసల్రావటమే తగ్గించేశావ్"

"లేదులే. ఈసారి తొందరగా వస్తా. ముందిక్కడికే వస్తా. సరేనా? నాకిష్టమైనవీ, నీకిష్టమైనవీ అన్నీ వండి పెడుదువుగాని"

"ఆ.. మాటలు నేర్చావ్" అంది లక్ష్మమ్మ మురిపెంగా.

"నేర్పింది నువ్వూ, పెదమావయ్యేగా అత్తయ్యా" అన్నాడు. అంటుంటేనే అతని కళ్ళల్లో నీళ్ళూరాయి.

"ఊరుకో పిచ్చాడా!" అని లక్ష్మమ్మ అతని భుజం మీద తట్టింది.

భుజం మీద అత్తచేతిని తన రెండు చేతుల్తోనూ పట్టుకుని "వెళ్ళేముందు వచ్చెళ్తాలే అత్తయ్యా" అని బైటికెళ్ళబోతున్న పిచ్చయ్యని "ఒక్క చిటం" అని ఆపి అటూ ఇటూ వెతికి "హూ.. ఏమీ లేవు. ఇదుగో ఈ ముక్క నోట్టో ఏసుకో" అని చిన్న పటిక బెల్లం ముక్క ఇచ్చింది.

నవ్వుతూ దాన్ని తుంపి చిన్నముక్క తన నోట్లో వేసుకుని పెద్దముక్క శీనూ నోట్లో పెట్టాడు.

"ఎల్తా ఎల్తా కన్పడెల్లయ్య" అంది లక్ష్మమ్మ.

"ఆ కన్పడ్తా" అంటూ బైటికి అరుగుల దగ్గరికి నడిచాడు పిచ్చయ్య.



పిచ్చయ్య అని ఊళ్ళో వాళ్ళందరూ ప్రేమగా పిల్చుకునే అట్లూరి పిచ్చేశ్వర్రావు పులపర్రులో డిగ్రీ దాకా చదివిన మొదటి వాడు. చదువేగాక ఊరందరితో చనువుగా ఉంటూ అన్ని సమస్యల గురించి అలోచించే గుణమూ ఉంది. పిచ్చయ్య కైకలూరు స్కూల్లో చదువుతున్న రోజుల్లో ఆంధ్రాలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడుతోంది. ప్రతి గ్రామంలో యువకుల ద్వారా సోషలిస్టు భావాలు ప్రవేశిస్తున్నాయి. అప్పుడే తెలంగాణాలో సాయుధ రైతాంగ పోరాటం మొదలవబోతోంది. ఆ పోరాట జ్వాలలు బెజవాడలో, గుడివాడలో, కైకలూరులో కూడా వెలుగునిచ్చాయి. కైకలూరు స్కూల్లో పెద్ద క్లాసుల పిల్లలందరూ విద్యార్థి సంఘంలో ఉత్సాహవంతులైన సభ్యులయ్యారు. పిచ్చయ్య చైతన్యం కేవలం స్కూలుకే పరిమితం గాక ఊళ్ళో యువజనులనూ, బాలలనూ పోగేసి సంఘాలుగా చేశాడు. ఆటలూ,

పాటలూ, వ్యాయామం, కర్రసాము ఇలాంటి వాటితో ఉత్సాహపరిచాడు. స్కూలు చదువు పూర్తయ్యాక ఎఫ్.ఏ చదువుతానని బందరులో చేరాడు. ఊళ్ళో సంఘాలను మధుకి అప్పజెప్పాడు. కాలేజీలో చదువుతూ కూడా ఉద్యమాలలో భాగమయ్యాడు. బెంగాల్ కరువు సందర్భంగా ఆ రాష్ట్రానికి వెళ్లిన బృందంలో పిచ్చయ్య కూడా ఉన్నాడు. ఊళ్లో వాళ్లందరికీ పిచ్చయ్య జీవిత ప్రయాణం కొత్తగా ఉండి ఆసక్తిగా చూసేవారు. వాళ్ళు పేర్లు కూడా వినని కలకత్తా, బొంబాయి, ఢిల్లీలు పిచ్చయ్య వెళ్ళొచ్చాడంటే వాళ్ళకెంత గొప్ప! కొంతకాలం నౌకాదళంలో పనిచేశాడు. ఉన్నచోట ఉండకుండా ఎక్కడెక్కడికో వెళ్ళి పెద్దపెద్ద పనులు చేస్తాడని చెప్పుకునే వారు. ఇదే అనుకుంటే తెలుగు ప్రజల్లో పెద్ద విప్లవ చైతన్యం తెచ్చిన త్రిపురనేని రామస్వామి చౌదరి గారమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడనేసరికి ఊళ్ళో అందరికీ ఏనుగెక్కినంత సంబరమయింది. మనూళ్ళో పుట్టి పెరిగి, మన రంగయ్యగారి మెడలమీదెక్కి మురుక్కాలవ దాటెళ్ళి చదువుకున్న పిచ్చయ్య చాలా గొప్పోడై అట్లూరి పిచ్చేశ్వర్రావయ్యాడని ఎంతో గొప్పగా అనుకుంటారు. ఈ కష్ట సమయంలో పిచ్చయ్య రాక అందరిలో ఏదో ఒక సంతోషాన్ని నింపింది. మనసుల్ని కాస్త తేలిక పరిచింది.

"ఆ.. రారా.. అయ్యా! అయినయ్యా అత్తా అల్లుళ్ళ పలకరింపులు" అంటూ పిల్చాడు కాకయ్య.

నవ్వుతూ వచ్చిన పిచ్చయ్యని తన పక్కన కూచోబెట్టుకుని "ఎట్టున్నాయ్యా? " అన్నాడు రంగయ్య.

"బాగున్నానే పెద్దమావయ్యా. నీ ఆరోగ్యం ఎలా ఉంది? "

"మాకేమయ్యా. వరదొచ్చి ఉన్నదంతా ఊడ్చేసింది. చేసేదేంలేక కడుపులో సల్ల కదలకుండా కూచ్చోటమే. నువ్వంటే ఉండ చోటుండకుండా తిరుగుతావయ్యే"

"ఇదివరకంత తిరుగుడు లేదులే ఇప్పుడు" నవ్వాడు పిచ్చయ్య.

"సరే మరిప్పుడు నువ్వేం జేత్తున్నా? " అన్నాడు పురుషోత్తం.

ఆయనవంక చూసి నవ్వుతూ "అట్లా అడిగితే ఏం చెప్పనూ? " అని కాస్త ఆగి, "చదువుకుంటూ.. రాసుకుంటూ... ఉండటమే" అన్నాడు

"ఏంటీ? ఇంకా సదువా? " అందరూ నోళ్ళు తెరిచారు.

"అంటే ఆ చదువు.. ఏదో స్కూలుకో, కాలేజీకో వెళ్ళి చదువుకోవటం కాదు"

"మరింకెక్కడికెళ్ళి సదువుతా? ఈ సదువుకంతం లేదా? అది కాదురా. నాసిన్నప్పట్నుంచి సతువుతున్నావే.. పెళ్ళయిందన్నారు. ఇంకా సతువుకోటమేంటోయ్? " అన్నాడు పిచ్చయ్యని చిన్నప్పుడు ఏడ్పించిన ఎంకట్రత్నం.

"మీకెలా చెప్పాలి? నేనిప్పుడు చదివేది, పరీక్షలకి కాదు. దేశంలో, ప్రపంచంలో రకరకాల భాషలు మాట్లాడేవాళ్ళున్నారు. వాళ్ళు ఆ భాషల్లో రకరకాల విషయాల మీద పుస్తకాలు రాశారు. రాస్తున్నారు. కథలు, నాటకాలు, వ్యాసాలు. అట్లా అవన్నీ చదివితే మనకి ఎన్నో విషయాలు తెలుస్తాయి"

"సరేరాబ్బాయ్! నీకెన్నో విషయాలు తెల్సుంటాయి గదా.. మరి మాకు రొండు సెప్పు.. వింటాం" అన్నాడు కాకయ్య.

పిచ్చయ్య నవ్వి "ఎందాకో ఎందుకు? ఈ మధ్యే కొల్లేరు గురించి కొన్ని విషయాలు చదివాను. అవి చెప్తాను వినండి..." కాస్తాగి, "మన కొల్లేరు చాలా పాతది" అన్నాడు.

అందరూ ఒక్కసారిగా పకపక బెకబెక

ఇకఇక నవ్వారు.

"వార్నీ! మన కొల్లేరు పాతదనే యిషయం ఎవడో రాత్తే అది సదివి మాకు సెబుతున్నావా? మాకు తెలవదులే? కొల్లేరు మన తాతముత్తాతల కాలంనుండీ ఉందిగదా! అదొకరు చెప్పాలా? " ఎంకట్రత్నం నవ్వాపుకోలేకపోతన్నాడు. మిగిలినవాళ్లూ నవ్వుతూనే ఉన్నారు.

అందరితో పాటు తనూ నవ్వి "శాలివాహన చక్రవర్తులని మన తెలుగు రాజుల్లో మొదటివాళ్ళు. మనం విన్న రాజులూ, చక్రవర్తులూ వాళ్ళంతా శాలివాహన చక్రవర్తుల తర్వాతి వాళ్ళే. ఆ శాలివాహనులు వేయించిన శిలాశాసనాల్లో కొల్లేరు గురించిన ప్రసక్తి ఉంది. అలాగే ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల నాణాలు మన కొల్లేరు దగ్గర దొరికాయి. దండి అనే మహాకవి కొల్లేరు గురించి రాశాడు. చైనా నుంచి వచ్చిన 'హ్యూయన్‌త్సాంగ్' అనే యాత్రికుడు కొల్లేరు గురించి రాశాడు. చాలా సుందరమైన సరస్సు అని, ఈ కొల్లేరు 260 చదరపు మైళ్ళ విస్తీర్ణం గలదనీ, దీనిలో వందకు పైగా పల్లెల్లో ప్రజలు బతుకుతున్నారనీ, సైబీరియా, ఫిలిప్పైన్స్, ఫిజీ దీవుల్నించి - అంటే లక్షలాది మైళ్ళ నుంచి గ్రేడన్ పెలికాన్, ఫ్లెమింగోలాంటి పక్షులు వలస వచ్చి, గుడ్లుపెట్టి సంతానోత్పత్తి చేసుకుని, తిరిగి పిల్లల్ని తీసుకుని వెళ్తాయని..." అలా చెప్తూ ఉన్న పిచ్చయ్య మాటల్ని అర్థం అయినా, కాకపోయినా మంత్రముగ్ధులై వింటున్నారు ఆ ఊరి జనం. ఆ సంగతుల్లో కొన్ని వారికీ తెలుసు. కొన్నసలు అర్థంగాలా. హ్యూయన్‌త్సాంగ్ అనే మాటే వాళ్ళ బుర్రలోకి ఎక్కలా. ఐనా పిచ్చయ్య చెప్పే తీరూ, పద్ధతి, ఆయన కంఠస్వరం.. అన్నీ కలిసి వారినలాగే కూచోబెట్టాయి.

పిచ్చయ్య చెప్పటం ఆపాక "అదిసరే గాని పిచ్చయ్యా.. ఇన్ని దేశాలు తిరిగావు. ఇన్ని పుస్తకాలు సదివావు. కొల్లేరంతటిది, ఇంతటిదని చెప్పావు. బాగానే ఉంది గాని, ఈ కొల్లేట్లో మేం పడుతున్న బాధలు నీకు తెలవనియ్యిగాదు. ఎందుకంటే నువ్వు యిక్కడ పుట్టి పెరిగినాడివే. మొన్నంటే మొన్న ఊరు ఊరంతా కష్టం గట్టెక్కినట్టే ననుకుని సంబరపడినంత సేపు పట్టలా.. కొల్లేరు మా కొంపల్ని నిలువునా ముంచేసింది. మా కడుపులు కొట్టేసింది. మమ్మల్నేం చెయ్యమంటా? మేం ఏం చేత్తే ఈ బాధలు తప్పుతయే? మేం చేసిన పాపమేంటి? " అన్నారొకరు.

"అరె ఊరుకోండిరా! మన ఖర్మకి ఆడేం జేత్తాడు? మన సమస్యని ఎవరూ పరిష్కరించలేరు. అందుకే 'కొంప కొల్లేరే', 'కొల్లేటి కాపురం' అని సామెతలు కూడా పుట్టినయ్యి"

"అదికాదు మామయ్యా! నేనివ్వాళ ఇక్కడికి రావటానికి కారణం ఉంది. మీ పంటలన్నీ నీట మునిగిపోయినయ్యనీ, ఊళ్ళకిఊళ్ళు నీటిలో ఉన్నయ్యనీ చదివే.. మీరెలా ఉన్నారో చూసి వెళ్దామనే వచ్చా! నేనింకా పదిరోజుల ముందే రావల్సి ఉంది. కానీ కుదరలా! మీ సమస్యకీ పరిష్కారం ఉంది. పోయినచోటే వెతకమ

'చతుర' నవలకు అంపశయ్య నవీన్ నవలా పురస్కారం

'చతుర' 2009 ఫిబ్రవరి సంచికలో ప్రచురితమైన శ్రీ వేంపల్లె గంగాధర్ **నేలదిగిన వాన** నవలకు **అంపశయ్య నవీన్ నవలా పురస్కారం** లభించింది. 2009 నుంచి 2011 మధ్య వెలువడిన ఆయా రచయితల తొలి నవలల్నే నిర్వాహకులు ఈ పురస్కారానికి పరిశీలించారు. ఈ నేపథ్యంలో 'నేలదిగిన వాన' పురస్కారం దక్కించుకుంది. గత ఏడాది కూడా చతురలో ప్రచురితమైన శ్రీ శిరంశెట్టి కాంతారావు నవల **'ఆకుపచ్చ విధ్వంసం'** ఈ పురస్కారానికి ఎంపికైన సంగతి విదితమే.



న్నారు" అన్నాడు పిచ్చయ్య.

"అంటే? "

"మన పంట ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే పొందాలి"

పురుషోత్తం ఎగతాళిగా నవ్వి, "పదండిరా.. పడవలేసుకుని కొల్లేట్లోకెళ్దాం. మా పంట మాకివ్వమని అడుగుదాం" అన్నాడు.

"ఎవర్నడుగుతాం? "

"ఇంకెవర్ని.. తీసుకుంది కొల్లేరేగా! కొల్లేటినే అడగాలి"

ఎవరిష్టమొచ్చినట్లు వాళ్ళని మాట్లాడనిచ్చి "ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మనం వెతకాలి, అంతే" అన్నాడు పిచ్చయ్య.

"సరే. చెప్పు, మా సమస్యకి పరిష్కారం ఏంటి? మమ్మల్నేం చెయ్యమంటావ్? " అన్నాడు వీరభద్రం.

"చెప్పడానికేముంది బాబాయ్.. చెప్తానుకాని, చెయ్యాల్సింది మీరు" అందర్నీ చూస్తూ అన్నాడు పిచ్చయ్య.

"మేమే చేస్తాం.. ఏంటది? "

"చేస్తాం.. అనేమాట ఎవరో ఒకరో ఇద్దరో, నలుగురో అంటే కాదు. అందరూ.. ఊరందరూ కలిసి ఒక్కమాట మీదుండి చేస్తే.. కష్టమే.. కాని అసాధ్యం కాదు. ఫలితం తప్పకుండా ఉంటుంది"

"సరే, చెప్పు"

"అందరూ కలిసి చేస్తారా? ముందది తేల్చండి"

ఒకళ్ళ మొఖాలొకళ్ళు చూసుకుంటూ, ఏంటని కళ్ళెగరేసి ప్రశ్నించుకుంటూ, చివరికి "అసలేం చెయ్యాలో చెప్పన్నయ్యా. పని తెలిస్తే దానికి అందరూ కలుస్తారా లేదా నేను చెప్తాను" అన్నాడు మధు.

"అవును. ఏం చెయ్యాలో చెప్పయ్యా. అవసరమైతే అందరూ కలిసేలా చేద్దాం" అన్నాడు రంగయ్య అనునయంగా.

"నిజానికి ఈ పని అంత కష్టం కూడా కాదు. మీరందరూ ఎప్పుడూ చేసే పనే. కాకపోతే ఎవరి పొలంలో వాళ్ళు చేసే పని అందరూ కలిసి ఒకే పొలంలో చెయ్యాలి. కలిసి కట్టుగా ఒక మాట మీద నిలబడి చెయ్యాలి"

"పనేంటో చెప్పు"

"ఎవరి పొలంలో చెయ్యాలో అదీ చెప్పు"

"చెప్తున్నా.. అందరూ జాగ్రత్తగా వినండి. మన కొల్లేట్లో నాలుగైదొందల

ఎకరాల మేర చుట్టూ గట్టు కట్టుకుని, లోపలున్న నీటిని తోడేసి, దానిలో దాళ్వా వ్యవసాయం చెయ్యాలి. ఊరందరూ కలి స్తేనే ఈ పని అవుతుంది. పొలం అంద రిదీ. పనీ అందరిదీ. పంట అందరిదీ. మూడు నెలలు తిరక్కుండా మీ కష్టాలు తీరుతాయ్. కేవలం మూడు నెలలు కష్ట పడండి. కష్టాల్నించి బైటపడండి. పంటతో గట్టెక్కండి" చాలా స్పష్టంగా, గట్టిగా చెప్పాడు పిచ్చయ్య.

"ఏమిటి? "

"ఏంటేంటి? "

"కొల్లేట్లోనా? "

"చుట్టూ గట్టు కట్టాలా? "

"నీళ్ళల్లో గట్టెట్టా కడతాం? "

"చుట్టూ నీళ్ళెట్టుకుని లోన ఎవసా యమా? "

"ఇదయ్యే పనేనా? "

"అసలందరూ కలిసి పని జేత్తారా? కొట్టుకు సావరూ? "

"అందరూ కలిత్తే బాగానే ఉంటుంది. పిచ్చయ్యేం సెప్పినా బాగా ఆలోచించే సెప్తాడు. నాకేమనిపిస్తాందంటే ఈసారి మనమంతా కలిసి ఆ పనిచేద్దామా అని. అందరం కలిత్తే మరి అదేమంత కష్టం కాదు" అన్నాడు రంగయ్య.

కుర్రాళ్ళకి బాగా హుషారొచ్చింది. ఒక్క సారిగా తమ ఆమోదం ప్రకటించారు.

"చేద్దాం! అన్నయ్య చెప్పినట్టు చేద్దాం" అన్నాడు రాజులు.

"అవును. అలా చెయ్యడం తప్ప మన కింకోమార్గం లేదు" అన్నాడు మధు.

పెద్దవాళ్ళంతా కుర్రకారుని చూశారు.

"మీరంతా చేద్దామంటే అట్టాగే చేద్దాం గానీ, దీంట్లోనూ కొన్ని చిక్కులెదురౌ త్తాయి. దిగేముందే అన్నీ జాగ్రత్తగా ఆలో చించి దిగాలి" అన్నాడు కాకయ్య.

"గవర్నమెంటు నుంచి ఏమబ్బెంతరం లేకుండానే చూసుకుంటా" అన్నాడు పెద్ద రాఘవయ్య.

"అవసరమైతే వాళ్ళకి కట్టాల్సిన తాసీ ళ్ళేవో కడదాం" అన్నాడు కాకయ్య.

"ఇవ్వాళే.. అంటే ఇప్పుడే ఎళ్ళి ఎక్క డ్నించి ఎక్కడిదాకా మనకి పనికొత్తంది అనేది కొందరెళ్ళి సూడాల. ఎన్నెకరాలుం టందో సుమారుగానైనా తెలవాలి"

"ఎన్ని కుటుంబాలున్నాయో అన్ని బాగాలా? ఎట్టా? "

"అట్టయితే ఎట్టా? కొన్ని కుటుంబాల్లో ఒక్క మగాడుంటే కొన్ని కుటుంబాల్లో నలుగురున్నారు. ఎంతమంది పనిచేత్తే అంతమందికీ వాటాలుండాల్సిందే"

"మరి మన అచ్చయ్యకి ఒక్కడు తప్ప ఆ కుటుంబంలో అందరూ ఆడపిల్లలే. ఆయనకొక్క బాగం అంటే ఇంటిల్లిపాదీ పస్తులుండాలా? "

"పగులెవురు పన్జెయ్యాల? రేత్రెవురు పన్జెయ్యాలా? "

అక్కడున్న అందరికీ అన్ని ప్రశ్నలు వచ్చాయి.

"ఆగండాగండి. అందరూ ఆగండి. మనం ఈ పని చేద్దామనుకుంటే అంతా ఒక పద్ధతి ప్రకారం సాగాలి. అంటే ఒక్కో పనికి ఒక్కొక్కర్ని బాధ్యుడిగా పెట్టాలి. ఆ పనికి సంబంధించి ఆయన చెప్పినట్టు చెయ్యాలి. అసలు ఈ పనిలో ఉన్న చిక్కులు, అనుమానాలూ అన్నీ రాసుకోరా మధూ! నువ్వూ, రాజులు, కృష్ణుడు మీ కుర్రాళ్లంతా కూచుని అందరూ అడిగే ప్రశ్నలూ, అన్ని సందేహాలూ ముందు రాసుకోండి. వాటిని మీరు కొందరు కూచుని ఎట్లా చెయ్యాలో ఆలోచించండి. అట్లాగే ఎవరు ఏ పని బాగా చేస్తారో రాయండి. వాళ్ళకి కొందర్ని ఇవ్వాలి. వాళ్ళెవరు? ఇంటికెంతమంది పనిచేసే మగాళ్ళున్నారు? ఆడపిల్లలు మట్టిపనులు

చెయ్యలేకపోవచ్చుగానీ వాళ్ళు చేసే పనులు వాళ్ళకీ ఉంటయ్యి. అన్నీ రాసుకుని మీరు ఆలోచించి రాయగల సమాధానాలు రాయండి. మళ్లీ అందరూ కూర్చుని నిర్ణయించుకోండి" పిచ్చయ్య ఒక్కొక్క మాటా చెబుతుంటే ఒక్కొక్కరి ముఖంలో ఆశ రేకెత్తుతోంది.

అరుగుమీద కూచున్న అందరిలో దైన్యం స్థానంలో ధైర్యం, ఏమీ చెయ్యలేం అనే నిస్పృహ స్థానంలో ఏమైనా చెయ్యగలం అనే ఉత్సాహం చోటు చేసుకున్నాయి. కొంతసేపటి క్రితం భవిష్యత్తంతా అంధకార బంధురంగా కనపడ్డ ఆ ఊరికి భవిష్యత్తు ఆశాకిరణాలతో వెలుగు నిండుతూ కనపడుతోంది.

ఇప్పుడు అసలు సమస్యని లేవనెత్తాడు సుబ్బయ్య. "అన్నీ అనుకున్నట్టు జరిగితే మూడు నెల్లకి పంట చేతికొత్తంది. అప్పటి దాకా ఇంటిల్లిపాదీ బతికేదెట్టా అనేదొకటి. రెండోది ఇప్పుడింత ఎవసాయం పెట్టుకుంటే ఎవసాయం కర్చులు... ఇత్తనాలు... ఎరువులు... రకరకాలు అయ్యేన్నీయాడ్నించి తెత్తారు... ముందిది తేల్తేగాని మిగతా ఏదన్నా ముందుకెల్లేది" సుబ్బయ్య మాటల్తో అప్పటివరకూ ఎగసిపడ్తున్న ఉత్సాహపు మంటలమీద నిరుత్సాహపు నీళ్ళు కుమ్మరించినట్టయింది.

అందరూ ఒక్కసారిగా చల్లబడ్డారు. చేతికందిన పండు బురదలో పడ్డట్టయ్యింది. రంగయ్య కాకయ్య వంక చూశాడు.

"ఊ" అన్నాడు కాకయ్య. ఆయనేదో నిర్ణయానికొచ్చినట్టున్నాడు.

"ఈ మూడు నెల్లూ ఊరివాళ్ళక్కావలసిన ధాన్యం నేనిస్తాను. కూరా నారా ఖర్చులకి పెద్ద రాఘవయ్యగారిస్తారు. ఆ మాట నేను ఆయనను అడక్కుండానే చెప్తున్నా" అని రాఘవయ్యవైపు చూశాడు.

పిచ్చయ్య మెచ్చుకోలుగా కాకయ్యగారి వంక చూసి రాఘవయ్యగారిని చెప్పమన్నట్లు చూశాడు.

"అడగక్కర్లా.. ఊరంతా పస్తుంటే మనం పండగ చేసుకుంటామా? ఊరి బాగే మనబాగు. కానివ్వు మామా" అన్నాడు రాఘవయ్య.

పిచ్చయ్య నవ్వి "మరి సుబ్బయ్యగారి సంగతి ఆయనే చెబితే బాగుంటుందేమో!" అన్నాడు.

"సరే ఊరిలో మొవాసులు ముగ్గురు అని, వీళ్ళిద్దరితో నా పేరెప్పుడో కలిపా

రుగా. తప్పుతుందా? వాళ్ళతో పాటే నేనూనూ. ఈ మూడునెల్లూ ముగ్గురమూ ఊరిని చూసుకుందాం.. పంటలొచ్చాక లెక్కచూసి మనవి మనకిత్తారుగా" అన్నాడు సుబ్బయ్య.

"ఒక పంటగ్గాపోతే రెండు పంటలకి త్తాంగానీ ఎగ్గొట్టంలే" అభిమానం, పౌరుషం కలగలిపాడు భూపతయ్య.

"మరింకేం.. ఈ సమస్య తీరిపోయింది. ఇంకేమిటి అందరం కలిసి అన్ని పనులూ చేసుకుంటాం గనక ఖర్చులు పెద్దగా ఉండవు. ఇత్తనాలక్కూడా మీ ముగ్గురే సర్దాలి. ఎరువులక్కర్లా. కొల్లేటి భూసారం చాలు. మూడు నెల్లు ఊరంతా ఒక్కతాటి మీదుంటే మనం చెయ్యలేని పనుల్లేవు" రంగయ్య పొంగిపోతున్నాడు.

"ఆ పెద్దింటమ్మ దయుంటే అందరం కలిసి గట్టెక్కుతాం" రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు కాకయ్య.

చుట్టుపట్ల ఇళ్ళ దళ్ళవతలనుంచుని అంతా వింటున్న ఆడవాళ్ళు కూడా పెద్దింటమ్మకు దణ్ణాలు పెట్టి మొక్కుకున్నారు.

ఊరివాళ్ళంతా కాకయ్యగారి అరుగుల మీద కూర్చుని మాట్లాడుకున్న మాటలు వడ్డిగూడెంలో కలకలం సృష్టించాయి.

కొల్లేటిలో తడకలు పెట్టి, మావులు పెట్టి, రెండు దోనెలక్కలిపి మంచం కట్టిన జంట దోనెల్లో వెళ్ళి వలలేసి చేపలు పట్టుకుంటారు వడ్డీలు.

వ్యవసాయం పేరుతో కొల్లేటిని ఊరివారాక్రమిస్తే మనమెట్లా బతకాలనేది వారి సమస్య.

"సూద్దాంలేరా.. సూత్తా సూత్తా కాకయ్యగోరూ, రంగయ్యగోరూ, రాఘవయ్యగోరూ మన నోటికాడ కూడు పడగొట్టర్లే. మనకీ ఏదైనా ఉపాయం ఆళ్ళే సెపుతార్లే" అన్నాడు వడ్డీల పెద్ద.

అంతలోకే కోటేశు పరిగెత్తుకుంటూ వచ్చి "ఊరి పెద్దలు రెండు పడవల్లో పెద్ద జాడెంట ఎల్తన్నారు" అన్నాడు.

వీళ్ళంతా లేచారు.

"అందరూ వద్దులేరా.. బాగుండదు. అయిదారుగురం ఎల్దాం. ఆల్లేం జేత్తన్నారో మన్నేం జెయ్యమంటారో చూద్దాం" అని పెద్దలు ఓ ఆరుగురు బైల్దేరి మూడు దోనెల్లో పెద్ద జాడ వెంట వెళ్ళారు.

★ ★ ★

"ఏటివారనుంచి లోతుగా ఉన్న ఓ పాతికెకరాలు ఒదిల్తే పెజ్జాడకి ఎడమవేపు నుంచి పెద్దగుణ్ణం ఇవతలి వరకూ సుమారు ఐదొందల ఎకరాలు కాస్త మెరుగ్గా ఉంటుంది. అలాగే పెజ్జాడకి కుడేపు ఓ వందెకరాలు మెరుగ్గా ఉంటుంది" అన్నాడు రంగయ్య.

"పదహారేళ్లు దాటిన మగాళ్ళు, పనిచెయ్యగల వాళ్ళు రెండొందల తొంభై నలుగురున్నారు" అన్నాడు మధు.

"ఐదొందల ఎకరాల చుట్టూ కనీసం నాలుగడుగుల మట్టికట్ట గట్టుగా కట్టాలి" అన్నాడు రాజులు.

"ఐదొందల ఎకరాల్లో ఉన్న నీళ్ళన్నీ ఇరవై చోట్ల పంపులు పెట్టి తోడాలి" అన్నాడు సుబ్బారెడ్డి.

"రెండొందల తొంభై నలుగురే కాక ఆడపిల్లలు ఎక్కువున్న కుటుంబాలవారిని

కూడా కలుపుకుంటే మనిషికి ఎకరంన్నర లోని పంట చేతికొస్తంది" అన్నాడు ప్రభా కరరావు.

"పెజ్జాడకి కుడేపునున్న వందెకరాల సంగతేంటని? " ఆరా తీశాడు సుబ్బయ్య.

"అది వడ్డీవాళ్ళని సాగుచేసుకోమన్నాం" అన్నాడు రంగయ్య

"వాళ్ళు చేసుకుంటారా! వాళ్ళకి చేపలు పట్టుకోటం తప్ప ఎవసాయం ఏం వచ్చు .. ఆళ్ళ మొఖాలు" అన్నాడు సుబ్బయ్య.

"మనకి పనులెద్దడిగా ఉన్నప్పుడు ఆళ్ళని పిల్చి మన పొలాల్లో పనులు చేయించు కోంగా లేంది, ఆళ్ళ పొలాల్లో ఆళ్ళు పన్లు చేసుకోలేరా? " అన్నాడు రాజులు.

"అంతగా అయితే మనం పైపైన సాయం చేద్దాం లెద్దురూ"

"అయినా ఆ వందా మనమే చేసుకుంటే పోలా. తలా పాతిక సెంటూ వత్తే యేం తీపరమా" సుబ్బయ్యకు వందెకరాల్ని వడ్డీల పరం చెయ్యటం మింగుడుపడలా.

"సుబ్బయ్యా! ఎన్నేళ్ళొచ్చినా ఇవరం రాలేదయ్యా నీకు. మనం బతకాల. మనతో పాటు మన చుట్టూ ఉన్న వాళ్లంతా బతకాలనేది తెలవలేదే నీకు" కాకయ్య విసుక్కుంటే సుబ్బయ్య గొణుక్కు న్నాడు.

"అయినా ఇది మనమేం దయాదాక్షిణ్ణా లతో ఆళ్ళకివ్వటల్లా. మనం పెద్దొడ్డిమీద ఎవసాయం సేసుకుంటున్నాం. ఆ వడ్డీ లంతా కొల్లేట్లో సేపలు పట్టుకుంటన్నారు. ఇప్పుడు మనం కొల్లేటి మీదికెళ్లి ఎవ సాయం చేద్దామనుకుంటన్నాం. ఆళ్ళ ఆదాయం తగ్గదా? అందుకే ఆళ్ళొచ్చి అడ గ్గానే ఆ వందెకరాలూ ఆళ్ళని చేసుకోమని ఇంకోమాట కూడా చెప్పా" రంగయ్య దయాగుణం తెలిసిన సుబ్బయ్య అనుమా నంగా "ఏంటది? " అనడిగాడు.

"పెద్దగుణ్ణంలో చేపల్ని ఏడాదికొకసారి వేలం వేసి ఊరికింద తీసుకుంటన్నాం గదా!"

"అవును"

"మన దాళ్వా ఎవసాయం కుదిరి పంట చేతికొత్తే ఆ పెద్దగుణ్ణంలోని చేపలన్నీ వడ్డీలు పట్టుకోవచ్చని చెప్పా"

ఈసారి సుబ్బయ్యే కాదు చాలామంది ఆలోచనల్లో పడ్డారు.

"పెద్దగుణ్ణం వాళ్ళకిచ్చేట్టయితే వందెకరా లెందుకు? "

"వందెకరాలిచ్చేట్టయితే పెద్దగుణ్ణం ఎందుకు? "

ఇలా గుసగుసలు సాగాయి. అన్నీ చూస్తూ, వింటూ ఉన్న రంగయ్య "ఏందిరా మల్లగుల్లాలు పడతన్నారు. మనకీ ఐదొందలెకరాలకి గట్టు కట్టి, దాన్ని రేత్రీపగలూ కాపాడుకోటంతోనే తాతలు దిగొత్తారు. ఇంకా ఆ వందెకరాలు యాడ జేసుకుంటాం. అది గనక వడ్డీలు చేసు కుంటే పెద్దజాడకి అటూఇటూ పెద్ద గట్లుంటాయి. కాబట్టి ఒక గట్టుకైనా నీటె ద్దడి తగ్గుతుంది. అట్టాగే అవసరమైతే ఆళ్ళు మనకి, మనం ఆళ్ళకి అండగా ఉంటాం. ఒకళ్ళకి నలుగురం అవుతాం"

"రంగయ్య చెప్పింది సబబుగానే ఉంది. మనతోపాటు వడ్డీలు కూడా ఈ కొల్లేరుని నమ్ముకుని బతుకుతున్నారు. చూద్దాం.. ఈ దాళ్వాని మనం సాధించామంటే అంద రికీ మంచి రోజులొచ్చినట్టే" కాకయ్య అందరికీ నచ్చజెప్పాడు.

"ఒకవేళ దాళ్వా పంట మనం అనుకు న్నట్టు చేతికి రాకపోతే? ఎవరు నమ్మాడు ఈ కొల్లేటిని? అప్పుడు పెద్దగుణ్ణం ఎవ రిది? " సుబ్బయ్యకింకా మంటగానే ఉంది, వడ్డీలకి వందెకరాలూ పెద్దగుణ్ణం పోతు న్నాయంటే.

"శుభం పలకరా అంటే ఏదో అన్నా డంట. దాళ్వాని తీసికెళ్ళిన కొల్లేరు పెద్ద

గుణ్ణాన్నట్టి పెడతందా? దాన్నీ, దాన్లో చేపల్నీ కూడా తీసకపోదా? ”

అందరూ నవ్వారు.

“సరే. అంతా రంగయ్య ఇష్టపెకారం చేద్దాం” నిష్టూరంగానైనా ఒప్పుకున్నాడు సుబ్బయ్య.

“నా ఇట్ట పెకారం ఇదంతా జరగట్లే దయ్యా! వెళ్లిన పాతికమందిమీ ఆలోచించిన మీదనే ఇట్టా చేద్దామనుకున్నాం. కాబట్టి ఇది అందరి ఇట్ట పెకారమే జరుగుతోంది” అని కచ్చితంగా చెప్పాడు రంగయ్య.

“అవునవును. అందరం ఒప్పుకున్నదే” అన్నారు పదిమంది.

“సరే, ఇక జరగాల్సిన పనులూ, వాటికెవరెవరు? ”

“అది రాత్రంతా కూచ్చుని మేం అందరమూ తయారుచేశాం. చెప్తాం, వినండి” మధు జేబులోంచి కాగితాలు తీసి చూస్తూ చెబుతున్నాడు.

అంతా శ్రద్ధగా వింటున్నారు.

“ఊళ్ళో అందరి దగ్గరా ఉన్న కత్తవలు కాక మరో పదిహేను కత్తవలు వడ్డా బత్తుడితో చేయించాలి”

“ఊళ్ళో అందరి దగ్గరా ఉన్న దున్నలు చాలవు. పాడి గేదెల్ని, దూడల్ని ఒదిలి, పాలెండిపోయిన గేదెల్ని, ఎదవ్వని పడ్డల్ని కూడా దుక్కికి తోలాలి”

“ఆ పని చెయ్యండి.. ఎదవ్వని పడ్డలు నాలుగు రోజులకల్లా ఎదవుతాయి”

అందరూ నవ్వులు.

“అందరికీ సరిపడా నాగళ్ళూ, కర్రలూ వెంటనే వడ్డాబత్తుడితోనూ, కమ్మరితోనూ చెప్పి చేయించాలి. అలాగే సొట్టబ్రెమ్మంతో చెప్పి కొడవళ్ళూ అవీ చేయించాలి”

“కత్తవల్తో నీళ్ళల్లో మునిగి గట్టి మట్టిగడ్డల్ని తేగల కుర్రాళ్ళు మన దగ్గర నలభైమంది ఉన్నారు. పైకి తెచ్చిన మట్టిగడ్డల్ని తూటు కాడా, వరిగడ్డి, తొండంగి, తుమ్మకర్రలు పరిచిన గట్టుమీద జాగ్రత్తగా పరవగలగాలి. అందుకు కుర్రాళ్లతోపాటు నలభై, యాభై ఏళ్ళవాళ్ళు కూడా సిద్ధంగా ఉండాలి”

“అందరూ తెల్లారేసరికి కొల్లేట్లోకెళ్ళిపోవాలి. వాళ్ళకి సద్దన్నాలూ, అన్నాలు, అన్నీ తేటానికి, నాలుగు పడవలు సిద్ధంగా ఉంటాయి. ఆడపిల్లలంతా భోజనాలు తేవాలి”

“ఊళ్ళో ఉన్న ఆడామగా తేడా లేకుండా చిన్న పిల్లలంతా ఊళ్ళో గొడ్లన్నిటినీ, మోతేవారి లంకల్లోకి పెద్దజాడలో నుంచి జాగ్రత్తగా తోలుకెళ్ళిపోవాలి. ఏ ఒక్క గేదె కూడా గట్టువైపు రాకుండా చూసుకోవాలి”

“గట్టులు కట్టడం పూర్తవగానే పంపులు పెట్టి లోనున్న నీళ్ళని బైటికి తోడేవాళ్ళు తోడుతుంటే దమ్ములు చేసేవాళ్ళు లోన చేస్తుంటారు”

“నాట్లపని పూర్తవగానే ఇంటికొకరు చొప్పున పగలూ, రాత్రీ గట్టు మీద శ్రద్ధగా లాంతర్లు పెట్టుకుని పీతలూ, నత్తలూ, గురకలూ ఊలలేసి బైటినీళ్ళు లోనికొచ్చేలా చేయకుండా చూసుకుంటూ ఉండాలి”

“కోతల సమయం వచ్చిందంటే ఇక కొల్లేటి నీటినుంచి ముప్పు అంతగా ఉండదు. కానీ ఊడ్పులప్పుడు, ధాన్యం

బైటికి చేరెయ్యాల్సినప్పుడూ అందరూ చాలా జాగ్రత్తగా ఉండాలి"

"ఇవేగాక ఎప్పుడు, ఏ చిక్కులొచ్చినా వాటిని విప్పుకుంటూ కొత్త కొత్త నియమాలు పెట్టుకుంటూ పంటనెలాగైనా ఏటివారకి చేర్చుకోవాల్సి ఉంటుంది"

మధు నిదానంగా ఒక్కొక్క పాయింటూ చెప్తుంటే బుద్ధిగా బడిపిల్లల్లా విన్నారందరూ.

"రేత్రసలు నిద్రపోలేదేరా అబ్బాయిలూ?" అన్నాడు కాకయ్య ఆ యువకుల్ని ముచ్చటగా చూస్తూ.

గంభీరంగా ఉన్న వాతావరణాన్ని ఆ మాట తేలిక చేసేసింది. అందరూ ఊపిరొదిలి హాయిగా నవ్వారు.

"మొత్తానికి ఊరు ఊరంతా ఈ మూడు నెల్లూ నిద్రోగూడదు. శ్రమ పడాలి. కష్టే ఫలి. కష్టపడితే ఫలితం దక్కుతుంది. అంతేనేరా అబ్బాయిలు" కాకయ్యకు తను గూడా కుర్రాడినైపోతే బాగుండనిపిస్తోంది.

"అంతేనే తాతా. మాక్కూడా వేసవి కాలం శలవలు. మేం అందరం కూడా మీతో పాటే. చివరగా ఒక్క సంగతి.. మనం చాలాపెద్ద పని చేస్తున్నాం. బహుశా ఇలాంటి పని కొల్లేరు పుట్టాక ఎవరూ చేసుండరు. చిన్నచిన్న పనుల్దగ్గరే గొడవలొస్తావుంటయ్యి. ఇంతపని పెట్టుకున్నప్పుడు చాలా గొడవలు రావొచ్చు. పంతాలు పట్టింపులు, చిన్నపెద్ద తేడాలు.. ఇట్లా చాలా వచ్చే అవకాశాలున్నాయి. అందుకని మేం మీ అందరికీ ఒకటే చెప్తున్నాం. ఎలాంటి గొడవలూ, పొరపొచ్చాలూ వచ్చినా కాకయ్య తాతతోనో, రంగయ్య మావతోనో పరిష్కరించుకోవాలే గాని మీలో మీరు గొడవ పడ్డమో, బాధ పడ్డమో చెయ్యగూడదు. అందరం 'ఇది మనది', 'ఇది మన పని' అని చేసుకుపోవాలి" అన్నాడు మధు.

'నిన్న మొన్నటిదాకా తన ఒళ్ళో పెరిగిన మధు ఇంత పెద్దమనిషెప్పుడయ్యాడా?' అని ఆశ్చర్యంలో మునిగాడు అతని తండ్రి వీరభద్రం.

"ఇంటన్నార్రా.. అదీ సంగతి! సర్లేరా, పని చేస్తాంటే అన్నీ అవే సర్దుకుంటాయిలే. ఇక రేపట్నించే పని మొదలుపెట్టండి. ఎవరెవరు ఏం చేస్తారో, ఏం చెయ్యాలో అవన్నీ ఈ కుర్రాళ్ళే చెప్తారు. దాని ప్రకారం చిన్న పని, పెద్ద పని అని లేకుండా వాళ్ళు చెప్పినట్టు చెయ్యండి" అన్నాడు కాకయ్య.

కుర్రాళ్ళు ఆరుగురూ కాగితాలూ, కలాలు తీసుకుని చావిట్లోకెళ్ళారు.

కైకలూరు తాలూకానే కాదు, కృష్ణా జిల్లానే కాదు, ఆంధ్ర దేశంలోనే కాదు, మొత్తం భారతదేశంలోనే ఎన్నడూ జరగని సమిష్టి వ్యవసాయం ఆ ఊర్లో అనంతజల సాగరమయిన ఆ కొల్లేట్లో జరగబోతోంది.

★ ★ ★

ములక వచ్చి పనల మీదున్న పంటని రెండోసారి కూడా తీసుకెళ్ళకుండా ఉంటే ప్రతి కుటుంబానికీ పెద్దదొడ్లో ఉన్న ఎకరం.. నాలుగెకరాల పొలాల్నుంచి పదో, ఇరవయ్యో, యాభయ్యో బస్తాల ధాన్యం వచ్చి ఉండేది.

ఒక పూట తినో తినకో, రెండు పూటలూ తినో, ఒకరిమీదొకరు కోపంతోనో, ద్వేషంతోనో, ప్రేమతోనో, దయతోనో కాలక్షేపం చేసేవాళ్ళు.

కొల్లేరుకి ఇది బొత్తిగా నచ్చలా!

'నా కడుపులో బిడ్డలు.. ఇలా కాదు మీరు బతకాల్సింది. నన్ను చీల్చండి. నలగ గొట్టండి. నాలో ఉన్న రత్నరాసుల్ని పొందండి' అన్నది. రెచ్చగొట్టింది. చేతిలో ఉన్నది ఊడగొడ్తేనే కొత్తది, అంతకన్నా గొప్పది పొందుతారనుకుంది.

కొల్లేటి మీద తిరగబడ్డారు మనుషల్లా



కాదు, రాక్షసుల్లా.

క్షీరసాగర మథనమప్పుడు నాజూగ్గా ఆదిశేషుడి తోక పట్టుకుని ఊపిన దేవతల్లా కాదు, విష జ్వాలల్ని ఎదుర్కొంటూ అమృతాన్ని సాధించిన రాక్షసుల్లా తిరగబడ్డారు.

★ ★ ★

ఊరు ఊరంతా కొల్లేట్లో దిగిపోయింది. చెయ్యాల్సిన పొలం హద్దులు చూసారు. గట్టులేసేవాళ్ళు కత్తవల్తో సిద్ధమయ్యారు. వాళ్ళు చేసే పనికి పంచెకూడా అడ్డమే. అందుకే ఎవరి వంటి మీదా గోచీలు తప్ప గుడ్డల్లేవు.

వీళ్ళు పంట పండించాల్సిన పొలం కిక్కిసపొదల్తో, రెల్లుగడ్డితో, రక్కిస పొదల్తో, గరికతో, తుంగల్తో నిండివుంది. జమ్ము, జీలగ ఎకరాలకొద్దీ విస్తరించి తూటుకాడ, నాచు, చీమిడి మొదలైన రకరకాల తీగల్తో మొక్కల్తో నిండిపోయి ఉంది.

వీటన్నిటినీ తీసేసి ఐదొందల ఎకరాల పొలాన్ని అద్దంలా చెయ్యాలి. ఎక్కడ మొదలెట్టాలో, ఎలా మొదలెట్టాలో అయోమయంగా ఉంది.

"ముందు కొందరు పొదల్ని నరికి ఆట్ని కుప్పలుగా ఎయ్యండి. కొందరు జమ్ము జీలగల్ని నరకండి. ఇక తూటు కాడలూ, నాచులూ, ఆటి సంగతి దమ్ములో చూసుకుందాం. నరికిన పొదల్నీ, జీలగల్నీ గట్టు వేసేవాళ్ళ దగ్గరికి చేర్చండి. ముందిదంతా నరుక్కుంటా పోతేగాని గట్టులు పూర్తిగావు. తర్వాత దుక్కి సంగతి చూద్దాం"



కత్తవతో నీళ్ళల్లో మునిగిన రాజులు ఎంతసేపటికీ బైటికి రాకపొయ్యేసరికి గట్టు వెయ్యడానికి నుంచున్న ధర్మారెడ్డికి భయమేసి కేకలెయ్యటం మొదలెట్టాడు. అప్పుడు ఆ పక్కల పని చేస్తున్న వాళ్ళు హడావుడిగా ఏమైందంటూ వచ్చేలోపే కత్తవతో ఓ పెద్ద మట్టి పెళ్ళను లేపుకుని పైకి తేలాడు రాజులు, సంజీవని పర్వతాన్ని తీసుకొస్తున్న హనుమంతునిలా!

"ఓర్నీ దుంపతెగ! నీళ్ళల్లో మునిగి ఇంతసేపా ఉండేది. బురదలో చిక్కుబడిపోయావనుకున్నా" అని ఊపిరి పీల్చుకున్నాడు ధర్మారెడ్డి.

రాజులు తెచ్చిన మట్టిపెళ్ళను అప్పుడే పెద్దారి చిన్నాడు తెచ్చిన కిక్కిస పొదల మీద వేస్తూ "మరీ ఎచ్చులకి పోమాకరా! ఇవ్వాళొక్క రోజుతోనే అవదీ పని. కత్తవని మరీ లోతుకి దించమాక" అన్నాడు చెల్లబ్బాయి.

"లోతుకి దించక పైపైనున్న బురదంతా తెచ్చి నీ నెత్తిమీద పొయ్యనా! నోరు మూసుకుని పని సూడంఁడ్రా" అంటూ రాజులు కత్తవని నిలువునా దించుతూ నీళ్ళల్లోకి మునిగాడు.

రాజులు పనిచేసే తీరుని చూసి ప్రతి వాళ్ళూ చురుగ్గా పనిచెయ్యడం మొదలెట్టారు.

అలా ఓ గంట చేసే సరికి అందరికీ ఆకళ్ళు మొదలైనై. దూరంగా పడవలు చద్దన్నాల్తో వస్తూ కనపడ్డాయి.

అందరూ పడవల దగ్గరికి చేరారు. ఎవళ్ళన్నాలు వాళ్ళు మోకాటి లోతు నీళ్లలో

నిలబడి తిన్నారు. కొందరు పడవ అంచుల మీదికెక్కి తిన్నారు. మళ్ళీ కొత్తగా తెచ్చుకున్న శక్తితో పనిలో పడ్డారు. పడవలు అన్నాలు తేడానికి తిరిగి వెళ్ళాయి.

మధ్యాహ్నం పడవలొచ్చేసరికి అందరూ డీలా పడిపోయారు. అలాగే అన్నాలు తిన్నారు. తిని, తాము చేసిన పనివంక చూసుకుంటే తృప్తిగా అనిపించింది. కొత్త ఉత్సాహంతో పనిలోకి ప్రవేశించారు.

సూర్యుడు నెమ్మదిగా పడమటి కొల్లేట్లోకి చేరుతున్నాడు. కొల్లేరంతా ఎర్రబడు తోంది. నీటి కదలికలకు తళతళ లాడు తున్న కిరణాల ప్రకాశంతో వీళ్ళు చేసిన పని చూసి సంతోషాన్ని ప్రకటిస్తున్న ట్లుంది.

అందరూ ఊరుకేసి మళ్ళారు. ఏటివార దగ్గరికి వచ్చేసరికి 'స్నానాలు చేసి రండి. ఇవ్వాళ జరిగిన పని గురించి, రేపట్నుంచీ చెయ్యాల్సిన వాటిగురించి మాట్లాడు కుందాం' అనే వర్తమానం సిద్ధంగా ఉంది.

★ ★ ★

అలా నెలరోజులుగా ఆ రాక్షసప్పునిని పనిరాక్షసుల్లా చేసి ఐదొందల ఎకరాల్ని సేద్యానికనువుగా చేశారు. కత్తవల్తో నీళ్ళల్లో మునిగి మట్టిగడ్డలు తెచ్చేవాళ్ళు తేగా, కింద ఆరడుగులు, పైకొచ్చేసరికి మూడడుగులుగా గట్లని కట్టారు. రెల్లు పొదల్నీ, జమ్ములన్నీ నరికి గట్లు పూర్తవ గానే అన్నివైపులా పంపుల్ని పెట్టి లోన నీటిని వంతుల వారీగా తోడేశారు. చేతి పంపుల్తో నీళ్ళు బైటికి తోడేస్తుంటే ఐదొం దల ఎకరాల కొల్లేట్లో చేపలు ఎగిరెగిరి పడుతున్నాయ్. పగలంతా పనిచేస్తూ, సాయంత్రాలు ఇళ్ళకెళ్ళేప్పుడు ప్రతివాడి చేతిలోనూ, కొరమీనో, వాలగో, పెద్దబొచ్చో, ఇంగిలాయో ఉంటున్నాయి. తుంగ పరక ల్ని మొప్పల్లో నుంచి నోట్లోకి దూర్చి బొమ్మిడాయిల, మట్టగుడిశల దండలు విలాసంగా పట్టుకుని ఇళ్ళకు వచ్చే మొగాళ్ళ కోసం ప్రతి ఇంటి గడపలోనూ ఆడవాళ్ళు ఎదురు చూస్తున్నారు.

దున్నల్నీ, గొడ్డుమోతు పడ్డల్నీ తోలు కొచ్చి దుమ్ము దుమ్ముగా దమ్ము చేశారు. దమ్ము చేసేప్పుడు వచ్చిన తూడునీ, నాచునీ, గుట్టలుగా వేసి తీసుకొచ్చి గట్లమీ దేశారు. పెద్దొడ్డిలో వేసి పెంచిన 'నల్లార్లూ', 'మూడార్లు' ఆకుమడిలో నుంచి నారు తెచ్చి ఊడ్పులు మొదలెట్టారు.

ఐదొందలెకరాలూ వరినాట్లతో తలలూ పుతుంటే పెద్దజాడ కవతల మరో వందెక రాలు కూడా వంత పాడాయి.

ఈ పనులన్నీ జరుగుతుంటే చూస్తున్న పిల్లలకీ, ఆడవాళ్ళకీ అక్కడొక కొత్త లోకం ఒకదాన్ని చూస్తున్నట్టుండేది. గొడ్లని తోలుకెళ్ళేప్పుడూ, తోలుకొచ్చేప్పుడూ గొడ్లు గట్టుమీదికెక్కకుండా వీళ్ళే గట్టెక్కి శ్రద్ధ తీసుకునేవారు.

ఊడ్పులయ్యేసరికి ఒళ్ళు హూనం అయినా అంతటి ఘనకార్యం తాము చెయ్యగల్గిన సంతోషంతో మనుషులు ఉత్సాహంగానే ఉండేవారు. ఇక గట్టు కాప లాకి ప్రతి ఆరుగంటలకీ ఇరవై మంది వంతులవారీగా వెళ్ళి గట్టు చుట్టూ తిరుగు తూండేవాళ్ళు. పీతలు, నత్తలు, గురకలు

ఊలలెయ్యకుండా చూడ్డం, ఏ పశువూ ఏమరుపాటున గట్టెక్కకుండా చూడటం, ఎక్కడైనా ఊల కనపడితే వెంటనే పూడ్చే య్యటం వారి పని.

కలుపుల కాలం వచ్చేసింది. 'కలుపు తియ్యని మడి, దేవుడు లేని గుడి' అన్నారు. కొల్లేటి పొలానికి కలుపుకేం కొదవ. పొలంనిండా ఎక్కడపడితే అక్కడ రకరకాల మొక్కలు, తూడు. ఇన్నిటి మధ్యలో వరి కూడా చాలినంత సారం ఉండటం మూలంగా ముదురాకుపచ్చగా మారి తలలూగిస్తోంది.

నీళ్ళెక్కువైతే పొలంలో ఉండేవి పంపులు. తక్కువైతే కొల్లేట్లో నుంచి చిన్న చిన్న గండ్లు. గండికి పదిమంది కాపలా. గండి పెరగ్గూడదు, గట్లు తెగగూడదు. మళ్లీ ఓసారి ఊరంతా కొల్లేట్లో దిగింది. వారం రోజుల్లో కలుపునేరేసింది.

మామూలుగా కలుపులయ్యాక పొలానికి ఎరువో, సూపరో, ఆముదప్పిండో ఏదో ఒకటి వేస్తారు. కానీ సారవంతమైన కొల్లేటి పొలాలకి ఏమీ అక్కర్లా. కొల్లేట్లోకి క్రిష్ణా, గోదావరి నీరు అరవయ్యేడు కాలవలగుండా వచ్చి చేరుతుంది. బుడమేరు, తమ్మిలేరు, అక్కిలేరు, నాగులేరుల్లాంటి ఏరుల నుండీ, మురిక్కాలువల నుంచీ వచ్చి చేరుతుంది. వీటికి తోడు కొల్లేరు ఒక పెద్ద జీవారణ్యం. నీటి కాకులు, గవర కాకులు, బుడ్డ కాకులు, తెల్ల కాకులు, రకరకాల కొంగలు, పిట్టలు, స్వదేశీవే కాక విదేశాల నుంచొచ్చిన పక్షుల్తో కళకళలాడుతోంది కొల్లేరు.

ఇక చేపల సంగతి చెప్పేదేముంది! జలచరాలన్నీ నెలవు చేసుకున్నదీ కొల్లేరు. ప్రకృతిలో ఉన్న పురుగు, పుట్రా, మొక్కా, మొదుసు, నాచు, నీచు అన్నిటితో నిండిన కొల్లేరది! కొల్లేటికి మించిన సారం మరొకటుందా? ఏ ఎరువూ వెయ్యకుండానే రెండ్నెల్లు దాటీ దాటకుండానే పొట్టలు పోసుకున్న వరి పాలకంకులిడిచింది. అక్కడక్కడా మరీ సారం ఎక్కువై ఊదేసిపోయింది.

ఇంతకుముందు పనిచెయ్యడానికి వచ్చే ఊరిజనం ఇప్పుడు పనిలేకపోయినా కంకులతో రారమ్మని స్వాగతాలు చెప్తున్న పొలాల్ని కనులారా చూడాలని, చూసి తమ కృషి ఫలితాన్ని కొల్లేరేవిధంగా ఇవ్వబోతోందో చూసి తరించాలని వస్తున్నారు.

గట్లనిండా జనమే. కొల్లేటి నిండా మాటలే. సంతోషాలే. పొలంనిండా తూనీగలెగుర్తున్నాయి. తూనీగలాడితే తూమెడు వడ్లు. కంకులు ముదుర్తున్న కొద్దీ నల్లటి గింజలు, ప్రతి గింజకీ కిరీటంలాగా అంగుళం పొడవున ఓ ముల్లు.

ఏమిటీ వడ్లు? తినడానికి ఇవి పనికొస్తాయా? అనే సందేహంతో ఓ గుప్పెడు గింజల్ని తీసుకుని అరచేతుల్తోనే నలిపి ఉఫ్‌న ఊదితే ముత్యాల్లా తెల్లటి బియ్యం గుప్పిట్నిండా.

ఊరిజనమే గాక కొల్లేట్లో పంట పండించారనే వార్త తెలవగానే కొల్లేటి లంకల్లో పులపర్రు పక్కనున్న పిల్లిపాడు, మణుగులూరులంక, గుడివాకలంక, కలపర్రు, కొవ్వాడలంక, దెయ్యప్పాడు, చింతపాడు, నుచ్చుమిల్లి, ఇంగిలింపాకలంక, పెనుమాక లంకల్నుంచే గాక కాస్త దూరంగా ఉన్న పత్తిపాడులంక, నత్తగుల్లపాడు, శెటకాయలంక, ఆరుతెగలపాడు, గుమ్మళ్ళపాడు, పైడిచింతపాడు, ఆటపాక, పందిరిపల్లిగూడెం, గోకర్ణపురం, ఆగడల్లంక, మళ్ళారంలంక, భుజబలపట్నాల నుంచి రైతులు వచ్చి చూసి ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు.

"పండేపంట పైరులోనే తెలుత్తుందన్నట్టు ఇంత కంకినెప్పుడూ సూడలా. ఎకరాకి రెండున్నర పుట్లు దిగుబడి వచ్చేట్టుంది"

"మన మెరకపొలాల్లో పదేను, పదారు బత్తాలు పండించేతలికి తాతలు దిగొత్త న్నారు. అదీ రేపూమాపూ ఎరువులు దట్టి త్తేనే. ఏ ఎరువు ఎయ్యకుండా ఈళ్ళిట్టా పండిచ్చారంటే ఇది మడుసుల వల్ల అయ్యే పనికాదు"

"అయ్యిందిగా.. పండిచ్చారుగా. ఈళ్ళని సూసైనా మనమూ బుద్ధి తెచ్చుకోవాల"

"మనమా మనజనం 'దున్నబోతే దూడల్లో, మెయ్యబోతే ఎద్దుల్లో' ఉంటారు. మనొల్లగాకేం? "

"ఆ మాటా నిజమేలే. దున్నే రోజుల్లో దేశంమీదకు పోయి, కోతల రోజుల్లో కొడ వళ్ళట్టుకొచ్చే రకం మనాళ్ళంతా. ఈళ్ళ కట్టుబాటు మనకెక్కడిది? "

"అవునవును. మనాళ్ళల్లో ఎద్దున్నాడికి బుద్ధుండదు. బుద్ధున్నోడికి ఎద్దుండదు. ఇక మనవల్ల ఏమవుతుంది? వీళ్ళు ఊరు ఊరు కదలి పనిచేశారంట"

"కట్టుబాటుండాలిరా.. కట్టుబాటు. ఊరంతా కలిసికట్టుగా ఇంత పనిచేసిం దంటే ఇది మామూలు మాట కాదు. మన దగ్గరంతా నువ్వు దంచు, నేను భుజాలెగ రేత్తాననే రకమే" అంటూ ఈ ఊరివాళ్ళని పొగడటం, తమ ఊరివాళ్ళని తెగడడంతో సరిపెట్టుకుని వెళ్ళారు.

కమ్మరి కొలిమి మండింది మండినట్టే ఉంది. కొత్తకొత్త కొడవళ్ళు తయారయి నాయి. పాత కొడవళ్ళు కక్కులు పెట్టుకు న్నాయి. పంట కోతకొచ్చే సమయానికి ఐదొందల ఎకరాల్లోనే ఉన్న చిన్నగుణ్ణం చేపలతో నిండిపోయి సందడి చేస్తోంది. మిగతా జలాశయాల్లో కంటే కొల్లేటి చేపలు రెట్టింపు పెరుగుతాయి. దానికి కారణం చేపలకి కావలసిన నీరూ, నీటిలో ఆహారం, సారం.

కొల్లేట్లో చేపల రుచే రుచి అని తిన్నవా ళ్ళెవరైనా అనకుండా ఉండలేరు. వడ్డీవాళ్ళ పెద్దలైన గంగరాజు, వడ్డీకాసులు, సంద్రాల పాండవుల్ని పిల్చి "చిన్న గుణ్ణంలో చేపలు పట్టండి. ఊళ్ళోనూ, మీ వడ్డీగూడెంలోనూ అని లేకుండా ప్రతి ఇంటికీ కావలసిన చేప తీసుకోమనండి. మిగిలిన వాటిని అమ్ము కుని మీరంతా కల్సి పంచుకోండి" అన్నారు ఊరి పెద్దలు.

వడ్డీగూడెంవాళ్ళు చేసుకున్న వందెక రాల్లో కూడా పంట బాగానే పండింది. పంట ఊళ్ళోకి చేరగానే, పెద్దగుణ్ణం చేప లన్నీ తమవేనని సంతోషంలో ఉన్న వడ్డీ గూడెం అంతా ఈ చిన్నగుణ్ణం చేపల్లో కూడా వాటా దొరికేసరికి ఉబ్బితబ్బిబ్బ య్యారు. వలలేసి, నీళ్ళు తోడేసి, బురదని కెలికి మూడు రోజుల్లో చివరి చేపదాకా పట్టారు.

ఆ మూడు రోజులూ ఊరందరికీ పండగే. పిల్లలకైతే తిరణాల.

★ ★ ★

పొలం కోతకి సిద్ధమైంది. ఊరివాళ్ళు కొడవళ్ళతో సిద్ధమయ్యారు. పంట పన లుగా మారింది.

వెన్నెల రాత్రులు. ఊళ్ళో ప్రతి వీధి లోనూ గడ్డిమోపులు. పక్కనే 'ఎంటులు' కడుతున్న జనం.

కుప్పలేసే పని పెట్టుకోలా. పనలు తిర గేశారు. ఎండలు మండుతున్నయ్. గింజ ఎండాల్సినంత ఎండింది. మోపులు కట్టు కుని కల్లంలో కొట్టేవాళ్ళు కొడుతున్నారు. దున్నల్నీ, పడ్డల్నీ బంతులు కట్టి పెద్దలూ పిల్లలూ తోల్తున్నారు. తూర్పారబడుతు న్నారు. నల్లటి వడ్ల రాశులు పెరిగిపోతు న్నాయి.

ఊళ్ళో మగాళ్ళందరికీ పిల్లల్తో సహా వడ్లముళ్ళు గుచ్చుకుని ఒకటే దురదలు. గోకితే దద్దుర్లు. వీటికొకటే మందు. సలస లకాగే నీళ్ళు ఒంటిమీద పోసుకుంటుంటే ఆవిర్లు పొగలు లేస్తున్నాయి.

ఊరంతటికీ పైకి ఉత్సాహం. లోన పైకి చెప్పలేని భయం. కొల్లేటిని నమ్మి వ్యవసాయమైతే చేశారు. 'కొల్లేట్లో పండే పంటే గాని చచ్చిన దున్నలకి లెక్కలేదు' అన్నట్టు ఎంత కష్టమైనా పడ్డారు. ఎంత చెమటైనా ధారపోశారు. పంటరాశులు నల్లటి కొండల్లా కల్లాల్లో కనపడుతున్నాయి.

కల్లాల్లోకి ఎక్కడెక్కడి నుంచో ఖాళీ బుట్టలతో సంచులతో జనం వచ్చి పడుతున్నారు. రంగయ్య వచ్చిన వాళ్ళకు లేదనకుండా చేటలతో పోస్తూ ధాన్యంతో వాళ్ళ గంపల్నీ, సంచుల్నీ నింపుతున్నాడు. వాళ్ళు సంతోషంగా వెళ్తున్నారు. ఇదంతా చూస్తున్న శీనూ "నాన్నా వాళ్ళకెందుకన్ని వడ్లు ఇచ్చేత్తన్నావ్?" అనడిగాడు వింతగా.

"మనం చేసిన పాపాలు పోడానికి"

ఇది మరింత వింతగా అనిపించింది వాడికి. "మనమేం పాపాలు చేశాం?"

"ఈ పంట పండించటానికి రైతన్నవాడు ఎన్నో జీవుల్ని చంపుతాడు" అని ఆలోచనలో పడిపోయాడాయన.

శీను చెప్పమన్నట్టు ఆయన భుజం పట్టుకు ఊపాడు.

"అవును. పాముల్ని, తేళ్ళనీ చంపాం కానీ వాటిని చంపకపోతే అవి మనల్ని చంపుతయ్యిగా" ఈ మాటలు వాడికి తండ్రి చెప్పినవే.

"పాముల్ని, తేళ్ళనేగాదు.. ఈ సృష్టిలో ఎన్నోవేల, లక్షల జీవులున్నయ్. మనకి కనపడే నీటి పురుగులే కాదు, కనపడనివి కూడా ఉంటయ్. నీళ్ళు కావల్సినవాటికి నీళ్ళు లేకుండా చేస్తాం. నీళ్ళు అవసరం లేని వాటిని నీళ్ళల్లో నానుస్తాం. అన్ని పాపాలు చేసి ఈ పంటలు పండిస్తాడు రైతు. ఈ పంటే లోకంలో ఉన్న ప్రజలందరికీ అన్నమవుతుంది. కానీ అన్నీ పండించే రైతుకే అన్నం కరువవుతుంది. లోకంలో రైతులే కాదు గదా! రకరకాల వృత్తులు చేసుకునేవాళ్ళున్నారు. అడుక్కుని బతికేవాళ్ళున్నారు. కథలు చెప్పి, పాటలు పాడి, ఆటలాడే వాళ్ళున్నారు. వాళ్ళందరూ బతకాలి. అందుకే కల్లంలోకి ఎవరొచ్చినా వాళ్ళకి లేదనకుండా ఇత్తేనే మనకీ తింటానికింతుంటుంది"

శీనూ చిన్నబుర్రలో పట్టనన్ని పెద్ద విషయాలు ఆనాడాయన చెప్పాడు. శీనూకి కొన్ని అర్థమయ్యాయి. కొన్ని అర్థంగాలా. కానీ ఒకటి అర్థమైంది. 'ఉన్నదేదైనా అందరితో పంచుకుంటేనే మనకి మంచి జరుగుతుందని'.. అది చాలదూ.

చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళు తంబలు తంబలుగా వచ్చి, కొల్లేట్లో జరిగిన అద్భుతాన్ని చూసెళ్తున్నారు. ఉన్నట్టుండి ఆకాశం ఉరిమింది. కొల్లేరు వరమిస్తే ఆకాశం శాపం పెడుతుందా? ఉరిమిన మబ్బు కురవకమానదు. అందరి మనసుల్లోనూ ఇదే దుడుకు. వర్షం ఇక్కడే కురవక్కర్లా. కొల్లేటికి ఆమడ దూరాన కురిసినా చుక్కబీరు పోకుండా మొత్తం వచ్చి కొల్లేట్లో చేరుతుంది.

'ఓరూరుకోండిరా', 'సినుకులకే సెరువు నిండుతుందా?', 'ఈ కాలంలో కొల్లేరు నిండడం అంత తేలిగ్గాదులే' మొదలైన ధైర్యవచనాలు పలుకుతున్నారు పెద్దలు.

ఖాళీ సంచులు ఎన్ని తెచ్చినా ఇంకా

కావాల్సి వస్తోంది. వడ్లని బస్తాల్లోకి కొందరు నింపుతుంటే ఇద్దరిద్దరు కల్సి వాటిని 'కాటా'లో పెట్టి తుయ్యడం, తూచి నవాటిని అవతల ఒక వరుసలో పెట్టుకు పోయేవాళ్ళు పోతున్నారు. తూచిన వాటిని దబ్బునం, పురికొసతో సిద్ధంగా ఉన్నవాళ్లు కుట్టేస్తున్నారు. కుట్టిన బస్తాల్ని పెద్దజా డలో ఉన్న పడవల దగ్గరికి చేరుస్తున్న వాళ్ళు, వాటిని అందుకుని పడవలో ఓ పద్ధతిగా వేసుకుంటూ వస్తున్నవాళ్ళూ.. పడవలన్నీ ధాన్యపు బస్తాల్తో నిండుతు న్నాయి.

"ఒరి! సాల్లేరా. ఈ పడవని తియ్యండి"

"ఇంకో వరస ఏద్దాం"

"నీళ్ళు చూశావా? ఇంకో అంగుళం దిగితే పడవ మునుగుతుంది"

"ఏం దిగదు.. నేను చూత్తాగా? "

మరో వరస బస్తాల్తో నింపిన పడవ నిండు గర్భిణిలా ఉంది.

రాజులు పెద్ద గెడకఱ్ఱ తీసుకుని కొల్లేట్లో నేలమీద గుచ్చి సుతారంగా పడవ అంచంటే ఆ చివరనుంచి ఈ చివరకి వస్తున్నాడు. పడవ నెమ్మదిగా కదిలింది. మరో మనిసి ఆ అంచుమీదికెక్కితే కొల్లేట్లో నీళ్ళు పడవలోకి వచ్చేస్తయ్.

ఒకదాని వెనక ఒకటి పడవలు బైల్దేరి ఏటివార కెళ్తున్నాయి. కొల్లేట్లో సూర్యాస్త మయవుతోంది. అనంత జలరాశి వెనక దాగి నిద్రపోబోతున్న సూర్యబింబం అద్భు తంగా ఉంది.

దూరంగా జీలగ తగలబడుతున్న మంటలు. ఆకాశం రంగులు మారుతూ చూసేవారిని అబ్బురపరుస్తోంది.

నిండు చూలాల్లా ధాన్యాన్ని మోస్తూ పెద్దజాడలో పడవలు బైల్దేరాయి. తనని నమ్ముకున్న జనాల సంతోషాన్ని చూసి కొల్లేరు ఆనందంతో తళతళలాడిపోతోంది.

పడవలోంచి ఒడ్డు కనపడని ఆ నీటిని, ఆ నీటిలో మునగబోయే సూర్యబింబాన్ని, దిగంతాలకావల ఎక్కడి నుంచో వస్తున్న ట్టున్న జీలగ మంటల్ని కన్నార్పకుండా చూస్తున్నాడు ఎనిమిదేళ్ళ శీను. వాడు ఆ సుందర దృశ్యాన్ని వాడి జన్మలో మర్చిపో కుండా మనసులో ముద్రించుకుంటు న్నాడు.

ఏటివారకేసి వస్తున్న పడవల్లోని ధాన్యాన్ని అక్కడే ఉన్న లారీల్లో నింపడా నికి జనం సిద్ధంగా ఉన్నారు.

★ ★ ★

అనుకున్నట్టు పంట దక్కగానే పెద్ద గుణ్ణంలోకి వలల్తో దిగారు వడ్డీలు. ఏమి చేపలవి! వలలతో దిగిన వడ్డీలు చేపలు పడుతున్నారా, చేపలే వడ్డీల్ని పడుతు న్నాయా? అన్నట్టు వేట సాగింది.

వలలో పడ్డ వాలగ తోకతో కొట్టే దెబ్బకి వడ్డీల వీపులమీద వాతలు తేల్తున్నాయి.

జెల్లలూ, ఇంగిలాయిలు, మార్పులు కుడుతున్న నొప్పి భరించలేక వడ్డీలు పెడుతున్న కేకలతో కొల్లేరు ప్రతిధ్వని స్తోంది.

ఒక్కో వాలగనీ పట్టుకుని ఏటివారకి తేవాలంటే రెండు కావిళ్ళకి కట్టి నలుగురు బలమైన యువకులు మొయ్యాల్సి వస్తోంది. ఒక్కో బొచ్చెనీ తేవాలంటే అయి దారు గోతాం సంచుల్ని చింపి ఒకటిగా కుట్టి దానిలో పడేసి మోసుకు రావాల్సివ స్తుంది.

కొల్లేట్లో ఎక్కడెక్కడో పెరిగిన రకరకాల చేపలన్నింటికీ పెద్దగుణ్ణం చివరి మజిలీ. ఆ మజిలీ మీదే దాడి చేసి వేటాడితే అక్కడ చేపల సంపదకేమి కొరత?

ఆ రోజు వడ్డీలు, చేపలు కలిసి చేసిన సందడిని శీనూ, కిష్టుడు, పొట్టోడు కలిసి చూసి పొందిన ఆనందంతో సాటి వచ్చేవి.. శీను జీవితంలో చాలా అరు దుగా ఉన్నాయి. నవ్వులు, కేరింతలు,

భయాలు, వీరాలాపాలూ అనేక రసాలతో వాళ్ళ చిన్న మనసులు పొంగి ప్రవహిం చాయి.



9

దేవమ్మగారింటి ముందున్న వసారాలో కూర్చుని చూస్తే కైకలూరు రోడ్డు మీద నుంచి ఊళ్ళోకొచ్చే రోడ్డంతా కనపడు తుంది. లక్ష్మమ్మ, దేవమ్మతో పిచ్చాపాటి మాట్లాడ్తున్నదన్నమాటే గాని ఆమె చూపంతా ఆ రోడ్డుమీదే ఉంది. అది గమ నించి దేవమ్మ "ఎందుకట్టా రోడ్డేపే చూత్తన్నా.. ఎవరొత్తారు? " అంది.

"ఇంకెవరు? నీ మనమడొత్తాడేమోనని" అంది లక్ష్మమ్మ.

"శీనా? ఆడు చౌటపల్లికెళ్ళి వారం అవ్వలా? చిన్నమోడు. ఒక్కడే ఎట్లొత్తాడే? " అంది దేవమ్మ.

"చిన్నమ్మాయికి శలవలిత్తారంట. ఆడ్ని తీసుకొత్తాలే అని కార్డేసింది. అందుకే చూట్టం" అంది లక్ష్మమ్మ.

"ఝాన్సీ వత్తానందా? దాన్ని జూసి ఎన్నాళ్ళయిందో! అయితే దాని సదువయి పోయినట్టేనా? " అంది దేవమ్మ.

"ఎనిమిది సదువుతాందిగా. పరీక్షలిచ్చి వత్తాంది. ఇదయ్యాక బందరెళ్ళి చదువు తానంటంది. అది చదివితే పంతులమ్మ అవచ్చుంట. అది చదవకపోతే ఇప్పటిదాకా చదివింది దండగే అంటంది. బందరంటే మాటలా! ఎంత కర్సవుతుందో? ఎట్టా తేవాలో? " దిగులుగా అంది లక్ష్మమ్మ.

"కర్సు సంగతి సర్లే. వయసొచ్చిన ఆడ పిల్లని దూరాబారం ఎట్టా పంపుతా? అదెక్కడుంటుంది? ఎట్టా ఉంటంది? " అనడిగింది దేవమ్మ.

"అదే గదా బాధ. వత్తాందిగా.. దాన్నే అడుగు. అది ససేమిరా సదవాల్సిందేనంటాంది" అంది లక్ష్మమ్మ.

ఇద్దరూ మాట్లాడుకుంటూనే రోడ్డెంక చూస్తున్నారు. చౌటపల్లి నుంచి పులపర్రు రావాలంటే పెద్ద ప్రహసనమే. చౌటపల్లి నుంచి ఒక మైలున్నర మట్టిరోడ్డు మీద నడిచి, తార్రోడ్డు మీదున్న కొత్త చౌటపల్లి గాని, డొంకదారుల్లో నడిచి పెదపాలపర్రు గాని వచ్చి, గుడివాడ నుంచి కైకలూరు వైపు వెళ్ళే భీమవరం బస్సుగాని, తణుకు బస్సుగానీ ఎక్కాలి. కైకలూరు గరువుల దగ్గర దిగి ఏలూరురోడ్డు మీద నడుచు కుంటూ రావాలి. బస్సులు గాని, రిక్షాలు గాని, జట్కాలు గాని ఏమీ ఉండవు. మరొక మార్గం పెదపాలపర్రు నుంచి చేల ల్లోబడి బోదెలు దాటుకుంటూ గళ్ళల్లో నుంచి నడిచి, మోటూరు రైల్వేస్టేషన్‌కి వచ్చి రెండుమూడు గంటల కొకసారి వచ్చే రైలెక్కి కైకలూరు స్టేషన్లో దిగి మరో మైలు నడిచి గరువులకి చేరాలి. ఇది చాలా విసుగు ప్రయాణం. కాని బస్సులు ఒక పట్టాన ఆపరు. బస్సులు కిక్కిరిసి వచ్చి, ఆక్కుండానో, దిగేవాళ్ళుంటే ఆగినా ఎక్కించుకోకుండానో వెళ్ళిపోతాయి.

ఒక్కోసారి పొద్దున చద్దన్నం తిని వచ్చి నుంచుంటే మధ్యాన్నపు అన్నంవేళ అయి పోయినా, సాయంత్రానిక్కూడా బస్సందక మోటూరు వెళ్ళి రైలెక్కి ఏ అర్ధరాత్రికో ఊరుచేరిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంతా జేస్తే చౌటపల్లి నుంచి పులపర్రుకి దూరం పదిహేను మైళ్ళలోపే. రైలు

టిక్కెట్టు పావలా. బస్సుకి ఆరణాలు. శీనూకి అర టిక్కెట్టే.. అంటే బేడా. మూణ్ణాలు. చూసి చూసి వీళ్ళిద్దరి కళ్ళూ కాయలు కాసినా వాళ్ళిద్దరూ రావడంలా.

"సర్లే. ఇకిట్టా కూచ్చుంటే అయినట్లే. ఈయన పొలం నుంచి వచ్చే ఏళయింది. ఎండెక్కి పోతాంది. నేనెళ్తా. వచ్చే వాళ్ళె ట్టాగూ వత్తార్లే" అని లేచింది లక్ష్మమ్మ.

"అంతేలే, పద. అబ్బాయొత్తే మళ్ళీ.."

"దొరగారొచ్చేసరికింటో లేకపోతే అంకమ్మ శివాలే..ఎల్తా" అంది లక్ష్మమ్మ.

★ ★ ★

రంగయ్య 'దొరగారు' పొలంనుంచి పచ్చ గడ్డి మోపెత్తుకొచ్చి చావిట్లో గేదెల గాట్లో కొంతేసి, మిగిలిన కొంత గేదెలకంద కుండా, దూరంగా పెట్టొచ్చి స్నానం చేసి, ఇంతన్నం తిని పడుకుని గుర్రుకొడ్తు న్నారు. ఆయన తిన్న తర్వాత తనూ ఇంత తిని మండిగం మీదొక దిండేసుకుని ఇంటో పడుకుని 'ముమ్మిడివరం బాల యోగి జీవితం' చదువుకుంటూ 'ఈళ్ళికి వాళ రానట్టేనేమో' అనుకుంటూ అట్లానే నిద్రోయింది లక్ష్మమ్మ.

"అమ్మా!" అనే శీనూ పిలుపుకి ఉలిక్కి పడి లేచి కూర్చుంది లక్ష్మమ్మ. వాకిట్లో శీనూ, రెండు సంచుల్తో ఝాన్సీ నిలబడు న్నారు. ఇద్దరి ముఖాలూ ఎండకి కమిలి వాడిపోయి ఉన్నాయి. లక్ష్మమ్మ గబగబా ఆ సంచులు తీసుకుని లోన భోషాణం మీద పడేస్తూ "కుండలో చల్లటి నీళ్ళు న్నాయి. ముందు కాళ్ళూ సేతులూ మొఖం కడుక్కోండి. ఇవ్వాళ ఎండంతా మీ పాలేగా" అంది.

"ఆ.. ఎప్పుడు బైల్దేరామనుకుంటున్నా? " అంది ఝాన్సీ.

"ఊ" ఎప్పుడో చెప్పమన్నట్టు లక్ష్మమ్మ.

"పొద్దున్నే అయితే బస్సుందుతుందనీ, ఎండెక్కకముందే వచ్చెయ్యొచ్చని ఏడింటికి బైల్దేరాం. కొత్తూరు దగ్గర నుంచునీ, నుంచునీ కాళ్ళు పీక్కుపోయినయి. ఒక్క సచ్చినాడూ ఆపలా. ఎన్ని బస్సులొచ్చా యనీ? ఏరా... బస్కుల్లెక్కడుతూ కూచు న్నాడు. ఎన్నిరా? " అంది ఝాన్సీ.

"భీమవరం బస్సులు ఏడు ఆపలా. తణుకు బస్సులు ఐదాపలా. బంటుమిల్లి బస్సులు నాలుగాపలా, రెండు ఆపాడు" అన్నాడు ఉత్సాహంగా శీను.

"అదీ సంగతి! ఇక చివరికి బంటుమిల్లి బస్కెక్కి ముదినేపల్లిలో దిగి కైకలూరు బస్సెక్కుదామనుకుని, ఇక ఏ బస్సాపినా ఎక్కేద్దాం అనుకున్నప్పుడు వచ్చిన బస్సు భీమవరంది. అదెక్కి గరువుల దగ్గర దిగే సరికి ఎండకి నాలుక పిడచగట్టుకుపో యిందే అమ్మా. అక్కడ చెరొక షోడా తాగి బైల్దేరితే ఒకటే ఎండ. ఏం ఊరో మాయదారి ఊరు. ఎట్టుంటన్నారే ఈ దరిద్రపూర్లో" ముఖం తుడుచుకుంటూ ఝాన్సీ ఘోష పెట్టింది. ఝాన్సీకి చౌట పల్లి బాగా అలవాటైంది. ఈ ప్రయాణ భారం పిల్లలకెందుకని రంగయ్య, లక్ష్మ మ్మలే ఎక్కువసార్లు చౌటపల్లి వెళ్ళి పిల్లల్ని చూస్తారు. ఎప్పుడన్నా రావాలంటే ఝాన్సీకి చిరాగ్గానే ఉంటుంది.

ఇద్దరూ అమ్మిచ్చిన కుండలోని చల్లని మంచినీళ్ళు తాగారు.

"అమ్మా! ఆకలి" అన్నాడు శీను.

"అన్నం పెడతా. పీటలు వాల్చుక్కో చోండి" అంది లక్ష్మమ్మ.

"అన్నం తర్వాత్తింటాలే. ముందేమన్నా పెట్టు"

లక్ష్మమ్మకు గ్గుర్తొచ్చింది. గబగబా ఉట్టి లోని మట్టి పిడత తీసి శీనూకందించింది.

పిడతలోంచి తనొకటి తీసుకుని అక్కకొ కటిస్తూ "ఎక్కడియ్యమ్మా గారెలు? " అని ఒక ముక్క కొరికి, "మసాలాగారెలు అత్త పంపిందా? " అన్నాడు.

వజ్రమ్మ వంట ప్రత్యేకత అదే. ఆమె చేసిన వంటకమేదైనా అది ఆమే చేసిందని ఒక్కరవ్వ రుచి చూడగానే చెప్పొచ్చు.

"ఆ! ఇవ్వాళెవరో చుట్టాలొచ్చారంట వాళ్ళింటికి. శ్యామల్తో పంపింది మీ అత్త. నెమ్మదిగా తిన్నాయినా! గొంతుకడ్డం పడ తంది" అంటూ కొడుకునే చూస్తున్న లక్ష్మమ్మకి దుఃఖం ఆగటం లేదు. రాబోయే రోజుల్ని తల్చుకుంటుంటే ఆమెకి ఊపిరాడటం లేదు.

"ఏంటమ్మా! అంత చిక్కిపోయావ్! ఒంట్లో బాగుండట్లేదా? " అంది ఝాన్సీ తల్లి ముఖంలో దిగులు చూసి.

"నాకేం తీపరం! శుబ్బరంగా ఉన్నా. నువ్వెట్టా ఉన్నా.. అక్కెట్టా ఉంది? మావయ్యా, పిల్లలూ అందరూ బాగానే ఉన్నారుగా? " అంది లక్ష్మమ్మ.

"అందరం బాగానే ఉన్నాంగాని.. నాన్నేంటి.. మేం ఇంత గోల చేస్తున్నా లేవడా? " అంది నవ్వుతూ

"మీ నాన్న సంగతి నీకు తెలవదూ? ఎవరన్నా ఏ పనన్నా చెప్పడం ఆలిస్నెం.. పొగులూ రేత్రీ నిద్రపోకుండా చేత్తారు. పనేం లేకపోతే కుంభకర్ణుడి తమ్ముడేగా" అంది లక్ష్మమ్మ.

గారెలు ఖాళీ చేస్తూ వీళ్ళ మాటలు వింటున్న శీనూ తండ్రిని కుంభకర్ణుడి తమ్ముడనగానే కిలకిల నవ్వటం మొదలెట్టాడు. తమ్ముడు నవ్వడం చూసి ఝాన్సీ కూడా ముసిముసి నవ్వులు నవ్వి తమ్ముడి తల మీదొకటి ఇచ్చి "ఎందుకురా అంత నవ్వు? " అని అంది.

తర్వాత తల్లివంక తిరిగి "అమ్మా! మొన్న వీడు మిషినీ మామయ్యాళ్ళింటికెళ్ళినపుడేం జరిగిందో అడుగు" అంది.

"ఏం జరిగిందయ్యా? " అంది లక్ష్మమ్మ.

తను తినగా మిగిలిన గారె అక్కకిస్తూ "మిషినీ మామయ్యాళ్ళింటికెళ్ళాగదా! అక్కడ రుక్మిణత్త నన్ను చూసి 'మా లక్ష్మమ్మ కొడుకువంటరా.. కొల్లేట్లోనే ఉంటన్నారుగా.. బళ్ళోకెల్తన్నావా బాబూ' అంది. 'మాఊళ్ళో బడి ఉంది గాని ఎవరూ ఎల్లరు. పొంతులుగారు కూడా రారు' అన్నాను. 'అయితే నువ్వేమీ సదూకోట్లేదా? ' అంది. 'లేదు' అన్నా. 'మరైతే ఏం జేత్తన్నా'వంది. 'కొల్లేట్లోకి గొడ్లని తోలుకెళ్తున్నా' అన్నాను. అమ్మా! అప్పుడెందుకే రుక్మిణత్త కళ్ళల్లో నీళ్ళొచ్చాయి? నన్నెట్టాగో చూసింది. అంది గదా, 'మా లక్ష్మమ్మొదిన సిన్నప్పుడు తను సదూకోటమేగాక మేమందరం సదువుకునేట్టు సేసింది. అటుమంటిది లేకలేక పుట్టిన

ఒక్కగానొక్క కొడుకువి నువ్వు సదువు లేకుండా కొల్లేట్లో గొడ్డని కాస్తన్నావా? ఏమిటో రోజులు' అని కళ్లు తుడుసుకుం దమ్మా. అప్పుడు నాక్కూడా ఏడుపొ చ్చిందే. ఏడిసా. అది చూసి 'ఊరుకో బాబూ! కళ్ళు తుడుచుకో, ఏంటో ఉండబ ట్టలేక వాగేశా. ఎట్టాగొట్టా సదువుకోవా లయ్యా, సదువుకో' అంది" అన్నాడు శీను.

శీనూ అదంతా వివరంగా చెప్పిన తీరుకీ, ఆ విషయంలోని విషాదానికీ ఝాన్సీకీ, లక్ష్మమ్మకీ కన్నీళ్ళు తిరిగాయి.

"అమ్మా! అసలంతకుముందే అనుకుంట న్నానే. నేనెట్టాగూ బందరెళ్ళిపోతా. అక్క క్కూడా పిల్లల్తో పాలయాపారం ఇబ్బందే. నేనుంటే దగ్గరున్న నాలుగిళ్ళకీ, తనో నేనో ఎళ్ళి పాలు పోంచుకొత్తన్నాం. ఒకళ్ళం పిల్లల్ని వంటపనీ చూసుకుంటున్నాం. నేను బందరెళ్ళిపోతే ఈడు అక్కింటో ఉండి నాలుగిళ్ళకెళ్ళి పాలు పోగేస్తాడు. తర్వాత ఇంకో సంగతి. ఇప్పుడు పొన్నమ్మ గారి చావిట్లో గోపాలం గారని ఒక పెద్ద పంతులు గారొచ్చి పిల్లలకి పాఠాలు చెప్త న్నారు. పెద్ద బళ్ళోకంటే ఈయన దగ్గరకే ఎక్కువ మందెల్తున్నారు. భలేగా చెప్త న్నాడు. నే చెప్పినట్టు చెయ్యండి. నువ్వా, నాన్నా రేపు నాతోపాటు ఈడ్ని తీసుకు రండి. అక్కతో, మావయ్యతో మాట్లాడి గోపాలం గారి దగ్గరికి తీసికెళ్ళి చేర్పిం చండి. ఈడికప్పుడే ఎనిమిదేళ్ళెళ్ళిపోతు న్నాయి. ఆయనైతే సంవత్సరంలో నాలుగు లోనో, రెండు సంవత్సరాల్లో అయిదులోనో ఏసేస్తాడు. ఇన్నాళ్లూ సదవకపోయినా పెద్ద ఫర్వాలా.. నా మాటినమ్మా.. నా తమ్ముడు గొడ్లను కాసుకుంటన్నాడంటే నాకే ఏడుపొస్తాందే. అక్కక్కూడా ఈడంటే ప్రేమే. వప్పుకుంటుంది. మామ య్యక్కూడా వీడు చేతికిందుంటాడు. నా మాటినండి" అంటూ కన్నీళ్ళతోనూ, తుడు చుకుంటూనూ ఝాన్సీ చెప్తున్నంతసేపూ గుండెల్లోనుంచి తన్నుకుంటూ వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ విన్న లక్ష్మమ్మ "ఆరు నూరైనా, కొంప కొల్లేరైనా, నీ బాబే మన్నా ఇక ఆగేది లేదు. అయ్యని చదివి చ్చుకోవాల్సిందే! అక్క ఒప్పుకుంటుందిలే. ఒకేళ ఒప్పుకోకపోతే నేను చౌటపల్లిలోనే ఉండి అయ్యని చదివిచ్చుకుంటా. మీ బాబుని అక్కడే రొండెకరాలు కౌలుకి తీసు కోమందాం. అక్కడా మనుషులున్నా రుగా.. వాళ్ళకి సాయాలు చేసుకుంటా అక్కడే ఉంటాడు. ఏం నాయనా.. శ్రద్ధగా చదువుకుంటావుగా? " అంది లక్ష్మమ్మ.

"ఆ.. చదువుకుంటాగాని, చిన్నక్కా.. పొంతులుగారు బెత్తంతో కొడతారా? " అన్నాడు.

"ఆ చెప్పింది చదవకపోతే, హోంవర్కు చెయ్యకపోతే, అప్పజెప్పమంది అప్పజెప్పక పోతే బాగా కొడతాడంట" అంది.

"అయితే నేను చదవన్లే. మన్ని కొట్టే వాళ్ళంటే మనకి నచ్చదు" అన్నాడు శీను.

"సరే అయితే, గొడ్లని కొట్టుకుంటా ఇక్కడే ఉండు. అమ్మానాన్నని కూడా నేను తీసుకెళ్ళి బందర్లో పెట్టుకుంటా" అంది ఝాన్సీ.

"బందరా? "

"అవును. మరి నువ్వా చదువుకోక, నేనూ చదువుకోక రేపు అమ్మానాన్నా ముసలి వాళ్ళయిపోతే వాళ్ళని ఎవరు చూస్తారూ? వాళ్ళకి మనిద్దరంగాక ఎవరు న్నారు? " అంది ఝాన్సీ.

"పెద్దక్క"

"పెద్దక్కకిప్పటికే ముగ్గురు పిల్లలు. ఇంకా పుడతారు. వాళ్ళందర్నీ పెంచేసరికీ వాళ్ళ పనయ్యిపోతాంది. ఇంకా అమ్మా నాన్నల్ని, నిన్నూ వాళ్ళు చూడగల్గుతారా? " అంది ఝాన్సీ.

ఈ సంభాషణంతా వింటున్న లక్ష్మమ్మ

"చిన్నక్కకి కూడా ఇవ్వాళగాపోయినా రేపు పెళ్ళి చేసి పంపాలిగా అయ్యా! అప్పుడు నువ్వుగాక ఎవరు చూస్తారు చెప్పు. ఒక పనిచేద్దాంలే... నాన్నని పొంతులుగారితో మాట్లాడమందాం"

"ఏమని? " ఆత్రుతగా అడిగాడు శీను.

"మా అయ్యని మేమే ఎన్నడూ ఒక్క దెబ్బెయ్యకుండా పెంచుకున్నాం. మీరు చెప్పే చదువేదో చెప్పండి. మా అయ్యకి వచ్చేదేదో వస్తుంది. రానిదేదో రాదు. కాని మీరు ఒక్క దెబ్బ కూడా మా అయ్యని కొట్టకూడదు అని చెప్పమందాం. అప్పుడు నీకిష్టమేగా? "

"ఆ"

"సరే, నాన్న లేవగానే అన్నీ ఆయనకి నచ్చచెప్పి ఒప్పిద్దాం. ఒప్పుకుంటార్లే. కొడుక్కి మంచి రోజులొస్తయ్యంటే ఏ తండ్రి ఒప్పుకోడూ? " అంది లక్ష్మమ్మ.

ఝాన్సీ తమ్ముడ్ని దగ్గరికి తీసుకుని ముద్దు పెట్టుకుంటూ "మా తమ్ముడు చదువుకొని గొప్పవాడవుతాడు" అంది.

"ఇకన్నాలు తిందురుగాని లేవండి" అంది లక్ష్మమ్మ.

ఈ సమస్యలో తల దూర్చకుండా హాయిగా నిద్రపోతున్నాడు రంగయ్యగారు.

★ ★ ★

"ఆ తర్వాత ఏమైంది క్రిష్ణబావా! సమష్టి వ్యవసాయం మొదలుపెట్టిన ఏడే నన్ను చదువుకోసం చౌటపల్లి పంపించారు, మా శకుంతలక్క ఇంటికి. అక్కడ పనులు, చదువు.. ఆ గోలలో పడిపోయాను. శలవల్లో కూడా ఏదో ఒక పని. ఎక్కువసార్లు పులపర్రు రాలేదు. స్కూల్ ఫైనల్ అయ్యాక హైదరాబాదు వెళ్తే అదొక ప్రపంచమై పోయింది.

కొల్లేట్లో చేపల చెరువులనీ, కొల్లేరంతా మారిందనీ వింటున్నాను, పేపర్లలో చదువుతున్నాను గానీ ఇంత ఘోరం జరుగుతుందనుకోలా? అసలా సమష్టి వ్యవసాయం ఎందుకాగిపోయింది? "

శ్రీనివాసరావు ఉద్వేగాన్ని అర్థం చేసుకున్నవాడిలా రాధాకృష్ణ అతని భుజం మీద తట్టాడు.

"ఆ వ్యవసాయం ఐదారేళ్ళు బాగా నడిచిందిరా. తర్వాత మొదలైంది ముసలం. అందరి దగ్గరా కాస్తో కూస్తో డబ్బాడటం మొదలవ్వగానే ప్రతివాడూ తానే మొనగాడిననుకున్నాడు. చిన్నగుణ్ణం చేపలు వడ్డీల కెందుకని వీళ్ళు - చిన్న గుణ్ణమే కాదు గట్లెయ్యటానికి తవ్విన కొలుముల్లో చేపలు కూడా మావే - అది మా హక్కని వడ్డీలు - సర్ది చెప్పగలిగినవాళ్ళు లేరు. మధు అన్నయ్యలాంటి వాళ్ళు ఉద్యోగాలెతుక్కుంటూ వెళ్ళిపోయారు"

"చదువుకున్నవాళ్ళు సరే, పెద్దలేమయ్యారు? " ఆక్రోశపడ్డాడు శ్రీనివాసరావు.

"ఏమయ్యారంటే ఉన్నారు. కానీ వాళ్ళ మాట వినేవాళ్ళు తగ్గిపోయారు. మీ నాన్న రంగయ్యగారు చౌటపల్లికెళ్ళాడా? కాకయ్యగారూ, వీరరాఘవయ్యగారూ ఒకటంటే సుబ్బయ్యగారూ, నాగయ్యగారూ ఇంకొకటంటారు. జనంలో పార్టీల తగాదాలు, గ్రూపులూ"

"మనూళ్ళో గ్రూపులా? " ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనివాసరావు.

"మరి. ఏం మనూరేమన్నా తీసిపోయిందా? దేశమంతా మతాలవారీగా కులాలవారీగా, పార్టీలవారీగా చీలిపోతుంటే మనూరేం తక్కువతిందా? మనూరూ చీలింది" నిష్టూరంగా అన్నాడు రాధాక్రిష్ణ.

"సమష్టి వ్యవసాయం ఆగిన తర్వాత మళ్ళీ రెండేళ్ళలో కథ మామూలైంది. ములకలు. పంటలు లేక పస్తులు.. ఈ మానవ స్వభావం ఏంటో అర్థం కాదురా, ఎంత మంచిదని తెలిసినా సరే తమ



అహంకారానికి దానిని బలి ఇచ్చేసి నానా కష్టాలు పడటానికి సిద్ధమవుతారు" రాధా కృష్ణ విషాదంగా అన్నాడు.

"బాబాయ్ ఇక్కడున్నారా? మీ కోసం ఊరంతా వెతుకుతుంటే పెద్ద మామయ్య గారు చెప్పారు. మీరు కొల్లేటి దగ్గరుం టారు చూడమని" ఆయాసపడుతూ హడా వుడి పడుతూ వచ్చాడు రవి.

"వస్తున్నాంరా, పద" అంటూ రాధాకృష్ణ, శ్రీనివాసరావులు గతం నుంచి ముందుకు కదిలి నడిచారు.

"మా వదిన లక్ష్మమ్మ తొంభై ఎనిమిదే ళ్లు బతికింది. నేనూ అన్నాళ్ళు బతకా ల్సిందే" అని పంతం పట్టిన శీను మేనత్త, రాధాక్రిష్ట, మధుసూదనరావుల తల్లి వజ్రమ్మ తొంభైఐదు ఏళ్ళకే మరణించింది. ఆ ఊరంతటికీ పెద్దామె. ఆ రోజు ఊళ్ళో పండగలాగా ఆమె పెద్దకర్మ జరుగు తోంది. ఆ సందర్భంలోనే దాదాపు నలభై ఏళ్ళ తర్వాత పులపర్రు వచ్చాడు శ్రీనివా సరావు. కాలవగట్టున నడుస్తుంటే ఊరిలో విశేషాలు వీళ్ళిద్దరికీ చెప్పాలని ఉత్సాహప డ్డాడు రవి - శ్రీనివాసరావు బాబాయి అచ్చయ్యగారి మనవడు.

"అటు చూశావా బాబాయ్ - ఆ డాబా లన్నీ ఎవరివనుకున్నా? మనూరి వడ్డా



ళ్ళవి" కాలవగట్టునున్న పెద్ద పెద్ద డాబాలని చూపించాడు వాడు.

శ్రీనివాసరావు ఆశ్చర్యంగా చూశాడు "ఔనా" అంటూ.

"ఆ! ఆ గుడి చూడండి. ఎంత పెద్దదో. అది కూడా వాళ్ళే కట్టించారు"

"ఒకప్పుడు గుడి అంటూ లేని ఊళ్ళో ఇంత పెద్ద గుడి వడ్డీలు కట్టించారా"? మరింత ఆశ్చర్యపోయాడు.

రాధాకృష్ణ నవ్వాడు.

"మనూరి వడ్డాళ్ళు ఈ చేపల చెరువుల వల్ల ఎంత బాగుపడ్డారో. ఆ మధ్య వీళ్ళంతా చేపల్ని లారీల మీద పంపేసరికి కొన్ని పాడైపోతున్నాయని మనూళ్ళో విమానాశ్రయం కట్టాలని అర్జీ పెట్టారు. అది తెలిసి ఇన్‌కంటాక్సు వాళ్ళొచ్చి వీళ్ళ ఇళ్ల మీద దాడి చేశారు. ఒక్కో ఇంట్లో మంచాల కింద గోనెసంచుల్నిండా ఐదొందల రూపాయల నోట్లు, వెయ్యి రూపాయ నోట్లూ దొరికినయ్యంట" నవ్వాడు రవి.

"నువ్వు మరీ చెప్తావురా" అన్నాడు శ్రీనివాసరావు.

"వాడు చెప్పిందాంటో అబద్ధమేమీ లేదురా. అంతా నిజమే" నవ్వుతూ అన్నాడు రాధాకృష్ణ.

శ్రీనూకి తన చిన్నతనంలోని వడ్డాళ్ళు

గుర్తొచ్చారు. యూనిఫాం వేసుకున్నట్టు చిన్నా పెద్దా అంతా గోచీలే. అందరివీ చుట్టు గుడిశలే.

అంత పేదరికం నుంచి వడ్డీవాళ్లు చేపల చెరువులవల్ల బాగుపడ్డారంటే నయమే అనుకుంటూ ఊళ్ళోకి నడుస్తున్నవాళ్లకు ఎదురుపడ్డ ఇద్దరిలో ఒకతను ఆగి వీళ్లను ముఖ్యంగా శ్రీనివాసరావుని పరీక్షగా చూస్తూ "బాబూ నువ్వు మా రంగయ్యగా రబ్బాయి శీనూవి గాదూ" అన్నాడు.

శ్రీనివాసరావతన్ని పరీక్షగా చూస్తూ "అవును. నేను రంగయ్యగారబ్బాయినే గాని.. నిన్ను నేను గుర్తుపట్టలేదే" అన్నాడు కాస్త మొహమాటంగా.

"నేన్నీకు గుర్తుండన్లే బాబూ.. నేను భలేకృష్ణమూర్తి కొడుకుని. నా సిన్నప్పుడు మీ ఇంటికి అప్పుడప్పుడూ సేపలివ్వటాని కొచ్చేవాడ్ని" అన్నాడు నవ్వుతూ.

"ఎప్పటి మాట! యాభై అరవైయేళ్ల నాటి మాట" అతని మొహంలో శీనూని చూసినందుకు ఆనందం కొట్టొచ్చినట్టు కన పడుతోంది.

శీనూకొక్కసారి తన చిన్నతనం, కిష్టమూర్తి, అతను తెచ్చిచ్చే చేపలూ, పంది మాంసపు పొట్లాం, అమ్మ విసుక్కోవటం.. నాన్న సంతోషపు నవ్వులూ, ఎంత విసు క్కున్నా ఎంతో రుచిగా వండిన ఆ కూర రుచీ, కిష్ణమూర్తితో పాటు అతని వెనకే నక్కినక్కి చూసే ఓ మొండిపిల్లాడు.. అన్నీ గుర్తొచ్చాయి. అప్పటి వరకూ అతని మనసుని కలవరపరుస్తున్న కొల్లేరు ఈ జ్ఞాపకాలతో తియ్యగా మారిపోయింది.

"ఇప్పుడు గుర్తొచ్చావోయ్. ఒకసారి నేన్నీకు జిలేబీ ఇచ్చాను గదా" అన్నాడు శ్రీనివాసరావు నవ్వుతూ.

"బాబూ! అది మీకింకా గుర్తుందా?" అన్నాడతను నవ్వుతూ.

"అది తీసుకుంటూ నువ్వు పడ్డ సంతోషం నాకెప్పుడూ గుర్తొస్తుంటుంది. అవునూ... నీ పేరేంటి?" అన్నాడు శ్రీని వాసరావు.

"మేం కమలలం గదండీ. నాపేరు నకు లుడు. మా తమ్ముడే ఈడిపేరు సాదే వుడు" అన్నాడు పక్కనున్నతన్ని చూసి.

"మరి కిష్టమూర్తి బావున్నాడా?"

"ఎక్కడండి.. పోయినేడు సచ్చిపోయా డండి"

"అవునా? మీరిద్దరేం చేస్తున్నారు?" అడుగుతూ వాళ్ళవంక పరిశీలనగా చూశాడు. ఇద్దరికీ గడ్డాలు, తల మాసి ఉన్నాయి. కచ్చాలు వేసుకుని తుండ్లు చుట్టుకున్నారు.

"ఏం సేత్తాం బాబూ? మాకొచ్చిన పని సేపలు పట్టటం.. అప్పుడు కొల్లేట్లో పట్టు కుని అమ్ముకునేవాళ్లం. ఇప్పుడు చెరువుల్లో పట్టి పెడ్తే కూలి దొరుకుతుంది. దాంతోనే పెళ్లాం బిడ్డలకింత పెట్టి మేమింత తింటన్నాం"

"అదేంటి? మీరు కూడా ఒక చెరువు తవ్వుకునే పనిగదా" అమాయకంగా అడి గాడు శ్రీనివాసరావు.

నకుల సహదేవులిద్దరూ పకపక న వ్వారు.

"భలే మాట సెప్పావ్ బాబూ! కొల్లేట్లో సెరువులు సూళ్ళా. ఒక్కొక్కటి ఎన్నెకరా లుంటంది. అంత మాకెక్కడ్నిచొత్తంది. మా అయ్య కాలం నుంచి మా బతుకులు మీకు తెలవనియ్యా? సెరువులు తవ్వించా లన్నా, సేప్పిల్లల్ని కొనాలన్నా, పెంచా లన్నా ఎంత పెట్టుబడి కావాల? మాకే డ్నించి వొత్తది? సేపల సెరువులంటే మాటలా బాబూ"

"మరి మీవాళ్లు కొందరు.." అని డాబాల కేసి తలెగరేశాడు శ్రీనివాసరావు.

"ఆళ్ళు.. ఆళ్ళ కత ఏరు. కొత్త డబ్బు సేసుకుని, సేపల యాపారం చేసి, కల

కత్తా ఎల్లొచ్చి, డబ్బులు పోగేసుకుని సిన్నగా సెరువులు తవ్వుకుని బాగుపడ్డారు. అదురుట్టవంతులు. మాకంత అదురుట్టం లేదు. తెలివీ లేదు"

భోజనాలు చేసి వస్తున్న కొల్లూరి నాగయ్య, పావులూరెంకటేశ్వర్రావు, నర్రా కుటుంబరావు, గుత్తాచంద్రం, శ్రీనివాసరావుని, రాధాకృష్ణని చూసి ఆగి పలకరించారు. దాంతో నకుల సహదేవులు "వత్తాం బాబూ" అని వెళ్ళిపోయారు.

"ఏంట్రా నత్త నడకలు. మీ బావలంతా నువ్వొత్తే గాని భోం చెయ్యమని భీష్మించుక్కూచ్చున్నారు" అన్నాడు నాగయ్య.

"ఆ.. ఆళ్ళ పనులూ ఇప్పుడే అయినవయ్యిలే. ఎళ్ళెళ్లు" అన్నాడు గుత్తా చంద్రం. వీళ్లు ముగ్గురూ నడక వేగం పెంచారు.



ఊరంతా వజ్రమ్మను తల్చుకుంటూ భోజనాలు చేశారు. అందరూ ఎటువాళ్ళటు వెళ్లిపోయారు.

మధుసూదనరావు, రాధాకృష్ణ, రాజేంద్ర కొడుకులుగా తల్లిని బాధ్యతగా సాగనంపామనే భావనతో ఉన్నారు.

శ్రీనివాసరావుకి మాత్రం కొల్లేటి గురించిన బాధ తగ్గటం లేదు.

"కొల్లేటి సమస్య చిన్న సమస్య కాదురా. ఇందులో రాజకీయాలున్నాయి. పెట్టుబడి ఉంది. నువ్వూహించలేనంత వ్యాపారం ఉంది. దానికోసం రాజకీయ నాయకులు చెయ్యగూడని పనులన్నీ చేస్తున్నారు. ప్రభుత్వం ఉందంటే గాంధీగారి సిద్ధాంతాన్ని చక్కగా పాటిస్తుంది. చెడు వినకు, చెడు కనకు- కొల్లేరే కాదు దేశం నాశనమవుతుంటే కళ్లూ చెవులూ మూసుక్కూచుంటుంది. ఇది పద్ధతి కాదని అరిచే వాళ్లెవరైనా ఉంటే వారి నోరు నొక్కేస్తుంది"

"ప్రభుత్వానికి కొల్లేటి గురించి తెలియనంత కాలం, కొల్లేటిని రైతుల, వడ్డీల బాధల సరసుగా మాత్రమే గుర్తించినంత కాలం కొల్లేరు బాగుందిరా. ఎప్పుడైతే.."

మధుసూదనరావు తమ్ముడిని వారిస్తూ "నువ్వుండరా.. కాసేపు మాట్లాడకు. నేననేది ఏంటంటే ఎప్పుడైతే బతకటానికి గాక, లాభాలవేటకి ప్రకృతిని, సహజ వనరుల్ని మనం కొల్లగొడతామో, అప్పుడు మనం పర్యావరణానికి ముప్పు తెస్తున్నట్టే. పేదలు బాగుపడాలి. అదే సమయంలో కొల్లేరునీ రక్షించుకోవాలి. ఇదేమీ అసాధ్యం, అసంభవం కాదు. కాకపోతే మన ప్రభుత్వాలకి ముందుచూపుండాలి. అది కలికానికి్కూడా లేదు. ఇక్కడే కాదు- ఎక్కడా- ఏ రంగంలోనూ ప్రభుత్వాలకి ముందు చూపు లేదు. అందుకే మన రాష్ట్రం అన్ని రకాలుగా దివాళా తీస్తోంది'' అన్నాడు.

"నిజంగా కొల్లేరులాంటి సరస్సు మన పక్క రాష్ట్రాలకు ఉండుంటే ప్రపంచంలోని అన్ని దేశాలవాళ్లు కొల్లేటిని చూడటానికి వచ్చేవాళ్ళు. వాళ్ళలా అభివృద్ధి చేసేవారు. అలానే మనకున్న కోటలు, గుళ్లూ, గోపురాలు, చారిత్రక ప్రదేశాలు, సరస్సులు, చెరువులు, అమితమైన సముద్ర తీర ప్రాంతం ఒకటా! ఎన్ని ప్రదేశాలు- కానీ ఏంలాభం. అన్నిటినీ నాశనం చేసుకోవటం లేదా దోచి పెట్టడం.. అన్నిటి

నుంచి 'నాకేంటి' అనే యావ తప్పు మరొకటి లేదు" ఆవేదనగా అన్నాడు శ్రీనివాస రావు.

అందరూ మౌనంలో పడ్డారు.

ఉన్నట్టుండి శ్రీనివాసరావే "అసలు కొల్లేరింత కాలుష్యకాసారం ఎలా అయింది? నా చిన్నప్పుడు మనం చెర్లో నీళ్లు తాగేవాళ్లం. కొల్లేట్లో నీళ్లూ తాగేవాళ్ళం. ఇవాళ ఆ నీళ్ళు తాగటానికి పనికి రాక ఊళ్ళో అందరూ కైకలూరు నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారంట. నీళ్ళింత కలుషితమెట్లా అయ్యాయి" అన్నాడు.

రాజులందుకుని "ఎట్లా అంటే- విజయవాడ, ఏలూరు పారిశ్రామిక కాలుష్యాలు కొల్లేట్లోకేగా వచ్చేది" అన్నాడు.

"కృష్ణా కాలువల్లో ఆక్సిజన్ పూర్తిగా తగ్గిపోతోందని, దానికి కారణం కాలువల్లోకి అన్ని రకాల వ్యర్థాల్ని పంపడమేనని తేలింది" అన్నాడు కృష్ణ.

"చేపల్ని పెంచడానికి వాడే మేత దగ్గర్నుంచి మందులదాకా అన్నిట్లోనూ రసాయనాలుంటాయి. అవన్నీ మళ్ళీ కుళ్ళి కొల్లేట్లోనే కలిసేది. ఇదివరకు దాన్లో కలిసే ఏరుల్లో నీళ్లు మంచివి. ఇప్పుడు వ్యవసాయంలో వాడే అన్ని పురుగు మందు వ్యర్థాలు మురుక్కాలవల గుండా వచ్చి చేరేదీ ఇక్కడేగా" అన్నాడు కృష్ణ.

"నిజంగా మన ప్రభుత్వాలెంత ప్రజాద్రోహ పూరితంగా వ్యవహరిస్తున్నాయి? ! తల్చుకుంటుంటే రక్తం ఉడికిపోతోంది" అన్నాడు ఎనభై ఏళ్ళ మధుసూదనరావు.

"ప్రభుత్వం కొల్లేటిని అభయారణ్యంగా ప్రకటించింది. చిత్తడి నేలల పరిరక్షణ చట్టం అని ఒకటుంది. కొల్లేరు పరిరక్షణ సమితివాళ్ళు కొల్లేరుని తగ్గించకూడదు అంటారు. లక్ష ఎకరాల్లో ఉన్న కొల్లేరుని డెబ్బైఏడు వేల ఎకరాల వరకూ కుదించి మిగిలిన ఇరవైమూడు వేల ఎకరాల్లో ఏమైనా చేసుకోవచ్చని కొందరి వాదన. మన స్వార్థరాజకీయ నాయకులు మాత్రం కొల్లేరుని నలభైఐదు వేల ఎకరాలకి కుదించి మిగిలిన దాన్ని చిత్తడి నేలల పరిరక్షణ చట్టం నుంచి మినహాయించాలనీ, తద్వారా దక్కే యాభైఐదు వేల ఎకరాల్ని కైవసం చేసుకోవాలనీ చూస్తున్నారు. అసలెన్ని చట్టాలున్నా అన్నిట్లోనూ ఏవో లొసుగులుంటాయిగా! ఏమీ లేకపోయినా వీళ్ళు చట్టాల్ని తుంగలో తొక్కి రేపటి మనుషుల గురించి, ప్రకృతి గురించి పట్టించుకోక పచ్చనోట్లు పోగెయ్యటంలో పడిపోయారు. కానీ రాబోయే తరాలవాళ్లు ఆరోగ్యకరమైన నీరు, గాలి, ఆహారం కాక ఈ నోట్ల కట్టలు తిని బతుకుతారా? తమ పిల్లలు ఇక్కడ గాకుండా ఏ అమెరికాలోనో సర్వసౌఖ్యాలు పొందుతారనే భ్రమలతో ఉన్న నేటి పెద్దలకి, అక్కడ కూడా తమలాంటి స్వార్థపరులే భూమినాక్రమించి సహజ వనరులను మాయం చేసి జీవావరణాన్ని, పర్యావరణాన్ని కలుషితం చేసేస్తున్నారని తెలియదా? అందరూ కలిసికట్టుగా ఈ భూమిని బాగుండేట్టు సుందరంగా చేసుకోకపోతే మనుష్య జాతికిజాతే రోగాలతో, నరకయాతనలతో తీసుకు చస్తుందే" ఆవేశంగా అన్నాడు రాధాకృష్ణ.

అంతవరకూ ఆయన చెప్తున్నది వింటున్న ఎంకన్న "అంటే నువ్వనేది కొల్లేటినట్టాగే ఉంచి పేదల కడుపులు కొట్టాలంటావా? " అన్నాడు.

"నేనామాట అనలేదే" అన్నాడు రాధాకృష్ణ.

"మరేవంటున్నా.. చెరువుల వల్లేగా ఈ లంకల్లో ఉన్న వేలాది వడ్డీవాళ్ళు, అంతకు ముందు గోచీపాతల్తో ఉండేవాళ్ళు ఇవాళ మేడల్లో ఉంటన్నారు. స్కార్పియోల్లో,

ఇన్నాళ్లో తిరుగుతున్నారు. ఏదేమైనా ఆళ్ళు బాగుపడ్డం మనకిష్టం ఉండదులే" వ్యంగ్యంగా అన్నాడు ఎంకన్న.

"ఆగాగు, వాళ్ళు బాగుపడటం నాకిష్టమే. కానీ నువ్వు చెప్పినట్లు వడ్డీలంతా మేడలు కట్టలా. అందరూ కార్లల్లో తిరగటంలా. వాళ్ళల్లో కొందరే బాగుపడ్డారు. ఎంతోమంది నాయకులు, వాళ్ళ అనుచరులు, వ్యాపారులు కోట్లకు పడగలెత్తారు. వాళ్ళతో పోలిస్తే వీళ్ళదసలు లెక్కేకాదు. వాళ్ళు బాగుపడటానికి కొల్లేటిని బలిపెట్టాలా? "

రాధాకృష్ణకు డెబ్బైఏళ్లు దాటినయ్యి. రక్తపోటు ఉంది. అదిప్పుడు బాగా పెరిగింది. "కొల్లేట్లో అంతులేని సంపదుందని ఎప్పుడైతే గ్రహించిందో.. ఇక ప్రభుత్వం దానిని ఇష్టమొచ్చినట్టు దురాశాపరుల చేతుల్లో పెట్టింది. వాళ్ళు కొల్లేటిని చెరపట్టారు. ఏమీ తెలియని మనం కొల్లేట్లో ఉమ్మడి వ్యవసాయం చేశాం. ప్రభుత్వం తల్చుకుంటే కొల్లేటిని ఎంత మంచిగా చెయ్యొచ్చు! కొల్లేరుని కొల్లేరులా ఉంచే రైతుల, వడ్డీల జీవితాలు బాగుచెయ్యొచ్చు. కానీ కొల్లేరెలా పోయినా వాళ్ళకక్కర్లేదు. డబ్బు.. డబ్బు..డబ్బు!"

"నిజమే బావయ్యా? ప్రకృతితో సహజీవనం చెయ్యటం మానేసి, దాన్ని నాశనం చెయ్యటం మొదలుపెట్టాం. ఇదంతా పెద్ద వినాశనానికే. పేపర్లలో చదువుతున్నాంగా గ్లోబల్ వార్మింగు, క్లయిమేట్ ఛేంజ్ అని. దేశమంతా ఇదే జరుగుతోంది. కొల్లేట్లోనూ ఇదే జరిగింది. కానీ దీన్ని మనం ఆపలేమా? " ఆలోచనగా అన్నాడు శ్రీనివాసరావు.

రాధాకృష్ణ కాస్త వ్యంగ్యంగా నవ్వాడు "నీ పొట్ట తిప్పలకి హైదరాబాదెళ్ళి మళ్ళీ పులపర్రు ముఖం చూట్టానికి యాభై ఏళ్ళు పట్టింది నీకు. ఊరొదిలి వెళ్ళిన చదువుకున్నవాళ్ళంతా అంతే.. ఏనాడూ ఊరు గురించి పట్టించుకోలేదు. ఇప్పుడీ ముసలితనంలో వచ్చి ఆవేశపడితే ఏంలాభం? "

"సరే, నువ్వు కొల్లేరు రాలేదురా. పోనీ మనం ఉన్నచోట్ల జరిగే విధ్వంసాన్ని పట్టించుకున్నామా? బాధ్యతగా కుటుంబాలను బాగు చేసుకున్నాం గానీ, సమాజం పట్ల బాధ్యత లేకుండా ఉన్నాం లేరా. అదంతా గవర్నమెంటు పని, గవర్నమెంటు చూడాలి, చూస్తుంది అనుకుని ఒదిలేశాం. పేపర్లు చదివి తిట్టుకోటం, టి.వి.లు చూడలేక కట్టెయ్యటం నేర్చుకున్నాం. మన చిన్నప్పుడు మనూళ్లో పంటలు పోతే ఎట్టా.. ఏదో ఒక దారి చూసుకోవాలి.. అనుకుని ఉమ్మడి వ్యవసాయం మొదలెట్టాం గదా! అట్లా బాధ్యతగా ఆలోచించటం, ఊళ్ళ గురించి ఆలోచించటం మానేశాం. మనవంటే మన మని కాదు. జనమంతా ఓటర్లమయ్యాంగానీ బాధ్యతగల పౌరులం కాలేదు"


ఆ సాయంత్రం అదృశ్యమైన కొల్లేటిలో, అదృశ్యమైన అనేకానేక సహజవనరుల్ని తల్చుకుని అందరూ దిగులుపడ్డారు.

వాళ్ళ తప్పువాళ్ళకు తెలిసిందిగానీ చాలా ఆలస్యంగా తెలిసింది. ఎండిపోయిన కొల్లేటిని చూస్తూ, చైతన్యరహితమైన కొల్లేటిని చూస్తూ తమ చిన్ననాటి కొల్లేటిని తల్చుకుంటూ మళ్ళీ తమ తమ నెలవులకు బయల్దేరారు.

కొల్లేరు వాళ్ళకొక కమ్మటి జ్ఞాపకం. వర్తమాన విషాదం. అంతే! కానీ రాబోయే తరాలకు కొల్లేటి విధ్వంసం చరిత్రలో జరిగిన అనేక బీభత్సాలలో ఒకటి. తమ జీవితాలను దుర్భరం చేసిన ఒక పెద్ద మానవ తప్పిదం. వాళ్ళీ తప్పిదాన్ని క్షమిస్తారా? ఎలా సరిదిద్దుకుంటారు? Ⓒ

అంతా మాయ!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు



చతుర కతలు

పొద్దున్నే నిద్రలేచిన కాంతం పక్కనే అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చుని వున్న భర్త శేషగిరిరావుని చూసి దడుసుకుని "అలా కళ్ళు తేలేసి కూర్చునుంటే నా గుండె జారిపోదూ.. నన్ను చంపి ఈ వయసులో మరో పెళ్ళి చేసుకుందామనా ఏంటి? " అంది గదమాయిస్తూ.

"చంపడానికి నేనెవర్ని.. చావడానికి నువ్వెవరు? నాలుగురోజులు ఉండడానికి ఈ లోకంలోకి వచ్చిన చుట్టాలం మనం. అది గుర్తెరిగి ప్రవర్తించాలి" అన్నాడు నింపాదిగా.

"ఓయమ్మో! ఈయన అబ్బిరిదిబ్బిరిగా మాట్లాడుతున్నాడు. ఈయనకేమైందిరా భగవంతుడా? " అని శోకాలు తీసింది. అది విని పక్కగదుల్లో పడుకుని వున్న కొడుకు, కోడలు, పండక్కొచ్చిన కూతురు, అల్లుడూ కూడా పరిగెత్తుకుంటూ వచ్చి "ఏమైంది? " ఆందోళన ముఖాల్లో కనబరుస్తూ గాబరాగా అడిగారు.

"ఏం చెప్పమంటార్రా.. మీ నాన్నకి ఏ గాలో సోకింది. ఏంటేంటో మాట్లాడుతున్నారు" అంది మరింత గట్టిగా రాగాలు తీస్తూ.

అది విని చుట్టుపక్కలవాళ్ళు కూడా వచ్చేశారు. పక్కింటాయన "ఏమైంది శేషగిరిరావు గారు? అందరూ భయపడుతున్నారు" అన్నాడు.

"ఏమీ కాలేదు.. కాదు.. మనం పోగొట్టుకున్నది మనదగ్గరే వుంటుంది. పోయిందనుకుని గొల్లుమంటాం, అంతే" అన్నాడు శేషగిరిరావు.

"నిజంగానే అర్థంపర్థంలేని మాటలు మాట్లాడుతున్నాడీయన" ఎదురింటి పుల్లారావు ముక్తాయింపునిచ్చాడు.

అంతలో అక్కడున్న వాళ్ళలో ఒకతను ఏదో గుర్తుకొచ్చినట్టు గబగబ బయటికెళ్ళి రెండు నిముషాల్లో వచ్చి "మీరంతా అనుకుంటున్నట్టు ఆయనకేమీ కాలేదు. దైవత్వం వచ్చింది. వారం రోజుల నుండి ఒక ముఖ్యమైన వస్తువు పోగొట్టుకుని సతమతమవుతున్నాను. ఆయన అన్న మాటకి తక్కున పెట్టిన చోటు గుర్తొచ్చి వెళ్ళి చూద్దునుకదా.. భద్రంగా అక్కడే వుంది" అని ఆయన పాదాలు కళ్ళకద్దుకున్నాడు.

అంతే! అందరిలో చలనం వచ్చింది.

"దేవుడు తమ దగ్గరికి వచ్చాడు. ఏ పుట్టలో ఏ పాముందో!" అని అందరూ లెంపలు వాయించుకుంటూ సాష్టాంగ పడ్డారు శేషగిరిరావుకు.

ఒకావిడ, "మా అమ్మాయికి ఎన్నో సంబంధాలు చూశాం.. కాని ఒక్కటీ కుదిరి చావలేదు. గుండెల మీద అగ్నిపర్వతం వున్నట్టుగా అనిపిస్తుంది మాకు! దయచేసి ఏదైనా తరుణోపాయం చెప్పండి" అంది.

శేషగిరిరావు పశ్చిమంవైపు తీక్షణంగా చూశాడు. అంతే, అక్కడి గుంపు నుండి ఒకాయన "అర్థమైంది స్వామీ! వాళ్ళమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాం. అమ్మాయి మన కళ్ళ ముందు పెరిగింది. పెద్దలంటే భయం, భక్తి వున్నాయి. మేమే కట్నంకోసం కక్కుర్తి పడి

అప్పుడు కాదన్నాం, కాదుకాదు కాలదన్నుకున్నాం. ఇప్పుడు మాకేం అభ్యంతరం లేదు. మీ ఆశీస్సులుంటే చాలు" అని చెప్తూ, అందర్నీ తప్పించుకుంటూ వచ్చి శేషగిరిరావు పాదాలపై పడ్డాడు.

"ఉన్నట్టుండి ఈయనిలా మారడమేంటి? వీళ్ళ ఫాలోయింగేమిటీ? " అని శేషగిరిరావు ఇంట్లోవాళ్ళకి విచిత్రంగా అనిపించింది.

వారంరోజుల్లో ఆ ఇంటి వాతావరణం మారిపోయింది. డబ్బుకి కొదవుండడం లేదు. ఏం కావాలన్నా క్షణంలో ముంగిట్లో వాలుతున్నాయి.

ఆరోజు సాయంత్రం తన వాళ్ళ సమక్షంలో విశ్రాంతి తీసుకుంటూ "కాంతం.." ప్రేమగా అన్నాడు శేషగిరిరావు.

"ఏమిటి స్వామీ" అంది నమ్రతగా కాంతం.

"అబ్బా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఇన్నాళ్లూ ప్రైవేటు కంపెనీలో గొడ్డుచాకిరీ చేసి రిటైరయ్యాను. సాధించింది.. సంపాదించింది ఏమీ లేదు. పెన్షను కూడా లేదు. మన పిల్లలు కూడా అత్తెసరు జీవితాలు గడుపుతున్నారు. భవిష్యత్తు తలచుకుంటే అంధకారబంధురంగా అనిపించింది. అదీగాక రిటైరయినప్పటి నుండి ఏమీ తోచక చస్తున్నాను. ఈ వయసులో మరో ఉద్యోగం చేసే ఓపిక లేదు. అందుకే పాచిక వేశాను.. పారింది. భక్తుల మధ్యలో వున్నప్పుడు పాలూపళ్ళు ఎలాగూ తప్పవు. కనీసం ఏకాంతంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడన్నా కాస్త ఆవకాయ, గోంగూరతో అన్నం పెట్టండి. మనకి రేపటి మీద బెంగలేదు. అంతా మన భక్తులు చూసుకుంటారు" అన్నాడు.

"మరి ఒకతనికి పోయింది దొరకడం.. మరొకావిడ కూతురికి సంబంధం కుదరడం.. అవన్నీ? " అడిగాడు కొడుకు.

"యాదృచ్ఛికం! కాలం కలిసొస్తే అంతే. అంతా మాయ!" అన్నాడు శేషగిరిరావు.

ఉచితం

- వీరేశ్వరరావు. ఎమ్



రామారావు అనే బిజినెస్‌మాన్ ఆ రోజు హెయిర్ కటింగ్‌కోసం బాలయ్య బార్బర్ షాపుకి వెళ్ళాడు. క్షవరం చేయించుకున్నాక రామారావు డబ్బులు ఇవ్వబోతే, 'ఈవారం నేను సేవావారోత్సవం పాటిస్తున్నా! డబ్బులు వద్దు' అని బార్బర్ బాలయ్య తిరస్కరించాడు. రామారావు సంతోషించి, ధన్యవాదాలు తెలిపి వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు దగ్గర రామారావు పంపిన స్వీట్ ప్యాకెట్, గ్రీటింగ్ కార్డు ఉన్నాయి.

తరువాత ఒక పోలీసువాడు బాలయ్య షాపుకి వచ్చాడు. కటింగ్ అయ్యాక డబ్బులు ఇవ్వబోతే బాలయ్య తిరస్కరించాడు. 'సేవే ధర్మం' అని చెప్పాడు. పోలీసు సంతోషించి వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు దగ్గర పోలీసు పంపిన బుట్టెడు పళ్ళు ఉన్నాయి.

అదేవిధంగా ఒక ప్రొఫెసర్‌కీ జరిగింది.

ప్రొఫెసర్ సంతోషించి బార్బర్ జీవితానికి పనికివచ్చే పుస్తకాల సెట్ పంపించాడు.

నాలుగు రోజుల తర్వాత ఎమ్మెల్యే ఏడుకొండలు వచ్చాడు. హెయిర్‌కటింగ్ అయ్యాక యాభై రూపాయలు ఇవ్వబోయాడు. ఎప్పటిలాగే బాలయ్య తిరస్కరించాడు. 'లోకం ఎంత మంచిది' అని సంతోషించి, కరచాలనం చేసి ఎమ్మెల్యే ఏడుకొండలు వెళ్ళిపోయాడు.

మర్నాడు బాలయ్య షాపు తెరిచే సమయానికి నలభైమంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు, ఉచితంగా క్షవరం చేయించుకోవడానికి!

అన్నీ సరైన సమాధానాలు రాసిన వారిలో డ్రా ద్వారా ఎంపికైన ఈ విజేతకు రూ.150/– త్వరలోనే అందుతాయి.

పి.బి. సీతాదేవి
ఇ.నెం. 6-13-4,
సర్వావారి వీధి, నరసాపురం,
పశ్చిమ గోదావరి జిల్లా
పిన్ : 534275

చతురంగం - 33 జవాబులు

1 పం	చ	2 మి		3 వే	4 మ	న		5 నా	6 సా
దే		7 తి	8 అ		దం		9 వి	రా	మం
10 రం	11 భ		12 ర	13 వి		14 స	రి		త
	15 వృ	ఆ		16 భ్ర	17 మ	రం		18 ము	రా
19 కీ	డు		20 గో	మ	ధు		21 త	రా	జు
ల		22 తా	వృ		23 పం	24 చా	క్ష	రి	
25 కం	26 గా	రు		27 దో		28 సో	కు		29 రా
	లి		30 సా	మ	31 జం		32 డు	33 ము	రా
34 మో		35 వే	గు		36 బు	ద్ధి		సు	
37 వి	రు	లు		38 లో	కం		39 పె	రు	గు

సరైన సమాధానాలు రాసిన వారు

1. కె. సుబ్రమణ్యం, అనంతపురం, 2. ఐరేని శ్రీనివాస్‌గౌడ్, రామాయంపేట, మెదక్ జిల్లా, 3. గేదెల రామారావు, ఏలూరు, 4. ఇందన మల్లికార్జున్‌రావు, తంగెళ్లమూడి, ఏలూరు, 5. యు. చిట్టిబాబు, హైదరాబాద్, 6. బిక్కునూరి రాజేశ్వర్, ఈద్‌గాం, ఆదిలాబాద్ జిల్లా, 7. ఉడాలి భాస్కరయ్య, చెన్నై, 8. సి. రాజేశ్వరి, ఎ.ఎస్. రావునగర్, హైదరాబాద్, 9. వి. రమాదేవి, బెంగళూరు, 10. పాలకుర్తి సుధీర్‌కుమార్, మాదాపూర్, 11. మద్దూరి లక్ష్మిరాజ్యం, ఎర్రగడ్డ, 12. పి. దేవసేనమ్మ, హైదరాబాద్, 13. సి. జనార్దన సింగ్, నల్లకుంట, 14. ఎస్. వసుంధర, మల్కాజిగిరి, 15. తిప్పావఝుల వెంకటనారాయణ, మల్కాజిగిరి, 16. అత్తిలి కస్తూరిభాయి, బైరాగిపట్టెడ, తిరుపతి, 17. యు. విజయశేఖరరెడ్డి, కూకట్‌పల్లి, 18. మొహమ్మద్ ఖాసిం, కల్లూరుగూడెం, ఖమ్మం జిల్లా, 19. గౌతమి శిష్టా, హబ్సిగూడ, 20. ఎమ్. రవికుమార్, జహీరాబాద్, మెదక్‌జిల్లా, 21. వసుమతి, అమీర్‌పేట్, 22. ఎస్. మణిమేగలై, బైరాగిపట్టెడ, తిరుపతి, 23. నల్లమోతు సుబ్బారావు, గుంటూరు, 24. సి. అల్వాల్‌రెడ్డి, సరూర్‌నగర్, 25. కె.వి.జె. దాస్, మైలార్‌గడ్డ, 26. జె. సువర్ణ, కర్నూలు, 27. అనంతుల సుబ్బారావు, బ్రాడీపేట, గుంటూరు, 28. కె.వి. దుర్గామోహనరావు, వనస్థలిపురం, 29. తల్లాప్రగడ మధుసూదనరావు, బెంగళూరు, 30. జి. ప్రభాకర్ రావు, మల్లాపూర్, 31. ఎస్. వెంకన్న, వైజాగ్, 32. వై. వెంకటరెడ్డి, బైరాగిపట్టెడ, తిరుపతి, 33. సిహెచ్. శేషుకుమారి, విశాఖ, 34. వేదాల తిరువేంగళ గౌతమ్, విశాఖ, 35. షేక్ నజీర్‌బాషా, కోట, నెల్లూరు జిల్లా, 36. వంకాయల చిరంజీవి, రాజమండ్రి, 37. కాకర్లమూడి కృష్ణప్రసాద్, తణుకు, 38. ధరణి పార్థసారథి, డి.డి. కాలనీ, హైదరాబాద్, 39. మల్లాప్రగడ వెంకట లక్ష్మీ నాగరత్నం, కాకినాడ, 40. దేవళ్రాజు వెంకటనరసింహారావు, చైతన్యపురి, 41. పసుమర్తి జయశ్రీ, మౌలాలి, 42. బోడపాటి కృష్ణవేణి, చెన్నై, 43. తల్లాప్రగడ భాస్కరరావు, న్యూ నల్లకుంట, 44. జె. ఆదిత్య, ట్రూప్ బజార్, హైదరాబాద్, 45. ఎ. అరుంధతి, పూనె, 46. కె. కృష్ణయ్య, కల్వకుర్తి, 47. యనమండ్రి వెంకటేశ్వరరావు, విశాఖ, 48. వై. రామకృష్ణారావు, పెందుర్తి, విశాఖ, 49. యమ్. అలవేలు, మల్కాజిగిరి, 50. పొన్నపల్లి వెంకటప్పయ్య, నూజివీడు, 51. డి. శివమౌళి, తిమ్మాపురం, కర్నూలు, 52. వి. సీత, విజయవాడ, 53. శివలెంక నాగమల్లిక, మెహదీపట్నం, 54. డాక్టర్ శివభూషణం, కర్నూలు, 55. సి.కె. శాస్త్రి, గుంటూరు, 56. ఎస్. రేవతి, హన్మకొండ, 57. ఆండ్ర అచ్యుతరామయ్య, తణుకు, 58. టి. రాహుల్, టోలిచౌక్, 59. వక్కలంక విజయలక్ష్మి, విజయనగరం, 60. గురజాల వరలక్ష్మి, ఆత్రేయపురం, తూ.గో. జిల్లా, 61. కె.వి. లక్ష్మణరావు, మానేపల్లి, 62. కొక్కెరగడ్డ అన్నపూర్ణ, మానేపల్లి, తూ.గో. జిల్లా, 63. బి.వి.వి. ప్రసాద్, మోతినగర్, హైదరాబాద్, 64. బి.వి. నరసింహారావు, చీరాల, 65. గరికిపాటి శ్రీచైతన్యకృష్ణ, కాకినాడ, 66. తటవర్తి రామకృష్ణ, తాళ్లగడ్డ, హైదరాబాద్, 67. గగనం ఫణేంద్రరాణి, అనకాపల్లి, 68. కె. వెంకటబ్రహ్మమ్మ, బాపట్ల, 69. యు.యు.యు, ఎమ్మిగనూరు, 70. టి. ప్రదీప్ శర్మ, గుంతకల్లు, 71. పప్పు శ్రీదేవి, అమలాపురం, 72. గుమ్మళ్ల విఠల్‌రాఘవేంద్రరావు, మచిలీపట్నం, 73. పి.ఆర్. నాయుడు, తిరుపతి, 74. కె. శ్యాంసుందర్‌రెడ్డి, మంచిర్యాల, 75. యం.వి.యన్. ధనలక్ష్మి, నరసాపురం, 76. జి.వి. రాఘవేంద్రరావు, బెంగళూరు, 77. వి.ఎ. రామారావు, నిజాంపేట, హైదరాబాద్, 78. పి.వి. రమణారావు, మల్కాజిగిరి, 79. సిహెచ్.వి.ఎస్.ఎల్. రాజేశ్వరి, కాకినాడ, 80. బొట్టా శ్రీహరిరావు, విశాఖ, 81. శ్రీరామనేని హనుమయ్య, హైదర్షాకోట, 82. మండ వెంకటజోగేశ్వరశర్మ, అరసవిల్లి, 83. టి.ఆర్. బాలకృష్ణారావు, రాజమండ్రి, 84. రుద్రమేశ్, మద్నూర్, నిజామాబాద్, 85. కె. సృజన, టెక్కలి, 86. కోలా సత్యనా

చతురంగం - 34 ఆధారాలు

అడ్డం

1. సంతోషంలాటిదే, ఓ సినిమా పేరు (3)
3. సుభాష్‌చంద్రబోసునిలా అంటారు (3)
5. పెదవి (2)
7. తిరగబడ్డ కన్యాశుల్కం రచయిత (4)
8. పెరుగు ఉన్న సముద్రం (3)
9. నెమ్మది (3)
11. శరీరంలోని ఉష్ణ తాపం (3)
13. బంధువర్గాన్ని ఇలా కూడా అంటారు (3)
15. తూ.గో.లో పచ్చని సీమ (4)
17. 'కాననం'లో చూడం (2)
18. పండు కాదు (2)
19. దైహిక బాధ నలత - మరి మానసిక బాధ --- (3)
20. తిరగబడ్డ టీవీ యాంకరు (2)
21. ఈ 'మానం' రెక్కలు కట్టుకు గాల్లో తీసుకుపోతుంది (3)
22. మహేశబాబు 'అర్జున్' సినిమాలో చూపిన ఆలయం? (6)
25. పొట్ట (3)
26. బుద్ధుడికి జ్ఞానోదయమైన నగరం (2)
28. వీరనాస్తికుడైన ఈ చౌదరి తిరగబడ్డాడు (4)
30. ఆడపిల్లలు జడకు పెట్టుకునేవి, రాయప్రోలువారి ఖండకావ్యం (5)
32. తీగ, ఈమధ్యే కాలం చేసిన సమాచార స్రవంతి (2)
33. ప్రసిద్ధ తెలుగు గాయని (3)
34. నిలువు 21 కి ఇష్టమైంది, తడబడింది (3)

నిలువు

1. వసంతరుతువు, ఓ నాయిక (3)
2. మూడు నిలువుకు దక్కే ఫలితం (3)
3. తప్పు, అపరాధం (3)
4. ముందు తిను..తరువాత నీళ్లు -- (2)
5. 1 అడ్డమే మరో రూపంగా (3)
6. ఇది చాలా బలీయం (2)
8. పాము (3)
10. కార్చిచ్చు (5)
11. మంట (3)
12. పిపీలికం (2)
13. ఏకచక్రపురంలో ఎవరి వధ జరిగింది (4)
14. నేత్రం (3)
15. చీర (2)
16. శ్రీరాముడి భార్య (2)
18. కంచి అమ్మవారు (3)
20. తీపి (3)
21. విఘ్నాధిపతి (5)
22. ఒకప్పుడు తెలుగు సినీపరిశ్రమ ఉన్న నగరం (4)
23. కాచిన పాలపై కట్టే తెట్టు (3)
24. అధికం (3)
25. ముక్కంటి అర్ధాంగి (2)
27. మాట (3)
29. 'స్వామి రారా' సినిమా నాయిక (2)
30. రెండు (2)
31. ముంగిలా మౌనంగా ఉండేవాడు తలకిందులు (2)

రాయణ, విశాఖ, 87. కణుగుల గ్రీష్మ, శ్రీకాకుళం, 88. కె. లక్ష్మినారాయణ, నిజామాబాద్, 89. జె. రాజ గోపాలరావు, హైదరాబాద్, 90. సి. భాగ్యలక్ష్మి, యర్రగుంట్ల, 91. ఎ.వి. రామకృష్ణ, కాత్రేనికోన, 92. బంధకవి శ్రీప్రియదర్శిని, కాకినాడ, 93. బి. రామమోహనరావు, సరూర్‌నగర్, 94. సౌదామిని నాగరాజన్, విశాఖ, 95. పి. కీర్తిప్రియ, అమలాపురం, 96. చింతపల్లి నాగేశ్వరరావు, విజయవాడ, 97. మీనా శుభాం జలి, తిరువూరు, 98. టి. శశికళ, గుంతకల్లు, 99. ఎమ్. హారిక, విజయవాడ, 100. శ్రీమాన్‌కంజర్ల అనం తాచార్యులు, జగిత్యాల, 101. కరణం సుధీంద్రరావు, కర్నూలు, 102. చి.పు. శాస్త్రి, ఎల్లమ్మగుట్ట, నిజామా బాద్, 103. పతంగి పద్మావతి, కర్నూలు, 104. తిరునగరి కేశవదాసు, గుంటూరు, 105. చిన్నం వెంకటే శ్వర్లు, విజయవాడ, 106. టి.ఎమ్. మోహన్ రెడ్డి, కర్నూలు, 107. పి. సరళ, మర్రిగూడ, నల్లగొండ, 108. భూమా ఓబులు, గుంటూరు, 109. డి.వి. కామేశ్వరి, విశాఖ, 110. సూరి నాగరాజు, రామవరప్పాడు, కృష్ణా జిల్లా, 111. ప్రతాపురం రామానుజాచారి, హన్మకొండ, 112. జి. పురుషోత్తం, హన్మకొండ.

చతురంగం - 34

రూ.150/- బహుమతి

గడువు తేది : జనవరి 17

1		2 దం	■	3	4		■	5	6
	■	7				■	8		
9	10		■		■	11			■
■		■	12	■	13			■	14
15		16		■	17	నం	■	18	
19			■	20		■	21		
■		■	22			23			■
24	■	25			■	26		■	27
28	29			■	30			31 చ్చు	
32 తం		■	33			■	34		

పంపినవారి పేరు: ---

వయసు (   ) చిరునామా : -----------------------------------

---------------- పిన్ : ----------- ఫోన్ : ---------------

ఆధారాలు

నిబంధనలు

✦ చతురంగాన్ని ఇదే పేజీలో పూర్తిచేసి పంపాలి. ✦ తుడుపులు, కొట్టివేతలు ఉండరాదు. ✦ మా 'కీ'తో సరిపోలిన పూరణలనే పరిగణనలోకి తీసుకుంటాం. ✦ గడువు తర్వాత అందిన పూరణలు పరిశీలించం. ✦ ఎక్కువ మంది సరైన జవాబులు రాస్తే డ్రా తీసి విజేతను ఎంపిక చేస్తాం. ✦ ఒక్కొక్కరు ఎన్ని కూపన్‌లైనా పంపవచ్చు. ✦ ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

చతురంగం పంపాల్సిన చిరునామా :

చతురంగం చతుర, ఈనాడు కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్ –082

★ ఒకే కవరులో చతురంగం కూపన్లు ఎన్నయినా పంపవచ్చు.

★ చతురంగం, చతురప్రవేశిక, విపుల వినోదిని ఒకే కవరులో పంపినా పరిశీలిస్తాం.

గిడుగువారి చతురోక్తులు



వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి పంతులు వాడుక భాష గురించి ప్రచారం చేయడమే తన జీవితధ్యేయంగా పెట్టుకున్నారు. గిడుగువారికి గ్రాంథిక భాషావాదులతో అనేక గిల్లికజ్జాలు వచ్చాయి. ఆయన వివిధ సందర్భాలలో ఎక్కుపెట్టిన చతురోక్తులు ఇవీ..

చురకకే చురక!

పర్లాకిమిడి రాజావారి సంస్థానంలో గిడుగువారు రాకుమారుడికి ట్యూటరుగా ఉండేవారు. అప్పట్లో ఆ సంస్థానంలో చిత్రమైన ఆచారం ఉండేది. కనుమ పండుగనాడు అక్కడి పశువులతో పాటు సంస్థానంలోని కొందరు



ఉద్యోగులకు కూడా చురకలు వేసేవారు. అదొక ఖర్చులేని సత్కారమన్నమాట!

కనుమ రోజు రాజసేవకులు గిడుగు దగ్గరకు వచ్చి 'తమకు కూడా చురకలు వెయ్యమని రాజావారు ఆజ్ఞాపించారు' అన్నారు.

వెంటనే గిడుగువారు 'అన్ని సంస్థానాలలో ప్రభువులు పండుగలప్పుడు పండితులను సత్కరిస్తుంటే ఇక్కడ చురకలతో సత్కరిస్తారా? ' అని రాకుమారుడి ఎదుటే వారికి చురకలంటించారు.

అప్రియ సత్యం!

గ్రాంథిక భాషావాదులపట్ల కరకుగా ఉండే గిడుగు రామ్మూర్తిపంతులుగారు వారి మొహంమీదనే విమర్శలు గుప్పించేవారు. కాని ఆయన తక్కినవారిపట్ల చాలా సౌమ్యంగా, ఉదారంగా ప్రవర్తించేవారు. ఒక సారి ఒక రచయిత గిడుగువారికి ఓ కథల పుస్తకం ఇచ్చి, తన కథలమీద అభిప్రాయం చెప్పమని అడిగారు.



వాస్తవానికి ఆ కథలేమాత్రం రుచించలేదు గిడుగువారికి. ఆ రచయితేమో పదేపదే తన రచనలపై అభిప్రాయం చెప్పమని వెంటబడుతుండేవాడు. ఓసారి ఆయన కనిపించి, తన కథల గురించి ఇంకా అభిప్రాయం అడగకుండానే గిడుగువారు 'మీ కథలు చదివానండీ. మనవాళ్లంతా అవి చప్పగా ఉన్నాయంటున్నారండీ. అవి నాకూ అట్లాగే ఉన్నాయండీ!' అని చాలా అమాయకత్వం నటిస్తూ చెప్పారు. అప్రియ సత్యాన్ని చెప్పిన ఆయన ధోరణి అందరికీ కితకితలు పెట్టింది.

అరసున్నాలెక్కడ పెట్టాలి?

గిడుగు రామమూర్తి పంతులుగారితో వ్యవహారిక భాషను గురించి శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి తలపడి హోరాహోరీగా పోరాడారు. అరసున్నాల గురించి ఒక కంపోజి



టరు వచ్చి ఓసారి శ్రీపాదవారిని 'అరసున్నాలు ఎక్కడెక్కడ ఉంచమన్నారండి అయ్యా' అని అడిగాడట.

'నాకు మటుకు తెలుసా, అక్కడక్కడుంచు' అని శ్రీపాదవారు అన్నారని గిడుగువారు చెప్పి, అందరినీ కడుపుబ్బా నవ్వించారు.

గట్టి జవాబు!

గిడుగువారికి తెలుగుభాష, సంస్కృతం, ఇంగ్లిష్, సవర తదితర భాషల్లో అపారమైన పాండిత్యం ఉంది. గ్రాంథిక భాషావాది అయిన జయంతి రామయ్య పంతులు శ్రీ సూర్యరాయ బృహదాంధ్ర నిఘంటువు రాసేటప్పుడు దేశ్యపదాలకు సంబంధించి గిడుగువారి



సాయం అడిగారు. దీనికి జవాబుగా గిడుగు వారు ఆయనను ఇక్కడో నొక్కు నొక్కాలని "సంస్కృతాంధ్ర కావ్యాలకు టీకలు రచించిన పండితులందరూ వ్యవహారికమే వాడినారు. ఆ శిష్టాచారం మీరు కూడా అవలంబించిన యెడల కూలీ ఏమీలేకుండా సేవ చేస్తాను. దీనికి మీరు ఒప్పుకోకున్ననూ గ్రంథమంతా సిద్ధము చేసిన తర్వాత నేను వచ్చి చూసి దానిలో తొలగించవలసినవీ, చేర్చవలసినవీ, మార్చవలసినవి సప్రమాణముగా తెలియజేస్తాను. అయితే నేను చెప్పినవాటిని మీరు అంగీకరించినప్పుడల్లా ఒక్కొక్క అంశమునకు ఒక్కొక్క రూపాయి చొప్పున ఈనాము ఇవ్వాల్సివుంటుంది" అని చమత్కారంగా జవాబిచ్చారు.

నూనె వ్రాసుకుంటారా?

గిడుగువారికీ, గ్రాంథిక భాషావాది అయిన జయంతి రామయ్య పంతులుగారికి ఉన్న వైరం జగమెరిగినదే. ఏమాత్రం అవకాశం దొరికినా వారు ఒకరినొకరు వదలిపెట్టేవారు కాదు.



ఒకసారి జయంతి రామయ్య పంతులు గారు ఎక్కడో పొరపాటున "తలకు నూనె వ్రాసుకుని" అని రాశారు.

అది చూసి గిడుగువారు "అవును, జయంతిరామయ్య పంతులుగారు తలకు నూనె వ్రాస్తారు. పుస్తకాలేమో రాస్తారు" అని వేళాకోళమాడారు.

అంతదాకా ఎందుకు?

గిడుగువారికి నంగి వేషాలు తెలియవు. ఆయన నిర్మొహమాటి. 1913లో గురజాడ అప్పారావుగారి బలవంతం మీద రాజా ఆనంద గజపతివారి కుమార్తెకు, కుమారునికి ఇంగ్లిష్ బోధించేందుకు ఒప్పుకున్నారాయన. రాజావారి పిల్లలకు ఆధునిక పద్ధతుల్లో



ఇంగ్లిష్ బోధిస్తుంటే ఆయనంటే పడని కొద్ది మంది ఆ బోధనాపద్ధతి లోపభూయిష్టమని చాడీలు చెప్పారు. దాంతో రాజావారు సంప్రదాయ పద్ధతుల్లోనే పాఠం చెప్పాలనీ, లేకుంటే ఒకటో తేదీకి ఉద్యోగం వదులుకోవాలనీ వర్తమానం పంపారు.

దాంతో ఆయన దారికొస్తాడని రాజావారు భావించారు. కానీ గిడుగు పిడుగు 'ఒకటో తారీఖుదాకా ఎందుకూ.. ఇప్పుడే మానేస్తున్నాను' అని గడుసుగా సమాధానమిచ్చారు. అక్కడున్న వారందరూ నివ్వెరపోయారు.

క్రిస్మస్ అద్భుతం!

క్రిస్మస్ సెలవుల్లో ఎయిర్‌పోర్టులు చాలా రద్దీగా ఉంటాయి. వాతావరణం సరిగా లేకపోవడంతో కొన్ని విమానాలు ఆలస్యమవుతుంటే, మరికొన్ని రద్దవుతుంటాయి. ఇంటికెళ్లాలనే తొందరలో ప్రయాణికులు అసహనంగా ఉంటారు. అయితే దీనికి భిన్నంగా 2013 డిసెంబరు 9న 'నైట్ బిఫోర్ క్రిస్మస్' పాటలోలాగా జరిగింది 250మంది వెస్ట్‌జెట్ ప్రయాణికులకి. వీరంతా ఆ రోజు టొరంటో, హామిల్టన్ విమానాశ్రయాల్లో కాల్గరీ వెళ్ళే వెస్ట్‌జెట్‌ల కోసం వేచి చూస్తున్నారు. వెస్ట్‌జెట్ విమానయాన సంస్థ ప్యాసెంజర్ లాంజ్‌లో ఓ పెద్ద గిఫ్ట్‌బాక్స్ ఏర్పాటు చేసింది. దానికి ఒకవైపున స్క్రీన్ మీద 'ఇక్కడ మీ బోర్డింగ్ పాస్‌ను స్కాన్ చేయండి' అని సందేశం కనబడింది. ప్రయాణికులు స్కాన్ చేయగానే తెరపైకి డిజిటల్ శాంటాక్లాస్ వచ్చాడు. 'మీకు క్రిస్మస్‌కి ఏం కానుక కావాలి? ' అని అడిగాడు. స్కాన్ చేసిన వారి వివరాలన్నీ శాంటాకి తెలుసు! తన మాటలతో వారిని శాంటా ఆకట్టుకోగానే సరదాగా అనిపించి పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా తమ కోరికల్ని వెల్లడించారు. ఎల్‌సిడి టివి, కెమెరా, ఐఫోన్, ఆండ్రాయిడ్ టాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లు, చలికి స్కార్ఫ్ - ఇలా పలురకాలు కోరుకున్నారు. ఒకావిడ తన కుటుంబం ఉండే చోటికి టికెట్లు కావాలంది. ఒకతను ఇది పనిచేస్తుందా పెడుతుందా అని మేజోళ్ళు, లో దుస్తులు మాత్రమే అడిగాడు. అయితే వీరందరికీ తెలియనిది ఏంటంటే తెరవెనుక వెస్ట్‌జెట్ సిబ్బంది వారు చెప్పినవన్నీ రాసుకున్నారు. టొరంటో, హామిల్టన్ ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు విమానాలు ఎక్కగానే కాల్గరీలో సుమారు 175మంది వెస్ట్‌జెట్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన షాపింగ్ మొదలుపెట్టేశారు. రాసుకున్న కానుకలు కొనడం, ప్యాక్ చేయడం, ప్రయాణికుల పేర్లు రాసిన గిఫ్ట్‌కార్డ్‌లు అతికించడం జరిగిపోయాయి.



ఐదు గంటల ప్రయాణం అనంతరం ఏమీ తెలియని ప్రయాణికులు కాల్గరీలో తమ బ్యాగేజి కోసం వెళ్ళేప్పటికి వారిపై మంచు కురిసింది. ఈ ఆశ్చర్యంనుంచి తేరుకోకముందే కన్వేయర్ బెల్ట్ మీద గిఫ్ట్‌ర్యాప్ చేసిన బహుమతులు ఒకటొకటే ప్రత్యక్షం! ఏమిటా అని ఆసక్తిగా తెరిచి చూస్తే మేజోళ్ల దగ్గర్నుంచి యాభై అంగుళాల టీవీ వరకు అన్నీ వారు శాంటాను అడిగినవే! వారి తడబాటు, పెదాలపై నవ్వులు, ఇదెలా సాధ్యం అన్న ఆశ్చర్యం, కళ్లలో ఆనందబాష్పాలు, సంతోషంతో పెట్టిన కేకలు - ఇవన్నీ అక్కడ రహస్యంగా ఏర్పాటు చేసిన 19 కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఏ క్రిస్మస్‌నూ ఇంతకంటే సంబరంగా జరుపుకోలేదని, ఇది తమ జీవితంలో అరుదైనదనీ చెప్పారు చాలామంది. కోరిన కోరిక తీరటమే కదా పండగంటే!

వెస్ట్‌జెట్ దీనినంతా 'క్రిస్మస్ మిరకిల్' పేరుతో ఐదున్నర నిమిషాల వీడియోగా యూ ట్యూబ్‌లో ఉంచింది. మూడు రోజుల్లో 70లక్షల మంది దీన్ని చూశారు. ఇదో రికార్డు!

2012 క్రిస్మస్‌కి ఇదే ఎయిర్‌లైన్స్ సంస్థ విమానాశ్రయంలో ఫ్లాష్‌మాబ్ ఏర్పాటు చేసింది. ఆ వీడియోకు యాభై లక్షల హిట్స్ దాటితే ఒక పేదకుటుంబానికి ఉచితంగా విమానప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన మాట నిలుపుకుంది.

ఈసారి రెండు మిలియన్ హిట్స్ రావచ్చని అంచనా వేసిందా విమానయాన సంస్థ. అయితే అనూహ్యంగా మూడురోజుల్లోనే డెబ్భైలక్షలకు పైగా హిట్స్ వచ్చాయి. ఆరు రోజులకల్లా ఈ హిట్స్ సంఖ్య కోటిముప్పై లక్షలు దాటడంతో క్రిస్మస్‌ఛార్ట్స్‌లో టాప్‌గా నిలిచింది!!

– హారిక

కాలాతీతం





ఫ్రాంజ్ కాఫ్కా

ది ట్రయల్

నిజానికి ఈ నవలలో వున్నది ఒకే పాత్ర, జోసెఫ్‌కె. ఇతర పాత్రలు - గ్రుబాక్, బర్ట్స్‌నర్, హల్డ్, లెని, టిటోరెల్లి వంటివాళ్లు సందర్భానుసారంగా కనిపిస్తారంతే. వారంతా అంతగా పాఠకులకు గుర్తు ఉండరు.


జోసెఫ్‌కె ముప్పై ఏళ్ల యువకుడు. బేంకులో ఉద్యోగం చేస్తున్నాడు, మర్యాద పురుషుడు. బోర్డింగ్‌హౌస్‌లో వుంటాడు. హోటళ్లలో తింటాడు. పని ఒత్తిడి వల్ల రాత్రి తొమ్మిదింటి దాకా పని చేస్తాడు. బ్రహ్మచారి. ఆప్తమిత్రులు పెద్దగా లేరు.

ఒక ఉదయం ఆ ప్రశాంత జీవితం అనూహ్యమైన మలుపు తిరిగింది. ఇద్దరు అపరిచితులు వచ్చి అతణ్ణి అరెస్టు చేస్తున్నామని ప్రకటించారు. తనకు తెలిసి జోసెఫ్‌కె ఏ నేరమూ చెయ్యలేదు. మరెందుకు అరెస్టు చేస్తున్నట్టు? కాని త్వరలోనే తెలుస్తుంది. విచారణ జరిగేది సాధారణ న్యాయస్థానంలో కాదు. కొత్త మనుషులు, కొత్త పరిసరాలు. మోపిన అభియోగం గురించి, చేసిన నేరం గురించి ముద్దాయికి ఎవరూ చెప్పరు. ఏ చట్టం తనకు వర్తిస్తుందో తెలియదు. విచారణ నడుస్తుంది గాని అతడి రోజువారీ కార్యక్రమాలకు, కదలికలకు ఏమాత్రం యిబ్బంది లేదు. మురికిగా వున్న చీకటిగుయ్యారంలాంటి యిళ్లలో జరిగింది విచారణ.

కోర్టు ఉద్యోగులందరూ ముక్కూ మొహం తెలియని కొత్తవారే. విచారణ పద్ధతి అత్యంత సంక్లిష్టంగా వుంటుంది. ఎంత సంక్లిష్టమంటే విచారణ చేస్తున్న వాళ్లకు కూడా అది అర్థం కాదు. కింది ఉద్యోగులిద్దరూ అవినీతిలో కూరుకుపోయారు. సర్వాధికారాలు గల ఉన్నతమైన జడ్జీలు ఎవరికీ అందుబాటులో వుండరు. అసలు వాళ్లున్నారో లేదో కూడా ఎవరికీ తెలియదు. విచారణ అలా కొనసాగుతూనే వుంటుంది. ఇంతవరకు అందులోంచి ఎప్పుడూ, ఎవరికీ విడుదల లభిం

చలేదు.

తను ఏ నేరమూ చెయ్యలేదని కె చేసిన ప్రయత్నాల కథనమే ఈ నవల. కనీసం తన మీద మోపిన అభియోగమేమిటో తెలుసుకోవాలని అతని కోరిక. ఈ బృహత్ ప్రయత్నంలో తనకు సహాయం చెయ్యమని, ఒకరి తర్వాత ఒకరిని అర్థిస్తాడు. కాని ఎవరూ ముందుకు రారు. మొదట అతడు సహాయం అడిగింది బోర్డింగ్ హౌస్‌లో తనతో పాటు వుంటున్న ఒక టైపిస్ట్ ఫ్రాలీన్ బర్ట్స్‌నర్‌ను. తన గోడు చెప్పుకోవటానికి ప్రయత్నిస్తాడు కాని ఆమె వినటానికి ఆసక్తి కనపర్చదు. ఆవిడ మీద కోరిక కలుగుతుంది. దగ్గర కావాలనుకుంటాడు. కాసేపు ఓపిక పట్టి తరువాత చీదరించుకుంటుందామె. ఆ తర్వాత ఆదివారం విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశం అందుకుంటాడు. కాని అక్కడంతా గందరగోళంగా ఉంటుంది. ఎవరేం మాట్లాడుతున్నారో ఒక్క ముక్కకూడా అర్థం కాదు. తను అమాయకుణ్ణని ఒక సుదీర్ఘమైన వాదన వినిపిస్తాడు కె. అక్కడున్న వాళ్లందరికీ తనపట్ల సానుభూతి పెరిగిందనే అనుకుంటాడు. కాని వాళ్లు ప్రేక్షకులు కారు. అందరూ కోర్టు ఏజెంట్లే. మరుసటి వారం మళ్లీ వస్తాడు. ఈసారి కోర్టు గది ఖాళీగా వుంటుంది. ఇదే అవకాశంగా తీసుకుని అక్కడున్న 'లా' పుస్తకాలను తిరగేస్తాడు. కాని అవన్నీ బూతు బొమ్మల పుస్తకాలని తెలుస్తుంది.



రాత్రింబగళ్లు ఈ 'విచారణ' గురించి బుర్ర పాడు చేసుకోవడంతో బేంకు పని సరిగా చెయ్యలేకపోతాడు. అతడి అంకుల్ అయిన కార్ల్ అత్యంత ప్రముఖుడైన లాయర్ హల్డ్‌ను సంప్రదించమంటాడు. ఇలాంటి కేసులను బాగా వాదిస్తాడని హల్డ్‌కు మంచి పేరుంది. అయితే ఆయన జబ్బు మనిషి. కాసేపు హల్డ్‌తో మాట్లాడిన కె, పక్కగదిలో వున్న ఆయన నర్సు లెనితో శృంగారం జరుపుతాడు. ఇలా చేస్తే కేసు వీగిపోయే ప్రమాదముందని జోసెఫ్ కెను వారిస్తాడు అంకుల్. కోర్టులో ఒక పిటిషన్ పడేస్తానంటాడు కె. కాని దాన్నెవరూ చదవరు, పరిగణనలోకి తీసుకోరని చెబుతాడు లాయర్. ముద్దాయికి తనను తాను రక్షించుకునే హక్కుందన్న విషయాన్ని చట్టం గుర్తిస్తుందా? అనేది అసలు ప్రశ్న.

మరో మిత్రుడి సలహా విని, టిటోరెల్లి అనే చిత్రకారుణ్ణి కలుస్తాడు కె. ఒక మురికివాడలో రౌడీలు, వ్యభిచారుల మధ్య టిటోరెల్లి నివాసం. అతడు కోర్టుకు ఆస్థాన చిత్రకారుడు. చాలా పలుకుబడి ఉందని చెప్పుకుంటాడు. టిటోరెల్లి ప్రకారం ఈ కేసు మూడు విధానాల్లో ఏదో ఒక మార్గంలో పరిష్కారం కావచ్చు.

ఒకటి- ముద్దాయి అమాయకుడని తీర్పు చెప్పి, అతడ్ని విడుదల చేయవచ్చు.

రెండు- అతడ్ని తాత్కాలికంగా విడుదల చేయవచ్చు. అంటే మళ్లీ అరెస్టు అయ్యే అవకాశం లేకపోలేదు.

మూడు- కచ్చితమైన తేదీలు చెప్పకుండా

ఫ్రాంజ్ కాఫ్కా (1883 - 1924)

ఒకప్పటి ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్న, ప్రస్తుత చెక్ రిపబ్లిక్ రాజధాని అయిన ప్రాగ్‌లో జన్మించాడు కాఫ్కా. యూదు సంతతి అయినా అతను రాసింది జర్మన్ భాషలోనే. ఆయన్ను జర్మన్ రచయితగానే గుర్తిస్తారు.

తండ్రి హెర్మాన్ కష్టపడి పనిచేసే మనస్తత్వం గల వ్యాపారవేత్త. ఆయనది బలిష్టమైన శరీరం. పైగా మొరటు మనిషి కూడా. కొడుకేమో సన్నగా, పీలగా, సుకుమారంగా ఉండేవాడు. తండ్రికున్న పాశవిక బలం తనకు లేనందుకు కొడుకు దిగులు పడని రోజంటూ లేదు. ఈ ఆత్మన్యూనతా భావాన్ని, తండ్రికి రాసిన సుదీర్ఘమైన లేఖలో సోదాహరణంగా, విశ్లేషణాత్మకంగా వివరించాడు కాఫ్కా. ఆయన రచనల్ని అర్థం చేసుకోవాలంటే దీన్ని చదవక తప్పదు.

1908లో 'లా' పట్టభద్రుడై ప్రాక్టీస్ చెయ్యటానికి నిరాకరించి, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ చూసే ప్రభుత్వాఫీసులో చిన్న ఉద్యోగంలో చేరాడు. దీనికి ప్రధాన కారణం అక్కడ ఎక్కువ పని లేకపోవటం, మధ్యాహ్నం రెండింటికే యింటికి వెళ్లగల వెసులుబాటు దక్కడం. అలా ప్రారంభమైంది కాఫ్కా సాహిత్య కృషి. ప్రముఖ రచయితలు ఫ్రాంజ్ వెర్ఫెల్, మార్టిన్ బూబర్‌ల బృందంతో పరిచయాలు పెరిగాయి.

పెళ్లి చేసుకోవాలని కోరిక వుంది. కాని అది తన రచనా వ్యాసంగానికి అడ్డు వస్తుందేమోనని భయం. అంతకన్నా ముఖ్య కారణం- తండ్రి పట్ల ఉన్న బెరుకు, అయిష్టం. 'న్యూరోటిక్'గా మారిన కాఫ్కాకు ఏ నిర్ణయమూ తీసుకోవటం సాధ్యం కాదు. 1912లో ఫెలిస్ బార్‌తో ప్రేమలో పడ్డాడు. అయిదేళ్ల పాటు పెళ్లి చేసుకోవాలనే కోరిక కూడా అతనిలో కొనసాగింది. కాని అప్పటికే కాలాతీతమైంది. 1917లో క్షయ వ్యాధి పట్టుకుంది. ఇది మానసిక రుగ్మత అనుకున్నాడు కాఫ్కా.

యూరోప్‌లో మొదటి ప్రపంచ యుద్ధం సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేసింది. కాని కాఫ్కా క్షేమంగానే ఉన్నాడు. అతడు చేస్తున్న ఉద్యోగం వల్ల, క్షయ వల్ల సైన్యంలో చేరవలసిన అవసరం లేకుండాపోయింది. అయితే క్షయ ముదురుతోంది. ఆరోగ్యం కోసం అనేక ఊళ్లు మారాడు. 1920లలో కుటుంబం నుండి విడిపడి బెర్లిన్‌కు మకాం మార్చాడు. 1923లో ఒక పోలిష్ యూదు యువతి డోరా డిమాంట్‌ను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కాని ఇరు కుటుంబాలు కూడా ఈ వివాహాన్ని వ్యతిరేకించాయి. అయినా బెర్లిన్‌లో వారిద్దరూ సహజీవనం చేశారు.

వాయిదాలు పడొచ్చు. అంటే అది శిక్ష నిర్ధారణా కాని, విడుదలా కాని ఓ ప్రత్యేక పరిస్థితి.

అతనివద్ద తనకిష్టం లేకపోయినా కొన్ని బొమ్మలు కొనుక్కుని నిష్క్రమిస్తాడు కె.

మరికొన్నాళ్లకు తన కేసు సరిగా వాదించటం లేదని భావించి, హల్డ్‌ను తొలగించాలనుకుంటాడు కె. హల్డ్‌కున్న మరో క్లయింట్ అయిన వ్యాపారి బ్లాక్‌తో పరిచయమవుతుంది.

బ్లాక్ కేసు కూడా సంవత్సరాల పాటు కొనసాగింది. కాని ఫలితం శూన్యం. హల్డ్‌తో విసిగి, అతడు కూడా రహస్యంగా యితర లాయర్లను సంప్రదిస్తున్నాడు. కె తనను వదిలించుకోవాలనుకుంటున్నాడని గ్రహించిన హల్డ్, తనెంత బలవంతుణ్ణో నిరూపించుకోవటానికి బ్లాక్‌ను తన ముందు మోకరిల్లమని ఆజ్ఞాపిస్తాడు.

కె చివరి యింటర్వ్యూ నగరంలోని కెథడ్రల్‌లో జరుగుతుంది. అక్కడికి మరేదో పనిమీద వెళతాడతడు. చర్చి చీకటిగా, ఖాళీగా వుంది. అకస్మాత్తుగా, పల్పిట్ నుండి ఒక స్వరం అతడ్ని సంబోధిస్తుంది. మాట్లాడుతున్నది ఒక ప్రీస్టు. ఆ ప్రీస్టు

ఇన్నాళ్లకు కలలు ఫలించాయి. జీవితానం దాన్ని రుచి చూడగలిగాడు. కాని అది చివరి దశ. మరణం సమీపించిందనటానికి ఈ విపరీ తానందం, ఉద్వేగభరిత స్థితి ఒక నిదర్శనం. చావాలని లేదు. ఎలాగైనా బతకాలి. ఇన్నాళ్లూ మానసిక యుద్ధాలు చేశాడు. కొత్త స్వప్న లోకా లను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఇప్పుడు శరీరం మీద చివరి యుద్ధం ప్రకటించింది క్షయ. 1924లో ప్రాగ్‌కు తిరిగి వచ్చి శానిటోరి యంలో చేరాడు. జూన్‌లో మరణించాడు.

తన జీవితకాలంలో మిత్రులకు తప్ప మరె వ్వరికీ కాఫ్కా పేరు తెలియదు. ఈనాడు ఆయన పేరు తెలియని సాహితీ ప్రియులు లేరు. ఒక్క యూరప్, అమెరికాలోనే కాక, మొత్తం ప్రపంచ వ్యాప్తంగా ఓ నూతన శకాన్ని ఆవిష్కరించిన రచయితగా కాఫ్కాను గుర్తి స్తారు. అంతర్లోకాలను దర్శింపచేసే రచనా ధోర ణికి మారుపేరు 'కాఫ్కాయిజం'.

రచనే జీవితంగా బతికాడు కాఫ్కా. కథలు, నవలలు, వ్యాసాలు మాత్రమే కాదు, ఆయన నోట్‌బుక్‌లు, డైరీలను కూడా పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. తన రాత ప్రతులన్నిం టినీ తగలెయ్యాలని వీలునామా రాశాడు కాఫ్కా. కాని ఆయన మిత్రుడు మాక్స్‌బ్రాడ్, ఆ రచయిత చివరి కోరికను అమలు చెయ్యలేదు. ది ట్రయల్, ది కాసిల్, ది అమెరికా తదితర నవలలు, పలు కథలు, వ్యాసాలు యిప్పుడు మనకు లభ్యం కావటానికి కారణం మాక్స్ బ్రాడ్. ఈయన రాసిన కాఫ్కా జీవిత చరిత్రకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఈ ఇద్దరి మన స్తత్వాలూ పూర్తిగా భిన్నమైనవి. జీవితకాలంలో తరచూ పోట్లాడుకున్నారు. అందువల్ల కాఫ్కా గురించి బ్రాడ్ చేసిన వ్యాఖ్యల్ని కొందరు తప్పుపడతారు.

కాఫ్కాది స్వప్నలోకం లేదా అంతర్లోకం. కాని ఇదే ఆయన జీవించిన లోకం. ఆయన కథలకు, నవలలకు ఒక కథాస్థలం అంటూ ఉండదు. ఆర్థిక, సామాజిక నేపథ్యం కూడా అస్పష్టమే. 'ఈయన పాత్రలన్నీ మనుషుల రూపాల్లో వున్న ఆత్మలు' అనిపిస్తుంది. అయినా ఒక వింత, విచిత్ర వాస్తవికత పాఠ కుణ్ణి లోబరచుకుంటుంది. ఆత్మవేదన సార్వజ నీనం గనుక, ఇది దేశ కాలాలకు పరిమితం కాని సమస్య గనక, చదివిన వాళ్లందరికీ అందులో తమ ప్రతిబింబం కనిపిస్తుంది.

ప్రతీకాత్మకత ఈయన రచనలోని ప్రధాన లక్షణం. అయితే దేని గురించి రాస్తూ, దేన్ని ప్రతీకగా చిత్రించాడో ఒకపట్టాన అర్థం కాదు. అంటే ప్రతి కథనూ ప్రతి నవలనూ ఎవరికి వాళ్లు తమకు తాము వివిధ విషయాలకు ఆపా దించుకుని, అన్వయించుకుని వ్యాఖ్యానించుకోవ లసిందే. కాఫ్కా సృష్టించిన వ్యక్తులందరూ ఏవో తెలియని, తెలుసుకోలేని నేరాలు చేసినవారే. ఈ నేరం నైతికమా, సామాజికమా, ఆధ్యాత్మి కమా? అనేది స్పష్టంగా తెలియదు. ఈ లోకంలో పుట్టటమే పెద్దనేరం అనుకున్నాడా కాఫ్కా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఎవ రికి వాళ్లు వెదుక్కోవలసిందే!

తను జైలు అధికారినని కూడా చెబుతాడు. అంటే కోర్టుతోనూ సంబంధమున్నట్టే. కేసు అనుకున్న ప్రకారం కొనసాగ టంలేదనీ, కోర్టు వ్యవహారాలు తనకే మాత్రం అర్థం కావట్లేదని వాపోతాడు కె.

ఈ యింటర్వ్యూ చివర ఒక పిట్టకథ చెబుతాడు ప్రీస్టు. కోర్టులోకి ప్రవేశించనివ్వ మని కాళ్ళావేళ్లా పడతాడొక వ్యక్తి. ప్రస్తు తానికి వీలుపడదంటాడు ద్వారపాలకుడు. సంవత్సరాల తరబడి అక్కడే పడిగాపులు కాస్తాడు అమాయకుడు. ఒక దశలో ద్వారపాలకుడికి లంచమిస్తాడు. లంచం తీసుకుంటాడు గాని లోపలికి మాత్రం వెళ్ల నివ్వడు ద్వారపాలకుడు. చివరికి కోరిక తీరకుండానే మరణిస్తాడావ్యక్తి. అయితే మరణించే ముందు ద్వారపాలకుణ్ణి అడిగి సందేహ నివృత్తి చేసుకోవాలనుకుంటాడు.

"అందరూ లోపలికి ప్రవేశించటమే తమ లక్ష్యమనుకుంటారు గదా, ఎవర్నీ ఎందుకు అనుమతించరు? "

"ఈ ద్వారం కేవలం నీ ప్రవేశం కోసమే ఉద్దేశించబడింది. ఐతే నువ్వు మరణిస్తు న్నావు గనుక, ఇక ఈ ద్వారం మూసివే స్తున్నాను" అంటాడు ద్వారపాలకుడు.

"ఆ అమాయకుణ్ణి మోసం చేశారు గదా!" అంటాడు కె. దానికి ప్రీస్టు ఏదేదో వివరణ యిస్తాడు గాని అది అర్థం కాదు. ఇంతకూ ఈ కథ తనకెలా అన్వయి స్తుందో అసలేమాత్రం అంతుపట్టదు.

ఓ సంవత్సరం తర్వాత తిరిగి ప్రారంభ మవుతుంది కథ. కె ముప్పై ఒకటో పుట్టి నరోజునాడు వస్తాదుల్లాంటి యిద్దరు వ్యక్తులు వచ్చి అతణ్ణి వెంట తీసుకుపో తారు. కె ప్రతిఘటించడు. బహుశా వాళ్ళ తణ్ణి హత్య చేస్తారు. కాని వాళ్ల పనికి అడ్డు తగలకూడదనుకుంటాడు. కనీసం పోలీస్ కాన్‌స్టేబుల్‌ను కూడా కేకెయ్యడు. అతడైనా రక్షించేవాడేమో! ఆ క్షణాన ఓ కిటికీ తెరుచుకుంటుంది. రెండు చేతులూ కదులుతాయి. రమ్మనో, సహాయం చెయ్యా టానికి వస్తామనో చెబుతున్నాయవి. ఆ అర్థం గ్రహించే స్థితిలో లేడు కె. బంధిం చిన యిద్దరు వ్యక్తుల్లో ఒకడు అతడిని కద లకుండా పట్టుకుంటాడు. మరొకడు గుండెలో బాకు దించుతాడు.

ఇతర నవలల్లాగ ఒకసారి చదివి 'ది ట్రయల్'ను అర్థం చేసుకోవటం కష్టం. ఇందులో స్థూలంగా కనిపించే కథ వేరు. అంతరార్థం వేరు. కొందరు యిది కేవలం మానసిక విశ్లేషణ లేదా అంతర్లోక సంచారమని అంటారు. మరికొందరికి యిందులో క్రైస్తవ మతపరమైన తాత్విక విచారం కనిపిస్తుంది. కాఫ్కా బాల్యం, తండ్రిపట్ల ఆయనకున్న అయిష్టం, అణచిపెట్టుకున్న ద్వేషభావన, తన బలహీ నత.. యిలా అన్నిటినీ వ్యక్తపరిచాడేమో అనిపిస్తుంది, దీన్నో సైకలాజికల్ నవలగా చూసినవాళ్లకు. జీవితమంతా తను ముద్దా యిగానే గడిపాననుకున్నాడు కాఫ్కా. ప్రతి రోజూ ఒక పీడకలలా గడిచింది. ఆ వృత్తాంతమే ఈ కథనం. స్వప్నలోకంలో జరిగినవనుకునే సంఘటనలు యిందులో అనేకం. అత్యంత సామాన్య విషయాలు కూడా అనూహ్య పరిణామాలకు దారితీ స్తాయి. బోర్డింగ్‌హౌస్‌కు వచ్చి తలుపు తీస్తాడు కె. లేదా బేంకులోకి ప్రవేశిస్తాడు. కాని లోపల కనిపించింది అతనికి పరిచిత మైన లోకం కాదు. ఒక అదృశ్య న్యాయ స్థానంలో తను విచారణను ఎదుర్కొంటు న్నాడు. రిప్రెస్డ్ ఏంగ్జయిటీస్‌కు ఇది కాఫ్కా కల్పించిన కళారూపమని అంటారు. కలల గురించి ఫ్రాయిడ్ చేసిన అధ్యయనాల్ని అర్థం చేసుకున్న తొలితరం యూరోపియన్లలో కాఫ్కా ఒకడు. అతడు స్వాప్నిక జీవితాన్ని యింత 'వాస్తవికంగా' తన రచనల్లో పునఃసృష్టి చెయ్యటానికి ప్రధాన కారణం యిదే. కాఫ్కా స్వాప్నిక జీవితం జేమ్స్‌జాయిస్ 'చైతన్య స్రవంతి'కి పూర్తిగా భిన్నం. అగమ్యగోచరమైన అంత ర్లోకం కాఫ్కాకు కఠోర వాస్తవం. మనం పట్టపగలు చూసిన విషయాలను వర్ణించ గలిగినంత స్పష్టంగా అతడు స్వాప్నిక వాస్తవికతను చిత్రించాడు. అసలు ఈ నవలలో రాసినది కె తనలో తాను సృష్టిం చుకున్న మానసిక లోకం గురించా? లేదా అదో భౌతిక అనుభవమా? అని కూడా స్పష్టంగా తెలియదు. మొత్తంమీద అందరూ నేరగాళ్లే. అంటే, అనిర్వచనీయ మైన, నిరాకారమైన ఒక అధికార గణం వాళ్లు నేరం చేశారంటుంది. ఆ నేరం నిరూపించటానికే అనంతకాలం కొనసాగు తుంది విచారణ.

ఫ్రాయిడ్ ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్(1900)కు కథారూపమే 'ట్రయల్' అని చెప్పినవాళ్లు దీన్ని మానసిక విజ్ఞాన పరంగా వ్యాఖ్యానించారు. కె పనిచేస్తున్న బేంకు- అతని 'కాన్షస్'. బోర్డింగ్ హౌస్- 'ప్రీ కాన్షస్'. కోర్టు- 'అన్‌కాన్షస్'. నిజానికి జోసెఫ్‌కెది గిల్టీ మనస్తత్వం. లాయర్ హల్డ్ సైకోఅనలిస్ట్. గ్రుబాక్‌ది 'తల్లి

పాత్ర'. కానీ పాఠకుడు వీటిని అంగీకరించాల్సిన అవసరం లేదు. అన్ని మంచి కథల్లాగే, పూర్తిగా అర్థం కాకున్నా, ఆసక్తికరంగానే సాగుతుంది 'ది ట్రయల్' కథనం.

ఇక మతపరమైన అర్థం వెతికే వాళ్లది మరో ధోరణి. కె ఒక వ్యక్తి కాదు. అతడు పాపులైన మానవులందరికీ ప్రతీక. నిష్కృతికోసం, భగవత్ సాక్షాత్కారం కోసం మనిషి చేసిన ప్రయత్నమే 'ట్రయల్'. కోర్టులోని జడ్జీలాగే, దేవుడు కూడా ఎవరికీ కనిపించడు. బైబిల్‌లోని 'జాబ్'లాగ, కె కూడా జీవితమంతా 'కష్టభారం' మోయక తప్పదు. 'దైవసాన్నిధ్యం పొందనివాళ్లందరూ పాపులే' అంటాడు సెయింట్ పాల్. అందువల్ల మానవమాత్రుడెవడూ తను పాపం చెయ్యలేదని చెప్పలేడు. కోర్టు నిర్ణయమంటే భగవన్నిర్ణయమే. మానవులెప్పుడూ దాన్ని అర్థం చేసుకోలేరు. మనిషి నేరుగా భగవంతుణ్ణి చేరుకోలేడు. అనేకమంది మధ్యవర్తులైన, వివిధ హోదాలలో వున్న మతాధికారుల అవసరం వుంటుంది. అయితే వీళ్లంతా అవినీతిపరులే. మనిషి తన నేరాన్ని, పాపాన్ని స్వచ్ఛందంగా అంగీకరించినప్పుడే భగవంతుని కరుణకు పాత్రుడవుతాడు.

ఇవి రెండూ కాక, కాఫ్కా సమకాలీన రాజకీయాల గురించి చేసిన వ్యాఖ్యానమిదనీ అన్నారు మరికొందరు. ఆనాటి సామ్రాజ్యంలోని ప్రభుత్వోద్యోగుల అవినీతినీ, అసమర్థతనూ ఎండగట్టడమే ఈ నవల ప్రధాన వుద్దేశమంటారు. ఆ ప్రభుత్వంలో కాఫ్కా ఓ చిరుద్యోగి. అనైతిక బ్యూరోక్రాట్ల ప్రవర్తనను ఆయన స్వయంగా చూశాడు. డికెన్స్ 'బ్లీక్ హౌస్'లో కోర్టుల పనితీరును ఎండగట్టినట్టే, కాఫ్కా కూడా వాటి గురించి అన్యాపదేశంగా ఘాటు విమర్శ చేశాడు. ఎందుకంటే రాజరిక పాలనలో ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శించడం పెద్ద నేరం!

'ది ట్రయల్' గురించి రచయిత స్నేహితుడైన మాక్స్ బ్రాడ్ కొన్ని వివరాలు వెల్లడించాడు- ఈ నవల రాతప్రతిని జూన్ 1920లో చదివాను. అప్పటికి దీనికి పేరు పెట్టలేదు. కాకపోతే ఫ్రాంజ్ పలుసార్లు 'ట్రయల్' అయితే బాగుంటుందన్నాడు.

ఫ్రాంజ్ ప్రకారం యిది అసంపూర్తి నవల. ఇందులోని చివరి అధ్యాయానికి ముందు విచారణకు సంబంధించిన అనేక యితర దశలను వివరించవలసిన అవసరముంది. కాని రచయిత ఉద్దేశంలో అత్యున్నత న్యాయస్థానానికి చేరే అవకాశమే లేదు. అంటే కథకు ముగింపు వుండదు.

ఒక్క ట్రయల్ మాత్రమే కాదు, నా మిత్రుడు అనేక రాతప్రతుల కట్టలను నాకు అప్పగించి వెళ్లాడు. అందులో అనేక అసంపూర్తి రచనలున్నాయి. అందులో 'సబబు' అనిపించిన కొంత సమాచారాన్ని ఈ నవలలోని ఎనిమిదో అధ్యాయంలో కొద్దిగా చేర్చాను. రాతప్రతిలో పాత్రల పేర్లను పొడి అక్షరాలతో, ఫ్రాలిన్ బర్స్నర్‌కు బదులు ఎఫ్.బి. అనీ, టిటోరెల్లికి బదులు టి అని సూచించాడు. రాతప్రతిని అనేకసార్లు నాకు స్వయంగా చదివి వినిపించాడు గనక నేను పూర్తిపేర్లు రాశాను.

కొందరు నా మిత్రుడు వీలునామా వదిలి వెళ్లాడని రాశారు. కాని అతని రాతప్రతులన్నీ నా అధీనంలోనే వున్నాయి. ఫ్రాంజ్ వీలునామా రాయలేదు. తన రచనల్ని కాల్చి బూడిద చెయ్యమని నాకు రాసిన చిన్నలేఖ మాత్రమే లభ్యమైంది. అయినా నేను నా మిత్రుని కోరికను మన్నించటానికి నిరాకరిస్తున్నాను. కొన్ని వ్యక్తిగత విషయాలు తప్ప, నా మిత్రుని సాహిత్యాన్నంతా ప్రచురించ దలచుకున్నాను.

– ఎం. వసంత

ఆత్మీయనేస్తాలకు అందమైన కానుకలు

స్నేహితుల ఆనందమే మన ఆనందం
ఆప్తుల తలపులే మనకు ఆహ్లాదం
ఆత్మీయులకు అరుదైన బహుమానం
ఇవ్వాలనుకుంటున్నారా..?
ప్రతి నిత్యం వారి మదిలో
నిలవాలనుకుంటున్నారా..?



ఇందుకు మీరు చేయాల్సిందల్లా..
మిత్రుల పేరు మీద
రూ. 280/- చందా కట్టండి చాలు
ఇక నెలనెలా వారికి కొనసాగుతుంది

చతుర విపుల



ఆత్మీయ పలకరింపు
నెలంతా సాహితీపరిమళాల
గుబాళింపు
ఏడాది పొడవునా వారి మదిలో
మీ తలపులే పరిమళిస్తాయి
అక్షరాక్షరాన మీ ఉత్తమాభిరుచి
రూపుకడుతుంది

అది నూతన సంవత్సర శుభవేళైనా
పుట్టిన రోజైనా.. పెళ్లి రోజైనా..
పండుగయినా పబ్బమైనా సరే
ఒక్కసారి మమ్మల్ని
సంప్రదించండి చాలు..

డిడి లేదా ఎంఒ పంపవలసిన చిరునామా :
వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ, హైదరాబాద్– 500 082.
ఆన్‌లైన్ చందా చెల్లింపునకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్,
హైదరాబాద్ ఆన్‌లైన్ అకౌంట్ నెం. 370605010044015
వివరాలకు : ✆ 040-23318181 ఎక్స్‌టెన్షన్ 6441
vipula.chatura@eenadu.net-vipula.chatura@gmail.com కు మెయిల్ కూడా చేయొచ్చు

కొత్తగాలి...

కొవ్వొత్తికి ప్రాణం పోయాలని
అగ్గిపుల్ల ప్రాణం విడిచింది
ప్రాణం పోసిన స్నేహితుని
